సమావేశము - III
వాల్యూం - I
నెం. 2

వెల : రూ. 48-50
24 జూలై, 2024
బుధవారము

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

విషయ సూచిక

1.	ప్రశ్నోత్తరాలు	...	01
2.	సభా సమక్షంలో పెట్టే పత్రం	...	15
3.	సభా సమక్షంలో ఉంచే పత్రాలు	...	16
4.	వాయిదా ప్రతిపాదనలు	...	16
5.	సంతాప ప్రతిపాదనలు (సభాపతి స్థానం నుండి)	...	16
6.	ప్రభుత్వ తీర్మానం	...	17

తెలంగాణ శాసన సభ

ప్రధాన అధికారులు

సభాపతి	:	శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్
కార్యదర్శి	:	డా. వి. నరసింహా చార్యులు
సంయుక్త కార్యదర్శులు	:	శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి
		శ్రీమతి వి.ఎన్. ప్రసన్న కుమారి
ఉప కార్యదర్శులు	:	శ్రీ డి. శ్రీనివాసులు
		శ్రీమతి ఎస్. నాగమణి
సహాయ కార్యదర్శులు	:	శ్రీమతి బి. ప్రమీల
		శ్రీ ఎమ్. రఘుమారెడ్డి
		శ్రీ ఎ. సుధాకర్
		శ్రీ పి. శ్రీనివాస్
		శ్రీమతి ఎ. పద్మాసిని
		శ్రీమతి ఎస్.వి.వి. సత్యశ్రీ
		శ్రీ ఎస్. సుజిత్ కుమార్
		శ్రీ కె. భాస్కర శ్రీనివాస్
		శ్రీ సి.కె. వినోద్ కుమార్
చీఫ్ రిపోర్టర్	:	శ్రీ జి. రాజేశ్వర రెడ్డి

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

(మూడవ సమావేశం - రెండవ రోజు)

బుధవారము, జూలై 24, 2024

(సభ ఉదయం గం. 10.00 లకు ప్రారంభమైనది గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

మిస్టర్ స్పీకర్:-గౌరవ సభ్యులు శ్రీ కల్వకుంట్ల తారక రామారావుగారికి జన్మదిన శుభాకాంక్షలు.

(ఈ సందర్భంగా సభలోని గౌరవ సభ్యులందరూ కరతాళ ధ్వనులతో శ్రీ కె. తారక రామారావుగారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు)

గౌరవ సభ్యులందరికీ మనవి. ప్రశ్నోత్తరాల సమయం గం.10.00ల నుండి గం.11.00ల వరకు ఒక గంట మాత్రమే ఉన్నందువలన, ప్రతి ప్రశ్నకు 6 నిమిషాల సమయాన్ని కేటాయించడం జరిగింది. ఈరోజు చర్చించవలసిన అంశాలు చాలా ఉన్నందువలన గౌరవ సభ్యులను సహకరించవలసిందిగా కోరుతున్నాను. గౌరవ సభ్యులు ఉపన్యాసాలు చేయకుండా ప్రశ్నలను మాత్రమే అడగవలసిందిగా కోరుతున్నాను. మంత్రులకు కూడా విజ్ఞప్తి. సభ్యులు అడిగిన ప్రశ్నకు పరిమితమై జవాబు ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

ఇప్పుడు, ప్రశ్న నెం.228. పాఠశాల మరియు కళాశాలల బస్సుల ఫిట్‌నెస్ తనిఖీ గురించి, రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు.

పాఠశాల మరియు కళాశాలల బస్సుల ఫిట్‌నెస్ తనిఖీ

ప్రశ్న నెం.228 (1)

సర్వశ్రీ మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్, ఆది శ్రీనివాస్, డా. కవ్వంపల్లి సత్యనారాయణ, శ్రీ వాకిటి శ్రీహరి:-

గౌరవనీయులైన రవాణా శాఖ మంత్రి గారూ, దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ)రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులు వేల సంఖ్యలో నడుస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ) పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కావడానికి ముందు నిర్వహిస్తున్న ఫిట్‌నెస్ ఇన్‌స్పెక్షన్‌పై ఆర్టీఏ అధికారులు శ్రద్ధ వహించడం లేదన్న విషయం వాస్తవమేనా;

ఇ)బస్సులకు ఫిట్‌నెస్ లేని కారణంగా కొంతమంది విద్యార్థులు ప్రమాదంలో మరణించిన, గాయాల పాలైన విషయం వాస్తవమేనా;

ఈ) అయితే, సదరు పాఠశాలలు, కళాశాలలపై చేపట్టిన చర్యలేమిటి;

ఉ)సంబంధిత అధికారులపై తీసుకున్న చర్యలేమిటి?

రవాణా శాఖ మంత్రి (శ్రీ పొన్నం ప్రభాకర్):-

అ) అవునండీ.

ఆ) లేదండీ.

ఇ) లేదండీ.

ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఉ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్:- అధ్యక్షా, ధన్య వాదాలు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పర్యవేక్షణ లోపమో, నిర్లక్ష్య ధోరణో గానీ, గతంలో అనేక పాఠశాలల్లో ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో పాఠశాల బస్సుల నిర్వహణలో నిర్లక్ష్యం జరిగిందనే విషయాన్ని అనేక మార్లు పత్రికలలో మనం చూశాం. అధ్యక్షా, ఇది నిజం. మన హైదరాబాద్ నగరంలో ఎనిమిది వేలకుపైగా పాఠశాలలు, వందల సంఖ్యలో కళాశాలలు ఉంటాయి. 15 సంవత్సరాల కాలం చెల్లిన బస్సులను ఫిట్‌నెస్ లేకుండా, తగినటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఇప్పటికీ నడుపుతుండడం వల్ల అనేక ప్రమాదాలకు గురయ్యాయి. ఈమధ్య కాలంలో మా ప్రాంతంలో ఒక పాఠశాల బస్సు సడెన్ బ్రేక్ వేస్తే, ఆ బ్రేకులు ఫెయిలయ్యి ఒక అమ్మాయి బస్సు నుండి బయటకు వచ్చి కింద పడి చనిపోవడం జరిగింది. ఇలాంటి అనేక సంఘటనలు మనం తరచూ చూస్తుంటాం. అంతేకాక ఆ బస్సులను నడిపే డ్రైవర్ల ఫిట్‌నెస్ విషయంలో కూడా ఆర్టీవోలు జాగ్రత్తపడవలసిన అవసరం ఉంది. బడి పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకునే క్రమంలో 60 సంవత్సరాలకు పైబడిన వారితో పాఠశాలల బస్సులను నడపనీయకుండా జాగ్రత్తలు పడవలసిన అవసరముంది. కానీ, ఆ విషయంలో కూడా నిర్లక్ష్యం కనబడుతోంది. అంతేకాకుండా, బస్సుల కెపాసిటీకి మించి అదనంగా పిల్లలను పాఠశాల/కళాశాల బస్సుల్లో తీసుకువెళ్ళడంవల్ల కూడా నష్టం జరుగుతుంది. ఆ బస్సుల్లో సేఫ్టీ ప్రికాషన్స్ క్రింద ఫైర్ సేఫ్టీ కిట్స్, ఫస్ట్ ఎయిడ్ మెడికల్ కిట్స్ కూడా ఉండని పరిస్థితి నెలకొంది. కాబట్టి, ఈ పరిస్థితుల్లో ఆయా పాఠశాలల పిల్లలకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వవలసిన అవసరముంది. అంతేకాకుండా కొన్ని కాలేజీలకు సంబంధించిన బస్సులపై ఎలాంటి పేర్లు కూడా ఉండడం లేదు. దానివల్ల దురదృష్టవశాత్తు ప్రమాదం చోటుచేసుకుంటే, ఇబ్బందులు తలెత్తుతాయి. కాబట్టి, పాఠశాలల మరియు కళాశాలల బస్సులపై ఆయా పేర్లు, సంబంధితుల ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా ఉండ వలసిన అవసరముంది. ఇంకా చెప్పాలంటే, పెద్ద పెద్ద కళాశాలలు, పాఠశాలలకు చెందిన యజమానులు, వారి పాఠశాలలకు చెందిన పిల్లలు వారి బస్సుల్లో కాకుండా ఆటోలలో వస్తుంటే, ఆ ఆటోలను ఆర్టీవో వారికి పట్టించి, పొట్టకూటికై ఆటోలు నడుపుకునే ఆటో డ్రైవర్లను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఎందుకంటే, వారు చెప్పిన బస్ ఫీజులు చెల్లించి వారి బస్సులలోనే ప్రయాణం చేయాలనేది వారి ఉద్దేశ్యం. ఆ బస్సులకు ఎలాంటి ఫిట్‌నెస్‌లు లేకున్నా, వాటికి ఎలాంటి ప్రమాదాలు జరిగినా పట్టించుకోరు గానీ, పొట్టకూటికై ఆటోలు నడుపుకునే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవలసిందిగా నేను రవాణా శాఖ మంత్రి గారికి విన్నవం చేస్తున్నాను.

10.10 ఉ. ఈరోజు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణ పథకంవల్ల, ఆర్.టి.సి. బస్సులు ఉన్న సీట్లకంటే ఎక్కువగా ప్రయాణీకులతో నిండి పోతున్నాయి. బస్సులన్నీ ఫుల్ అవుతున్నాయి. గతంలో పల్లెల నుండి పాఠశాలలకు వెళ్ళేందుకు ఆర్.టి.సి. బస్సులు విద్యార్థుల కొరకు వెళ్ళేవి. కానీ, దురదృష్టమో, అదృష్టమో మాకర్థం కావడం లేదు, బస్సులన్నీ ఫిలప్ అవుతుండడంతో, పిల్లవాడు పాఠశాలకు వెళ్ళే సమయానికి బస్సులు పంపలేకపోతున్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో కొత్త బస్సులను కొని, విద్యార్థులతోబాటు, ఇతరులకు కూడా మరింత ప్రయాణ సౌకర్యం ఏర్పరచి వారికి న్యాయం జరిగే విధంగా చేయాలని మినిస్టర్‌గారిని ప్రత్యేకంగా కోరుతున్నాను. ఆర్.టి.ఏ. అధికార్లు వెంటనే కాలం చెల్లిన బస్సులను మార్పు చేసి, ఎటువంటి ప్రమాదం జరగకుండా, ప్రైవేటు స్కూల్స్, గల్లీలల్లో ఉన్న చిన్న చిన్న కార్పొరేట్ స్కూల్స్ అన్నీ దాదాపు 8000కు పైగా ఉన్నాయి. ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి. వీటన్నింటిలో కాలం చెల్లిన బస్సులున్నాయన్న విషయం ప్రతి రోజు ఎక్కడో ఒక చోట వార్తలల్లో చూస్తున్నాము, దీనిపై సీరియస్ యాక్షన్ తీసుకోవాలని మంత్రిగారిని కోరుతున్నాను. నాకు సమయం ఇచ్చినందుకు ధన్యవాదాలు.

శ్రీ ఆది శ్రీనివాస్:- నాకు మాట్లాడే అవకాశం కల్పించి నందుకు ధన్యవాదాలు అధ్యక్షా. ఇప్పుడే మా సహచర

సభ్యులు ప్రైవేటు పాఠశాల బస్సులు, స్కూల్ వ్యాన్‌ల ఫిట్‌నెస్‌కు సంబంధించిన అంశంలో వారు చెప్పిన అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటుందని భావిస్తున్నాను. ప్రధానంగా, ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్.టి.సి. బస్సులో ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించడం జరిగింది. వారం రోజుల క్రితం వరకూ సుమారు 62 కోట్ల మంది ప్రయాణాలు చేయడం జరిగి, రూ. 2100 కోట్లను ప్రభుత్వం ఆర్.టి.సి.కి చెల్లించిన సందర్భంలో, మహిళా తల్లులందరూ కూడా ఆర్.టి.సి. బస్సుల్లో తమ స్వంత ప్రదేశాలతోబాటు వివిధ దేవాలయాలకు సంబంధించి ఎక్కువగా ప్రయాణం చేస్తున్నారు కాబట్టి, ఇది చాలా హర్షించదగ్గ విషయంగా భావిస్తూ, మహాలక్ష్మీ పథకం ఏర్పాటు చేసిన తరువాత, ప్రయాణికుల సంఖ్య ఎక్కువ అవుతున్నందున బస్సుల సంఖ్య సరిపోవడం లేదని ఆయా ప్రాంతాలకు వెళ్ళినప్పుడు ప్రజలు చెబుతున్నారు. కొత్తగా బస్సులు కొనుగోలు చేసి, ఆయా డిపోలకు, కొత్త రూట్లకు ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నారా అని గౌరవ మంత్రివర్యులను ఈ సందర్భంగా అడుగుతున్నాను. కొత్తగా బస్సులను కొనుగోలు చేసి, పంపాల్సిన అవసరముందని నేను ప్రజల పక్షాన అభిప్రాయపడు తున్నాను. ప్రమాదాలు జరగకుండా ఆర్.టి.ఏ. అధికార్లకు తగు సూచనలు, సలహాలు అందిస్తూ, ప్రతి సంవత్సరం స్పెషల్ డ్రైవ్ చేపడుతూ, స్కూలుకు వెళ్ళే పిల్లలకు, ప్రైవేటు బస్సుల్లో ప్రయాణం చేసే వారికి ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా, ప్రభుత్వం పక్షాన ఉన్న వాహనాలకు ప్రతి సంవత్సరం మనం ఏ విధంగానైతే పది రోజుల ముందు నుంచే సంబంధిత బస్సులకు ఫిట్‌నెస్‌గానీ, లైసెన్స్‌లు వంటి వాటిని ఏవిధంగా చేస్తారో, ప్రైవేటు బస్సులు, వ్యాన్లకు సంబంధించి ప్రధానంగా పాఠశాలలకు సంబంధించిన వారికి ఒక నెల ముందు నుంచే వారికి కసరత్తు చేసే విధంగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని చెప్పి కోరుతున్నాను. ప్రధానంగా ఈ ప్రభుత్వం ప్రారంభించిన మహాలక్ష్మి పథకానికి మా మహిళా తల్లులు తరఫున అభినందనలు తెలియజేస్తున్నాను. నూతన బస్సులు ప్రవేశపెట్టవలసిందిగా ఆయా రద్దీ ప్రాంతాలలోకి కొత్తగా బస్సులను కొనుగోలు చేసి అమలు చేయవలసిందిగా నేనీ సందర్భంగా కోరుతున్నాను.

శ్రీ వాకిటి శ్రీహరి:- నాకు మాట్లాడే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు అధ్యక్షా. ఇంతకు ముందు సహచర శాసన సభ్యులు శ్రీ మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మరియు శ్రీ ఆది శ్రీనివాస్‌గారు మాట్లాడారు. వారి మాటలతో నేను ఏకీభవిస్తున్నాను. ముఖ్యంగా ఆర్.టి.సి.కి సంబంధించిన బస్సులు, ప్రైవేటు బస్సులు మా ప్రాంతంలో లేదా రాష్ట్రం మొత్తం మీద స్కూల్ టైమింగ్స్ మెయింటెయిన్ చేసే విధంగా బస్సులను మెయింటెయిన్ చేయగలిగితే చాలా వరకు సేవ చేసి, బస్సులను కరెక్టుగా ఉపయోగించుకున్న వాళ్ళమవుతాం. మా ప్రాంతం (మక్తల్) మరీ చివరగా ఉంటుందనీ, అందువల్ల మా ప్రాంతంలో బస్సుల కొరత ఉన్నదనే విషయాన్ని మంత్రిగారికి తెలపగా, వారు సానుకూలంగా స్పందించారు. గతంలో ఉన్న బస్సులే కాకున్నా, బడులు బలోపేతం చేయాలనే ఆలోచనతో మొట్టమొదటిసారి స్కూల్స్ తెరిచిన రోజే బుక్స్, బట్టలు ఇచ్చాం. అదే మాదిరిగా స్కూల్ తెరవగానే పిల్లవాడు బడిలో సమయానికి ఉండాలంటే బస్సు సౌకర్యం అనివార్యం. స్కూల్ టైమింగ్స్‌కు బస్సులు రావపోవడం వల్ల చాలా ప్రాంతాల్లో ఈ మూడు టైర్ల ఆటోలో వెళ్ళి ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది. కాబట్టి, ఆత్మకూరు, అమరచింత, నర్వా, మక్తల్ ప్రాంతాలలో ట్రాన్స్‌పోర్టేషన్‌లో చాలా మంది పిల్లలు కిందపడి దెబ్బలు తగిలిన సందర్భాలున్నాయి. మనం ప్రతి బస్సు వెనుక ఆర్.టి.సి. ప్రయాణమే సురక్షితమని రాస్తాం. మరి మనం మన పిల్లలకు సురక్షితమైన ప్రయాణాన్ని చేయించే విధంగా చేయాలి. బస్సుల లోటున్నదనేది స్పష్టంగా అర్థమవుతోంది. కాబట్టి, కొత్త బస్సులను ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రిగారిని కోరుతున్నాను. ముఖ్యంగా స్కూల్ పిల్లలని సమయానికి స్కూల్‌లో దించేందుకు స్కూల్ టైమింగ్స్‌పై స్కూల్ వాళ్ళతో చర్చించాలి. స్కూల్స్ తెరిచిన రోజే బుక్స్ ఇచ్చాం, స్కూల్స్ తెరిచిన రోజే యూనిఫామ్స్ ఇచ్చాం. ఇలా ప్రభుత్వం ప్రతిష్టాత్మక కార్యక్రమాలు చేపట్టింది. అదే విధంగా స్కూల్ పిల్లవాడిని కూడా సరైన సమయంలో స్కూల్‌కు

పంపించగలిగితే వాడి భవిష్యత్తు బాగుండే అవకాశాలున్నాయి. బస్సుల ఫిట్‌నెస్ మరియు ఇతరత్రా అంశాలను బస్సులు రోడ్డుపైకి రాకముందే చెక్ చేసుకోవాలి. కేవలం ఫిట్‌నెస్ ఉన్న బస్సులనే స్ట్రిక్ట్‌గా, ఒక పద్ధతిలో నడిపించగలిగితే పిల్లలను కొంత సెక్యూర్‌గా పంపించగలిగే వాళ్ళమవుతామనే బాధ్యతతో మీకు తెలియజేసుకుంటున్నాను. మా వెనుకబడిన మక్తల్ నియోజకవర్గంలో ఎక్కడ కూడా సరైన సమయంలో బస్సులు రావు. కాబట్టి, ఉదయం పూట స్కూల్ టైమింగ్స్‌లో బస్సులు తప్పకుండా వచ్చేవిధంగా మెయింటేయిన్ చేసి, పిల్లలకు సౌకర్యం కలిగించవలసిందిగా మీ ద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను. ధన్యవాదాలు అధ్యక్షా.

మిస్టర్ స్పీకర్:- గౌరవ మంత్రిగారు అన్ని ప్రశ్నలకు సమాధానమివ్వవలెను.

శ్రీ పొన్నం ప్రభాకర్:- అధ్యక్షా, దాదాపు పాఠశాలలకు సంబంధించి 24,000 బస్సులున్నాయి. ప్రతి సంవత్సరం పాఠశాలలు ప్రారంభమయ్యేందుకు ముందుగానే చెకింగ్స్ చేసి 15 మే నాడు, బస్సుల ఫిట్‌నెస్‌కు సంబంధించిన సర్టిఫికేట్ ఇస్తాము. ఇది మ్యాండేటరీ చేశాము. దానికంటే ముందే ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకొని, బస్సులతోబాటు, వాటికి సంబంధించిన డ్రైవర్లు, స్పేర్ డ్రైవర్లు, అటెండర్లు వారందరికీ కౌన్సిలింగ్ చేసి వారంతా పర్ఫెక్ట్ అయిన తరువాతనే వారికి ఫిట్‌నెస్ సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన చట్టాలకనుగుణంగా 15 సంవత్సరాలు దాటిన బస్సులన్నింటినీ వెంటనే స్క్రాప్ క్రిందికి తీసుకొని ఆ బస్సులు నడవకుండా చర్యలు తీసుకుంటున్నాము.

అదే విధంగా, గౌరవ సభ్యులు అడిగినట్లుగా ప్రతి బస్సులో ఫైర్‌కు సంబంధించి, ఫోన్ నంబర్ల డిస్‌ప్లే మెడికల్ కిట్ ఏర్పాటు చేయడంతోబాటు ఎక్కడ కూడా బస్సులకు సంబంధించిన ప్రైవేటు స్కూలు బస్సులు ప్రైవేటు స్కూలు వారు నడుపుకుంటారు. పాఠశాల సమయంలో విద్యార్థుల కొరకు ఆర్.టి.సి. బస్సులు నడపమని చెప్పారు, తప్పకుండా పాఠశాలలున్న ఏరియాల్లో వాటన్నింటి ప్రకారంగా పాఠశాలలకు సంబంధించి స్కూల్ బస్సులు నడిపించే కార్యక్రమం తీసుకురావడంతోబాటు, స్కూల్ ఏరియాలో ఎక్కడైతే బస్సుల అవసరం ఉందో, వీటికి సంబంధించి ఇప్పటికే ముఖ్యమంత్రిగారు సూచన చేయడం జరిగింది, సేఫ్టీ మెజర్మెంట్స్‌తోబాటు, రవాణా శాఖ కఠినంగా వ్యవహరించాల్సి ఉందని, రవాణా శాఖ మంత్రిగా రాష్ట్ర స్థాయి సమీక్ష నిర్వహించి, దీనికి సంబంధించి అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది. దానితోబాటు పిల్లలకు కూడా అవగాహన ఉండాలని UNICEF ఆధ్వర్యంలో ప్రతి కార్పొరేట్‌స్కూల్‌లో ఒక ట్రాఫిక్ రూల్స్ అవగాహన కొరకు (ట్రాఫిక్ జీబ్రా క్రాసింగ్, ట్రాఫిక్ సిగ్నల్ ఫోటోను చూపిస్తూ) ఇటువంటివి ఏర్పాటు చేయడానికి విద్యాశాఖతో సమన్వయం చేసి, ముందుగా ఏర్పాటు చేయడం జరుగుతోంది. అదే విధంగా, ఆర్.టి.ఓకు సంబంధించి గౌరవ సభ్యులను కోరడం జరుగుతోంది, ఎక్కడైనా స్పెసిఫిక్‌గా రవాణా శాఖకు సంబంధించిన సమస్య ఉంటే, ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే స్పందించడానికి సిద్ధంగా ఉన్నాం. దానితోబాటు ప్రత్యేకించి బడి పిల్లలకు సంబంధించిన శ్రద్ధ, రవాణా సౌకర్యాలలో ఎక్కడ కూడా జాప్యం, నిర్లక్ష్యం లేకుండా, గౌరవ సభ్యుల సూచనలను తీసుకుని, మరొకసారి మా శాఖతో సమన్వయం చేసుకొని, ఎవరికీ ఇబ్బంది లేకుండా చేస్తామనే మాట ఈ సందర్భంగా గౌరవ సభ్యులకు తెలియజేయడం జరుగుతోంది.

10.20 ఉ.

తండాలు గ్రామ పంచాయతీలుగా ఉన్నతీకరణ

ప్రశ్న సంఖ్య.65 (02)

సర్వ శ్రీ జాటోత్ రామ్‌చందర్ నాయక్, ఐలయ్య బీర్ల, చిక్కుడు వంశీకృష్ణ :- గౌరవనీయులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో అనేక తండాలను గ్రామపంచాయతీలుగా స్థాయిని పెంచిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, జిల్లాల వారీగా వాటి వివరాలు ఏమిటి;

ఇ) అనేక గ్రామ పంచాయతీలను రెవెన్యూ పంచాయితీలుగా స్థాయిని పెంచలేదన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడమయిందా; అయితే, ఇందుకు గల కారణాలేమిటి;

ఈ) పంచాయతీలుగా స్థాయిని పెంచినటువంటి తండాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి?

పంచాయతీరాజ్ శాఖ మంత్రి (శ్రీమతి డి. అనసూయ):-

అ) అవునండీ.

ఆ) రాష్ట్రంలో 1851 జనావాసాలు మరియు తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చడమయింది.

(వివరాలను సభా సమక్షంలో ఉంచడమయింది)

STATEMENT TO CLAUSE (b) of LAQ.No.65 (STARRED)
e Number of Habitations & Thandas converted into Gram Panchayats as follow

ABSTRACT OF 1851 New Schedule Tribe Gram Panchayats

Sl.No	District Name	No.of GPs
1	Adilabad	142
2	Bhadradri Kothagudem	266
3	Hanumankonda	5
4	Jagitial	21
5	Jangoan	37
6	Jayashankar Bhupalapally	6
7	Jogulamba Gadwal	3
8	Kamareddy	63
9	Karimnagar	1
10	Khammam	53
11	Kumuram Bheem Asifabad	93
12	Mahabubabad	170
13	Mahabubnagar	77
14	Mancherial	22
15	Medak	63
16	Medchal Malkajgiri	0
17	Mulugu	45
18	Nagarkurnool	79
19	Nalgonda	104
20	Narayanpet	30
21	Nirmal	35
22	Nizamabad	71
23	Peddapalli	3
24	Rajanna Sircilla	25
25	Rangareddy	60
26	Sangareddy	74
27	Siddipet	9
28	Suryapet	58
29	Vikarabad	84
30	Wanaparthy	33
31	Warangal	84
32	Yadadri Bhuvanagiri	35
	Grand Total	**1851**

ఇ) ఈ ప్రశ్న వర్తింపు కాదు.

ఈ) పంచాయితీల అభివృద్ధి కార్యకలాపాల కోసం కేంద్ర గ్రాంటులతో సమానంగా రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంటు (ఎస్ఎఫ్‌సి)ని తెలంగాణ ప్రభుత్వం విడుదల చేస్తున్నది. తదుపరి, సంవత్సరానికి రూ.5.00 లక్షల కంటే తక్కువగా వార్షిక ఆదాయాన్ని పొందుతున్న పంచాయితీలకు దాదాపుగా రూ. 5.00 లక్షల అదనపు నిధులను విడుదల చేయడమయింది.

తదుపరి గ్రామపంచాయితీల అభివృద్ధికి ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పంచాయితీ కార్యదర్శిని ప్రభుత్వం నియమించింది. ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్, నర్సరీ, పల్లె పకృతి వనం, సెగ్రేగేషన్ షెడ్, స్మశానవాటిక, తెలంగాణ క్రీడా ప్రాంగణాలను అన్ని గ్రామపంచాయితీలు కలిగి ఉన్నాయి.

డాక్టర్ జె. రామ్‌చందర్ నాయక్:- ధన్యవాదాలు అధ్యక్షా. మహాత్మాగాంధీగారు చెప్పినట్లు పల్లెలే ఈ దేశానికి పట్టుకొమ్మలైతే, తండాలు, ఆదివాసీ గూడాలు గ్రామాలకు ఆయుపట్టుగా పనిచేస్తున్నాయి. గిరిజన తండాలలో, ఆదివాసీ గూడాలలోని ప్రజలు ప్రకృతినే ఆరాధిస్తూ, వారికున్న ప్రత్యేక సంస్కృతిని కాపాడుకుంటూ జీవిస్తున్న పరిస్థితిని మనం చూస్తున్నాము.

గతంలో గిరిజన, లంబాడ సోదరులు అడవిని నమ్ముకుని జీవించేవారు. ప్రస్తుతం అడవులు అంతరించి పోతున్న సందర్భంలో వారు భూమిని నమ్ముకుని జీవిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పంటలకు గిట్టుబాటు ధరలు రాక, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వ్యవసాయం లాభదాయకంగా లేదని విద్యార్థులంతా విద్య, ఉపాధి, ఉద్యోగాల వైపు ఆలోచన చేస్తున్నారు. మా తండాలు మా రాజ్యం, మాకెంత వాటా, మేమెంతో మాకంత వాటా.. అనే నినాదంతో గిరిజన, ఆదివాసీల ఆత్మగౌరవం కోసం తండాలను గ్రామపంచాయతీలుగా చేయాలని గత 30 సంవత్సరాలుగా గిరిజనులు కోరుతున్నారు. గత ప్రభుత్వం కేవలం కోడిని ముందు కట్టి మాంసం తినమన్నట్టుగా ప్రవర్తించింది. దాదాపు 4000 తండాలను గ్రామపంచాయి తీలుగా చేసింది కానీ వాటిని రెవెన్యూ గ్రామ పంచాయితీలుగా గుర్తించలేదు.

(ఈ సందర్భంగా .. సార్ మాకు మైకు ఇవ్వండి అంటూ సభ్యులు శ్రీ హరీష్ రావు మరియు ఇతర బీఆర్ఎస్ సభ్యులు కోరారు.)

గత ప్రభుత్వం గిరిజన ఓట్ల కోసం, వారిని ఆకర్షించడం కోసం నామమాత్రంగా తండాలను గ్రామపంచాయతీలుగా చేసిందే తప్ప ఎక్కడా కూడా వాటిని రెవెన్యూ గ్రామపంచాయతీలుగా గుర్తించలేదు. కొన్ని మేజర్ గ్రామపంచాయతీలను మునిసిపాలిటీలుగా మార్చడం కోసం కొన్ని తండాలను మునిసిపాలిటీలలోకి కలిపేశారు. మునిసిపాలిటీలలో వేసే పన్నులు కట్టలేక అమాయక గిరిజన ప్రజానీకం పేదరికంతో ఇబ్బంది పడుతున్న పరిస్థితులు ఈరోజు తండాలలో ఉన్నాయి అధ్యక్షా.

అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాలలు లేని పరిస్థితులు తండాలలో ఉన్నాయి. కాబట్టి గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిచేస్తూ మన ప్రభుత్వం తండాలను అభివృద్ధి చేసే కార్యక్రమాలను చేపడతారని కోరుకుంటున్నాను. గ్రామాలతో సమానంగా తండాలలో అన్ని రకాల సౌకర్యాలు, వాటికి కావలసిన నిధులను కేటాయించి, తండాలను అభివృద్ధి పరిచే దిశలో ముందుకు సాగాలని కోరుతున్నాను అధ్యక్షా.

శ్రీ బీర్ల ఐలయ్య:- నమస్కారం అధ్యక్షా. ఈ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సుమారు 12741 గ్రామ పంచాయతీలకుగాను అందులో 5841 తండాలు ఉన్నాయి. గత ప్రభుత్వం గిరిజనుల ఓటు బ్యాంకు కోసం మేము తండాలను అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని చెప్పి కేవలం 1271 తండాలను మాత్రమే గ్రామపంచాయతీలుగా చేసి మిగతా వాటిని నిర్వీర్యం చేశాయి. గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేశారు కానీ ఏ ఒక్క పంచాయతీకి కూడా కనీసం పక్కా భవనం లేదు, వాటికి నిధులను కేటాయించలేదు. అక్కడ ఉన్న సర్పంచులు చెట్ల క్రింద కూర్చుని పరిపాలన చేయాల్సినపరిస్థితి వచ్చింది. గతపదేళ్ళ బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తండాలను పూర్తిగా నిర్వీర్యం చేశారు. కాబట్టి మన ప్రభుత్వం ఎస్.సి, ఎస్.టి, మైనారిటీలకు ప్రాధాన్యత ఇచ్చే ప్రభుత్వంగా మిగతా తండాలను కూడా గుర్తించి వాటిని గ్రామపంచాయతీలుగా ప్రకటించి వాటికి పక్కా భవనాలను ఏర్పాటు చేయాలని మీద్వారా కోరుతున్నాను అధ్యక్షా.

గత పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామపంచాయతీలకు కేటాయించిన నిధులను 73,74 రాజ్యాంగ సవరణల ప్రకారం పూర్తిగా నేరుగా వాటికి కేటాయించకుండా ఆ నిధులను టిఆర్ఎస్ ప్రభుత్వం వాడుకుని, ఎంతోమంది సర్పంచుల అప్పులకు, చావులకు ఈరోజు టిఆర్ఎస్ ప్రభుత్వం కారణమైనది. స్మశాన వాటికలని, పల్లెల ప్రభుత్వమని, ట్రాక్టర్లని.. ఈరోజు కనీసం ఆ తండాలలో ట్రాక్టర్లను మెయింటేన్ చేయలేని స్థితిలో సర్పంచులు ఉన్నారు. సర్పంచు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసినటువంటి ప్రభుత్వం టిఆర్ఎస్ ప్రభుత్వం అధ్యక్షా. మన గౌరవ ముఖ్యమంత్రిగారు అన్ని తండాలను గుర్తించి మిగతా గ్రామపంచాయతీలకు ధీటుగా వాటికి పక్కా భవనాలను ఏర్పాటు చేయాలని మీద్వారా కోరుతున్నాను. థాంక్యు.

(సార్.. ఒక్కసారి మైకు ఇవ్వండని శ్రీ హరీష్‌రావు, ఇతర బీఆర్ఎస్ సభ్యులు కోరారు)

మిస్టర్ స్పీకర్:- సీనియర్ సభ్యులు హరీష్‌రావు గారు మళ్ళీ మళ్ళీ మాట్లాడాలని అనుకుంటున్నారు కానీ సమయాభావం వల్ల అందరి సభ్యులకు అవకాశం ఇవ్వడం వీలుకాదు. శ్రీ చిక్కుడు వంశీకృష్ణగారు..

డాక్టర్ చిక్కుడు వంశీ కృష్ణ :- అధ్యక్షా, అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. గత ప్రభుత్వంలో తండాలను గ్రామపంచాయతీలుగా చేయాలనే తపన ఉన్నదని వాటిని గ్రామపంచాయతీలుగా చేశారే తప్ప ఆ గ్రామపంచాయతీలైన తండాల అభివృద్ధిని గురించి మరచిపోయారు. ఇప్పటివరకు చాలా తండాలకు రోడ్డు సౌకర్యం, మంచినీటి సరఫరా, చాలా తండాలలో స్కూళ్లు లేవు. అంగన్‌వాడీ స్కూళ్లు కానీ, టీచర్లు కానీ లేని తండాలు చాలా ఉన్నాయి. అంతేకాకుండా ఏదో లెక్కలు చూపించడం కోసం తండాలను గ్రామపంచాయతీలుగా చేశామని చెప్పుకోడానికి ఒకే ఊర్లో రెండు తండాలుంటే ఆ రెండు తండాలను రెండు గ్రామపంచాయతీలను చేశారు అధ్యక్షా.

మా అచ్చంపేట మండలంలో రంగాపూర్ అనేది ఒకటే గ్రామం. ఆ గ్రామంలో అటు దర్గా తండా, ఇటు జైరాం తండా మధ్యలో నుంచి రోడ్డు పోతుంది. ఈ రెండిటికీ

గతంలో ఒకటే గ్రామపంచాయతీ ఉండేది. ఈ రెండిటినీ దర్గాతండా గ్రామపంచాయతి, జెర్రాం తండా గ్రామ పంచాయతి అని చేశారు. అట్లాగే ఇప్పలపల్లి గ్రామపంచాయతీ ఉండేది. అందులో రెండు తండాలు ఉంటే ఆ రెండిటినీ విడగొట్టివాటిని గ్రామపంచాయతీలను చేస్తే, ఒక గ్రామపంచాయతీలో ఉండే తండా ఏజెన్సీ క్రింద వస్తుంది. అదేవిధంగా ఆ గ్రామ పంచాయతీలో ఉండే గానుగపెంట తండా అది నాన్ ఏజెన్సీ క్రింద వస్తుంది. ఈ విధంగా అశాస్త్రీయంగా ఈ తండాలను గ్రామపంచాయతీలను చేశారు అధ్యక్షా. కాబట్టి మా డిమాండు ఏమిటంటే, గ్రామపంచాయతీ, తండాలలో ఎక్కడెక్కడైతే కనీస మౌళిక సదుపాయాలు కల్పించలేదో అక్కడ రోడ్లు, స్కూళ్లు, మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా లాంటి కనీస మౌళిక సదుపాయాలను కల్పించాలని నేను ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను.

గత ఎన్నికల ముందు కేవలం ఓట్ల కోసం పోడు భూములకు పట్టాలను ఇచ్చారు తప్ప ఇప్పటి వరకు ఏ ఒక్క ఆదివాసీకానీ, గిరిజనుడు కానీ ఆ పోడు భూములకు వెళ్లలేదు. ఇంకొక మాట అధ్యక్షా, అసలు ఒక దగ్గర భూమే లేదు కానీ దానికి పోడుపట్టా ఇచ్చారు. కేవలం ఓట్ల కోసం లింగాల మండలం, రాయవరం గ్రామంలో 153 మందికి పట్టాలు ఇచ్చారు. ఇవన్నీ కూడా కేవలం ఓట్ల కోసం చేశారు తప్ప నిజంగా తండాలమీద కానీ, ఆదివాసీ గూడేల మీద కానీ గత ప్రభుత్వానికి ఎక్కడా కూడా చిత్తశుద్ధి లేదు. కాబట్టి మన ప్రభుత్వం, ప్రజాప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రిగారికి మరొక్క సారి విజ్ఞప్తి చేస్తున్నాను. ఓట్ల కోసం గత ప్రభుత్వంలో కేవలం తండాలను గ్రామపంచాయతీలుగా చేశారు తప్ప వాటికి కావలసిన మౌలిక సదుపాయలను సమకూర్చలేదు. గౌరవ ముఖ్యమంత్రిగారు వీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి తండాలకు కావలసిన కనీస మౌలిక సదుపాయాలను సమకూర్చాలని సభాముఖంగా వారికి విజ్ఞప్తి చేస్తున్నాను. థాంక్యూ అధ్యక్షా.

10.30 ఉ. **శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి**:- అధ్యక్షా, సభ్యులు అడిగిన ఈ ప్రశ్న అత్యంత కీలకమైనది. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందా లేదా అనేది మనం చర్చించుకోవాలనుకుంటే, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గిరిజనుల నివాసప్రాంతాలకు రవాణా సౌకర్యం, తాగునీటి సమస్య పరిష్కారం, పిల్లలు చదువుకోవడానికి పాఠశాలలు ఏర్పాటుచేసినప్పుడే నిజమైన తెలంగాణ రాష్ట్రం యొక్క ఉద్దేశం నెరవేరినట్లు. ఈ మధ్యకాలంలో చాలా విషయాలు మా దృష్టికి వచ్చాయి. నా నియోజకవర్గం గురించి కూడా తమకు తెలుసు. తమరి నియోజకవర్గం పక్కనే బొమ్రాసిపేట మండలం ఉంటుంది. ఒక్క మండలంలో 72 తండాలు ఉన్నాయి. చాలా తండాలకు రవాణా సౌకర్యం లేదు. కాని అవి గ్రామ పంచాయతీలుగా మారినాయి. ఆ ఊరిలో పాఠశాల లేకపోయినా, ఆ ఊరికి రోడ్డు లేకపోయినా, కొన్ని తండాలలో కరెంటు లేకపోయినా వాటికి గ్రామపంచాయతీలుగా హోదా ఇవ్వడం జరిగింది. అందుకే ఈ ప్రభుత్వం నిశితంగా గమనించి ఈ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని తండాలలో, గ్రామ పంచాయతీలుగా రూపాంతరం చెందినా, గతంలోనే గ్రామ పంచాయతీలుగా ఉన్న తండాలకు కచ్చితంగా ఆయా తండాల నుండి మండల కేంద్రానికి నూటికి నూరు శాతం బి.టి. రోడ్డు వెయ్యాలని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అదే విధంగా అన్ని తండాలకు తాగునీటి సౌకర్యం, విద్యుత్తు సౌకర్యము...

(ప్రతిపక్ష సభ్యులు శ్రీ టి. హరీష్ రావు నుండి అంతరాయం)

పాపం మాజీ మంత్రివర్యులు శ్రీ హరీష్ రావు గారు గతంలో వారి నాయకుడు చెప్పిన అబద్ధాలనే ఇంకా పట్టుకున్నట్టున్నారు. కావాలంటే వారిని తీసుకువెళతాము. సీతక్కగారు ఆదిలాబాద్ జిల్లా ఐటిడిఏ ప్రాంతంలో ఉన్న గూడెలల్లో ఉన్న నీళ్ల విషయం, కరెంటు విషయం గురించి వారిని ప్రత్యేకంగా తీసుకువెళ్లి చూపిస్తారు. అన్ని గ్రామపంచాయతీల నుండి తీర్మానాలు చేసి, తెప్పించాము. 7 లక్షల ఆవాసాలకి మీరు ఇంతవరకు నీళ్లు ఇవ్వలేదు. ఇప్పటికే ప్రాథమికంగా మాకు అందిన సమాచారము ఇది. కాబట్టే అధికారిక లెక్కలు మీకు ఇస్తాము. ఎందుకంటే మీరు తప్పులు చేశారు, ఆ చేసిన తప్పులను ప్రజలు గుర్తించి, ఆ ప్రజలు మిమ్మల్ని శిక్షించినా కూడా మీరు మారడం లేదు.

సో, ఆ దేవుడు మీకు ఒక మంచి ఆలోచనని కలిగించాలని మేము కోరగలం, ప్రార్థన చేయగలం. అంతకు మించి మనం చేయగలిగింది ఏముంది అధ్యక్షా? ఈ రోజు మా ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి అంటే తండాలు, గూడేలల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటుచేసినప్పుడే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి జరిగినట్లు అని బలంగా మా ప్రభుత్వం భావిస్తుంది. అందుకే తండాలలో, గూడేలలో విద్యుత్తు సమస్య పరిష్కారానికి, విద్య సమస్య పరిష్కారానికి ఆ తండాల నుండి మండల కేంద్రాలకు కనీసం ఒక్కటైనా బిటి రోడ్డు ఏర్పాటు చేయాలని, మండలాల నుండి జిల్లా కేంద్రాలకు మిగిలిపోయిన డబుల్ రోడ్లు ఏవైతే ఉన్నాయో వాటిని పూర్తి చేయడానికి, జిల్లా కేంద్రాల నుండి హైదరాబాద్ నగరానికి ఫోర్‌లేన్ రోడ్లు వేయాలని సంకల్పించింది. ఈ రాష్ట్రంలో ఎక్కడైనా ప్రతివారికి ఒక మంచి రవాణా సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుంది.

నేడు ప్రతి పేదవాడు కష్టపడి వాహనాలు కొనుక్కుంటున్నారు. కాని సొంత ఊరికి పోవాలంటే రోడ్డు ఉండడం లేదు. మోటర్ సైకిల్ మీద వెళ్లి, గుంతలల్లో పడి, కింద పడి, భార్యాపిల్లలతో పోతూ, ప్రమాదాలకి గురవుతున్నారు, చనిపోతున్నారు. దీనికి కారణం మనం సరైన మౌలిక వసతులు ఏర్పాటుచేయకపోవడం. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన కార్యాచరణ తీసుకుని, ఇప్పటివరకు నిర్లక్ష్యానికి గురైన తండాలను, గూడేలను, మారుమూల ప్రాంతాలను అభివృద్ధి పథం వైపు నడిపించాలని ఈ ప్రభుత్వం భావిస్తుంది. సభ్యులు శ్రీ వంశీకృష్ణ గారైనా, డా. రామచంద్ర నాయక్ గారైనా ప్రస్తావించిన అంశాలతో ప్రభుత్వం పూర్తిగా ఏకీభవిస్తోంది. పూర్తిస్థాయిలో కాంప్రహెన్సివ్ ప్రణాళికను రూపొందించి, కచ్చితంగా ఈ ప్రభుత్వం ముందుకు వెళుతుందని తమరి ద్వారా సభ్యులందరికీ, తెలంగాణ రాష్ట్ర ప్రజలకి మాట ఇస్తున్నది అధ్యక్షా.

శ్రీమతి డి. అనసూయ:- అధ్యక్షా, గత కొంత కాలంగా పెండింగ్ ఉన్నటువంటి మల్టీ పర్పస్ వర్కర్స్ యొక్క జీతభత్యాలు మరియు శానిటేషన్ కోసం ప్రభుత్వం రూ. 378.88 కోట్లు విడుదల చేయడం జరిగింది. గౌరవ సభ్యులు శ్రీ రామచంద్ర నాయక్‌గారు, శ్రీ ఐలయ్యగారు, శ్రీ వంశీకృష్ణ గారుచెప్పినట్లుగా చాలా మారుమూల తండాలు, గ్రామాల్లో, ఇందాక గౌరవ ముఖ్యమంత్రిగారు కూడా చెప్పినట్లుగా రోడ్డు, రవాణా సౌకర్యాలు గాని, విద్యుత్తుగాని, విద్యా వసతులు గాని సరిగా లేనటువంటి మాట వాస్తవం. వాటన్నిటిని కూడా ఈ బడ్జెట్ ద్వారా పునరుద్ధరించుకుని, వారిని మిగతా సమాజంలోని పౌరులతో సమానంగా జీవించే విధంగా, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కొరకు విద్యగాని, విద్యుత్తు గాని, రోడ్డు రవాణ వ్యవస్థగాని, మంచినీటి వ్యవస్థగాని, ఇళ్లుగాని వారికి కల్పించవలసిన అవసరం ఉన్నది అధ్యక్షా. తప్పకుండా ఈ బడ్జెట్ ద్వారా వాటిని పరిపూర్తి చేస్తామని తెలియజేస్తున్నాము. అదే విధంగా రెవెన్యూ గ్రామాలుగా మార్చడం కొరకు సంబంధిత రెవెన్యూ శాఖతో ప్రభుత్వం అనుసంధానం కావలసిన అవసరం కూడా ఉన్నది. ల్యాండ్ సర్వే గతంలో ఎప్పుడో 1936లో జరిగింది. అప్పుడు ఏర్పడినటువంటి రెవెన్యూ గ్రామాలు, ఆ తదనంతరం గ్రామపంచాయతీలు పెరుగుతూ వచ్చాయి తప్ప, రెవెన్యూ డివిజన్లుగా మారినటువంటి పరిస్థితి లేదు కాబట్టి రెవెన్యూ డిపార్టుమెంట్ వారి సమన్వయంతో తగు నిర్ణయాలు తీసుకుంటాము. నూతన గ్రామపంచాయతీల కొరకు డిమాండ్ కూడా ఉన్నది. ఈ విషయంలో కూడా ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

ఆర్.టి.సి. సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు

ప్రశ్న నెం. 201(3)

సర్వశ్రీ తన్నీరు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి వేముల, గంగుల కమలాకర్, ముఠా గోపాల్, కల్వకుంట్ల సంజయ్:-

గౌరవనీయులైన రవాణా శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) ఆర్.టి.సి. సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే ప్రతిపాదన ఏ దశలో ఉంది;

ఆ) ఈ విషయంలో జాప్యం జరగడానికి కారణాలేమిటి,

ఇ) ఎప్పటిలోగా ప్రతిపాదన అమలు చేసి, నియమిత రోజును ప్రకటించడమవుతుంది?

రవాణా శాఖ మంత్రి (శ్రీ పొన్నం ప్రభాకర్):-

అ) అప్పటి ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వ రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ఆర్టిసి) ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులలో విలీనం చేయడానికి ఒక నిర్ణయాన్ని తీసుకుంది. ప్రభుత్వ సర్వీసులలో టిజిఎస్ఆర్టిసి ఉద్యోగులను విలీనం చేయడం కోసం మరియు ఇందుకు సంబంధించిన విషయంలో అనుషంగిక విషయాలను సమకూర్చడం కోసం 2023, తెలంగాణ రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ (ప్రభుత్వ సర్వీసులోకి ఉద్యోగుల విలీనం) (2023 లోని 7వ చట్టం) చట్టాన్ని 15.09.2023వ తేదీన తెలంగాణ గెజిట్లో న్యాయ శాఖ ప్రచురించింది.

అంతేగాక, 2023, టిజిఎస్ఆర్టిసి (ప్రభుత్వ సర్వీసులో ఉద్యోగుల విలీనం) (2023లోని 7వ చట్టం) ప్రకారంగా ప్రభుత్వ సర్వీసులో టిజిఎస్ఆర్టిసి ఉద్యోగులను విలీనం చేయడానికి విధి విధానాలను రూపొందించడం కోసం రవాణా, రోడ్లు మరియు భవనాల (టిఆర్అ II) శాఖ 29.09.2023వ తేదీ గల, జీ.ఓ. ఎం.ఎస్.నెం.41 ద్వారా ఒక కమిటీని ఏర్పాటు చేయడమయింది.

ఆ) లేదండీ.

ఇ) ఈ ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

శ్రీ టి. హరీష్ రావు:- అధ్యక్షా, గౌరవ మంత్రిగారి సమాధానం ఒక రకంగా చెప్పాలంటే బాధ్యతా రహితంగా ఉంది, తప్పుదోవ పట్టించే విధంగా ఉంది. ఈ విషయంలో జాప్యం జరగడానికి గల కారణాలు ఏమిటి అన్నప్పుడు లేదండీ అన్నారు. ప్రభుత్వం వచ్చి దాదాపు ఇప్పుడు 8వ నెల జరుగుతున్నది. ఎనిమిది నెలలు జరుగుతున్నా, ఇంకా జాప్యం జరగడం లేదని ఒక సమాధానం చెప్పారు. ఎప్పటిలోగా ఈ ప్రతిపాదనను అమలు చేసి, నియమిత రోజును ప్రకటించడమవుతుంది అనంటే, ఇది పరిశీలనలో ఉంది అని గౌరవ మంత్రివర్యులు చెప్పారు. ఇది కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో అధ్యక్షా(ఒక పుస్తకాన్ని సభకు ప్రదర్శిస్తూ). ఈ మేనిఫెస్టోలో పేజీ నెంబర్ 28, ఐటం నెంబర్ 144.. టిఎస్ఆర్టిసి సిబ్బంది సంక్షేమం. ఆర్టీసి కార్మికులను ప్రభుత్వంలో విలీన ప్రక్రియ పూర్తి చేసి, రెండు పిఆర్సీల బకాయిలను వెంటనే చెల్లిస్తాం. వెంటనే అంటే ఎనిమిది నెలల సమయం సరిపోదా అధ్యక్షా?

రెండవ అంశం. వచ్చే పిఆర్సి పరిధిలోకి టిఎస్ ఆర్టిసి కార్మికులను చేరుస్తాం. మూడవది - రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు, సదుపాయాలు కల్పిస్తాం. నాలుగవ అంశం - ఆర్టీసి బస్సులను ఆధునీకరించి, విస్తరిస్తాం, అధునాతనమైన సౌకర్యాలతో కొత్త సర్వీసులను ప్రారంభిస్తాం. ఐదవది మరియు చివరి అంశం ఆర్టిసి యూనియన్ పునరుద్ధరణకు అనుమతి ఇస్తాం. అయితే వారికి నా సూటి ప్రశ్నలు, నేను మంత్రిగారిని లోతులోకి పోకుండా సూటిగా ప్రశ్నించదలచుకున్నాం.

మొదటి ప్రశ్న గౌరవ మంత్రిగారు ఎప్పటిలోగా ఈ అపాయింటెడ్ డేట్ ప్రకటిస్తారు? ఏ రోజు నుండి ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారు? పరిశీలనలో ఉంది, చూస్తాం, చేస్తాం అని కాలయాపన చేయడం కాదు, ఒక కచ్చితమైన తేదీని ఈ సభ ద్వారా ఆర్టిసి కార్మికులకు చెప్పాలని మీ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

10.40 ఉ. ప్రశ్న నెం. 2 యూనియన్ను పునరుద్ధరణ చేస్తామని మీరు హామీ ఇచ్చారు. దానిని ఎప్పటిలోగా చేస్తారు? యూనియన్ పునరుద్ధరణ చేసేది లేదనే విధంగా మీరు ఉత్తర్వులు ఇచ్చినట్లుగా మా దృష్టికి వచ్చింది. మీరు ఉత్తర్వులు ఇచ్చారా, లేదా? ఇవ్వకపోతే ఎప్పటిలోగా యూనియన్ను పునరుద్ధరణ చేస్తారు?

ప్రశ్న నెం. 3 గతంలో మా ప్రభుత్వ హయాంలో ఆర్టీసీలో కార్మికులు చనిపోయినట్లైతే, వారి పిల్లలకు వెంటనే పర్మినెంట్ ఉద్యోగం ఇచ్చేవారము. కానీ మీ ప్రభుత్వం వచ్చిన తరువాత పర్మినెంట్ ఉద్యోగం అనే నిబంధన తీసివేసి బ్రెడ్విన్నర్స్ అనే పథకాన్ని తీసుకొచ్చి కన్సాలిడేటెడ్ పే రూ. 15000/- జీతం చెల్లించే విధంగా మూడు సంవత్సరాలు పనిచేసిన తరువాత అప్పుడు వారిని శాశ్వత ఉద్యోగుల క్రింద తీసుకోవడం జరుగుతున్నందున, చనిపోయిన కార్మికులకు మీ ప్రభుత్వం అన్యాయం చేసిన

మాట వాస్తవమా? ఈ విధానాన్ని ఎందుకు అమలులోకి తీసుకొచ్చారు? గత ప్రభుత్వంలో లాగా చనిపోయిన కార్మికుల కుటుంబాలలోని పిల్లలకు వెంటనే పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నాను.

ప్రశ్న నెం.4 గౌరవ ముఖ్యమంత్రిగారు, మంత్రిగారు నెక్లెస్ రోడ్‌లో మా ప్రభుత్వ హయాంలోని కొత్త బస్సులకు జెండా ఊపారు చాలా సంతోషం. Governance is a continuous process. అయితే ఆ జెండా ఊపిన సందర్భంలో కార్మికులకు పిఆర్‌సి బకాయిలను విడుదల చేస్తున్నానని 10.2.2024 నాడు దాదాపు రూ. 300 కోట్ల చెక్‌ను గౌరవ ముఖ్యమంత్రిగారు చూపించి ఆ డమ్మి చెక్కులతో కొన్ని ఫోటోలు కూడా దిగారు. నేటికి దాదాపు ఐదు నెలలు అయినప్పటికీ, నెక్లెస్ రోడ్ నుండి బస్ భవన్‌కు ఆ చెక్ ఇంకా చేరలేదు. ఆ చెక్‌ను ఎప్పుడు ఇస్తారో తెలపాలని కోరుతున్నాను.

ప్రశ్న నెం. 5 మహాలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చి నందుకు చాలా సంతోషిస్తూ, అభినందిస్తున్నాను. ఆ పథకానికి నెల నెల బిల్లులు విడుదల చేయకపోవడం వాస్తవమా? ఈ పథకం క్రింద రాష్ట్రప్రభుత్వం ఆర్టీసీకి విడుదల చేసే నిధుల వివరాలు, ఇప్పటివరకు విడుదల చేసిన నిధుల వివరాలు, ఇవ్వకపోవడం వల్ల కార్మికుల యొక్క పియఫ్, సిపియఫ్ నిధులను మళ్లించి కార్మికులకు జీతాలు ఇచ్చిన మాట వాస్తవమా కాదా అని తెలపాలని, వాటిని ఎప్పటిలోగా ఇస్తారన్న విషయాన్ని సూటిగా చెప్పాలని కోరుతున్నాను.

మా ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు 43 శాతం, ఆర్టీసీ కార్మికులకు 44 శాతం ఫిట్‌మెంట్‌ను ఇవ్వగా, గత తెలుగు దేశ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులకు కేవలం రూ.100 కోట్లు, కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు రూ.200 కోట్లు బడ్జెట్‌లో కేటాయించగా, మా ప్రభుత్వం మాత్రం దాదాపు రూ.1000 కోట్లు, రూ.1500 కోట్లను కేటాయించి ఆర్టీసీ సంస్థను మేము కాపాడుకోవడం జరిగింది.

శ్రీ డి. శ్రీధర్ బాబు:- అధ్యక్షా, గౌరవ సీనియర్ శాసన సభ్యులకు ఇది క్వశ్చన్ అవర్ అని తెలుసు. కేవలం ప్రశ్నలు మాత్రమే అడగాలి. మా మేనిఫెస్టోను టి.ఆర్.ఎస్. సభ్యులు బట్టీ పట్టినందుకు చాలా సంతోషం. స్పష్టతతో దానిని మేము తయారు చేయడం జరిగింది. స్పెసిఫిక్ ప్రశ్నలు వేస్తే సమాధానాలు చెప్పడానికి ఆస్కారం ఉంటుందని నేను తమరి ద్వారా గౌరవ సభ్యులను కోరుతున్నాను. కానీ వారు డిబేట్ మొదలు పెట్టారు అధ్యక్షా. దాదాపు పది ప్రశ్నలకు 11.00 గంటల వరకే సమయం ఇచ్చినందున గౌరవ మంత్రులు కూడా మాట్లాడవలసి ఉంటుంది.

మిస్టర్ స్పీకర్:- హరీష్ రావు గారు

శ్రీ టి. హరీష్ రావు:- అధ్యక్షా, నేను ఆర్టీసీకి సంబంధం ఉన్న విషయాలను మాత్రమే అడిగాను తప్ప, రాజకీయాలకు సంబంధ విషయాల జోలికి పోలేదు. ప్రభుత్వం దివ్యాంగులకు, విద్యార్థులకు, ప్రభుత్వ ఉద్యోగులకు, జర్నలిస్ట్‌లకు రాయితీతో బస్సు పాసులను ఇవ్వడం జరుగుతుంది. ఈ ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలలో ఆ రాయితీలకు చెందిన నిధులలో ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం వాస్తవమా? దానికి సంబంధించిన నిధులు ఎన్ని, వాటిని ఎప్పటిలోగా చెల్లిస్తారు, ఇప్పటివరకు చెల్లించకపోవడానికి గల కారణాలను వివరించాలని కోరుతున్నాను.

కార్మికులకు సంబంధించి మోటారు ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్‌లో డ్రైవర్లు, కండక్టర్లు 8 గంటలకు మించి పని చేయకూడదని ఉంటుంది. ఇందులో మహిళా కండక్టర్లు కూడా ఉన్నారు. కానీ వీరిని దాదాపు 18 గంటలు పని చేయించడం వల్ల పని ఒత్తిడికి లోనయ్యి దాదాపు పందలాది కార్మికులు చనిపోతున్న మాట వాస్తవమా? మహాలక్ష్మి పథకం తీసుకొచ్చిన తరువాత సరిపడినంతగా డ్రైవర్లు, కండక్టర్లను నియమించక పోవడం వల్ల ఓవర్ లోడ్ అయ్యి వారికి పని గంటల భారం పెరిగి ఒక్కొక్కరు దాదాపు 18 గంటలు పని చేస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా అని, దీనికి అనుగుణంగా డ్రైవర్లు, కండక్టర్ల నియామకాన్ని ఎప్పటిలోగా చేపడతారని తమరి ద్వారా కోరుతున్నాను. ప్రభుత్వం ఎటువంటి రాజకీయాల జోలికి వెళ్లకుండా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే ప్రక్రియను చేపట్టాలని దానికి సంబంధించిన తేదీలను తెలియజేస్తూ,

ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు ఈ సభ ద్వారా తీపి కబురు అందించాలని తమరి ద్వారా గౌరవ ముఖ్యమంత్రిగారిని మరియు మంత్రి గారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్:- శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డిగారూ...

(అంతరాయం)

శ్రీ పొన్నం ప్రభాకర్:- అధ్యక్షా, దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా పది సంవత్సరాలుగా ఆర్టీసీ సంస్థను చంపి ఇది ఉంటుందా, పోతుందా, తీసివేస్తారా అనే పరిస్థితుల నుంచి ఒక రిటైర్డ్ executive director ని ఎండిగా నియమించి ఒక కమిటీని వేసి పది సంవత్సరాలుగా చేయలేదు. గత ప్రభుత్వంలో ఎన్నికల ముందు ఎటువంటి సంప్రదింపులు, చర్చలు జరపకుండా, కనీసం ఆర్టీసీ యాజమాన్యంతో కూడా సంప్రదించకుండా, కార్మికులను రెచ్చగొట్టి గవర్నర్‌గారు అనుమతించడం లేదని, వారి సహాయంతో ప్రొటెస్ట్ చేయించుకొని దానికి రాజకీయాలు పులిమిన వీరు, కార్మిక సంస్థలను రద్దు చేసిన వీరు, ఆర్టీసీ అధ్యక్షులుగా వీరి కుటుంబ సభ్యులు ఉన్న వీరు ఈనాడు మాట్లాడుతున్నారు అధ్యక్షా. వీరికి ఏ విధమైన హక్కు ఉందని రద్దు చేశారు? రద్దు చేసినందుకు ముందుగా కార్మికులకు క్షమాపణ చెప్పాలి. అన్నమో రామచంద్రా అని 50 రోజులు సమ్మె చేస్తే కూడా పట్టించుకోలేదు.

10 సంవత్సరాలుగా ఒక్క బస్సును కూడా కొనుగోలు చేయలేదు. మా ప్రభుత్వం వచ్చిన తరువాత బరాబర్‌గా బస్సులను కొనుగోలు చేయడం జరిగింది. అంతేకాకుండా 2013 నుండి పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ. 280 కోట్ల బకాయిలను మేము బాండు రూపంలో తీసుకొచ్చి దాదాపు రూ. 80 కోట్లను పేమెంట్ చేయడం కూడా జరిగింది. ఆర్టీసీ యాజమాన్యం ఇతర అవసరాలకు కూడా అడుగుతోంది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికుల పిఎఫ్, కోపరేటివ్ సంస్థలకి సంబంధించిన నిధులలో ఒక్క రూపాయి కూడా వాడుకోవడం జరగలేదు. వారు కార్మికుల సొమ్మును దాదాపు రూ. 4 వేల కోట్ల బకాయిలను వాడుకోవడం జరిగింది. ఆర్టీసీ దాదాపు రూ. 7 వేల కోట్ల అప్పుతో మాకు అప్పగిస్తే మహాలక్ష్మి పథకం క్రింద మా ప్రభుత్వం నెలకు దాదాపు రూ. 300 కోట్లను చెల్లించడం జరిగింది. ఇప్పటికే దాదాపు 70 కోట్ల మంది మహిళలు ప్రయాణించగా దాదాపు రూ. 2400 కోట్లను ఆ మహిళల పేరు మీద ఆర్టీసీకి చెల్లించడం జరిగింది. కారుణ్య నియామకాలను ఏ ప్రభుత్వం తీసుకొచ్చినప్పటికీ, వాటిని ఇంకా సరళీకృతం చేసి ఆర్టీసీ కార్మికుల కుటుంబాల వారికి ఆధారం ఇస్తున్నాము. మేము ఎన్నడూ జీఓలను మార్చడం జరగలేదు అంతేకాకుండా ఆర్టీసీ కుటుంబాలలోని చనిపోయిన వారితో పాటుగా, వారి కుటుంబంలోని వారి ఆరోగ్యం బాగలేకపోతే వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలనే పాలసీని కూడా తీసుకురావడం జరిగింది.

మొన్ననే తార్నాక హాస్పిటల్‌లో ఎమ్ఆర్ఐతోపాటుగా సీటీ స్కాన్‌ను తీసుకొచ్చి క్యాథ్‌ల్యాబ్‌ను అభివృద్ధి చేసి ఆర్టీసీ కార్మికులను ఆదుకునే ప్రయత్నాలు చేస్తున్నాము. నాడు 45 లక్షల మంది ప్రయాణం చేస్తే నేడు 56 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. ఆర్టీసీలో దాదాపు 3035 మంది ఉద్యోగులను నియామకాలు చేయడం జరిగింది. ఈ సభా వేదిక ద్వారా ఆర్టీసీ కండక్టర్లకు, డ్రైవర్లకు మా ప్రభుత్వం ద్వారా అభినందనలు తెలియజేస్తున్నాను. శ్రమ దోపిడి చేయవద్దని 8 గంటల కంటే ఎక్కువ పని చేసేవారికి పని భారం పెరిగినప్పటికీ వారికి రెట్టింపు జీతాలను చెల్లించడం జరుగుతోంది. మీ హయంలో బస్సు ఎక్కే ప్రయాణీకులే లేరు గానీ నేడు 95 శాతం ఆక్యుపెన్సీతో నష్టాల బాటలో నుండి లాభాల బాటలో ప్రయాణింపజేస్తున్నాము. 50 రోజులు సమ్మె చేసినా వారు పట్టించుకోలేదు. ఎన్నికల ముందు వారిని కమిట్ చేయించి ఒక కమిటీ వేశారు. 50 వేల కుటుంబాల వారు వారిని ఎన్నికల ముందు వ్యతిరేకిస్తుంటే గెలవలేరనే ఆలోచనతో గత ప్రభుత్వం భూతద్దంలో చూపించారు. అలా చూపించినప్పటికీ వారు మమ్మల్ని ఆశీర్వదించారు కాబట్టే 2017 నుండి పెండింగ్‌లో ఉన్న 21 పిఆర్‌సి కమిషన్ ప్రకారం 21 శాతం, వీటితోపాటు 2013 నుండి పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.280 కోట్ల బకాయిలను శాంక్షన్ చేయడం జరిగింది. పంపిణీలో జాప్యం జరగవచ్చు కానీ, ఇప్పటికే ప్రభుత్వం

దాదాపు రూ.80 కోట్లను ఇవ్వడం జరిగింది. మిగిలిన వాటిని కూడా చెల్లించడం జరుగుతుందని ఈ సభ ద్వారా తెలియజేస్తున్నాను.

10.50 ఉ. అదేవిధంగా ఆదరబాదరాగా 29వ తేదీనాడు కేబినేట్ సమావేశాన్ని ఏర్పాటు చేసి 10వ తేదీనాడు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. అటువంటిది వీరు ఈ అంశం గురించి మాట్లాడుతూ మొసలి కన్నీరు కారుస్తున్నారు. నిజంగా ఆర్టీసి కార్మికులపై చిత్తుశుద్ధి ఉంటే, పది సంవత్సరాల మీ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని ఎందుకు చంపే ప్రయత్నం చేశారు. ఆర్టీసి సంస్థ ఆస్తుల మొత్తాన్ని వాళ్ల పార్టీలో ఉన్న నాయకులకు అప్పనంగా అప్పజెప్పే ప్రయత్నం చేసి తక్కువ ధరకే అప్పజెప్పడం జరిగింది.

(బీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

ఆనాడు మేము ప్రతిపక్ష సభ్యులుగా ఉన్నప్పుడు మీ ఇష్టం వచ్చినట్లు ఆర్టీసి ఆస్తులను ఇచ్చిన పరిస్థితులను చూశాము. ఆనాటి గౌరవ ముఖ్యమంత్రి గారు ఆర్టీసి సంక్షేమానికి కృషిచేస్తామని చెప్పి, ఆర్టీసి కార్మికుల ఒత్తిడిని ప్రక్కకు పెట్టి, చివరికి ఆర్టీసి కార్మిక సంఘాలను బంద్ చేయించిన వీరు మాట్లాడితే ఎట్లా అధ్యక్షా? అందుకే ఆర్టీసి సంక్షేమం, ఆర్టీసి కార్మికుల సంక్షేమం మరియు ప్రజల రవాణా సౌకర్యం మా ప్రభుత్వం యొక్క బాధ్యతగా భావించి, ఈ మూడు అంశాలను స్ఫూర్తిగా తీసుకొని ఎక్కడా ఆర్టీసీకి అన్యాయం జరగకుండా, భవిష్యత్తులో తప్పకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. ఈనాడు ఆర్టీసీకి సంబంధించి మాట్లాడే నైతిక హక్కు కూడా బిఆర్ఎస్ పార్టీ శాసన సభ్యులకు లేదు. 5 సంవత్సరాలపాటు ఆర్థిక శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వహించిన హరీష్‌రావు గారు ఆర్టీసి శాఖకు ఏ విధమైన సహకారం అందించారని ఈ సందర్భంగా అడుగుతున్నాను. బడ్జెట్‌లో రూ. 15 వందల కోట్లు కేటాయిస్తే, రూ. 4 వందల కోట్లు కూడా విడుదల చేయని లెక్కలు మొత్తం నేను లిఖిత పూర్వకంగా వారికి పంపిస్తానని తమరి ద్వారా తెలుపుతున్నాను. అటువంటిది వీరు మాట్లాడితే ఎలా అధ్యక్షా? ఈనాడు మా ప్రభుత్వం రూ. 2,400 కోట్లు మహాలక్ష్మీ పథకానికి అందజేసిన సొమ్ములో దాదాపు రూ. 2,000 కోట్లు ఆర్టీసి శాఖకు అందివ్వడం జరిగింది. రూ. 280 కోట్లు బాండ్ల రూపంలో రూ. 80 కోట్లు ఇవ్వడం జరిగింది. దాదాపు రూ. 35 వేల కోట్లు వరకు అదనపు భారం పడుతున్న 21 శాతం పీఆర్సీని ఇవ్వడం జరిగింది. భవిష్యత్తులో ఆర్టీసి సంక్షేమానికి సంబంధించి మేము నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది. ఇవన్నీ మాట్లాడిన వాళ్ళకు, వాళ్ళ ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి గారు, గతంలో ఉన్న ఎం.పి. తీసుకున్న ఆస్తులు మీకు ఏమి కనిపించలేదా అధ్యక్షా? ఆర్టీసి సంక్షేమం ఆనాడు కనపడలేదా? నేను అన్నింటికంటే ముఖ్యమైన ప్రశ్నను అడుగుతున్నాను. అసలు ఆర్టీసి వంటి సంస్థలు ఒక రిటైర్డ్ ఈ.డి.ని ఎందుకు ఎండిగా పెట్టారో చెప్పమని అడుగుతున్నాను. తప్పకుండా మరొక్కసారి ప్రభుత్వ పక్షాన ఈ అంశం పరిశీలనలో ఉందని తమ ద్వారా ఆర్టీసి కార్మికులకు చెబుతున్నాను. వాళ్ళు ఒక కమిటీ వేసి జాప్యం చేసి ఉండవచ్చు. మేము ఆ అంశంపై చర్చలు, ఇతరత్రా కార్యక్రమాలు తీసుకుంటున్నాము. ఆర్టీసి కార్మికులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామనే మాట ఈ సందర్భంగా తమ ద్వారా మనవిచేసుకుంటున్నాను.

(బీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి:- క్వశ్చన్ వేశాక సమాధానం ఇవ్వకపోతే ఎలా అధ్యక్షా?

శ్రీ టి. హరీష్ రావు:- అధ్యక్షా, మంత్రిగారు నన్ను క్వశ్చన్ చేస్తున్నారు. మరి సమాధానం చెప్పమంటే చెప్తాను. నేను అడిగిన ఏ ఒక్క క్వశ్చన్ కూడా సమాధానం చెప్పలేదు. కాని, నేను క్వశ్చన్ చేస్తున్నా, నేను క్వశ్చన్ చేస్తున్నా అని వారు నాకు క్వశ్చన్ వేస్తున్నారు. సమాధానం చెప్పమంటే చెప్తాను.

మిస్టర్ స్పీకర్:- శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి గారూ, మీరు మాట్లాడండి.

(ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సభ్యులు మేము ప్రొటెస్ట్ చేస్తున్నామని తెలపడం జరిగింది.)

మిస్టర్ స్పీకర్:- ఇది క్వశ్చన్ అవర్. షార్ట్ డిస్కషన్ కాదు.

SRI T. HARISH RAO:- (మైకు లేకుండా) We are protesting. We have right to protest. Protest is our right. ప్రభుత్వం నుండి సరైన సమాధానం రానప్పుడు ప్రొటెస్ట్ చేసే హక్కు శాసన సభ రూల్స్‌లో ఉంది. కాబట్టి మేము ప్రొటెస్ట్ చేస్తున్నాము.

(ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సభ్యులందరూ వెల్ వద్దకు వెళ్లి ప్రొటెస్ట్ చేయసాగారు.)

శ్రీ డి. శ్రీధర్ బాబు:- అధ్యక్షా, సీనియర్ శాసన సభ్యులైన హరీష్ రావు గారిని నేను తమ ద్వారా కోరుతున్నాను. మీరు అడిగిన ప్రతి ప్రశ్నకి గౌరవ రవాణా శాఖా మంత్రి గారు స్పష్టంగా, కూలంకషంగా సమాధానం ఇవ్వడం జరిగింది. మీరు సమాధానం రాలేదని అనుకుంటే వేరే ఫామ్‌లో రమ్మని అనండి. This is a question hour. వారికి అదనంగా సమాచారం కావాలని అనుకుంటే let them come in different form. This is a question hour. Specific గా question ఉండాలి. అందుకోసమే రవాణా శాఖా మంత్రి గారు కూడా Specific గా సమాధానం చెప్పడం జరిగింది. దయచేసి ఇంకొక 5 నిమిషాలు ఉంది. గౌరవ శాసన సభ్యులందరి ప్రశ్నలున్నాయి. మంత్రులు కూడా ఇక్కడ కూర్చొని ఉన్నారు. గౌరవ శాసనసభ్యులకు సంబంధించిన క్వశ్చన్లకి సమాధానం చెప్పడానికి అవకాశం ఇవ్వాలని గౌరవ స్పీకర్ గారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్:- శ్రీ కూనంనేని సాంబశివ రావు గారు.

శ్రీ కూనంనేని సాంబశివ రావు:- అధ్యక్షా, ఆర్టీసీకి సంబంధించి మా యూనియన్ ఏఐటియుసి ఆర్టీసి పుట్టిన దగ్గర నుండి మేము ఒకటి రెండు పర్యాయాలు మినహా ఎప్పుడూ కూడా మా పార్టీ గుర్తుతోనే మేము ఎన్నికయ్యాము. ముఖ్యంగా టిఆర్ఎస్ కాలంలో ఆ రోజు....

(బీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

మిస్టర్ స్పీకర్:- శ్రీ టి.హరీష్‌రావు గారూ, మీరు సీనియర్ శాసన సభ్యులు. ఇది క్వశ్చన్ అవర్. దీనిని డీవియేషన్ చేయకండి. మీకు మైక్ ఇస్తాను ప్లీజ్ కూర్చోండి.

శ్రీ కూనంనేని సాంబశివ రావు:- ఇప్పుడు ఆర్టీసికి సంబంధించిన అంశంపై వారు బాగా ఆందోళన చేస్తున్నారు. నేను మీకు ఒక అంశం గుర్తు చేయాలి. 50 రోజుల పాటు జరిగిన సమ్మె కాలంలో ఖమ్మంలో ఒక డ్రైవర్ కాల్చుకొని ఆత్మహత్య చేసుకొని చనిపోయారు. ఆనాడు హుజూర్‌నగర్‌లో టీఆర్ఎస్‌కు మేము మద్దతిస్తే కూడా ఆర్టీసి ఘటన వల్ల మేము మద్దతు వెనక్కి తీసుకోవల్సిన పరిస్థితి వచ్చింది. అదే సందర్భంలో నేను హైదరాబాద్‌లో ఆర్టీసీ కార్మికుల హక్కుల కొరకు 6 రోజుల పాటు నిరవధిక నిరాహార దీక్ష చేశాను. అదే సందర్భంలో ఆర్టీసీ సంఘాలను రద్దు చేసి వారికి మాట్లాడే హక్కు లేకుండా కార్మికులను ఈనాడు అడుక్కుతినే వారిలాగా వారికి ఏదైనా సమస్య వస్తే హక్కు లేని పరిస్థితి కల్పించబడింది. ఇంకా చాలా అంశాలున్నాయి. కాని, సమయాన్ని బట్టి నేను మాట్లాడడం లేదు. ఇప్పటికైనా ఆనాడు వారు చేసిన తప్పుల్ని ఈ కొత్త ప్రభుత్వం సరిదిద్దాలి. ఆ కార్మికులకు హక్కులివ్వాలి. అలాగే కార్మికులను విలీన ప్రక్రియలో చేర్చాలి. వారికి ఇవ్వాల్సిన డిఎ ఇవ్వాలని తమ ద్వారా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్:- శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి గారూ, ఇది క్వశ్చన్ అవర్. ఇది మంచి ప్రాక్టీస్ కాదు. మీకు మాట్లాడేందుకు అవకాశం ఇస్తానని అన్నాను కదా! మిమ్మల్ని మాట్లాడమని అంటే మాట్లాడలేదు.

11.00 ఉ.

(వారు సిగ్నేటరీనే కాదు, వారికి మాట్లాడటానికి అవకాశమెలా ఇస్తారని బీఆర్ఎస్ సభ్యులు అంతరాయం కలిగించసాగారు)

డి. శ్రీధర్ బాబు: హరీష్‌రావు గారు సీనియర్ శాసన సభ్యులు మరియు లెజిస్లేటివ్ మంత్రిగా కూడా చేయడం జరిగింది. వారు స్పెసిఫిక్‌గా రూల్ బుక్ గురించి మాట్లాడారు. There is no provision in the Rule Book to express their dissent. ఇది ప్రశ్నోత్తరాల సమయం. మీకు కూడా మాట్లాడటానికి అవకాశం ఇస్తాం. మిమ్మల్ని

మాట్లాడమంటే మీరు మాట్లాడలేదు. సభా సమయం వృధా అవుతుంది. మీరు (గౌరవ స్పీకర్ గారిని ఉద్దేశించి) 11.00 గం.లకు క్వశ్చన్ అవర్‌ని క్లోజ్ చేస్తామని అన్నారు. అలాంటి సందర్భంలో గౌరవ శాసన సభ సభ్యులందరి సమయం కూడా వారే తీసుకొంటున్నారు. మా మంత్రి గారు స్పెసిఫిక్‌గా దాదాపు ఐదు నిమిషాల్లో వారు అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పడం జరిగింది. దయచేసి ఏ విధంగానైతే మనందరం రూల్స్ బుక్ ద్వారా ప్రొసీజర్స్‌ను నడిపించడం జరిగిందో అదే విధంగా హౌస్ నడపడానికి సహకరించమని కోరుతున్నాను.

(Without mike, Sri Vemula Prashanth Reddy of BRS Party stated that earlier there were so many incidents where the Opposition Members were allowed to express their dissent)

నేను స్పెసిఫిక్‌గా హరీష్‌రావు గారు రూల్ అడిగారు కనుక రూల్ చెబుతున్నాను. దయచేసి వారికి ఇంకేమైనా ప్రశ్నలుంటే డిఫరెంట్ ఫామ్‌లో మీ దగ్గరకు తీసుకురమ్మని వారిని తమరి ద్వారా కోరుతున్నాను. You allow Sir, our Minister will answer.

శ్రీ టి. హరీష్ రావు:- శ్రీధర్ బాబు గారి వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయి.

(ఈ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ సభ్యులు తమ అభ్యంతరం తెలపసాగారు)

ఈ సభలో అనేక సందర్భాలున్నాయి. మేము ఎల్.ఏ. మంత్రులుగా ఉన్నప్పుడు శ్రీధర్ బాబు గారు మరియు భట్టి గారు క్వశ్చన్ అవర్‌లో సరైన సమాధానం రాలేదని చాలా సందర్భాల్లో ఈ సభలో వాకౌట్ చేసి వెళ్ళారు. మేము మీకు ప్రొటెస్ట్ చేసే అవకాశమిచ్చాము. ఒక్క నిమిషంలో మేము చెప్పి వెళ్ళిపోతాము. I don't want to waste the time. ఎందుకంటే ఇందులో సిగ్నేటరీ కాకపోయినా మీరు సాంబశివరావు గారికి అవకాశమిచ్చారు. అక్కడ సభా సమయం వృధా కాదా? మాకు సరైన సమాధానం రాలేదని మేము అడిగితే మా గొంతు నొక్కడానికి సభా సమయం అడ్డు వస్తున్నది. అధ్యక్షా, గౌరవ మంత్రి వర్యులు ....,

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి:- అధ్యక్షా, హరీష్ రావు గారు దాదాపుగా 2004-05వ సంవత్సరం నుండి శాసనసభ్యులుగా ఈ సభలో కొనసాగుతున్నారు. 2014-2023 వ సంవత్సరం వరకు మంత్రిగా కొనసాగారు. వారికి లెజిస్లేటివ్ ఎఫైర్స్ మంత్రిగా కూడా పని చేసిన అనుభవం ఉన్నది. ఛైర్ మీద ఆరోపణలు చేయడం ఏ సభ్యునికీ తగదు. ఎందుకంటే, ఇది ప్రాధాన్యతతో కూడుకున్న సమస్య. కార్మికుల పక్షాన కార్మికులు కష్టాల్లో ఉన్నప్పుడు, 50 రోజులు దీక్ష చేసినప్పుడు, 50 మంది చనిపోయినప్పుడు అలాగే ఖమ్మం జిల్లాకు సంబంధించిన డ్రైవర్ శ్రీనివాస రెడ్డి గారి పిల్లలు పెద్ద ఉద్యోగాలలో ఆర్థికంగా బలంగా ఉన్నా, ఆనాటి ప్రభుత్వం కార్మికుల పట్ల వివక్ష, 50,000 కార్మికుల పట్ల చూపిస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తూ, ఆత్మ బలిదానం చేసుకున్నప్పుడు వారి కుటుంబానికి వారందరూ అండగా నిలబడ్డారు. అలాంటి కార్మికుల తరఫున కొట్లాడే కమ్యూనిస్టు పార్టీ, ఈ సభలో వారి తరపున మాట్లాడటానికి అడిగితే మీరు వారికి అవకాశమిచ్చారు. కార్మికులకు, కార్మికుల తరఫున కొట్లాడే వారికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఈ ప్రభుత్వానికి వారి సమస్యలు పరిష్కరించడానికి ఏమైనా సూచనలు ఉపయోగపడతాయనే ఉద్దేశంతో మీరు సాంబశివ రావు గారికి అవకాశమిచ్చారు. ప్రశ్న అడగకపోయిన వారికి మాట్లాడటానికి ఎట్లా అవకాశమిస్తారని వారు అంటున్నారు. అది ఏ చట్టానికి, దేనికైనా వారు మాట్లాడుతున్నది పూర్తిగా విరుద్ధం. ఒక్క సారి ఒక్క ప్రశ్న ఈ సభలో ఆమోదం పొందిందంటే అది సభ యొక్క ఆస్తి. సభలో ప్రశ్న అడిగిన వాళ్ళకే అవకాశమివ్వాలని, మిగతా వారికి అవకాశమివ్వద్దని ఏ చట్టంలో లేదు.

(బీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుండి అంతరాయం)

ఈ రోజు సభలో మాట్లాడటానికి పది ప్రశ్నలు ఆమోదం పొందాయి. ఈ పది ప్రశ్నలకు ఒక్క గంటలో చర్చ జరిగి దీని మీద సమాధానాలు చెప్పాలి. అంటే ప్రతి ప్రశ్నకు ఆరు నిమిషాల్లో మనం చర్చ ముగించాలి. అట్లా అరవై నిమిషాల్లో అన్ని ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి

సమాధానాలు రాబట్టడానికి ప్రయత్నం చేయాలి. కొన్ని సార్లు ప్రశ్న యొక్క ప్రాధాన్యతను బట్టి తమరు అనుమితిస్తే ఆ చర్చ కొంత ఎక్కువ సేపు జరగడానికి అవకాశమున్నది. ఎప్పుడైతే ఈ ప్రశ్నలు సభకు అడ్మిటై హౌస్‌లోకి వస్తాయో అవి హౌస్ ప్రాపర్టీ అవుతాయి. ప్రశ్న అడిగిన వాళ్ళ ప్రాపర్టీ కాదు అధ్యక్షా. దయచేసి వారు 20 సంవత్సరాలు ప్రజాప్రతినిధులుగాపనిచేశామని జబ్బలు చరుచుకుంటారు కదా, లెజిస్లేటివ్ ఎఫైర్స్ మంత్రిగా పని చేసిన హరీష్ రావు గారికి ఒక్క సారి ప్రశ్న సభలోకి వచ్చిందంటే అది సభ్యుల యొక్క అందరి ఆస్తి అవుతుంది కనీసం తెలియాలి. ఎవరికి మాట్లాడటానికి అవకాశమివ్వాలనేది ఛైర్ యొక్క విచక్షణ అధికారం అవుతుంది. తమరు సాంబశివ రావు గారికి అవకాశం ఇవ్వడాన్ని సభ్యులు తప్పుబట్టడం దాన్ని నూటికి నూరు శాతం తప్పు. కాబట్టి వారు అలా మాట్లాడటాన్ని భవిష్యత్తులోనైనా సవరించుకోవాలి.

అదే విధంగా వారు పదే పదే రూల్ బుక్ గురించి మాట్లాడుతున్నారు. అదే రూల్ బుక్ గురించి వారు చాలా సార్లు కోట్ చేశారు. సభ్యులు ఛైర్‌ని వదిలి పోడియంలోకి వస్తే అదే రూల్ బుక్‌లో ఆ సభ్యులను బయటకు పంపించే ప్రావిజన్ కూడా ఉంది అధ్యక్షా. తమరికి ఈ విషయం తెలుసు కదా అధ్యక్ష. ఈ సమస్య యొక్క ప్రాధాన్యత మీకు తెలుసు కాబట్టివారు ఎంత సేపు అడిగినా మీరు ప్రభుత్వం తరఫున వారికి సమాధానమిచ్చారు కానీ అది ఉపయోగించలేదు. ఆ సమాధానంతో వారు సంతృప్తి చెందకపోవచ్చు, ఎందుకంటే, పది సంవత్సరాలు వారు చేసిన తప్పులు ఈ ప్రభుత్వం కూడా చేయాలని వారికి కోరిక ఉండవచ్చు. కానీ ఈ ప్రభుత్వము ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో కార్మికులను ఆదుకోవాలని, ఆ సంస్థను ఆదుకొని బలోపేతం చేయాలని ఈ రోజు అహర్నిశలు కృషి చేస్తుంటే వారు పదే పదే మాట్లాడుతున్నారు. వారు గతంలో ఆ కార్మిక శాఖకు గౌరవ అధ్యక్షులుగా ఉన్నారు. ఆనాటి ముఖ్యమంత్రికి వీరిని ఎలా తొలిగించాలని అర్థం కాక ఆ కార్మిక సంఘాన్నే రద్దు చేశారు. వాళ్ల అంతర్గత సమస్యలు వారిష్టం. వాళ్ళ కుటుంబ సమస్యలు వారు ఏలా అయినా కొట్లాడుకోని కానీ, ఆ కార్మిక సంఘాలనే రద్దు చేశారు. అలాంటిది ఇప్పుడు మళ్ళీ మొదటికి వచ్చి పాత తప్పులను కప్పి పుచ్చుకోవడానికి ఈ రోజు కొత్తగా ఈ ప్రభుత్వం మీద బురద జల్లి మంత్రి గారిని బుల్‌డోజ్ చేసే విధంగా మాట్లాడడం సమంజసం కాదు. చివరిగా సభ్యులందరికీ నా సూచన ఒక్కటే. ఇక్కడున్న దాదాపు 119 మంది సభ్యుల్లో 60 మందికి పైగా మొదటిసారి ఎన్నికైన వారున్నారు. ఆ సభ్యులు వారు మాట్లాడింది విని ఏమనుకుంటారు. హరీష్‌రావు గారికి 20 సంవత్సరాల అనుభవం ఉన్నది, ప్రశ్న వేసిన వాళ్ళే సప్లిమెంటరీ క్వశ్చన్స్ అడగాలేమోనని ఈ సభ్యులందరూ కూడా తప్పుగా అర్థం చేసుకునే అవకాశమున్నది. ఒక్క సారి హౌస్‌లోకి అడ్మిట్ అయిందంటే ఆ ప్రశ్న హౌస్ ప్రాపర్టీ అని మా నూతన సభ్యులకు కూడా తెలియజేస్తున్నాను. ఈ హౌస్‌లో ఏ సభ్యుడైనా కూడా సప్లిమెంటరీ ప్రశ్న అడగడానికి అవకాశమున్నది. సప్లిమెంటరీ ప్రశ్న అడిగినప్పుడు స్పీకర్ అనుమతిస్తే ఎవరైనా మాట్లాడటానికి అవకాశముంటుంది. ఈ సభను తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేయొద్దని వారికి సూచిస్తున్నాను.

(ఈ సమయంలో సభ్యులు శ్రీ హరీష్ రావు, శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి గారు, డా. పల్లా రాజేశ్వర రెడ్డి గారు, డా. సంజయ్, తదితర బీఆర్ఎస్ పార్టీ సభ్యులు వెల్‌లోకి వచ్చి హరీష్ రావు గారికి మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరసాగారు.)

మిస్టర్ స్పీకర్:- హరీష్ రావు గారు మీరు ఈ శాసన సభలోనే సీనియర్ సభ్యులు. ఇది ప్రశ్నోత్తరాల సమయం. దయచేసి కూర్చోండి. మిమ్మల్ని చూసి కొత్త సభ్యులందరూ నేర్చుకుంటారు.

Question Hour is over. Remaining questions are postponed. All papers are deemed to have been placed and laid on the Table of the House.

PAPERS PLACED:

A copy of the report on the 'Decisions of the Business Advisory Committee' taken at its meeting held on 23rd July, 2024.

PAPERS LAID:

1. A copy of the 23rd Annual Report of the Northern Power Distribution Company of Telangana Limited, for the Year 2022-23, as required under Section 395 of the Companies Act, 2013.

2. A copy of the Annual Report of the Transmission Corporation of Telangana Limited, for the Year 2022-23, as required under Section 394 of the Companies Act, 2013.

3. A copy in each of the 4th, 5th and 6th Annual Reports of the Telangana State Trade Promotion Corporation Limited, for the Years 2017-18, 2018-19 and 2019-20 respectively, as required under Section 395(1)(b) of the Companies Act, 2013, along with reasons for delay.

వాయిదా ప్రతిపాదనలు

1. డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు గారు.. ఇటీవల కురిసిన నిరంతర వర్షాల వలన గోదావరి మరియు దాని ఉప-నదుల వరదల వలన తెలంగాణ రాష్ట్రంలోని కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం మరియు భద్రాద్రి-కొత్తగూడెం మొదలకు జిల్లాలలో జరిగిన పంట నష్టం గురించి చర్చించాలని కోరుతూ, ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

(ఈ సమయంలో సభ్యులు హరీష్ రావు గారు.. ముఖ్యమంత్రి గారు తన పేరు చెప్పినందుకు మాట్లాడటానికి అవకాశమివ్వాలని కోరసాగారు.)

మిస్టర్ స్పీకర్:- హరీష్ రావు గారూ, మీరు ఈ శాసన సభలోనే సీనియర్ సభ్యులు. ఇది ప్రశ్నోత్తరాల సమయం. దయచేసి కూర్చోండి. మిమ్మల్ని చూసి కొత్త సభ్యులందరూ నేర్చుకుంటారు.

2. శ్రీ కె. తారక రామారావు గారు మరియు ఇతరులు.. నిరుద్యోగులకు జాబ్ కేలండర్ ప్రకటనతో పాటు ఇతర న్యాయపరమైన డిమాండ్లపరిష్కారం గురించి చర్చించాలని కోరుతూ, ఇచ్చినవాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

(ఈ సమయంలో తమ వాయిదా ప్రతిపాదన తిరస్కరించిందుకు బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేయసాగారు)

(Members of BRS Legislature Party stood up in their respective seats exhibiting placards on issues like "జాబ్ కేలండర్ అడిగితే నిరుద్యోగులపై జులుం ఏలా?" "గ్యారంటీలపై గాలిమాటలు వద్దు", "నిరుద్యోగులపై లాఠీ చార్జ్‌చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి", "గ్రూప్-I అభ్యర్థుల 1:100 డిమాండ్ నెరవేర్చాలి", "ఉద్యోగాలు అడిగితే ఉక్కుపాదమా?" "కాంగ్రెస్‌కు కుర్చీలు నిరుద్యోగులపై లాఠీలా?")

సంతాప ప్రతిపాదనలు

1. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చెన్నూర్ శాసన సభ నియోజకవర్గం మాజీ సభ్యులు డా.నెమరుగొమ్ముల సుధాకర్ రావు గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం వడ్డే కొత్తపల్లి గ్రామానికి చెందిన డా. సుధాకర్ రావు గారు 1999 నుండి 2003 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా, చెన్నూరు శాసన సభ నియోజకవర్గం నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు. "ఆరోగ్య శ్రీ ట్రస్ట్" ఛైర్మన్‌గా ప్రజలకు వీరు విశేష సేవలు అందించారు.

ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఉద్యోగం ప్రారంభించి, గాంధీ మెడికల్ కాలేజీలో ఎండోక్రైనాలజీ విభాగం హెడ్‌గా పని చేశారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని 8 పరిశోధన పత్రాలను సమర్పించారు. వీరు 2014 లో ఎండోక్రైనాలజీ విభాగంలో "లైఫ్ టైం అచీవ్‌మెంట్" అవార్డులను అందుకున్నారు. వీరు తమ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. వీరు 2024, మార్చి 10వ తేదీన మరణించారు. వీరి వయస్సు 74 సంవత్సరాలు.

11.10 ఉ.

2. హైదరాబాద్ జిల్లాలోని నాంపల్లి శాసన సభ నియోజకవర్గం మాజీ సభ్యులు శ్రీ మహమ్మద్ విరాసత్ రసూల్ ఖాన్ గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

మురాద్‌నగర్ కార్పోరేటర్‌గా పని చేసిన అనంతరం శ్రీ మహమ్మద్ విరాసత్ రసూల్ ఖాన్ గారు 1989 నుండి 1994 మరియు 2009 నుండి 2014 వరకు చార్మినార్ మరియు నాంపల్లి శాసన సభ నియోజకవర్గాల నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు. వీరు తమ నియోజకవర్గాల అభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. వీరు 2024, మే 28వ తేదీన మరణించారు. వీరి వయస్సు 75 సంవత్సరాలు.

3. నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్ (అర్బన్) శాసన సభ నియోజకవర్గం మాజీ సభ్యులు శ్రీ ధర్మపురి శ్రీనివాస్ గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

శ్రీ ధర్మపురి శ్రీనివాస్ గారు నిజామాబాద్ జిల్లా వేల్పూరులో 1948 సెప్టెంబర్ 27వ తేదీన వెంకట్రాం మరియు లక్ష్మీబాయి దంపతులకు జన్మించారు. వీరు 1989 నుండి 1994,1999 నుండి 2003 మరియు 2004 నుండి 2009 వరకు నిజామాబాద్ (అర్బన్) శాసన సభ నియోజకవర్గం నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు. వీరు 1969-1970 మధ్య రాష్ట్ర ఎన్.ఎస్.యూ. తొలి కన్వీనర్‌గా పనిచేశారు. అనంతరం ఆర్.బి.ఐ.లో ఉద్యోగం చేస్తూ న్యాయ విద్యను అభ్యసించి, నిజామాబాద్‌లో న్యాయవాదిగా పనిచేసారు. 2003 ఆగస్టు లో పి.సి.సి. అధ్యక్షుడిగా నియమితులైన ధర్మపురి శ్రీనివాస్ గారు వరుసగా మూడు సార్లు తన బాధ్యతలను నిర్వర్తించారు. వీరు శ్రీ కోట్ల విజయభాస్కర్ రెడ్డి, శ్రీ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మరియు డా.వై.ఎస్. రాజశేఖర రెడ్డి గార్ల క్యాబినెట్లో మంత్రిగా పని చేశారు. వీరు తెలంగాణ ఉద్యమ సమయంలో తన వాదాన్ని బలంగా వినిపించారు. వీరు తమ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. వీరు 2024, జూన్ 26వ తేదీన మరణించారు. వీరి వయస్సు 76 సంవత్సరాలు.

4. నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ (ఎస్.టి) శాసనసభ నియోజకవర్గం మాజీ సభ్యులు శ్రీ రమేశ్ రాథోడ్ గారి మృతిపట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

ఆదిలాబాద్ నార్నూర్ మండలం తాడి హత్నూర్‌కు చెందిన శ్రీ రమేశ్ రాథోడ్ గారు మోహన్ రాథోడ్ మరియు కమలాబాయి దంపతులకు 1966 అక్టోబర్ 20వ తేదీన జన్మించారు. వీరు 1999 నుండి 2003 వరకు ఖానాపూర్ (ఎస్.టి.) శాసన సభ నియోజకవర్గం నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు. వీరు 2009 లో ఆదిలాబాద్ ఎం.పీ. గా గెలిచారు. వీరు 1995లో నార్నూరు జడ్పీ.టీ.సీ సభ్యుడిగా మరియు 2006లో జడ్పీ చైర్మన్‌గా గెలుపొందారు. వీరు రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. వీరు తమ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. వీరు 2024, జూన్ 29వ తేదీన మరణించారు. వీరి వయస్సు 57 సంవత్సరాలు.

డా. నెమరుగొమ్ముల సుధాకర్ రావు గారు, శ్రీ మహమ్మద్ విరాసత్ రసూల్ ఖాన్ గారు, శ్రీ ధర్మపురి శ్రీనివాస్ గారు మరియు శ్రీ రమేశ్ రాథోడ్ గారి ఆత్మలకు శాంతి చేకూరేందుకుగాను, రెండు నిమిషాల పాటు మౌనం పాటిద్దాం.

(సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది.)

టీ విరామం కొరకు సభను వాయిదా వేయడమైనది.

(The House then adjourned for tea-break at 11.16 AM)

****

(టీ విరామానంతరం సభ తిరిగి మధ్యాహ్నం 12.14 గంటలకు ప్రారంభమైనది.)

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానం వహించారు)

12.10 మ.

*****

మిస్టర్ స్పీకర్:- ప్రభుత్వ తీర్మానం..

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి (కొడంగల్):- అధ్యక్షా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయించవలసిన

నిధులు, ఇవ్వవలసిన అనుమతుల విషయంలో చూపించిన వివక్షపై ఈ సభలో చర్చకు అనుమతించవలసిందిగా తమరిని కోరుతున్నాను.

శ్రీ డి. శ్రీధర్ బాబు (మంథని):-అధ్యక్షా, గడచిన ఏడు మాసాల నుండి గానీ, గత పది సంవత్సరాల నుండి గానీ మనకు న్యాయపరంగా రావాల్సిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల నిధుల కేటాయింపు విషయంలో నిన్న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిస్థాయిలో అత్యంత వివక్షపూరితంగా, ప్రమాదకరంగా ఉందని భావిస్తున్నాను. కేంద్ర ప్రభుత్వం అనుసరించాల్సిన సమాఖ్య న్యాయ సూత్రాలకు పూర్తిస్థాయిలో విరుద్ధంగా ఉంది.

ఇంకో ప్రధానమైన అంశం ఏమిటంటే .. శ్రీమతి నిర్మలా సీతారామన్ గారి రెండు గంటల బడ్జెట్ ప్రసంగంలో ఒక సందర్భంలో గానీ, ఒక వాక్యంలో గానీ, ఒక్క పదంలో గానీ తెలంగాణ అనే పదాన్ని ఒక్కసారి కూడా పలకనే లేదు, దాని ఊసే లేదు. ఇది చాలా దురదృష్టకరం, బాధాకరమని ఈ సందర్భంగా చెప్పదలచుకున్నాను.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు సంబంధించిన introduction speechలో ఓ మాట చెప్పారు. "We are determined to ensure all Indians...", "All Indians" include the people from Telangana too, అని మేము భావించాము. "We are determined to ensure that all Indians regardless of religion, caste, gender and age make substantial progress in realising their life goals and aspirations." అని అన్నారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సందర్భంలో ఇంట్రడక్షన్ చెబుతున్నప్పుడు నిజంగానే అన్ని రాష్ట్రాల ప్రజల ప్రయోజనాల గురించి ఆలోచన చేస్తారని ఆశించాము. నిన్న వారు ప్రవేశపెట్టిన బడ్జెట్ సమాఖ్య స్ఫూర్తికి, అదేవిధంగా రాజ్యాంగంలో అమర్చిన న్యాయ సూత్రాలకు ఆదర్శంగా ఉందా? లేదా అని మనం ఒకసారి ఆలోచన చేసుకోవాల్సిన తరుణం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ పునర్ విభజన చట్టంలో విభజనకు సంబంధించి దాదాపు 35 అంశాలున్నాయి.

12.20 మ. అధ్యక్షా, రాష్ట్ర విభజన చట్టంలో 35 హామీలున్నాయి. పది సంవత్సరాల నుంచి ఆ 35 హామీలకు సంబంధించి అనేక సందర్భాలలో మేము అక్కడ ఉన్నప్పటికీ (ప్రతిపక్ష స్థానాన్ని చూపిస్తూ) ప్రస్తావన చేశాం. ఇప్పుడు సోదర బిజెపి సభ్యులు కూడా ఇక్కడ ఉన్నారు. వారు కూడా అనేక సందర్భాలలో వాటి గురించి ప్రస్తావన చేసి ఉండవచ్చు. బీఆర్ఎస్ సోదరులు కూడా వారు ప్రభుత్వంలో ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వంతో ప్రస్తావన చేసి ఉండవచ్చు. కానీ, ఈ బడ్జెట్‌లో దాని ఊసే లేకపోవడం, ఉచ్చారణ లేకపోవడం, ఈవిధంగా చేస్తామనే ఒక ప్రణాళిక లేకపోవడం, చెప్పకపోవడంతో యావత్ తెలంగాణ ప్రజల మనస్సులు నొచ్చుకున్నాయి.

I would like to place it on record that the Union Budget which was presented yesterday has neglected State of Telangana completely. It so unfortunate the Central Government has not deemed it important to include the term Telangana in all its budget and has discriminated against our State in such a unfair manner. The AP Re-organisation Act that has been used to reference to allocate funds to AP also covers the unfulfilled promises towards the State of Telangana. They have completely forgotten and it is incumbent upon the Central Government to do justice to Telangana as per AP Re-organisation Act . We want that honour.

అధ్యక్షా, ఈరోజు గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానానికి సంబంధించి.. ఈరోజు మనకు కావలసింది గౌరవం. ఆనాడు రాష్ట్రప్రజలందరూ పోరాటం చేసి తెలంగాణ సాధించారు. మరలా ఆ గౌరవాన్ని వంచించే విధంగా నిన్న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రతిబింబించడం చాలా దురదృష్టకరం. ఈరోజు వాళ్ళు వికసిత్ భారత్ అంటున్నారు. చాలా సంతోషం. 2047వ సంవత్సరం నాటికి 5 ట్రిలియన్‌ల ఎకానమీ చేయాలని గౌరవ ప్రధానమంత్రి గారు అనేక సందర్భాలలో చెప్తున్నారు.

ఈ 5 ట్రిలియన్‌ల ఎకానమీ చేసే క్రమంలో తెలంగాణ రాష్ట్రం అనేది దేశంలోనే పెద్ద ఎకనామిక్ గ్రోత్ ఇంజన్. ఈ పెద్ద ఎకనామిక్ గ్రోత్ ఇంజన్‌నే మరచిపోయి 5 ట్రిలియన్‌ల

ఎకానమీ ఏరకంగా చేస్తారో, చేయదలచుకున్నారో ఈ సందర్భంలో తెలంగాణ రాష్ట్రానికి... నేను ఒక ఉదాహరణ చెప్తున్నాను, మా డిపార్ట్‌మెంట్‌కి సంబంధించిన ఒక కారిడార్‌ని ప్రత్యేకంగా ప్రకటించారు. హెడ్‌లైన్స్‌లో చూస్తూ మేము సంతోషపడ్డాం. Under the Act for promoting Industrial Development funds will be provided for essential infrastructure such as Water, Power, Railways and Roads in Kopparthi node on Visakhapatnam, Chennai Industrial Corridor and Orvakal node on Hyderabad, Bangalore Industrial Corridor. సరే, హైదరాబాద్ పేరు వచ్చింది కదా అని సంతోషపడి చూస్తే, ఈరోజు వారు చెప్పిన ఇండస్ట్రియల్ నోడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉంది. హైదరాబాద్- బెంగళూర్ ఇండస్ట్రియల్ కారిడార్ అని అన్నప్పుడు, మన రాష్ట్రానికి సంబంధించి 210 కిలో మీటర్లుంటుంది. దాని తదుపరి 280 కిలో మీటర్లు కర్ణాటక రాష్ట్రం రీచ్ అయ్యేవరకు ఉంటుంది. ఆ మధ్యలో ఉన్న ప్రాంతాన్ని వారు ఇండస్ట్రియల్ నోడ్‌గా డెవలప్‌మెంట్ చేసి క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పూర్తిస్థాయిలో ఇస్తామని చెప్పడం, ప్రత్యేకించి ఆంధ్ర ప్రదేశ్ రీ-ఆర్గనైజేషన్ యాక్ట్ ప్రకారం మీరు ఆ రాష్టానికి నిధులిస్తే మేము కాదనడం లేదు. ఇతర రాష్ట్రాల అభివృద్ధి, సంక్షేమం గురించి మీరు ఆలోచన చేస్తే మేము కాదనడం లేదు. కానీ, ఒకే చట్టం ప్రకారం వారికి సహకరించేటువంటి పార్టీ ప్రభుత్వంలో ఉంది కనుక వారికే ఇస్తామని, ఇతరులని మేము విస్మరిస్తామనడం సరికాదు. దీనికి సంబంధించి ఒక రిలేషన్ చెప్తాను. కేంద్ర మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ గారి స్పీచ్‌లో 'పూర్వోదయ' అని ఒక ప్రణాళికను తీసుకొచ్చారు. ఏమన్నారు, బీహార్ రాష్ట్రానికి సంబంధించి we will formulate a plan Poorvodaya for all round development of the Eastern region of the country covering Bihar, Jharkand, and other to make these regions an engine to attain "Viksit Bharat". నేను గౌరవ సభ్యులని అడుగుతున్నాను, we have potential to become the greatest economic engine for this country, why the Central Government is looking down. కాబట్టి, ఈ విధంగా బీహార్ రాష్ట్రానికి సంబంధించి రోడ్ కనెక్టివిటీ ప్రాజెక్ట్ విషయంలో చెప్పారు, పవర్ ప్రాజెక్ట్స్ గురించి చెప్పారు. కొత్త ఎయిర్‌పోర్టులు, మెడికల్ కాలేజీలు, స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లు బీహార్ రాష్ట్రానికి సంబంధించి చెప్పారు. ఈరోజు మేము ఎందుకు చెప్తున్నామంటే, ఒక్క హైదరాబాద్‌లో తప్పితే ఈ రాష్ట్రంలో విమానాశ్రయం లేదు. అనేక సందర్భాలలో ఈ రాష్ట్ర ప్రభుత్వం కోరినప్పటికీ కొత్త విమానాశ్రయలకు పూర్తిస్థాయిలో ఎందుకు అనుమతి ఇవ్వలేదని అడుగుతున్నాను. హైదరాబాద్‌లో మనకున్న ఒకే ఒక విమానాశ్రయాన్ని ఏదో ఒక కారణంగా ఒక గంట గానీ, రెండు గంటలో, ఒక రోజో మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడితే, మన రాష్ట్ర ప్రజలకి గానీ, మన రాష్ట్రానికి వచ్చిన, వచ్చే ప్రజానీకానికి గానీ ఎంత ఇబ్బంది కలుగుతుందనే విషయాన్ని గమనించాలి. ఇతర రాష్ట్రాల పరిస్థితి ఒకసారి చూస్తే, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి అనేక ఎయిర్‌పోర్టు లున్నాయి. కాదనడం లేదు. అవి మనం చేసుండొచ్చు, కొత్తగా నిర్మించే ప్రయత్నం వాళ్ళు చేసుండవచ్చు. కానీ, ఈరోజు మీరు 'పూర్వోదయ' అనే పథకంలో భాగంగా బీహార్‌కు సంబంధించి గానీ, లేదా ఏ.పి. రీ-ఆర్గనైజేషన్ యాక్ట్‌ను అడ్డం పెట్టుకుని కేవలం మేము ఒక్క రాష్ట్రానికే మేలు చేస్తామని కేంద్రం చెప్పడం సరికాదని ఈరోజు ఈ వేదిక ద్వారా వారికి తెలియజేయడానికి మేము ప్రయత్నం చేస్తున్నాం.

ఏ.పి. రీ-ఆర్గనైజేషన్ యాక్ట్‌లోని పేరా 33లో..., ఈరోజు దాదాపు రూ.15 వేల కోట్లు ఫైనాన్షియల్ సపోర్టు చేస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ గారు మాట్లాడుతూ చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్‌లో అక్కడున్న భారీ నీటిపారుదల ప్రాజెక్టుకు కూడా ఈరోజు అన్ని తీరులా అనుమతులిస్తూ, ఫైనాన్షియల్ యాస్పెక్ట్స్‌లో కూడా సహకారం అందిస్తామని వారు చెప్పారు. ఈ రాష్ట్రంలో మా ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మన గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రధాన మంత్రి గారినీ, సంబంధిత కేంద్ర మంత్రులని కలిసి, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయింపులు చేయాలి, అనుమతులివ్వాలని కేంద్రాన్ని కోరితే, ఈ బడ్జెట్‌లో వాటి గురించిన ప్రస్తావనే లేదు.

అదేవిధంగా టూరిజానికి సంబంధించి కూడా కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ గారు ప్రస్తావన చేశారు. Tourism has always been a part of our civilization అని వారు చెప్పారు. వారు గుర్తించినందుకు చాలా సంతోషం. తెలంగాణలో ఆ సంస్కృతి ఉంది. మన సంస్కృతిని ప్రతిబింబింపజేసే అనేక స్థలాలున్నాయి. దాన్నెందుకు విస్మరించారు? కేవలం బీహార్‌కు సంబంధించిన విష్ణుపాద్ టెంపుల్, మహాబోధి టెంపుల్.. వీటన్నింటికీ ఇచ్చిన ప్రాధాన్యత, మన రాష్ట్రానికి సంబంధించి కూడా ప్రపంచస్థాయిలో ఎదిగేటువంటి pilgrimage centers ఉన్నాయి, Tourist Destination Centers ఉన్నాయి. ఉదాహరణకి రామప్ప దేవాలయం ఉంది. ప్రధానంగా pilgrimage centers సంబంధించి మా ప్రాంతంలో ఉన్న కాళేశ్వరమే గానీ, వేములవాడే గానీ, యాదగిరి గుట్ట, కొండగట్టు, భద్రాచలం ఆలయం వీటన్నింటి విషయంలో ఒక ప్రస్తావన చేస్తే, ఈ ప్రాంత ప్రజలు దేశ ప్రగతిలో మేము కూడా భాగస్వాములమవుతున్నామని వారు సంతోషించేవారు. కానీ వారు ప్రస్తావించ లేదు. వారు ప్రస్తావించి ఉంటే, మేము ఈ ప్రస్తావన చేయకపోయేవాళ్ళం.

12.30 మ. ఎ.పి. రీ–ఆర్గనైజేషన్ యాక్ట్‌కు సంబంధించి దీనిలో 33 ప్రధానమైన హామీలతో అనేక శాఖలకు సంబంధించి యూనియన్ బడ్జెట్‌లో రిఫ్లెక్ట్ కాని, గత పది సంవత్సరాలుగా పరిష్కారం కాని, గత పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన అనేక అంశాల విషయంలో ఈరోజు ఎన్డీయే ప్రభుత్వం నీతి ఆయోగ్ అని 2015లో ప్లానింగ్ కమిషన్‌కు సంబంధించిన అనేక అంశాలను ప్రక్కన పెట్టి ఒక కొత్తసంస్థను స్థాపించడం జరిగింది. To involve States in decision making and promote co-operative federalism అని వారన్నారు. కో–ఆపరేటివ్ ఫెడరలిజం అంటే రాష్ట్రాలన్నీ కలుసుకొని కేంద్రానికి సంబంధించిన ప్రగతిలో భాగస్వాములు కావాలి, దీనిలో spirit of co-operative federalismని మీరు డైల్యూట్ చేస్తూ, నిర్లక్ష్యం చేస్తూ, మరొక ప్రక్క కో–ఆపరేటివ్ ఫెడరలిజం గురించి మాట్లాడుతూ, రాష్ట్రానికి సంబంధించిన విధులు, నిధులు, హక్కులను కాల రాస్తూ, కేంద్రప్రభుత్వం ఆ విధంగా ముందుకు వెళుతూ ఉంటే, తప్పకుండా మన బాధ్యతగా ఈరోజు మన గౌరవ శాసన సభ్యులు ఏ పార్టీకి సంబంధించిన వారైనా గానీ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని, మీరు తప్పుగా వెళుతున్నారు, ఇది సరికాదు, ఈ రాష్ట్రం, దేశంలో కూడా భాగస్వామ్యం అని చెప్పడానికి మనమిక్కడ కూర్చున్నాం. ఈరోజు మేము కాదు అంటే, రాష్ట్రప్రజలకు సంబంధించిన అంశం విషయంలో మేము ముందు ఉండడం లేదని అంటే మీరు ఒకసారి ఆలోచన చేయమని కోరుతున్నాను. అదే విధంగా, నీతి ఆయోగ్‌తోబాటు అనేక సందర్భాల్లో 14వ ఫైనాన్స్ కమిషన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంవత్సరాలుగా అడుగుతోంది. రాష్ట్రానికి సంబంధించిన పన్నుల డెవల్యూషన్‌ని 42 శాతం మీకు వచ్చే గ్రాస్ ట్యాక్స్ రెవెన్యూలో ఇవ్వాలని డిమాండ్ చేస్తే, దానికి కూడా పక్కన పెట్టడం జరిగింది. ఈరోజు ఆర్టికల్ 275 రాజ్యాంగానికి సంబంధించి కూడా ఫైనాన్స్ కమిషన్ ఏది చెబితే కమీషన్ మ్యానేజ్ ట్రాన్స్‌ఫర్ టు స్టేట్ విషయంలో కూడా పది సంవత్సరాలుగా మన రాష్ట్రానికి ఏ విధమైన లాభం చేయలేదు. ఈరోజు మోస్ట్ సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీంకు సంబంధించి, మన రాష్ట్రానికి సంబంధించిన అనేక అంశాలలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా తీసుకోవడం జరిగింది. మీరు ఎంత వరకైతే అన్ని రాష్ట్రాలను బలంగా వాళ్ళని ఎంపవర్ చేసి ముందుకు వెళితే తప్ప 'వికసిత్ భారత్' అనేది అసాధ్యం. ఈరోజు ఇండియాని self sufficient global manufacturing hub గా చేయాలంటే మీ 'వికసిత్ భారత్'లో తెలంగాణని మీరు ఇతర రాష్ట్రాలతో ముందుకు తీసుకువెళ్ళకపోతే 'వికసిత్ భారత్' సాధ్యం కాదని మా అభిప్రాయం. ఈరోజు మీ సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్స్‌లోగానీ, ఇంటెరిం బడ్జెట్‌కు సంబంధించిన అంశంలోగానీ, మనకు సంబంధించిన ట్యాక్స్ ఇన్సెంటీవ్స్ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ విషయంలోగానీ, పవర్ యుటిలిటీ పేమెంట్ విషయంలోగానీ, గత పది సంవత్సరాల నుండి

అనేక సందర్భాల్లో రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్న పవర్ డ్యూస్‌కు సంబంధించి, Tribal University in Telanganaకు సంబంధించి A.P.Reorganisation Act mandates the establishment of Tribal University in Telangana. ఈరోజు దాని విషయంలోగానీ, ఓవరాల్ బడ్జెట్ అసెస్‌మెంట్ విషయంలో జరిగిన నష్టాన్ని మనమందరం చూస్తున్నాము.

A.P.Reorganisation Act, 2014 లోని షెడ్యూల్-9, షెడ్యూల్-10కు సంబంధించిన అంశాలు కాని, లేకుంటే Section 93 of Reorganisation Act గానీ, అదే విధంగా Division of Organisations under schedule 9 and 10 లోగానీ, centrally sponsored schemes కి సంబంధించిన నిధుల కేటాయింపుల విషయంలోగానీ, అనేక అంశాల విషయంలో construction workers విషయంలోగానీ, expenditure చేసిన అంశాల విషయాలలోగానీ backward districts కు సంబంధించి యావత్ తెలంగాణ అంతా కూడా backward districts కింద పెట్టకుండా, ఇతర రాష్ట్రాలకు సంబంధించిన అనేక ప్రాంతాలను మాత్రం మరొక్కసారి నిర్మలా సీతారామన్‌గారు backward districtsలో ప్రస్తావన చేయడం జరిగింది. మన రాష్ట్రానికి సంబంధించి అనేక వెనుకబడిన జిల్లాలున్నాయి. ఇప్పటికీ వాటిని ముందుకు తీసుకవెళ్ళవలసిన అవసరము, ప్రాధాన్యత ఉంది. Adilabad, Bhupalapally, Khammam, Bhadra-chalam, Mahabubnagarలోని కొన్ని ప్రాంతాలకు సంబంధించి, ఈరోజు ఈ వెనుకబడిన జిల్లాలకు సంబంధించి స్పెసిఫైడ్‌గా మీరు ప్రస్తావించకపోవడం. అంతకు పూర్వకమున్న వెనుకబడిన జిల్లాలకు సంబంధించిన 2019-2020, 2021-2022, 2022-2023, 2023-2024 సంవత్సరాలకు సంబంధించిన ఇన్‌స్టాల్మెంట్స్ ఈరోజు వరకూ కూడా రిలీజ్ కాకపోవడం చాలా బాధాకరం. ఈరోజు Backward Districts Development Grants క్రింద రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులకు మనం నోచుకోకుండా పోతాం. ఆ ఫండ్‌లో ఈరోజు మనం మన జిల్లాలు, జిల్లాలకు సంబంధించి ప్రజలకు సంక్షేమంపై ఆలోచన చేయాలంటే, Backward Districts Development Grant కు సంబంధించి స్పెసిఫైడ్‌గా ఆ జిల్లాలు హోం మంత్రిత్వ శాఖలో మెన్షన్ చేయకపోతే, దానిలో నిధులు రావు. దానివల్ల కూడా మనకే నష్టం జరుగుతుందని ఈ సందర్భంలో మేము సభ దృష్టికి తీసుకొస్తున్నాము.

గౌరవ ముఖ్యమంత్రిగారు 26.12.2023లో he has requested for the release of amount Rs.1800 Cr. ఇప్పటి వరకు కూడా అది రిలీజ్ కాకపోవడం చాలా బాధాకరం, శోచనీయం.

రెండవ అంశానికొస్తే, ఈరోజు మనం వివిధ శాఖలకు సంబంధించి, ఉదాహరణకి issue of Coal Block Allocation in Telangana, మన తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి బొగ్గు గనులకు సంబంధించిన కేటాయింపు, మరొక్కమారు ముఖ్యమంత్రిగారు 04.07.2024 నాడు ఈ Coal Block Allocation విషయంలో ప్రధానమంత్రిగారిని కలిశారు.దానిలో allocation of Koyagudem Block 3, Sattupally Block 3 immediateగా మన రాష్ట్ర విద్యుత్తు అవసరాలను తీర్చడానికి వెంటనే ఇవ్వాలని. PKOC2 dipside block సింగరేణీ కాలనీకి సంబంధించి Godavari Valley Coal Fieldలో వీటన్నింటిని కూడా రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వ పరంగా ఉన్న సింగరేణీ కొలరీస్‌కి ఇవ్వాలని కోరడం జరిగింది.

విద్యాపరంగా చూసినట్లయితే ఇతర రాష్ట్రాలకు సంబంధించి అన్ని రాష్ట్రాల్లో Indian Institute of Management ప్రతి రాష్ట్రంలో ఇవ్వడం జరిగింది. ఎందుకు మా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన విద్యార్థినీ విద్యార్థులకు మెరుగైన విద్యను అందుబాటులో ఉండాలనే ఆలోచన వారు చేస్తే, అనేక సందర్భాల్లో ప్రభుత్వం కోరినప్పటికీ, ముఖ్యమంత్రిగారు అదే డిసెంబరు 26వ తేదీనాడు, అదే మార్చి 2వ తేదీనాడు, అదే విధంగా జూలై 4వ తేదీ నాడు, తప్పకుండా ఇక్కడున్న తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన విద్యార్థులకు ఒక prestigious

management institute మన ప్రాంత వాసులకు కూడా విద్యా బోధన చేయడానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని, IIM ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. ఆ ప్రస్తావన కూడా లేదు అధ్యక్షా.

12.40 మ. విద్యకు సంబంధించి జవహర్, నవోదయ, సైనిక్, కేంద్రీయ విద్యాలయాలు లేవు. 10 సంవత్సరాల కాలంపాటు జవహర్‌లాల్, నవోదయ విద్యాలయాలు లేవు. ఒక్క సైనిక్ విద్యాలయం కానీ, కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేంద్రీయ విద్యాలయాల గురించి బాధ్యతగా ఆలోచన చేసి సమిష్టిగా దేశాన్ని అభివృద్ధి చేయాలనే దిశగా ముందుకు వెళ్ళడం జరిగింది.

మరొక ప్రత్యేకమైన ప్రస్తావన Information Technology Investment Region. ఏదో రకంగా దీన్ని మరొక్క మారు ఆలోచన చేయమని ముఖ్యమంత్రిగారు కేంద్రప్రభుత్వాన్ని కోరారు. పది సంవత్సరాల నుంచి ఉన్న long pending issue అధ్యక్షా ఇది. 2012వ సంవత్సరంలో అప్పుడు అధికారంలో ఉన్న యుపిఏ ప్రభుత్వం దీన్ని మంజూరు చేస్తే దాన్ని ఆలస్యం చేశారు. ప్రత్యేకంగా మూడవసారి ప్రధానమంత్రిగా మోదీగారు, తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది పార్లమెంటు సభ్యులు గెలిచిన తరువాత తెలంగాణ రాష్ట్రానికి ఏమైనా ప్రయోజనాలు చేస్తారని రాష్ట్ర ప్రజలు ఆలోచన చేశారు. కానీ ఐటిఐఆర్ అంశాన్ని కూడా బడ్జెట్‌లో ప్రస్తావన చేయలేదు. ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన లేదు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు సంబంధించి గౌరవ ముఖ్యమంత్రిగారు, రోడ్లు భవనాల శాఖ మంత్రిగారు ప్రధానమంత్రిని కలిసి ప్రధానమంత్రి ఆవాస్ యోజన క్రింద 2 లక్షల 70 వేల ఇండ్లను నిర్మించాలని ఉంటే దాని గురించి mention లేదు.

మొన్న గౌరవ ముఖ్యమంత్రిగారు Textiles, Commerce and Industry Ministry మంత్రిగారిని కలిసి Indian Institute of Handloom Technology పై వారి స్పందన చూసి తప్పకుండా వస్తుందని ఆలోచన చేశాము. అది కూడా బడ్జెట్ ప్రస్తావనలో లేకపోవడం బాధాకరం.

ఇండస్ట్రియల్ కారిడార్ ఇన్ తెలంగాణ – సింగరేణి ప్రాంతానికి సంబంధించిన సింగరేణి ఇండస్ట్రియల్ కారిడార్ ప్రస్తావన కూడా మేము వారి ముందు తీసుకురావడం జరిగింది. బడ్జెట్‌లో ఆ ప్రస్తావన లేదు. డిఫెన్స్ కారిడార్ విషయం గురించి కూడా మాట్లాడలేదు.

బల్క్ డ్రగ్ పార్క్ అధ్యక్షా. ఈరోజు మనందరికీ, ఇక్కడున్న పెద్దలందరికీ తెలుసు. హైద్రాబాద్ అనేది It is a capital of Pharma. Hyderabad is the Pharma capital of the country. Bulk Drugs Parks were sanctioned to Gujarat, Himachal Pradesh and Andhra Pradesh. ఫార్మా ఇండస్ట్రీలను డెవలప్ చేయడానికి ఇక్కడ బలమైన ఎకో సిస్టం ఉంది. పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంది. వనరులు, మానవ వనరులు ఉన్నాయి. వాటన్నిటినీ కూడా పక్కన పెట్టి I can only say Speaker Sir, through this step of Union Government, it has adopted a step-motherly approach towards Telangana. India is using an opportunity to become Bulk Drug Power House of the world. I can say that Speaker Sir, I stick to this. ఎందుకంటే బల్క్ డ్రగ్‌కు సంబంధించిన ఎకో సిస్టం ఎక్కడ కూడా ఇంతవరకు డెవలప్ కాలేదు. కొత్త రాష్ట్రాలు ఏర్పడ్డప్పుడు హిమాచల్ ప్రదేశ్ లాంటి ప్రాంతాలలో ఇదేవిధంగా అభివృద్ధి చేశారు. ఇతర రాష్ట్రాలు ఇదేవిధంగా ప్రయత్నం చేసి టాక్స్ ఇన్సెంటివ్స్ ఇచ్చి బల్క్ డ్రగ్ పరిశ్రమలను పెద్దఎత్తున తీసుకువెళదామనే ప్రయత్నం చేస్తే ఆనాడు మన రాష్ట్రానికి సంబంధించిన పెద్దపెద్ద పారిశ్రామిక వేత్తలు టాక్స్ ఇన్సెటివ్స్ వస్తున్నాయని, రిపేర్లు వస్తున్నాయని అక్కడకు వెళ్ళడం జరిగింది. బల్క్ డ్రగ్ తయారీ విషయంలో ఇక్కడ బలమైన ఎకో సిస్టం ఉందని మళ్ళీ తిరిగి ఇదే రాష్ట్రానికి రావడం జరిగింది. మన మనోభావాలను కేంద్రప్రభుత్వానికి తెలియజేయడానికి ఇక్కడ ప్రజలకు కావలసిన అవసరాలు, ఇప్పటికైనా పది సంవత్సరాల తరువాతనైనా కేంద్రప్రభుత్వానికి తెలియ జేయాలనే ఈరోజు ఈ చర్చకు దారితీసింది.

మెడికల్ డివైజెస్ పార్కును ఇంకా పెద్ద ఎత్తున ముందుకు తీసుకువెళ్లాలనే ప్రస్తావనను తీసుకువచ్చాము. ఎందుకంటే ఇక్కడ ఒక బెస్ట్ ఎకో సిస్టం ఉంది. Mega Textile

Park in Warangal గ్రీన్ ఫీల్డ్ మెగా టెక్స్‌టైల్ పార్కు పిఎం మిత్ర స్కీం క్రింద ఉంటే, దాన్ని గ్రీన్ ఫీల్డ్ నుంచి బ్రౌన్ ఫీల్డ్‌కి అంటే రూ. 500 కోట్లు వచ్చేదానిని రూ. 200 కోట్ల రూపాయలు వచ్చే బ్రౌన్ ఫీల్డ్‌గా గుర్తించి ఇప్పటి వరకు కూడా ఆ నిధులను విడుదల చేయలేదు అధ్యక్షా. మీరు దీన్ని రీక్లాసిఫై చేయండి, రీక్లాసిఫై చేసి ఇది బ్రౌన్ ఫీల్డ్ కాదు, గ్రీన్ ఫీల్డ్‌గా మీరు గుర్తించాలని ముఖ్యమంత్రిగారు కోరారు.

2013వ సంవత్సరంలో యుపిఎ ప్రభుత్వం National Institute of Designని శంకుస్థాపన చేస్తే దాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి షిఫ్ట్ చేయడం జరిగింది. మెగా లెదర్ పార్కు విషయం కానీ Health, Medical and Family Welfare Department ఎన్.హెచ్.ఎం గ్రాంటు విడుదలకై ఆరోగ్య శాఖ మంత్రి గారు మార్చి నెలలో ప్రస్తావన తీసుకువస్తే ఇప్పటివరకూ కూడా ఆ గ్రాంటు విడుదల కాలేదు. దీనికి సంబంధించి ఫైనాన్స్ కమిషన్ రిలీజ్ చేయాల్సిన రూ. 160 కోట్లు కూడా రిలీజ్ కాకపోవడం చాలా దురదృష్టకరం.

ఐసిఏఆర్ నిధులు వస్తే ములుగు జిల్లాలో హార్టీకల్చర్ యూనివర్సిటీ పెట్టాలనే ఆలోచన చేశాము. అదే విశ్వవిద్యాలయానికి కేటాయించిన ఐసిఏఆర్‌కి నిధులు రూ.65 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయండని, విద్యార్థులకు వసతి గృహాలు నిర్మించాలని అడిగితే ఇప్పటివరకు కూడా నిధులు విడుదల చేయలేదు.

ట్రైబల్ వెల్ఫేర్‌కు సంబంధించి కోర్టు పరంగా ఉన్న కేసులను డిస్పోజల్ చేయమని గౌరవ న్యాయస్థానాలు ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు పెండింగ్ కేసులను కూడా పరిష్కారం చేయకపోవడం కేంద్రప్రభుత్వం యొక్క ఉదాసీనతను తెలియజేస్తుంది.

నేషనల్ హైవేలు – దాదాపు 16 జాతీయ రహదారుల విషయంలో గౌరవ ముఖ్యమంత్రిగారు, మా గౌరవ రోడ్లు భవనాల శాఖా మంత్రి గారు ఒక్కసారి కాదు మూడుసార్లు ప్రధాన మంత్రిగారిని, పది సార్లు సంబంధిత మంత్రిగారిని కలిసారు. ఇక్కడున్న కారిడార్స్‌ని, టూరిజంని, పిల్గ్రిమేజ్ సెంటర్లను అభివృద్ధి చేద్దామని, పక్క రాష్ట్రాలకు అనుసంధానమయ్యే విధంగా గొప్ప రహదారులను ఏర్పాటుచేద్దామని దానికి సంబంధించిన ప్రతిపాదనలను సంబంధిత మంత్రివర్యులకు, గౌరవ ప్రధానమంత్రిగారికి అందించారు. వీటి కొరకు నిధులను మంజూరు చేయమని కోరితే ఈ రోజు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఒకటో, రెండో, మూడో ఇచ్చి దీనికి సహకరిస్తామని ముందుకు వస్తే సంతోషపడేవారం.

హైదరాబాద్ - కల్వకుర్తి నేషనల్ హైవే 765 విషయం కూడా పెండింగులోనే ఉంది. నగర్‌వన్ యోజన క్రింద ఫారెస్ట్ డిపార్టుమెంటుకు వచ్చే నిధులను కూడా ఇప్పటివరకు రిలీజ్ కాకపోవడం దురదృష్టకరం. ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్– పౌర సరఫరాలకు సంబంధించి మనకు రావలసిన పెండింగ్ సబ్సిడీ నిధులను వెంటనే రిలీజ్ చేయాలని, దాదాపు రూ. 3000 కోట్లు ఇంకా పెండింగులోనే ఉన్నాయి, వాటిని విడుదల చేయుమని రెండు మార్లు ఇప్పటివరకు కేంద్రప్రభుత్వాన్ని కోరాము (కం).

12.50 మ. అధ్యక్షా, ఈ రోజు పిఎంజికెవై పథకం క్రింద, మరి ఇదే సివిల్ సప్లైస్ డిపార్ట్‌మెంట్‌కి సంబంధించి రూ. 400 కోట్లు పెండింగ్‌లో ఉంది. అలాగే మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు రూ. 500కి గ్యాస్ సిలెండర్ అందిస్తామంటే, దాని గురించి కూడా క్యాష్‌క్రెడిట్ విషయం కూడా వారు ఆలోచన చేయడం లేదు. అదే విధంగా సివిల్ సప్లైస్ భవన్‌కి సంబంధించి డిమెర్జర్ ప్లాన్ కూడా పెండింగ్‌లో ఉంది. ఈ విధంగా అనేక శాఖలకు సంబంధించిన అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. కార్మిక శాఖకు సంబంధించి, మిషన్ భగీరథ గురించి కూడా కేంద్ర ప్రభుత్వానికి అనేకసార్లు ఆర్థిక సహాయం అందించమని కోరుతూ లేఖలు రాయడమే కాదు, మేము భేషజాలకు పోకుండా ప్రయత్నాలు చేస్తున్నాము. రాష్ట్ర ప్రజానీకం అందరికీ, ప్రతి ఒక్కరికి మంచినీరు అందించాలి అనే లక్ష్యంతో, గత ప్రభుత్వం మొదలుపెట్టిన ఈ పథకం అమలులో ఉన్న లోటుపాట్లను కూడా సవరించి, ముఖ్యమంత్రిగారు జలశక్తి మంత్రిగారిని మాకు ఇంకో రూ.16వేల కోట్లు ఇవ్వాలని కోరడం జరిగింది. దాని ప్రస్తావన కూడా లేదు.

అదే విధంగా ఎస్సీ డెవలప్‌మెంట్ డిపార్టుమెంట్‌కి సంబంధించి రూ.200 కోట్ల సహకారం ఇవ్వమని కోరాము. దాని గురించి కూడా ఎక్కడా చెప్పలేదు. మిషన్ కాకతీయ విషయంలో గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం కేంద్రం నుండి రావలసిన నిధుల గురించి అడిగినా కూడా, వాటిని కూడా రిలీజ్‌చేయలేదు. Water bodies Repair, Renovation and Restoration క్రింద నిధులు రావలసి ఉంది. అలాగే పాలమూరు– రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకి సంబంధించి పెద్ద ఎత్తున నిధులు కేటాయింపు చేయాలని మా ఇరిగేషన్ మంత్రి శ్రీ ఉత్తమ్‌కుమార్ రెడ్డిగారు, ముఖ్యమంత్రిగారు మూడుసార్లు కేంద్రాన్ని కోరడం జరిగింది. అదే విధంగా పవర్‌కి సంబంధించి విద్యుత్తుపరంగా ఈ రోజు యుటిలిటీస్ ఏవైతే ఉన్నాయో దానికి సంబంధించి dues కేంద్ర ప్రభుత్వం నుండి రావలసిన నిధులు కూడా వెంటనే రిలీజ్ చేయాలని, డిస్కంలు చాలా ఇబ్బందిపడుతున్నాయి అని అనేక సందర్భాలలో కేంద్రాన్ని కోరడం జరిగింది.

అలాగే పట్టణాభివృద్ధికి సంబంధించి Urban Development కేంద్ర ప్రభుత్వానికి అనేక correspondence లేఖలు రాయడం జరిగింది అధ్యక్షా. ఈరోజు మేము ఒకటే అడుగుతున్నాము. హోం డిపార్ట్‌మెంటుకి సంబంధించి ఐపిఎస్ కేడర్ review విషయంపై 2021లో రాష్ట్రప్రభుత్వం నుండి పంపిన ప్రతిపాదన గురించి ఆలోచన చేయండి, సరిపోవడం లేదు, మరొక 70 మంది ఐపిఎస్ ఆఫీసర్లను రాష్ట్రానికి కేటాయించమని అడుగుతున్నా కూడా నేటి వరకు దాని గురించి ప్రస్తావన చేయడం లేదు. అదే విధంగా ఇంతకుముందు చెప్పినట్లు ఎల్‌డబ్ల్యుఈకి సంబంధించి అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు సంబంధించిన ప్రయోజనాల విషయంలో వివిధ డిపార్టుమెంట్లకి చెందిన అనేక అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈరోజు మా ప్రభుత్వం ఏర్పాటైన తరువాత proposals కేంద్ర ప్రభుత్వం నుండి రావలసిన నిధులు, కొత్తగా వారు ఇవ్వవలసిన అనుమతులు, కేటాయింపుల విషయంలో వివక్ష జరిగింది. ఆ వివక్ష పూర్తి స్థాయిలో ప్రస్ఫుటంగా నిన్న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కనబడింది.

ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ రోజుకి కూడా మన సోదర సోదరీమణులే. వారికి ఎందుకు ఇచ్చారని అడగడం లేదు. A.P. Reorganistion Act కి సంబంధించి వారికి ఏ నిష్పత్తిలో ఇచ్చారో అదే విధంగా ఆ రేషియో ప్రకారం అది మాకు రావలసిన హక్కు. ఈ తెలంగాణ రాష్ట్రప్రజల హక్కు. అది మాకు రావాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాము. ఇంకా సమయం ఉంది. గౌరవ బీజేపీ శాసన సభ్యులు ఉన్నారు. వారు కూడా మనందరి అభిప్రాయాలను గౌరవిస్తారని మేము ఆశిస్తున్నాము. ఈరోజు ఒక పక్కన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ముగ్గురు పార్లమెంట్ సభ్యులు బీజేపీ పార్టీ నుండి వెళ్లి, అంత పెద్ద ఎత్తున సాధించారు. మన తెలంగాణ రాష్ట్రప్రజలు బిజెపికి ఎనిమిది మంది పార్లమెంటు సభ్యులను ఇచ్చారు. అందులో ఇద్దరు గౌరవ కేంద్ర మంత్రులు ఉన్నారు. మీకు కూడా బాధ్యత ఉందని తెలియజేయడానికి, ఆ బాధ్యతకి సంబంధించి ఎక్కడో పొరపాటు జరుగుతా ఉంది, దాని వలన తెలంగాణ రాష్ట్ర ప్రజలు వారి హక్కులను కోల్పోతున్నారు. వారికి రావలసిన నిధులు రాకుండా పోతున్నాయి. మనకందరికీ ఈరోజు అన్యాయం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ సభ్యుల ఆలోచనలు కూడా చెప్పమని కోరుతున్నాము.

(బీజేపి సభ్యుల నుండి అంతరాయం)

I am not yielding. I am not speaking against the rule. నేను ఒకటే ప్రశ్న అడుగుతున్నాను. ఈ రోజు తెలంగాణ మన దేశంలో భాగం కాదా? తెలంగాణ రాష్ట్రాన్ని ఎందుకు విస్మరించడం జరిగింది? కేంద్ర ప్రభుత్వం ఎందుకు మరిచిపోయింది? ఈ రోజు వారు తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పవలసిన అవసరం ఉంది. ఈ రోజు తెలంగాణ అనే ఒక కొత్త రాష్ట్రం దేశంలో ఉందనే సంగతి పూర్తి స్థాయిలో మరిచిపోయింది కేంద్ర ప్రభుత్వం. అందుకోసమే బడ్జెట్‌లో మొండిచేయి చూపించినట్లు స్పష్టంగా కనబడుతున్నది. ఈరోజు Industrial Parks గురించి చెప్పాలంటే you know my dear good friend. They have declared one industrial corridor. That corridor doesn't fetch even one kilometer of the

corridor which is in Telangana. The NODE which they already ascribed falls in Andhra Pradesh and in spite of our right, whatever the general thing what you people are telling.

ఈరోజు కూడా చెబుతున్నాము. నిధుల కేటాయింపు విషయంలో వివిధ డిపార్టుమెంట్ల ద్వారా వచ్చే అంశాలు మన హక్కు, తప్పకుండా మనకు రావాలి. ఈ రోజు మేము ప్రత్యేకంగా ప్రస్తావనలో Andhra Pradesh Reorganisation Act కి సంబంధించిన అంశాల విషయంలో సమాధానం చెప్పమని కోరుతున్నాము. A.P Reorganisation Actలో ఇతర రాష్ట్రాలకి సంబంధించి మేము అడుగుతున్నాము– అక్కడ కేటాయింపులు ఎందుకు జరుగుతా ఉన్నాయి, మన రాష్ట్రానికి సంబంధించిన విభజన చట్టం గురించిన అంశాలు ఎందుకు ప్రస్తావన రాలేదని అడుగుతా ఉన్నాము అధ్యక్షా. పరిశ్రమలకు సంబంధించి మనకు ఇది గ్రోత్ ఇంజన్. Five trillion economy చేయాలి, భారతదేశానికి సంబంధించి మేము పాత్రధారులమని ముందుకు వెళుతున్నాము. మనకు ఇక్కడ గొప్ప మానవ వనరులు ఉన్నాయి. ఇక్కడ ఒక గొప్ప eco system create చేశాము. అందులో మాకు భాగస్వామ్యం కావాలి, దానిని తప్పకుండా కల్పించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. మేము ఒకటే single line ప్రశ్న అడుగుతున్నాము. సత్య దూరమైన మాటలు మాట్లాడుతున్నారు. తెలంగాణ ప్రజలకు నష్టం కాకూడదు. రాబోయే కాలంలో ప్రజలకు ఎటువంటి నష్టం కలగకూడదు. Andhra Pradesh Reorganisation Act, 2014 గురించి కేంద్ర బడ్జెట్ స్పీచ్‌లో స్పెసిఫిక్‌గా చెప్పారు. Andhra Pradesh Reorganisation Act లో ఒక సబ్ హెడింగ్ ఉంది అధ్యక్షా.

1.00 మ. విభజన చట్టానికి సంబంధించిన విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ కేంద్ర ప్రభుత్వం నుంచి ఏమీ వద్దు అనేది మీ అభిప్రాయం అయితే చెప్పండి. మేము ఏం అడుగుతున్నామంటే మీ ద్వారా మీ పార్లమెంట్ సభ్యుల ద్వారా గౌరవ కేంద్ర మంత్రులకు, ప్రధాన మంత్రిగారికి తెలియజేయాలని, ఇప్పటికైనా బడ్జెట్‌ను ఆమోదించడానికి సమయం ఉన్నది కాబట్టి సవరణ చేసే కార్యక్రమం చేయాలనే అంశం గురించి అందరి అభిప్రాయం కోరుతున్నాను. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ సంబంధించిన మన హక్కులు, నిధులు, నిధులను మనం సాధించడానికి మీ అందరి సహకారాన్ని, అభిప్రాయాన్ని కోరడానికే ప్రభుత్వ పక్షాన ప్రస్తావన చేసి మీ అభిప్రాయాలను కోరుతున్నాను. మా మహేశ్వర రెడ్డిగారు specificగా they mentioned, otherwise they wouldn't have been so troubled ఆ రాష్ట్రానికి సంబంధించిన అంశాలున్నప్పుడు ప్రక్క రాష్ట్రమైన తెలంగాణ విభజనకు సంబంధించిన అంశాలు ఉండాలి. కానీ ఏమీ లేకపోవడంతో ఎంతో మనోవ్యథకు గురవుతున్నాము. తెలంగాణ ప్రజలకు సంబంధించిన అంశాలను మనందరం చర్చించుకొని ఒక మంచి వాతావరణంలో కేంద్ర ప్రధానమంత్రిగారిని అడగాలని కోరుతూ నాకు ఈ అవకాశం ఇచ్చిన శాసన సభాపతిగారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

శ్రీ కె. తారక రామారావు:-అధ్యక్షా, గౌరవ మంత్రి గారు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రిగారు కూడా వారే కాబట్టి వారిని ఏమడగదలచుకున్నానంటే వారు పెట్టిందేమో తీర్మానం అన్నారు కానీ, వాటికి సంబంధించిన కాపీలు మాత్రము మాకు రాలేదు. తీర్మానం అని చర్చ ప్రారంభించారు. ఇంతటి ప్రాముఖ్యం గల అంశం కాబట్టి గౌరవ ముఖ్యమంత్రి గారే రాష్ట్ర ప్రభుత్వ పక్షాన సమర్థవంతంగా తీర్మానం ప్రవేశపెడుతూ వాదన వినిపిస్తారని అనుకున్నాను కానీ, మరి ఏ కారణం చేతనో వారు మాట్లాడకుండా సహచర మంత్రివర్యులతో మాట్లాడించారు. వారు మాట్లాడడం ఇష్టం లేక మాట్లాడడం లేదా ఇబ్బంది కలిగి మాట్లాడడం లేదో నాకైతే తెలియదు.

గత పది సంవత్సరాలుగా మేము అక్కడ ఉండి చెప్పిందే గౌరవ మంత్రి శ్రీధర్ బాబు గారు చెప్పారు తప్ప కొత్త విషయం ఏమీ కాదు.

మిస్టర్ స్పీకర్:- గౌరవ ముఖ్యమంత్రి గారూ..

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి:- ప్రధాన ప్రతిపక్ష నాయకుడిని నేను ఏదో అనాలనే ఉబలాటం వారిలో ఎక్కువగా కనిపిస్తోంది. అత్యంత కీలకమైన 4 కోట్ల తెలంగాణ

ప్రజల హక్కులు, అనుమతులు, నిధుల గురించి సర్వం మనం ఇక్కడ చర్చించుకుంటున్నాము. ఇంత కీలకమైన సందర్భంలో ప్రధాన ప్రతిపక్షనాయకుడు 15 సంవత్సరాల తెలంగాణ ఉద్యమం, 10 సంవత్సరాల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా మొత్తం 25 సంవత్సరాలు పని చేసారని గొప్పగా చెప్పుకుంటూ ఉంటే దానికి వీరేమో భజన చేస్తూ ఉంటారు. మరి అంతటి అనుభజ్ఞుడు ఇక్కడికి వచ్చి ఈసభలోకి వచ్చి చర్చలో పాల్గొని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన సందర్భంలో కూడా ఇక్కడికి రాకుండా ఉండడం ఏమిటి అధ్యక్ష. వారు ఇక్కడికి రావడం నరేంద్ర మోదీగారు చూస్తే ఏమైనా జరుగుతుందేమోనసే భయంతో ఎక్కడో దాక్కొని వీరిని ఇక్కడికి పంపించిన వారి గురించి వీళ్లు మాట్లాడేది? తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రిగా కేంద్ర ప్రభుత్వం నిన్న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిధులు, అనువంతులకు సంబంధించి నిన్న మా మంత్రివర్గ సహచరులకు స్పష్టంగా చెప్పడమే కాకుండా ఈరోజు ఈ సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టి అందరి అభిప్రాయాలను తీసుకొని తెలంగాణ రాష్ట్రానికి న్యాయం జరగాలని మా ప్రభుత్వం ముందుకు రావడం జరిగింది. కాబట్టి ఆ సభ్యులు ప్రస్తావించాల్సిన అంశాల మీద దృష్టి పెడితే అది తెలంగాణ రాష్ట్రానికి ఉపయోగపడుతుందని, ఆ విధంగా కాకుండా వివాదాస్పదమైన విషయాల గురించి మాట్లాడితే వారి నాయకుల బండారం బయట పడుతుందని, తద్వారా వారికే నష్టం జరుగుతుందని సూచన చేస్తున్నాను.

శ్రీ కె.తారక రామారావు (సిరిసిల్ల):- ఏ రకంగానైనా గౌరవ ముఖ్యమంత్రిగారు గొంతు విప్పి నందుకు, అలాంటి పరిస్థితి వచ్చినందుకు సంతోషం, ధన్యవాదాలు అధ్యక్షా. గౌరవ కేసీఆర్ గారి గురించి, మా పార్టీ గురించి వారు మాట్లాడిన దాని గురించి వారికి నేను ఒక్కటే చెప్పదలచుకున్నాను. ఇక్కడ ఉండే ఈ నాయకుడి స్థాయికి మేము చాలు, మా కేసీఆర్‌గారు అవసరం లేదు అధ్యక్షా. ఆయన వచ్చినా, రాకపోయినా సమాధానం చెప్పే సత్తా మాకుంది. మీరు ఇక్కడ నుండి అక్కడికి వెళ్లినవారే కాబట్టి మీ సత్తా కూడా మాకు తెలుసు. మీకు మేము సరిపోతాము. కేసీఆర్‌గారు అవసరం లేదు. మీరు మాకు సమాధానం చెప్పండి చాలు.

అధ్యక్షా, వారన్నారు తీర్మానం అని, అసలు తీర్మానం ఎక్కడుంది? మాకైతే కాపీ రాలేదు. అసలు మీరు ప్రవేశపెట్టిన తీర్మానం ఏది శ్రీధర్ బాబుగారూ? రిజల్యూషన్ లేకుండా చర్చ ఏమిటి? ఇది షార్ట్ డిస్కషనా? రిజల్యూషనా? దేనిని ప్రవేశపెడుతున్నారో తెలియకుండా హౌజ్ నడుపుతున్నారు.

శ్రీ డి. శ్రీధర్ బాబు:- గౌరవ ముఖ్యమంత్రిగారు స్టేట్‌మెంట్ ఇచ్చి మీ అభిప్రాయాలను తీసుకొని చాలా డెమోక్రటిక్‌గా వెళుతున్న సందర్భంలో మీరు డెమోక్రటిక్‌గా వెళ్లవద్దంటే ఎలా? మేము స్పెసిఫిక్‌గా తీర్మానం చేస్తాము. దాని ప్రకారమే వెళుతున్నాము. ఈరోజు గవర్నమెంట్ బిజినెస్‌లో ఏ అంశం ఉంది అధ్యక్షా. మేము స్టేట్‌మెంట్ ఇచ్చి మీ అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకొని తీర్మానం చేద్దామని ఆలోచన చేస్తే మీరు వద్దు అంటే ఇప్పుడే అధ్యక్షుల వారు సమయం ఇస్తే 5 నిమిషాల్లో తీర్మానం పెట్టి దాని ప్రకారం వెళదాము. మీలాగా యూనిలేటరల్‌గా పోకుండా, డెమోక్రటిక్ పద్ధతిలో మీ అభిప్రాయాలను తీసుకొని వెళదామనుకుంటే, వద్దంటే ఒక ఐదు నిమిషాల్లో రిజల్యూషన్‌ను పాస్ చేస్తాము.

(బీఆర్ఎస్ సభ్యుల నుండి అంతరాయం)

శ్రీ కె.తారక రామారావు:- మేము అక్కడ పది సంవత్సరాలు కూర్చొని ప్రభుత్వాన్ని నడిపించడం జరిగింది. ఒక స్టేట్ మెంట్‌ను గానీ, ఒక రిజల్యూషన్‌ను గానీ ప్రవేశపెట్టేటప్పుడు ముందుగా ప్రభుత్వం ఏ అంశం మీద చర్చ చేయదలుచుకున్నది, ఏం చెప్పదలుచుకున్నది అనే అంశానికి సంబంధించిన ప్రతులను అందరికీ పంచాలి.

(ట్రెజరీ బెంచెస్ నుండి అంతరాయం)

అధ్యక్షా, కొంచెం హౌజ్‌ను ఆర్డర్‌లో పెడితే మంచిది, మీ మంచి కోసమే చెబుతున్నాను. గౌరవ ముఖ్యమంత్రిగారు గతంలో మంత్రిగా పనిచేయలేదు. వారికి సభా వ్యవహారాలకు సంబంధించి అనుభవం లేకపోవచ్చు. శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రిగారు సీనియర్ సభ్యులు. గతంలో కూడా వారు ఈ శాఖను

నిర్వహించారు. నేను కోరేదేమంటే ఈరోజు వదిలేయండి. చర్చలో బ్రహ్మాండంగా పాల్గొంటాము, చెబుతాము. కానీ రేపు ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్లకూడదు. రేవంత్ రెడ్డి గారు, శ్రీధర్ బాబుగారు.. సిన్సియర్‌గా నేను మా పార్టీ తరఫున చెప్పేదేమంటే మీరు ఇచ్చిన ఓపెనింగ్ స్టేట్‌మెంట్ లిఖితపూర్వకంగా కాకుండా వెర్బల్‌గా ఇచ్చారు. దీనిని మేము స్వాగతిస్తూ, వంద శాతం సపోర్ట్ చేస్తాము. ఆ విషయంలో అనుమానం లేదు అధ్యక్షా.

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి:- వారి కుటుంబం మొత్తం సభను తప్పుదోవ పట్టించే పనిలోనే ఉన్నారు.

(బీఆర్ఎస్ సభ్యుల నుండి అంతరాయం)

మిస్టర్ స్పీకర్:- దయచేసి సభాధ్యక్షులు మాట్లాడేటప్పుడు రన్నింగ్ కామెంట్రీ ఆపేయండి. మీరు ఇక్కడ నుండి మాట్లాడుతుంటే అక్కడ నుండి కూడా వస్తుంటాయి.

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి:-అధ్యక్షా, నేను వారు మేనేజ్‌మెంట్ కోటానే అనుకున్నాను. కానీ, వారు ఆబ్సెన్స్ ల్యాండ్ లార్డ్ అని కూడా అర్థం అవుతోంది. అధ్యక్షా, మొదటగా తమరి అనుమతితో కేంద్ర ప్రభుత్వం 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాల్సిన నిధులు, ఇవ్వవలసిన అనుమతుల విషయంలో చూపించిన వివక్ష పై సభలో చర్చకు అనుమతించాల్సిందిగా కోరుతున్నాను అని స్పష్టంగా చర్చ కోసం అనుమతిని కోరడం జరిగింది.

1.10 మ. అధ్యక్షా, తీర్మానం ప్రవేశపెట్టారు కానీ, మాకు ఇవ్వలేదని వారన్నారు. ఇది ఏంటి అధ్యక్షా? ఎవరిని తప్పుదోవ పట్టిస్తున్నారు అధ్యక్షా? వారు సమయానికి రారు, ఆలస్యంగా వస్తారు. వచ్చిన తరువాత అవగాహన రాహిత్యంతో మొత్తం చర్చను ఇంత సీరియస్ ఇష్యూపై, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం మీద గంభీరంగా సభలో చర్చ జరుగుతుంటే, అవగాహన రాహిత్యంతోటి అనవసరమైన వివాదాలను గెలికి ఈ రోజు మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారు ఆ సభ్యులు. మరొక్కసారి స్పష్టంగా.. ఒకవేళ వారి దగ్గర కాగితం లేకపోతే నేను పంపిస్తాను. మొదట చర్చ చేయండని చెబుతున్నాము. మీ అభిప్రాయం తీసుకోవడానికే చర్చ పెట్టాము. మీ అభిప్రాయం ఏమిటి? మొన్న ఢిల్లీకి పోయి చీకట్ల మాట్లాడుకుని వచ్చిందే మీ అభిప్రాయమా? సభలో ఇంకేమైనా వేరే అభిప్రాయం ఉందా? మీరు ఏం చెప్తారో చెప్పడానికే అనుమతించాము. అది చెప్పకుండా వివాదాలు చేసి ఏదో ఒకటి మాట్లాడితే, మిమ్మల్ని సభలో నుండి బయటికి పంపిస్తే, అబ్బా! బతుకురా జీవుడా అని తప్పించుకొని పారిపోదామని ప్రయత్నాలు చేస్తున్నారు. కాని బయటికి పంపవద్దు అధ్యక్షా. నిల్చోపెట్టి వారి అభిప్రాయం కనుక్కోండి. వారి అభిప్రాయం స్పష్టంగా చెప్పవలసిందే. తెలంగాణ ప్రజల ముందు నిల్చోపెట్టండి. చీకటి ఒప్పందాలతో తెలంగాణకు అన్యాయం జరుగు తుంటే, సభలో ఇంత ప్రధానమైన అంశంపై చర్చ జరుగుతున్నప్పుడు ఇది తీర్మానమా, ఇది చర్చనా అనంటే స్పష్టంగా చర్చ అని నేను చెప్పడం జరిగింది. కావాలంటే మీరు రికార్డును తిరగవేసుకోండి. చర్చలో పాల్గొనండి. చర్చలో పాల్గొన్న తరువాత ప్రభుత్వం వైపు నుండి తీర్మానం ప్రవేశపెట్టాలని అనుకుంటే మీరందరూ సూచిస్తే, ఈ చర్చను మీరు తీర్మానం క్రింద మలుద్దామా! ప్రభుత్వం ఓపెన్ మైండ్‌తో ఉంది మీ సలహా ఇవ్వండి. మీ సలహాను అనుమతించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అంతే తప్పా, నేను మంత్రిగా చేయలేదనడం కాదు. మా నాన్న నాకేమి ఉచితంగా కుర్చీలు ఇచ్చి చదువు రాకపోయినా మంత్రులను చేయలేదు.

(ఈ సందర్భంగా అధికార పక్ష సభ్యులు బల్లలు చరిచారు.)

మా నాన్న చదువు రాకపోయినా, సంధ్య లేకపోయినా మాకు మంత్రులను చేసి ఇందులో కూర్చోపెట్టలేదు. మేము కష్టపడి క్రింది స్థాయి నుండి జిల్లా పరిషత్తులో పనిచేశాము, శాసన మండలిలో పని చేశాము, శాసన సభ్యుడిగా పని చేశాము, పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశాము, ఈ రోజు ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నాము. ఇదంతా స్వయం కృషితో కష్టపడి తెలుసుకొని, అవగాహన కల్పించుకొని సభలోకి రావడం జరిగింది. అయ్యా పేరో, తాత పేరో చెప్పుకొని

ఇందులోకి రాలేదు. కాబట్టి, దయచేసి మీరు వివాదాల వైపు వద్దు, ఈ చర్చలో పాల్గొని మీ అభిప్రాయం చెప్పండి.

(ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

మిస్టర్ స్పీకర్:- కూర్చోండి. కౌశిక్ రెడ్డి గారు కూర్చోండి.

శ్రీ కె.తారక రామారావు:- అధ్యక్షా, గౌరవ ముఖ్య మంత్రి గారికి.....

మిస్టర్ స్పీకర్:- మీ నాయకుడే మాట్లాడుతున్నారు.

శ్రీ కె.తారక రామారావు:- అధ్యక్షా, ఎవరు మాట్లాడినా హౌస్ ఆర్డర్‌లో మీరే పెట్టాలి. వాళ్లను కూడా కంట్రోల్ చేయాలి మీరు, మమ్మల్నే కాదు.

మిస్టర్ స్పీకర్:- మీరు కంట్రోల్ అయితే వారు కంట్రోల్ అవుతారు.

శ్రీ కె.తారక రామారావు:- అధ్యక్షా, మీరు కంట్రోల్‌లో పెడుతలేరు. గౌరవ ముఖ్యమంత్రి గారికి సహనం, సంయమనం, ఓపిక ఉండాలి అధ్యక్షా. మాటిమాటికీ ఓపిక కోల్పోయి రన్నింగ్ కామెంటరీ అవసరమా అధ్యక్షా! పేమెంట్ కోటాలో ముఖ్యమంత్రి పదవి కొట్టేశావని నేను కూడా అనవచ్చు.

(ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుంచి హర్షధ్వనులు)

నేను కూడా బాగానే మాట్లాడతాను. అయ్యాల పేర్లు చెప్పి పదువులు అంటే, రాహుల్ గాంధీ గారిని అంటున్నారా లేదా రాజీవ్ గాంధీ గారిని అంటున్నారా నాకైతే తెలియదు. వారు ఎవరిని అంటున్నారు అధ్యక్షా? ఎవరి గురించి మాట్లాడుతున్నారు?

(అంతరాయం)

శ్రీ డి. శ్రీధర్ బాబు:- అధ్యక్షా, ప్రభుత్వంలో అనేక సంవత్సరాలు పనిచేసిన గౌరవ సీనియర్ శాసన సభ్యులైన కేటీఆర్ గారిని నేను తమ ద్వారా కోరుతున్నాను. మేము ఆక్షేపించేది ఏమిలేదు. ఈ రోజు వారు మాట్లాడిన మాటలు తప్పకుండా వెనక్కి తీసుకోవల్సిందేనని కోరుతున్నాను. ఈ రోజు మేము డెమోక్రటిక్‌గా ఒక డిబేట్‌ని ప్రవేశపెడితే, ఇంత సీరియస్ ఇష్యూను పక్కదారి పట్టించవద్దని వారిని మేము కోరుతున్నాము. ఇప్పుడు కూడా చెబుతున్నాను. ఇంత సీరియస్ ఇష్యూను వారు పక్కదారి పట్టిస్తుంటే రాష్ట్రప్రజలకు సంబంధించిన ప్రయోజనాలు ప్రక్కన పడతాయని దయచేసి గౌరవ శాసన సభ సభాపతి గారిని కోరుతున్నాను. Let us go on to the subject. Otherwise, మా రిజల్యూషన్ మూవ్ చేస్తాం. రిజల్యూషన్ పూర్తి స్థాయిలో మూవ్ చేసి, అదే హౌస్ రిజల్యూషన్ అని అనుకుంటాము. కానీ, ఎవరికైతే ఇష్టం లేదో.., మేము డెమోక్రటిక్ స్పిరిట్‌లో మీ అభిప్రాయాలను కూడా తీసుకొని ముందుకుపోవాలనే ఆలోచన చేస్తున్నాము. దయచేసి గౌరవ సభ్యులను కూడా కోరుతున్నాము. Let us go on to the subject.

మిస్టర్ స్పీకర్:- దయచేసి కె.టి.ఆర్ గారూ, సబ్జెక్ట్‌పై మాట్లాడండి. డీవియేట్ కాకండి.

శ్రీ కె.తారక రామారావు:- అధ్యక్షా, మీరు మా ఒక్కరికే నీతులు చెబితే కుదరదు అధ్యక్షా. అక్కడ కూడా ఇదే మాట చెప్పాలి.

మిస్టర్ స్పీకర్:- నేను వారికి కూడా అదే మాట చెబుతున్నాను.

శ్రీ కె.తారక రామారావు:- అధ్యక్షా, అయ్యాల పేర్లు చెప్పుకొని, మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చారని ఒక సభా నాయకుడు మాట్లాడవచ్చా? ఇది సంస్కారమా? నేను కూడా ఒక సభ్యుడినే. నా హక్కులను కూడా మీరే కదా కాపాడాలి. వారు మాట్లాడినప్పుడు తప్పకుండా సమాధానం చెప్పాలి. అధ్యక్షా, తమరిని కోరేదేమంటే, ఈరోజు ప్రభుత్వం ఏదైతే చర్చ ప్రారంభించిందో ఆ చర్చను మేము స్వాగతిస్తున్నాము. వంద శాతం సమర్థిస్తున్నామనే మాటను నేను చెబుతున్నాను. అయితే ఒకటే ఒకటి ఏమిటంటే శ్రీధర్ బాబు గారు ఈరోజు బిజినెస్‌లో రిజల్యూషన్ అని ఇచ్చారు. భవిష్యత్తులో పెట్టండి. సబ్జెక్టుపై చర్చ ఉంటే ఆ చర్చకు స్టేట్‌మెంట్ ఇవ్వండి. So that, the Members can come prepared. ఆ మీమాంస వదిలేస్తే, ఇప్పుడే నేను చెప్పాను. సీరియస్ విషయం కాబట్టే రిజల్యూషన్ సరిగ్గా పెట్టమని చెప్తున్నాను వెంకట్ రెడ్డిగారు.

(ఈ సందర్భంగా గౌరవ మంత్రివర్యులు శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మైక్ ఇవ్వాలని కోరారు.)

ఈ విధంగా మంత్రులు disturb చేయడం మంచి పద్ధతి కాదు. వారు సీనియర్ సభ్యులు. ఇదేం పద్ధతి అధ్యక్షా. స్వాగతిస్తున్నామని చెప్పినా కూడా ఈ విధంగా ఇబ్బంది పెట్టడం ఏమిటి? ఇంత ఓపిక లేదేంటి అధ్యక్షా?

మిస్టర్ స్పీకర్:- ప్లీజ్ మీరు కూర్చోండి. మాట్లాడేందుకు మైకు ఇస్తాను కూర్చోండి.

శ్రీ కె.తారక రామారావు:- అధ్యక్షా, మేము క్లియర్‌గా చెప్పేది ఏమిటంటే, అధికార పక్షంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, మేము ఏ పక్షంలో ఉన్నా కూడా ప్రజల పక్షం అధ్యక్షా. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చర్చను ఎందుకు సమర్థిస్తున్నామంటే, తప్పకుండా రాష్ట్రవిశాల ప్రయోజనాల దృష్ట్యా రాజకీయాల ప్రయోజనాల కంటే కూడా రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం కాబట్టి, రాష్ట్రంలోని ప్రజలకు న్యాయం జరగాలి కాబట్టి, నిన్న కేంద్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్యాయం జరిగింది కాబట్టి, ప్రభుత్వం ఈరోజు పెట్టిన చర్చను మేము సంపూర్ణంగా స్వాగతిస్తున్నామనే మాట మరొక్కసారి చెబుతున్నాను. ఇప్పటి వరకు గౌరవ మంత్రివర్యులు మాట్లాడిన మాట ఏమిటంటే, అధికారంలో పది సంవత్సరాలు ఉండి చెప్పింది అదే మాట. కొత్తది ఏమి లేదు. వారు ఏమన్నారంటే, తెలంగాణ అనే పదమే నిన్న కేంద్ర బడ్జెట్‌లో వినిపించలేదని అన్నారు. శ్రీధర్ బాబు గారు మీరు చెప్పిన మాట వాస్తవమే. ఎందుకు వినపడలేదు? ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదే శాసనసభలో తెలంగాణ అనే పదం నిషేధించారు. ఈరోజు పార్లమెంట్‌లో తెలంగాణ పదం లేదంటే దానికి కారణం ఒక్కటే అక్కడ బిఆర్ఎస్ లేకపోవడమే కారణం తప్ప, మరొకటి కానే కాదు.

(ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సభ్యుల బల్లలు చరిచారు.)

గులాబీ జెండా ఎగిరినంకనే తెలంగాణ ఇక్కడ మెయిన్ స్టే అయ్యింది, అక్కడ కూడా ఉండేది, కానీ ఈరోజు అక్కడ లేదు. కేంద్ర బడ్జెట్ చూసిన తరువాత తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఏం అనుకుంటున్నారంటే, లెక్కలు తప్పాయి.

(అంతరాయం)

8+8 మామూలు గణితం అయితే 16. కానీ, ఈనాడు 8+8 గుండుసున్న అని తెలంగాణ ప్రజలు అనుకునే పరిస్థితి ఏర్పడింది.

(బీఆర్ఎస్ పార్టీ సభ్యులు షేమ్ షేమ్ అంటూ నినదించారు.)

ఇది వాస్తవం. ఎందుకంటే తెలంగాణ గడ్డ మీద పుట్టిన ప్రతి బిడ్డకు పుట్టిన భావన నిన్న కేంద్ర బడ్జెట్ చూసిన తరువాత ఈ పది సంవత్సరాలు ఏదైతే అన్యాయం జరిగిందో, అదే అన్యాయం కొనసాగింపుగా ముందుకు పోతుంది. కాకపోతె హాస్యాస్పదం ఏమిటంటే, మమ్మల్ని ఒక మాట అన్నారు. ఏం అన్నారు ముఖ్యమంత్రి గారు? ఏం అన్నారు అధ్యక్ష? కేసీఆర్ గారు అనవసరంగా పంచాయితీ పెట్టుకున్నారు. ముఖ్యమంత్రిగా కేంద్ర ప్రభుత్వంతో పంచాయితీ పెట్టుకొని అనుసరుపు భేషజాలకు పోవడంతో పది సంవత్సరాలపాటు ఏం కాలేదు. అందుకే నేను సఖ్యతతో ఉంటానని వారన్నారు. ఏం అన్నారు అధ్యక్షా వారు? హైదరాబాదులో ఒక సమావేశానికి మోదీ గారు వస్తే, ఏమని చెప్పారు? ఇప్పటి నుండి మావి కేంద్ర ప్రభుత్వంతో బంధాలు, అనుబంధాలు, సత్సంబం, దాలుంటాయని, మోదీ గారు పెద్దన్న లాంటివారని, వారు బడే భాయి నేను ఛోటే భాయి అని అన్నారు. ఆ వేదిక మీద అన్నాదమ్ముల అనుబంధం మంచి సినిమాను గౌరవ ముఖ్యమంత్రి గారు పండించారు. ఈ రోజు ఏమైంది, ఏం జరిగింది? తన దాకా వస్తే గాని తెలియలేదు. ఇందాక శ్రీధర్ బాబు గారు మాట్లాడుతున్నారు. సవతి తల్లి ప్రేమ, కక్ష, వివక్ష మరి మేము ఏం చెప్పాము. మేము కూడా ఇన్ని రోజులు అదే చెప్పాము. ఇప్పుడు మీదాకా వస్తే తత్త్వం అర్థమైంది. వాళ్ళు ఏ విధంగా వ్యవహరిస్తారో, ఎన్నిసార్లు తిరిగినా... ఎక్కే విమానం, దిగే విమానం. 20 సార్లు ఢిల్లీలో దిగినా అక్కడ ఏమీ జరగదన్న విషయం ఇప్పుడు మీకు అర్థమైంది. ఇప్పటికైనా వాళ్ళ తత్త్వం బోధపడినందుకు చాలా సంతోషం. కాకపోతే, మీలాగా మాకు కొన్ని అలవాట్లు లేవు. మేము ప్రయత్నం చేసి చాలా పనులు సాధించాము. ఏ ఏ పనులు సాధించామో కూడా చెప్తాము. కాని,

ఇతరులు సాధించింది మా ఖాతాలో వేసుకునే అలవాటు లేదు.

1.20 మ. మా ప్రభుత్వమున్నప్పుడు కేంద్ర ప్రభుత్వంతో ఆనాడు మేము కొట్లాడి ఎలివేటెడ్ కారిడార్లు, రక్షణ శాఖ భూములకు సంబంధించిన వర్క్స్ జరిగి కాగితం మీరున్నప్పుడు వస్తే మేము సాధించామని గొప్పలు చెప్పుకున్నారు. ఏం ఫర్వాలేదు. మేము 30వేల ఉద్యోగాలిస్తే మీరిచ్చారని చెప్పుకున్నారు. అది కూడా పర్వాలేదు. కానీ ఇప్పటికైనా తత్వం బోధ పడిందేమోనని చెప్పి నేను భావిస్తున్నాను.

శ్రీ డి. శ్రీధర్ బాబు:- ఈ రోజు A.P Reorganisation Act, 2014 చట్టానికి సంబంధించిన ఆధారం తీసుకొని రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధులకు సంబంధించిన అంశంలో ప్రస్తావన చేసుకొని పోదామని చెప్పే అంశం పై మరొకసారి వేరే విధంగా చర్చ పెట్టమని గౌరవ కేటీఆర్ గారిని కోరుతున్నాను. ఎంత వరకు వారు శాంక్షన్ చేయించారు, వారు ఏ విధంగా శాంక్షన్ చేయించారు, మేము ఏవిధంగా ముందుకు వెళ్ళాము వంటి వాటి పై చర్చ పెట్టండి. Sir, Definitely we will give you answer.

శ్రీ కె.తారక రామారావు:- అధ్యక్షా, దేశ అత్యున్నత చట్ట సభైన పార్లమెంట్‌లో A.P Re-organisation Act, 2014 కు సంబంధించి 2014వ సంవత్సరంలో బిల్లు పాసైనప్పుడు తెలంగాణ మరియు ఆంధ్ర ప్రదేశ్ రెండు రాష్ట్రాలకు కూడా వారు చెప్పినట్లుగా 35 పైచిలుకు హామీలిచ్చారు. కానీ, ఒక రాష్ట్రానికి చేయూతనిచ్చి మరొక రాష్ట్రానికి మొండి చేయి చూపించడం నిజంగా బాధాకరం, అన్యాయం. తప్పకుండా ఇది తెలంగాణ హక్కులను కాలరాయడమే అవుతుంది. ముఖ్యంగా వ్యవస్థీకరణ చట్టానికి తూట్లు పొడిచినట్లుగా మేము కూడా భావిస్తున్నాం. అధ్యక్షా, పక్క వారు బాగుపడితే సంతోషపడుతాము. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి డబ్బులిచ్చారు, సంతోషం. అందుకు ఇబ్బంది లేదు. కానీ, మనకు ఇవ్వలేదనే బాధ తెలంగాణలోని ప్రతి బిడ్డకు ఉంది. ముఖ్యంగా కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ మీద ఇంత చిన్న చూపా అనే బాధ ఉంది. అధ్యక్ష, తెలంగాణ హక్కులను ఎవరు హరించిన, తెలంగాణ ప్రయోజనాల విషయంలో ఎవరు ఇబ్బంది పెట్టినా, తప్పకుండా తెలంగాణ కోసం వారి మెడలు వంచే బాధ్యత తెలంగాణ గడ్డ మీద పుట్టిన పార్టీగా బిఆర్ఎస్ పార్టీదేననే విషయాన్ని నేను మరొకసారి గుర్తు చేస్తున్నాను. కేసీఆర్ గారి పోరాట పటిమ గురించి, పది సంవత్సరాలు కేంద్ర ప్రభుత్వం మీద మేము చేసిన కార్యక్రమాల గురించి చెప్పవలసి వస్తే 'రాసుకుంటే రామాయణమంత చెప్పుకుంటే భారతమంత' అన్న అంత కథ ఉంది. కానీ కొన్ని మాత్రం తప్పకుండా మీ దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత మా మీద ఉన్నదని మేము భావిస్తున్నాం. మొట్టమొదట రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం కూడా చేయలేదు. అప్పటికి వారు చీఫ్ మినిస్టర్ డెజిగ్నేట్‌గా ఉన్న సమయంలో తెలంగాణకు సంబంధించిన ఏడు మండలాలు అన్యాయంగా ఒక ఆర్డినెన్స్ ద్వారా పోలవరం ముంపులో భాగంగా ఆంధ్ర ప్రదేశ్‌లో కలిపితే మొట్టమొదటగా స్పందించి రాష్ట్రబంద్‌కు పిలుపునిచ్చి, ఆనాడు అప్పటి కేంద్ర ప్రభుత్వాన్ని మా పార్టీనే వ్యతిరేకించింది. ఆనాడు ఇంకా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకపోయినా మేము కొట్లాడడం జరిగింది. (ఈ సందర్భంలో సభకు ఒక ఫోటో కాపీని చూపిస్తూ) ఇది సెప్టెంబర్ 7వ తేది, 2014న కేసీఆర్ గారు మరి ప్రధాన మంత్రి గారిని కలిసి తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వండి, ప్రత్యేక హోదా ఇవ్వండి అని ఆంధ్ర ప్రదేశ్ అడుగుతున్నది, అలాగే మాకు కూడా ప్రత్యేక హోదా ఇవ్వండని అడిగిన క్లిప్పింగ్‌ను చూపించారు. ఒకసారి కాదు అధ్యక్షా, 1లక్ష, 15వేల 667 కోట్ల రూపాయలను మా రాష్ట్రానికి ఇవ్వండని ముఖ్యమంత్రిగా ఆనాడు కేసీఆర్ గారు సెప్టెంబర్ 2016, ఫిబ్రవరి 12న అడిగిన ఒక క్లిపింగ్ కాపీను సభకు చూపించారు.

అధ్యక్షా, ఒకటి కాదు ఇలా ఎన్నో సందర్భాలున్నాయి (2015వ సంవత్సరంలో కలిసిన ఫోటో జిరాక్స్ కాపీలను చూపించారు.) 'ఎక్కని కొండ లేదు మొక్కని బండ లేదు' అన్నట్లుగా ఒక్క సారి కాదు అధ్యక్షా, ప్రతి ప్రాజెక్టు

విషయంలో కేంద్ర ప్రభుత్వం దగ్గరకు పలుమార్లు పోవడం జరిగింది. అలా వెళ్ళి కొన్ని సాధించాము, కొన్ని సాధించలేకపోయాము. కానీ రకరకాల ప్రయత్నాలు చేశాము. నిష్పక్షపాతమైన వ్యవహారం చేశాము. ముఖ్యంగా సి.ఏ.ఏ, ఎన్.పి.ఆర్, ఎన్.ఆర్.సి వంటి వాటి విషయాల్లో శాసనసభలోనే తీర్మానం పాస్ చేయడం జరిగింది. పాస్ చేసి this was in 2020 March 26 Sir. (ఈ సందర్భంలో సభకు కొన్ని ఫోటో కాపీలను చూపించారు). మేము సి.ఏ.ఏ, ఎన్.ఆర్.సిలను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నామని కేంద్ర ప్రభుత్వానికి మా నిరసన కూడా తెలపడం జరిగింది. Central Electricity Amendment Actను తీసుకొచ్చి మోటర్లకు మీటర్లు పెట్టవలసిందేనని మెడ మీద కత్తి పెడితే దాన్ని వ్యతిరేకిస్తూ శాసన సభలో తీర్మానం చేయడం జరిగింది.

అధ్యక్షా, ఇది ఒక్కటే కాకుండా ఖాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వనందుకు మేము మా పార్టీ 2021, మార్చిలో చేసిన నిరసన (ఈ సందర్భంలో సభకు ఫోటోలు చూపించారు) ఇవన్నీ A.P Re-organisation Act సంబంధించిన ప్రామిస్‌లు ....,

MR. SPEAKER:- One minute, Dy Chief Minister garu,

శ్రీ భట్టి విక్రమార్క మల్లు (మధిర):- అధ్యక్షా, ఈ రోజు రాష్ట్ర ప్రజలంతా కూడా గంభీరంగా మనకు జరిగిన నష్టం పైన ఆవేదన చెందుతున్నారు. దానికి సంబంధించి గౌరవ ముఖ్యమంత్రి గారు సభలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాల్సిన నిధులు, ఇవ్వవలసిన అనుమతుల విషయంలో చూపించిన వివక్ష పై సభలో చర్చకు అనుమతించాల్సిందిగా కోరుతున్నానని చాలా స్పష్టంగా చెప్పారు. దీని మీద చర్చించి అంతిమంగా మనకు జరిగిన నష్టాన్ని ఏ రకంగా పూడ్చుకోవాలనే విషయంలో సభ్యులందరి అభిప్రాయాలు తీసుకుందామని చర్చకు పెడితే, అది వదిలేసి గత పది సంవత్సరాల్లో వారు ఏమి చేశారో చెప్పకుంటూ పోవడానికి కాదు కదా చర్చ పెట్టింది. ఇప్పుడు జరిగిన నష్టాన్ని ఎలా పూడ్చుకోవాలనే దాని మీద గౌరవ సభ్యులను మాట్లాడల్సిందిగా కోరుతూ, మనందరం కలిసి ఏమి చేయాలని, సభలోని సభ్యులందరూ కలిసి తీర్మానం చేయాలా లేక కేంద్ర ప్రభుత్వం దగ్గరకు పోయి అడగాలా అనే విషయాల్లో మీ సూచనలు చెప్పండి, తీర్మానం చేద్దాం. దాని మీద మాట్లాడమని స్పష్టంగా చెప్పండి అధ్యక్షా.

శ్రీ కె.తారక రామారావు:- అధ్యక్షా, వారు చెప్పింది వాస్తవం. ఈ వివక్ష ఈ రోజుది కాదు భట్టి గారు, పది సంవత్సరాల నుంచి వివక్ష ఉన్నది. శ్రీధర్ బాబు గారు మాట్లాడింది కూడా అదే అని తెలియజేస్తున్నాను. 2014వ సంవత్సరంలో పునర్విభజన చట్టం వచ్చింది. అందులో నెరవేర్చని అంశాలు పది సంవత్సరాల నుంచి ఉన్నాయి. అలా కాకుండా మేము చెప్పిందే మాట్లాడాలంటే మాకు రాసి పంపండి, మేము చదువుతాము. మా వర్షన్ మమ్మల్ని చెప్పుకోనివ్వాలి కదా. పది సంవత్సరాలు మేము చేసిన ప్రయత్నాలు కూడా చెప్పాలి కదా. తెలంగాణ ఏడు నెలల క్రింద పుట్టలేదు కదా. పది సంవత్సరాల క్రిందట పోరాటాలతో పుట్టింది. అధ్యక్షా, పెండింగ్ ఇష్యూస్‌ని ఎన్ని సార్లు పర్స్యూ చేశామంటే లెక్క లేదు. చివరికి ఓ.బి.సి సెన్సెస్ కావాలని స్టేట్ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపడం జరిగింది. అది మాత్రమే కాదు, ఎన్నో రకాల విషయాల్లో, ఆఖరికి కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలు తెస్తే మా పార్లమెంట్ సభ్యులు పార్లమెంట్‌లో ప్రొటెస్ట్ చేశారు.

(కాంగ్రెస్ పార్టీ సభ్యులచే సభలో అంతరాయం)

నేను ఏమైనా తప్పు మాట్లాడుతున్నానా అధ్యక్షా. ఇందులో ఏమైనా ఇబ్బంది ఉందా అధ్యక్షా. బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడితే మీకెందుకు ఇబ్బంది అధ్యక్షా. వాళ్ళకు ఎందుకు ఇబ్బందో నాకు అర్థం కావడం లేదు. మరి ఏమి మాట్లాడాలో పంపించండి మాట్లాడుతాం. ఇదేమి పద్ధతి అధ్యక్షా. ఏమి మాట్లాడాలో కూడా మీరే చెబుతారా. Sir, I am a Senior Member and ఐదు సార్లు గెలిచి రావడం జరిగింది. నాకు ఏమి మాట్లాడాలో తెలుసు. హౌస్‌లో ఎలా ఉండాలో తెలుసు. ట్రెజరీ బెంచీలు ఈ రకంగా డిక్టేట్ చేయడం కరెక్ట్ కాదు. గత పది సంవత్సరాల మా పార్టీ పరంగా కేంద్ర ప్రభుత్వం ధాన్యం

కొనుగోలు చేయమంటే స్వయంగా మొత్తం కేబినేట్ ముఖ్యమంత్రి గారితో సహా వెళ్ళి అక్కడ నూకలు తినండి అంటే మేము ఢిల్లీలో ధర్నా చేసి వచ్చాము. మాకేమీ ఇది కొత్తకాదు. టిఆర్ఎస్ ఎంపీలు రాష్ట్రపతి ప్రసంగాన్ని కూడా బహిష్కరించారు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టకపోతే ఇక్కడ మాత్రమే కాకుండా ఢిల్లీ దాకా మా ఎంపీలు నిరసన తీసుకొని పోయారు. అదే విధంగా కంటోన్మెంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇబ్బంది పెడుతుంటే వాటిని లేవనేత్తింది కూడా మా ప్రభుత్వమే అధ్యక్ష, వాటి విషయం వదిలేసి నిన్నటి బడ్జెట్‌కు వస్తే, దానిలో కూడా కోటి ఆశలతో ఏర్పడిన ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చిన్న వయస్సులో ముఖ్యమంత్రి అయ్యారు. కాబట్టి సహజంగానే ఉత్సాహంగా....,

(కాంగ్రెస్ సభ్యుల నుంచి అంతరాయం)

మీ ముఖ్యమంత్రి గారి గురించే చెబుతున్నాను. వారు చిన్న వయస్సులో ముఖ్యమంత్రి పదవిని అధిష్టించారు. వారు అన్నట్లుగా కష్టపడి వచ్చారు. సంతోషం. I Congratulate Revanth Reddy garu. వారు ఉత్సాహంగా చాలా సార్లు ప్రధాన మంత్రి గారిని మరియు కేంద్ర మంత్రులను కలిసి వారికి ఎన్నో విజ్ఞాపనలు, వినతి పత్రాలు ఇచ్చారు. మేమిచ్చినట్లే మీరు కూడా ఇచ్చారు. కానీ న్యాయం మీకు కూడా జరగలేదు. మేము మొదటి నుంచి అదే చెబుతున్నాము. ప్రొఫెసర్ జయ శంకర్ గారు 'యాచిస్తే తెలంగాణ రాదు, శాసిస్తే వస్తుంది' అని చెప్పేవారు. ఇప్పుడు కూడా తెలంగాణ ప్రజలకు అదే చెబుతున్నాము. యాచిస్తే రాదు, శాసించే స్థితిలో తెలంగాణ ఉండాలి. అందుకే మేము చెబుతున్నాము. ఆనాడు మేము కేంద్ర ప్రభుత్వానికి సహకారం అందించినా, సమరం సాగించినా తెలంగాణ ప్రజల కోసమే తప్ప ఏ రకమైన లాలూచీ కానీ వ్యక్తిగతమైన ప్రయోజనాల కోసం రాజీ పడలేదు.

అధ్యక్షా, ఏడు మండలాలు గుంజుకున్నప్పుడు నిరసించింది మేమే, నిరసన చెప్పింది మేమే. ఒక్కసారి నేను అడుగుతున్నాను. పది సంవత్సరాల్లో మీరు ఐదు సంవత్సరాలు కేంద్ర ప్రభుత్వంలో ఎంపీగా ఉన్నారు. ఒక్కటంటే ఒక్క రోజు గొంతు విప్పారా అధ్యక్షా. ఎన్నడైనా తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన హక్కుల గురించి పార్లమెంట్‌లో ప్రసంగించారా.

మిస్టర్ స్పీకర్:- కేటీఆర్ గారు..,

శ్రీ కె. తారక రామారావు:- నేను సబ్జెక్ట్ మాట్లాడుతున్నాను, ఎందుకు డిస్టర్బ్ చేస్తారు.

మిస్టర్ స్పీకర్:- తీర్మానం ఏమి పెట్టారో, దాని గురించి మాట్లాడండి.

శ్రీ కె. తారక రామారావు:- తీర్మానం పెట్టలేదు అధ్యక్షా, తీర్మానం ఎక్కడ పెట్టారు. నోటి మాటలతోని తీర్మానాలు కావు. తీర్మానాలు ఎక్కడ ఉన్నాయి. ఇది చర్చ, దాని గురించే మాట్లాడుతున్నాను.

మిస్టర్ స్పీకర్:- బడ్జెట్ మీదనే మాట్లాడండి.

శ్రీ కె. తారక రామారావు:- మీరు రాసివ్వండి, దాన్నే చదువుతా. తీర్మానం లేదు, చర్చ లేదు, మేము చర్చలో పాల్గొని మాట్లాడుతున్నాము. తమరు కూడా ఇట్లా డిస్టర్బ్ చేస్తే ఎలా సార్. నేను అడిగేది ఒక్కటే అధ్యక్ష. పది సంవత్సరాల్లో ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వమున్నప్పుడు ఎన్నడన్న ఒక్క రోజు ....,

మిస్టర్ స్పీకర్:- నిన్న ప్రవేశ పెట్టిన బడ్జెట్ గురించి మాట్లాడండి.

శ్రీ కె. తారక రామారావు:- అదే చెబుతున్నాను అధ్యక్ష.

1.30 మ. **మిస్టర్ స్పీకర్**:- నిన్న కేంద్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ విషయంలో చర్చ జరగాలి. పది సంవత్సరాలలో జరిగింది మీరు చెప్పాలనుకుంటే, టైమ్ వచ్చినప్పుడు మీకు అవకాశం ఇస్తాను, చెప్పండి.

శ్రీ కె. తారక రామారావు:- అధ్యక్షా, హైకోర్టు విభజన విషయంలోనైనా పోరాటాలతోనే ఆనాడు రాష్ట్రాన్ని సాధించుకున్నాము. మా ఎంపీలు, ఇక్కడి న్యాయవాదులు పోరాటం చేసి ఆ విధంగానే సాధించుకున్నాము. కృష్ణా జలాలు విషయంలో ట్రిబ్యునల్ తేల్చాలి, ట్రిబ్యునల్ ద్వారా రెఫర్ చేయాలని దాదాపు పది సంవత్సరాలు వెంబడి పడితే, మొన్న చిట్టచివరికి కేసీఆర్‌గారు పట్టుబడితే గట్టిగా నిలదీస్తే

చివరకు కేంద్రం దిగివచ్చి కృష్ణా జలాల పంపిణీ విషయాన్ని మొన్న ఎన్నికల ముందు ట్రిబ్యునల్‌కు రెఫర్ చేశారు. ఇది మేము సాధించిన అతి పెద్ద విజయం. అందుకే అంటున్నా శాసించి సాధించుకోవాలి తప్ప, యాచిస్తే కేంద్రం లొంగదు.

మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ గురించి ఇప్పుడే శ్రీధర్‌బాబుగారు చెప్పారు. ఇరవై నాలుగు వేల కోట్ల రూపాయలు ఇవ్వాలనీ నీతి ఆయోగ్ సిఫారస్సు చేసినా ఒక్క పైసా ఇవ్వలేదు. అందుకే వారి నీతివాలిన రాజకీయాన్ని అప్పుడు కూడా ఎండగట్టాము. ఇప్పుడు కూడా ఎండగడుతాము. గిరిజన విశ్వవిద్యాలయాన్ని కొర్రీలతో అడ్డం పెడితే చివరకు పోరాటాలతో సాధించాము. కానీ యూనియన్ బడ్జెట్‌లో ఒక్క పైసా కూడా దానికి రాలేదు. దానికి తప్పకుండా శాసనసభ నుండి మనందరం ముక్త కంఠంతో తీర్మానం చేద్దాము. కేంద్రప్రభుత్వానికి పంపుదాం. మా మద్ధతు సంపూర్ణంగా ప్రభుత్వానికి ఉంటుంది. మన ప్రాజెక్టులకు జాతీయ ప్రాజెక్టు హోదా ఇవ్వలేదు. అప్పర్ భద్ర, కెన్‌బెత్వా ప్రాజెక్ట్‌లకు జాతీయ హోదా ఇచ్చారు. మన పాలమూరు రంగారెడ్డి, కాళేశ్వరానికి, సీతారామ ప్రాజెక్ట్‌లకు ఇవ్వలేదు. అందుకే ఆనాడు అడిగాము. ఈరోజు కూడా అడుగుతున్నాము. మన శాసనసభ నుంచి తీర్మానం పాస్ చేయండి. తప్పకుండా కేంద్ర వివక్షను ఎండగడుదాము. ఒకటి కాదు, ఎన్నో విజయాలను సాధించాము. కేంద్రం ఇవ్వలేదని దిక్కులు చూడలేదు. కాలంతో పోటీపడి బ్రహ్మాండంగా పర్యావరణ అనుమతులు సాధించి వాయు వేగంతో ప్రాజెక్టులను కట్టాము. నిన్నగాక మొన్న చూశాను. భట్టి విక్రమార్కగారు సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్‌లోకి వెళ్లి ఆన్ చేశారు. అది కాలంతోపోటీపడుతూ కట్టింది బిఆర్ఎస్ ప్రభుత్వం. పంపులు మీరు ఆన్ చేయవచ్చు కానీ దానిని కట్టింది కేసీఆర్‌గారు అన్న మాట ప్రజలందరికి తెలుసు. కాళేశ్వరం అయినా పాలమూరు రంగారెడ్డి అయినా అన్నీ కూడా చేసుకున్నాము. కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వకపోయినా దమ్మిడీ పైసా సహాయం చేయకపోయినా చేసుకున్నాము.

మా కొలువులు మాకే దక్కాలని ఒక ఉద్యమ నినాదాన్ని నిజం చేస్తూ 95శాతం రిజర్వేషన్ ప్రభుత్వ నియమాకాల్లో సాధించిన ఒకే ఒక్క రాష్ట్రం భారతదేశంలో తెలంగాణ మాత్రమే. ఈ విషయంలో కూడా కేంద్రానికి అభ్యంతరం ఉంటే ఒప్పించాము, మెప్పించాము, అంతిమంగా సాధించాము. ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ గురించి శ్రీధర్‌బాబుగారు ప్రస్తావించారు. నిజమే వరంగల్ ప్రజలకు అన్యాయం జరిగింది. అక్కడ కోచ్ ఫ్యాక్టరీ పెడతామని మాట ఇచ్చి మేము పదేండ్లు పర్స్యూ చేస్తే ఆఖరికి ఒక వ్యాగన్ రిపేర్ ఫ్యాక్టరీ పెట్టారు. అది ఎంత మాత్రం కరెక్ట్‌కాదు. తప్పకుండా కోచ్ ఫ్యాక్టరీ విషయంలో మనమందరం కలిసి కొట్లాడుదాము. మా గిరిజన శాసనసభ్యులు ఇక్కడ ఉన్నారు. బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ కూడా ఇవ్వలేదు. ఎన్నోసార్లు అడిగాము, జరగలేదు. తప్పకుండా ఆ విషయంలో కూడా ప్రభుత్వంతో కలిసి వస్తాము. కలిసి నిలబడుతాము. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎవ్వరితో కూడా రాజీపడమనే మాట మళ్లీ ఒక సారి విజ్ఞప్తి చేస్తున్నాను.

మేము వారు ఇవ్వలేదని ఆగిపోలేదు. భారతదేశంలో 157 మెడికల్ కళాశాలలు ఇచ్చి 156 నర్సింగ్ కళాశాలలు ఇచ్చి మనకు ఒక్కటి కూడా ఇవ్వకపోతే మనం ఆగలేదు. ఆనాడు ముఖ్యమంత్రి కేసీఆర్‌గారు, ఆనాటి హెల్త్ డిపార్ట్‌మెంట్ మంత్రి హరీష్‌రావుగారు జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ పెట్టి కేంద్రం నిధులు ఇవ్వకపోయినా మేము చేసుకున్నాము. ఈరోజు Telangana is the only State where there is a Medical Collage in each and every District. వాళ్లు నవోదయ పాఠశాలలు ఇవ్వలేదు. శ్రీధర్‌బాబుగారు కరెక్ట్‌గా చెప్పారు. కేంద్ర విద్యాలయాలు ఇవ్వలేదు. నవోదయ పాఠశాలలు ఇవ్వలేదు. వాళ్లు ఇవ్వకపోతే మేము ఊరుకోలేదు. ఒకవైపు కొట్లాడాము. మరోవైపు వెయ్యి గురుకుల పాఠశాలలు కూడా పెట్టి అత్యధిక రెసిడెన్షియల్ పాఠశాలలు పెట్టిన ఒకేఒక్క రాష్ట్రం తెలంగాణ. తెలంగాణ కొంగు బంగారం సింగరేణి. సింగరేణిని నేడు చీకట్లోకి నెట్టే కుట్రలు కేంద్రప్రభుత్వం చేస్తే ఈ రోజు కాదు మొదటి నుంచి వ్యతిరేకిస్తూ వచ్చాము. అడ్డుకున్నాము. ఒక్క సింగరేణి మాత్రమే కాదు. పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ అన్నీ విషయాలల్లో ఒకటే

నిర్ణయం తీసుకున్నాము. తప్పకుండా ప్రభుత్వ రంగసంస్థలను కాపాడాలనే కృతనిశ్చయంతో పని చేశాము. చేస్తూనే ఉంటాము. కానీ మొన్న చాలా విచిత్రంగా అనిపించింది. కిషన్‌రెడ్డిగారు పిలుస్తారు. మా డెప్యూటీ సి.ఎం గారు వెళ్లి ఇద్దరూ సింగరేణి గనులను వేలం వేస్తుంటే చిరునవ్వులు చిందిస్తూ ఒకే వేదికను పంచుకుంటుంటే మేము ఆశ్చర్యపోయాము. వడ్లు కొనకుండా దాగుడు మూతలు ఆడితే ఊరుకోలేదు. రైతాంగం తరపున కేంద్రంలోని హస్తినాపురానికే వెళ్లి ముఖ్యమంత్రి మంత్రులు ఎమ్మెల్యేలు, ఎమ్‌పిలు అందరం వెళ్లి ఢిల్లీలో ధర్నా చేసి అక్కడ గర్జించాము. మోటార్లకు మీటర్లు పెట్టాలని మెడమీద కత్తి పెట్టినా వినలేదు. రైతుల కోసం ముప్పై వేల కోట్ల ఆర్థిక వనరులు మన రాష్ట్రానికి రావాల్సినవి మెడ మీద కత్తి పెట్టినందుకు దానిని వదులుకున్నాం. మేము ఈ రోజు కూడా మళ్లీ ఈ ప్రభుత్వానికి చెబుతున్నాము. దయచేసి మీరు రాజీ పడకండి. ఎందుకంటే కొన్ని మాటలు వింటుంటే విచిత్రంగా అనిపిస్తున్నది. విద్యుత్తు సంస్కరణలు పెట్టి డిస్కంలను ప్రైవేటీకరణ చేయాలని బిజెపి పార్టీ చెబుతుంటే మొన్న మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు ఇచ్చిన ప్రకటన ఏమిటంటే హైదరాబాదు పవర్ సర్కిల్‌ను అదానీ గారికి అప్పజెబుతామని చెప్పారు. ఈ విషయంలో దయచేసి నేను ఈ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసేదేమంటే ప్రైవేటీకరణ పేరిట డిస్కంలను ప్రవేటీకరణ చేయకండి. వాళ్ల ఒత్తిడికి లొంగకండి. కేంద్రం మోటర్లకు మీటర్లు పెట్టాలంటే దానికి లొంగవద్దని కూడా నేను ఈ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- అధ్యక్షా, గౌరవ సభ్యులు సభతోబాటు రాష్ట్రప్రజలను కూడా తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇది మంచి సాంప్రదాయం కాదు. ముఖ్యమంత్రిగారు ఎక్కడో ఎవరికో ప్రైవేటైజ్ చేయడానికి ఇస్తున్నామని చెప్పారని మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రిగారు ఆ విధంగా ఎక్కడా చెప్పలేదు. ఏదో పత్రికలో రాసిన దానిని పట్టుకొని అడ్డగోలుగా సభలో సభ్యులు ఆ విధంగా మాట్లాడటమంటే ఏమైనా అర్థముందా అని అడుగుతున్నాను. మీరు సీనియర్ సభ్యులై ఉండి ఆ విధంగా చెబితే ఎలాగండీ. మేం మీ మాదిరిగా అడ్డగోలుగా ఏది పడితే అది చేసేవాళ్లం కాదు. రాష్ట్రప్రయోజనాలే మాకు ముఖ్యం. మీరు ఇందాక ఒక మాట కూడా అన్నారు. లేని అంశాలను గురించి సభలో మాట్లాడి సభను తప్పుదోవ పట్టిస్తాం, మీరు దానిని ఖండించండి అని అంటే అది కరెక్టు కాదు.

రెండవది - సింగరేణి కాలరీస్ ఆక్షన్స్ గురించి కూడా మాట్లాడారు. దానికి సంబంధించి మేం చర్చకు సిద్ధమే. దాని గురించి ఏదైనా ఒకరోజు షార్ట్ డిస్కషన్ కింద టేకప్ చేసి చర్చించుకుందాము. సింగరేణి కాలరీస్‌కు బిఆర్ఎస్ ప్రభుత్వం వల్ల ఏం నష్టం జరిగింది, మేం అధికారంలోకి వచ్చిన తరువాత సింగరేణి కాలరీస్‌కు ఎంత మేలు జరిగింది, రాష్ట్ర ప్రజల ప్రయోజనాల విషయంలో ఎంత మేలు జరిగిందనేది చర్చించడానికి మేం సిద్ధంగా ఉన్నాం, కానీ ఇప్పుడున్నటువంటి అంశం కేవలం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన నష్టంపైన సభలో చర్చ జరిగి తద్వారా ఒక తీర్మాణం చేసి రాష్ట్రప్రయోజనాల కోసం మనందరం ఏం చేద్దామని అత్యంత ప్రజాస్వామ్యయుతంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం చర్చకు తెరతీసింది. దానిని వదిలేసి పాతవాటన్నింటి గురించి ఏదో మాట్లాడతారు. గడచిన పది సంవత్సరాలు ఈ రాష్ట్రాన్ని మేం ఇలా సర్వనాశనం చేశాం, ఇంకా చేస్తామని చెప్పుకుంటూ పోతే ఎలాగండీ. మీరు బాగా పరిపాలన చేస్తే ఇప్పుడు రాష్ట్రంలో ఈ సమస్యలన్నీ ఎందుకుంటాయని అడుగుతున్నాను. ఇప్పటికే రెండు, మూడు సార్లు చెప్పాము. మరలా చెబితే మాకే మంచిగా అనిపించదు కాబట్టి గౌరవ సభ్యులు దయచేసి సబ్జెక్టు మాట్లాడటంతోబాటు ఏం చేద్దామనేది చెప్పండి.

శ్రీ కె. తారక రామారావు:- అధ్యక్షా, భట్టిగారికి సాధారణంగా ఆవేశం రాదు కాని ఇవ్వాళ ఎందుకో చాలా ఆవేశపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గుగనుల ఆక్షన్ పెడతామని పిలిస్తే మీరేమో వెళ్లి ఆ వేదికను పంచుకుంటారు. ఈ విషయాలను ప్రస్తావిస్తే భట్టి గారికి కోపమొస్తున్నది. ముఖ్యమంత్రి గారేమో స్వయంగా అదానీకి ఇస్తానని చెబుతారు. ఎస్‌పిడిసిఎల్ ఏదైతే ఉన్నదో

వాళ్లను పిలిచి మాట్లాడండి. మొన్న ఓల్డ్ సిటీలో బిల్లు కలెక్టర్లు బిల్లులు జారీ చేయడానికి వెళితే అదానీ మనుషులు వచ్చారని గొడవలు అయ్యాయా లేదా తెలుసుకొని ఓల్డ్ సిటీ శాసనసభ్యులతో ఒక మీటింగ్ పెట్టుకొని వారి భయాలు తప్పు అని చెప్పాలి తప్ప నా మీద ఎదురు దాడికి దిగితే ఏం లాభం వస్తుంది? మేం ఏమైనా తప్పులు చేసి ఉంటే, పొరపాట్లు చేసి ఉంటే దానికే కదా మమ్మల్ని శిక్షించి ప్రతిపక్షంలో కూర్చోబెట్టారు. కాబట్టి ఇప్పుడు మీరు సరిగా పరిపాలన చేయండి. ఇప్పుడు మేం ఏమంటున్నామంటే డిస్కంలు ప్రైవేటీకరణ చేయడం లేదని కుండ బద్దలు కొట్టినట్లుగా ముఖ్యమంత్రిగారో, మీరో ఒక స్టేట్‌మెంటు ఇవ్వండి. అదానీకి అప్పజెప్పము అని స్టేట్‌మెంటు ఇవ్వండి. అదానీకి బెదరము అనే స్టేట్‌మెంటు ఇవ్వండి. దాని గురించి అడిగితే ఎందుకు మాట్లాడటం లేదు, ఎందుకు భయపడుతున్నారు, ఎవరి కోసం భయపడుతున్నారు, మళ్లీ దాని మీద ఎదురుదాడి ఎందుకు అని అడుగుతున్నాను. దయచేసి నేను మిమ్మల్ని కోరేదేమంటే ఆనాడైనా ఈనాడైనా పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ విషయంలో we have abundant clarity.

ఇవ్వాళ ముఖ్యమంత్రిగారు మునిసిపల్ శాఖను కూడా చూస్తున్నారు. హైదరాబాదు మెట్రో విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని మేం అడిగినప్పటికీ ఎన్నడూ అక్కడి నుంచి మాకు సహకారం రాలేదు. రాకపోయినా ఆగకుండా మేం దాదాపుగా 415 కిలోమీటర్లకు ఎక్స్‌ప్యాన్షన్‌ను ప్లాన్ చేశాము. ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ మెట్రోకి నిజానికి టెండరు కూడా ఫైనల్ చేశాం, దానిని ఈ ప్రభుత్వం రద్దు చేసింది అది వారి ఇష్టం. భవిష్యత్తులో ప్రజలు అల్టిమేట్‌గా వారికి సమాధానం చెబుతారు. మేం ఎన్నో ప్రయత్నాలు చేసి కేంద్రం మాకు ఎన్ని ఆంక్షలు పెట్టినా, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు పెట్టినా గడచిన పది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రాన్ని బ్రహ్మాండంగా భారతదేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాం. కాని బాధ ఎక్కడ అనిపిస్తుందంటే కేంద్రమేమో డబ్బులు ఇవ్వకుండా సతాయిస్తుంది, మీరేమో ఇవ్వాళ రాష్ట్రంలో పదవుల్లో కూర్చొని ముఖ్యమంత్రిగా, మంత్రిగా ఉండి రాష్ట్రం మీద నిందలు వేసే విధంగా మాట్లాడితే అప్పు ఎక్కడ పుడుతది, కొత్త పెట్టుబడులు ఎక్కడి నుంచి వస్తాయని అడుగుతున్నాను. బ్రహ్మాండంగా ఉన్న రాష్ట్రం దివాళా తీసింది, ఇన్ని వేల కోట్ల రూపాయల అప్పు, ఇంత కడుతున్న, అంత కడుతున్న అని స్వయంగా ప్రభుత్వ పెద్దలే మాట్లాడితే మన రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడానికి ఎవరైనా వస్తారా అని అడుగుతున్నాను. దయచేసి నేను కోరేదేమంటే........

1.40 మ. **శ్రీ మల్లు భట్టి విక్రమార్క**:- అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వం నిన్న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ రాష్ట్రానికి చేసిన అన్యాయం గురించి మాట్లాడటానికి సిద్ధంగా లేరు వారు. వారు దానిగురించి మాట్లాడితే కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడ కోపం వస్తుందో, భారతీయ జనతా పార్టీకి ఎక్కడ కోపం వస్తుందో అని అసలు అంశాన్ని పక్కకు పెట్టి ఆవు కథ లాగా మళ్లీ మొదటికే వచ్చి ఈ చర్చను వదిలిపెట్టి మిగతావన్ని మాట్లాడుతున్నారు. వారికి నేను మూడుసార్లు విజ్ఞప్తి చేశాను. అయ్యా చర్చకు రండి, సబ్జెక్ట్ మీద మాట్లాడమని చెప్పాను. ఇదంతా వదిలివేసి చిన్నప్పటి ఆవు కథలాగా ఏది వచ్చినా మళ్లీ ఆవుకు నాలుగు కాళ్లు ఉండును, తోక ఉండును అన్నట్లు మళ్లీ ఆ పదేళ్లదే చెబుతున్నారు తప్ప, దీనిమీద మాత్రం మాట్లాడటానికి ఇష్టపడటం లేదు. అధ్యక్షా, మీద్వారా వారికి మరొక్కసారి విజ్ఞప్తి చేస్తున్నాను. వారికి నిజంగా రాష్ట్రప్రయోజనాలపైన ఏమాత్రం ప్రేమ ఉన్నా మాకు రాజకీయ ప్రయోజనాలు కాదు, రాష్ట్రప్రయోజనాలే మాకు ముఖ్యమైనవి, భారతీయ జనతా పార్టీతో మేము అంటకాగడం లేదు. మాకు, వారికి ఎటువంటి అండర్‌స్టాండింగ్ లేదు, చీకటి ఒప్పందం లేదు, రాష్ట్రప్రయోజనాలే మాకు ముఖ్యం, కేంద్ర బడ్జెట్‌లో వారు మనకు చేసిన అన్యాయాన్ని ఎండగడతాం, సభ ఏవిధంగా తీర్మానం చేసినా మేము సిద్ధంగా ఉన్నామని చెబుతామంటే చెప్పమనండి. లేదూ వారు చేసింది కరెక్టే వాళ్లతోపాటు మా పార్టీని కూడా అందులో విలీనం చేస్తామని చెప్పి దానిమీద మాట్లాడకుండా ఆవు కథని చెబుతానంటె ఎలా? కాబట్టి, దయచేసి ఇంకా ఎవరైనా సభ్యులు మిగిలి ఉంటే మాట్లాడాల్సిందిగా గౌరవ సభాపతి గారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్:- కె.టి. రామారావు గారు తొందరగా పూర్తి చేయండి. దయచేసి సబ్జెక్టే మాట్లాడండి.

శ్రీ కె. తారక రామారావు:- ఎందుకు సార్, వాళ్లకు భయం అవుతోందా? అదాని గురించి మాట్లాడితే భయం అవుతోందా? ఎవరి గురించి మాట్లాడితే అంతగనం భయం అవుతోంది. ఎందుకు భయపడుతున్నారు సార్, కన్క్లూడ్ ఎందుకు చేయాలి సార్? ఇంత ముఖ్యమైన అంశం. ఇంకా ఎంతమంది డిస్టర్బ్ చేస్తారు?

శ్రీ డి. శ్రీధర్ బాబు:- (మైకు లేకుండా) అదాని విషయంలో వేరే రూపంలో రండి సమాధానం చెబుతాము.

శ్రీ కె. తారక రామారావు:- అధ్యక్షా, నిజంగా వారి వ్యవహారం చూస్తే, వారు ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్లే ఉంది నాకైతే. గొంతులు చించుకోవడం, ఆగమాగం లేచి మాట్లాడటం. ముఖ్యమంత్రి గారు చాలా సమన్వయంతో ఉండాలి, వారే రన్నింగ్ కామెంట్రీ చేస్తున్నారు. కేవలం బడ్జెట్‌కి కన్ఫైన్ అయి మాట్లాడమని వారే అంటారు. ఏదో చీకటి ఒప్పందాలని ముఖ్యమంత్రి గారు మాట్లాడుతారు. విలీనాలని ఉప ముఖ్యమంత్రి గారు మాట్లాడుతారు. వారిద్దరికీ నేను ఈ వేదిక ద్వారా స్పష్టంగా చెబుతున్నాను. ఎలాంటి చీకటి ఒప్పందాలు చేసుకోవాల్సిన దౌర్భాగ్యం మాకు లేదు. ముమ్మాటికి తెలంగాణ ప్రజల పక్షానా ఇక్కడే ఉంటాం, గొంతు విప్పుతాం, వారిని అడుగడుగునా ఎండగడతాం. ఈరోజు కేంద్ర బడ్జెట్ మీద లేదంటే కెసిఆర్ ప్రభుత్వం మీద నెపం వేసి తప్పించుకోవాలని ఏదైతే ప్రభుత్వం ఒక డ్రామా చేస్తోందో, తప్పకుండా దీనిని ఎండగడతామనే మాటను విజ్ఞప్తి చేస్తున్నాను. ఆరు గ్యారంటీలు అమలయ్యే దాకా వదిలిపెట్టం, ప్రజల తరఫున అడుగుతూనే ఉంటాం, కడుగుతూనే ఉంటాం. ఆ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో వారు ఎలాంటి ఆలోచన చేయాల్సిన అవసరం లేదు.

అధ్యక్షా, కేంద్రం ఇవ్వలేదని చెప్పి, మేము ఆగలేదు. భారతదేశంలో ఉన్న పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం 2014లో తలసరి ఆదాయంలో 12వ స్థానంలో ఉండేది. మన రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోతే అప్పుడు మేము ఆగలేదు, తెలంగాణను తలసరి ఆదాయంలో నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దాం. ఇది రిజర్వ్ బ్యాంక్ లెక్క. అధ్యక్షా, మన రాష్ట్రాన్ని మనమే తిట్టుకుంటే బయట ఒక్క దమ్మిడి కూడా పుట్టదు, అది వారు ఆలోచించుకోవాలి. కెసిఆర్ మీద కోపం ఉంటే కెసిఆర్‌ను తిట్టవచ్చు, రాష్ట్రాన్ని తిడితే వారికే నష్టం, ఎందుకంటే రాష్ట్రాన్ని నడిపిస్తున్నది వారే. ఐదేళ్లు ఇబ్బంది పడేది వారే. ఈరోజు తెలంగాణ బిడ్డగా గర్వంగా చెబుతున్నాను. తెలంగాణ జనాభా భారతదేశంలో 2.8శాతం. కానీ, we contribute 5% to India's GDP. We are an economic engine like Sridhar Babu said. 2014లో మేము అధికారంలోకి వచ్చిన నాడు 4శాతం ఉంటే, 1శాతం జిడిపి కాంట్రిబ్యూషన్ పెంచాం. I would request my friend Sridhar Babu garu to correct himself. శ్రీధర్‌బాబు గారు మాట్లాడుతూ ఒక మాట అన్నారు. ఐదు ట్రిలియన్ ఎకానమీ, వికసిత్ భారత్, 2047 అని మాట్లాడారు. 2047 కాదు, ఐదు ట్రిలియన్ ఎకానమీ రాబోయే ఒకటి, ఒకటిన్నర సంవత్సరాల్లోనే అవుతుంది. అక్కడ ఎవరు ఉన్నా, లేకున్నా అవుతుంది. ఆ విషయాన్ని I want you to correct yourself. అధ్యక్షా, స్వంత పన్నుల రాబడిలో, భారతదేశంలో State Own Tax Revenues లో నెంబర్ వన్, నెంబర్ టు స్థానంలో తెలంగాణను నిలబెట్టింది మేము. పేదరిక నిర్మూలనలో, వ్యవసాయ విస్తరణలో తెలంగాణను అగ్రభాగాన నిలబెట్టాం. పంజాబ్, హర్యానాను తలదన్ని మూడున్నర కోట్ల వరి ధాన్యాన్ని పండించే స్థాయికి తీసుకొనిపోయాం. కేంద్ర ప్రభుత్వం చేతులు ఎత్తేసి నూకలు తినండనే పరిస్థితి కల్పించింది కూడా మేమనే మాట గుర్తు చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణను 1, 2, 3 స్థానాల్లో అగ్రభాగాన నిలబెట్టాం. అన్ని రంగాలకు 24గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తున్న ఒకే ఒక రాష్ట్రం తెలంగాణగా నిలబెట్టింది మేము. ఇప్పుడే వారు చెప్పారు. ఐటిఐఆర్‌కు సంబంధించి యూనియన్ బడ్జెట్‌లో లేదని చెప్పారు. అవును, I agree with my friend Sridhar Babu. ఐటిఐఆర్ ఇవ్వవలసిందే, పదేండ్లు అడిగాం మేము, కానీ వారు ఇవ్వలేదు. మీరు తెస్తామని మీ మ్యానిఫెస్టోలో పెట్టారు. ఎనిమిది మంది ఎంపీలను ప్రజలు మీకు కూడా ఇచ్చారు. తెస్తారా? చస్తారా? ప్రజలు

చూస్తారు. తప్పకుండా ప్రజలు మిమ్మల్ని కూడా వదిలిపెట్టరని నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

యూనియన్ బడ్జెట్ మీద ఇక్కడ గొంతు చించు కుంటే కాదు సార్. వారికి 99 మంది ఎంపీలు ఉన్నారు. పార్లమెంట్‌లో గళం విప్పమనండి, కొట్లాడమని చెప్పండి. రాజ్యసభలో మేము కూడా నలుగురం ఉన్నాం. కలిసి వస్తాం, తెలంగాణ ప్రజల ప్రయోజనాల విషయంలో కలిసి కొట్లాడుదాం. రాజీ లేదు. మా పార్టీ పుట్టిందే తెలంగాణ కోసం. మా పార్టీకి తెలంగాణ ప్రజల ప్రయోజనాలే పరమావధి. మా జెండా, మా ఎజెండా తెలంగాణనే. తప్పకుండా అది మారదు. వారు ఎన్ని కలలు కన్నా, ఎన్ని రకాల ఊహలు చేసుకున్నా, ముఖ్యమంత్రి గారికి ఎన్ని తప్పుడు ఇంటలిజెన్స్ రిపోర్ట్స్ వచ్చినా మేము ఎక్కడికి పోము. ఇక్కడనే ఉంటాం, నిలదీస్తూనే ఉంటాం. ఆరు గ్యారంటీలు అమలయ్యేదాకా వెంబడి పడతాం. పంద్రాగస్టు లోపల రుణమాఫీ అన్నారు. ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ అన్నారు. ఇంతవరకు ఏదీ లేదు. తప్పకుండా ఎండగడతాం. ఈరోజు ప్రభుత్వం ఈ తీర్మానాన్ని ఎందుకు పెట్టిందో, ఈ చర్చ ఎందుకు తీసుకువచ్చిందో మాకు తెలుసు.

మిస్టర్ స్పీకర్:-శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు..

(బీఆర్ఎస్ సభ్యుల నుండి అంతరాయం)

చర్చ ఎందుకు పెట్టుకున్నారు? చర్చలో ఏమి మాట్లాడాలి, ప్రభుత్వం మీద దుమ్మెత్తిపోయడానికి చర్చనా? లేకుంటే, యూనియన్ బడ్జెట్ మీద చర్చనా? యూనియన్ బడ్జెట్‌పై మాట్లాడండి. యూనియన్ బడ్జెట్‌పై మాట్లాడే మంచి అవకాశం దొరికింది. దానిని వదిలేసి పది సంవత్సరాల చరిత్రను చెబితే ఎలా సార్ మీరు? మీకు మళ్లీ ఇంకోసారి అవకాశం ఇస్తాను. అదాని, అంబాని చర్చ, పది సంవత్సరాలది మొత్తం మాట్లాడండి అప్పుడు.

శ్రీ కె. తారక రామారావు:-అధ్యక్షా, ఇది చాలా ఆశ్చర్యంగా ఉంది. తప్పకుండా చెబుతాము. గుజరాత్ మోడల్ చెబుతాము. చోటేబాయ్, బడేబాయ్‌ల గురించి చెబుతాము. అదాని గురించి చెబుతాము, అన్నింటి గురించి చెబుతాము. అధ్యక్షా, మా నిబద్ధతను ప్రశ్నించినప్పుడు, ముఖ్యమంత్రి గారు అడ్డగోలుగా మాట్లాడినప్పుడు తప్పకుండా సమాధానం చెప్పాల్సిన బాధ్యత మామీద ఉంటుంది. వారు సబ్జెక్ట్‌లో ఉంటే, మేము కూడా సబ్జెక్ట్‌లో ఉంటాం. వారు దాటితే, మేము కూడా దాటాలి కదా సార్.

అధ్యక్షా, ఒకటి మాత్రం వాస్తవం. మీరు చాలా గొప్పగా చెప్పారు. యూనియన్ బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం చర్చ. ఈ చర్చ ఎక్కడ జరగాలి సార్? కేంద్రంలో, పార్లమెంట్‌లో అక్కడ కాంగ్రెస్ ఎంపీలు గొంతు విప్పాలి, కొట్లాడాలి. లోక్‌సభలో మాకు ఎంపీలు లేరు, వారికి ఉన్నారు. నిన్న పంజాబ్ ఎంపీలు అక్కడ రోడ్డు ఎక్కారు. కేంద్ర బడ్జెట్‌లో పంజాబ్‌కి అన్యాయం జరిగిందని పంజాబ్ ఎంపీలు రోడ్డు ఎక్కారు. ఈరోజు ఇక్కడ వారు ఎందుకు పెట్టారో మాకు తెలియదా? అక్కడినుండి ఒక్క పైసా రాలేదు కాబట్టి, 21 ట్రిప్పులు వృథా అయినవి కాబట్టి, విమానం ఖర్చులు వృథా అయ్యాయి కాబట్టి, ముఖం చెల్లక, ప్రజలకి ఏమి సమాధానం చెప్పుకోవాలో తెలియక ఈరోజు ఇక్కడ చర్చ పెట్టి ఒక ప్రహసనం లాగా చేస్తున్న విషయం మాకు తెలియదా సార్, ప్రజలకు తెలియదా? మేము అనేది ఒక్కటే. బడేబాయ్, చోటేబాయ్ అనే అన్నదమ్ముల అనుబంధం పండిస్తే ఏమి వచ్చింది సార్ రాష్ట్రానికి? మేము చెప్పింది అదే కదా. మొదటినుండి చెబుతున్నది అదే కదా.

ప్రభుత్వాన్ని ఒకటే కోరుతున్నాను. మన రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం విషయంలో వారు దీనిని ఏ రకంగా ముందుకు తీసుకొని పోదామంటే, ఆ రకంగా మేము మీకు తప్పకుండా అండగా నిలబడతాం. మేము మీతో కలిసి వస్తాం. మీరు గతంలో రాలేదు. వారు పార్లమెంట్‌లో ఆనాడు తెలంగాణకు అనుకూలంగా మాట్లాడలేదు. రాజ్‌భవన్‌ని అడ్డం పెట్టుకొని మమ్మల్ని ఇబ్బంది పెడితే వారు వాళ్లకి అండగా నిలబడ్డారు తప్ప, తెలంగాణ రాష్ట్రానికి, తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు అండగా నిలబడలేదు. కానీ, మేము అట్లా చెయ్యం.

వందకు వందశాతం తెలంగాణ ప్రజల ప్రయోజనాలే పరమావధిగా మేము నిలబడతాం. భవిష్యత్తులో కూడా నాలుగు కోట్ల ప్రజల తరఫున కొట్లాడతామని మరొకసారి విజ్ఞప్తి చేస్తూ ఈ అవకాశం ఇచ్చిన తమరికి ధన్యవాదాలు. జై తెలంగాణ!

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి:- అధ్యక్షా, ఒక మంచి ఉద్దేశంతో తెలంగాణ ప్రజల తరఫున ఈ సభ ఏకాభిప్రాయంతో మన హక్కులను సాధించుకోవడానికి, మన ప్రాజెక్టుల అనుమతులు సాధించుకోవడానికి, మన నిధులు రాబట్టుకోవడానికి ఒక మంచి సాంప్రదాయాన్ని నెలకొల్పడానికి చర్చ ప్రారంభించాం. అవసరమైన మేరకు ప్రతిపక్షాల సభ్యులు మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని తమరిని అనుమతి అడిగాం. తమరు కూడా పెద్ద మనసుతో ఈ చర్చకు అనుమతించారు. అయితే, ఈ చర్చను దుర్వినియోగం చేసి, సత్య దూరమైన అంశాలను ఇక్కడ ప్రస్తావించి, చేసిన పాపాలన్నింటినీ కప్పి పుచ్చుకోవడానికి వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయి అన్ని మాఫీ అయ్యాయని వెనకటికి చెప్పినట్లుగా వారి ప్రసంగాన్ని చూస్తే అర్థం అవుతుంది. వారేదో వీరోచితంగా పోరాటాలు చేసినట్లు, ఆ పోరాటాలతో ఢిల్లీ దద్దరిల్లినట్లు తద్వారా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిని ఎక్కడికో ఆకాశంలోకి తీసుకువెళ్లినట్లుగా ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు.

ఈ సభలో రికార్డ్స్‌ని సవరించాల్సిన బాధ్యత సభా నాయకుడిగా నామీద ఉంది. వారు చెప్పిన సత్య దూరమైన వార్తలతోపాటు కొన్ని సత్యాలను ఈ సభలో ప్రస్తావించాల్సిన బాధ్యత నామీద ఉన్నది.

1.50 మ.

2014 నుండి 2021 వరకు ఎన్డీఏ ప్రభుత్వానికి/మోడీ గారి ప్రభుత్వానికి రాజ్యసభలో మెజారిటీ లేదు. అంటే, ఒక బిల్లుని తీసుకొచ్చినా, ఏ అంశాన్ని ప్రస్తావనకు తీసుకువచ్చినా, రాజ్యసభలో ఆమోదం పొందాలి అనంటే, ఇటు లోక్‌సభలో గానీ అటు రాజ్యసభలో గానీ ఆనాటి ప్రభుత్వం, వారి ఆరాధ్య దైవమని చెప్పుకునేటువంటి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు పదే పదే మోడీ గారి ప్రభుత్వానికి ఏవిధంగా ఊడిగం చేశారో కొన్ని అంశాలను ప్రస్తావించదలచుకున్నాను.

(ఊడిగం చేయడమేమిటంటూ బీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుండి అభ్యంతరం)

జీఎస్టీ బిల్లును తీసుకొచ్చినప్పుడు, ఏప్రిల్ 5 నాడు జీఎస్టీ బిల్లును ఆమోదించిన వెంటనే భారత దేశంలో ఎన్నో బిజెపి ప్రభుత్వాలున్నా, ఆ బిజెపి ప్రభుత్వాల ముఖ్యమంత్రుల కంటే ముందు ఏప్రిల్ 9వ తారీఖు నాడు అత్యవసరంగా శాసనసభ సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఇంత అద్భుతమైన జీఎస్టీ బిల్లును నరేంద్ర మోడీ గారు తీసుకువచ్చారు, నరేంద్ర మోడీ గారు తీసుకువచ్చిన జీఎస్టీ బిల్లుకు మేము సంపూర్ణంగా మద్దతు తెలుపుతున్నాం అన్నారు. ఇదే కాకుండా వారు ఆరోజు ఏమి చెప్పారంటే.., ఈ బిల్లుల మీద మోడీ గారిని ప్రశ్నించడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తే... ఆరోజు ఇక్కడ కూర్చున్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారేమన్నారంటే, ప్రధానమంత్రిని నిలదీసినట్లుగా ఈ సభలో మాట్లాడుతారా, మీరు మాట్లాడడానికే లేదంటూ కాంగ్రెస్ సభ్యులను దబాయించి, అక్కడ రాజ్యసభలోనూ లోక్‌సభలోనూ జీఎస్టీ బిల్లుకు 100% మద్దతు పలకడమే కాకుండా, ప్రత్యేక శాసనసభ సమావేశాలు ఏర్పాటు చేసి సంపూర్ణంగా నరేంద్ర మోడీ గారికి మద్దతు తెలికారు. ఇది పాయింట్ నెంబర్ వన్.

అదే విధంగా 2018 జూలై 21 నాడు మోడీగారి కేంద్ర ప్రభుత్వం మీద కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు, ప్రతిపక్ష పార్టీలన్నీ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఉంటే, ఆ అవిశ్వాస తీర్మానంలో ఆనాడు ప్రతిపక్షాలకు మద్దతివ్వకుండా, మోడీ గారికి మద్దతు ఇచ్చేందుకు వీళ్ళు ఓటింగ్‌లో పాల్గొనకుండా వాకౌట్ చేసి బయటికి వెళ్ళిపోయారు. అంటే, వాకౌట్ చేయడం కూడా మోడీ గారికి మద్దతుగా ఆ ప్రభుత్వాన్ని నిలబెట్టడం కొరకు చేశారు.

అదే విధంగా రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్. ఈ దేశంలో పారదర్శకమైన పరిపాలన అందించడానికి ఆనాటి యు.పి.ఎ. ప్రభుత్వంలోని మన్మోహన్‌సింగ్ గారు ప్రవేశపెట్టిన

ఆర్.టి.ఐ.యాక్టుకు తూట్లు పొడవడానికి 2019 జులైలో ప్రవేశపెట్టిన సవరణ బిల్లుకు, రాజ్యసభలో వారికి మెజారిటీ లేకపోతే, రాజ్యసభలో మొత్తం 240 మంది సభ్యులకు గాను, బిజెపికి 113 సభ్యులు మాత్రమే ఉంటే, ఆ బిల్లును ఆమోదించేందుకు, ఆనాటి టీఆర్ఎస్ పార్టీ సభ్యులైన జోగినిపల్లి సంతోష్‌కుమార్ గారు ప్రత్యేక విమానమేసుకొని, రాజ్యసభలో పాల్గొని ఆర్.టి.ఐ. సవరణ బిల్లుకి ఓటు వేసిన మాట వాస్తవం కాదా. టీఆర్ఎస్ పార్టీ సభ్యుడు ప్రత్యేక విమానంలో వెళ్ళి అక్కడ నరేంద్ర మోడీ గారికి మద్దతు పలకడమనేది, ఆ పార్టీ అధ్యక్షుడు, ఆనాటి ముఖ్యమంత్రి అయినటువంటి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి అనుమతి లేకుండా చేయగలడా ఆ సాహసం? అప్పుడే మీరు దీన్ని మరచిపోయారా?

అదే విధంగా నోట్ల రద్దు. నోట్ల రద్దు అనేది ఈ దేశంలో ఉండే చిరు వ్యాపారుల జీవితాలతో చెలగాటమాడింది. నోట్ల రద్దుని కాంగ్రెస్ పార్టీ సంపూర్ణంగా తప్పుపడితే, 2016 డిసెంబర్ 16 నాడు నోట్ల రద్దుని స్వాగతిస్తున్నట్లు ఇదే అసెంబ్లీలో చంద్రశేఖర్ రావు గారు తీర్మానాన్ని ప్రవేశపెట్టి, ఇది అద్భుతం, ఈ నోట్ల రద్దుతో ఈ దేశంలో సమూలమైన మార్పులు తీసుకువస్తారు... అంటూ ఇంకా వారేమన్నారంటే, ఈ నోట్ల రద్దుతో పూర్తిగా మార్పులు జరుగుతాయి, ఎప్పటి నుండో ఇలాంటి గొప్ప గొప్ప మార్పులు నేను తీసుకురావాలనుకుంటున్నాను, దీని ద్వారా మొత్తం వ్యాపారాలన్నీ కూడా బాగుపడతాయన్నారు. కానీ, చివరకు ఏమైంది, దేశంలో ఈ నోట్ల రద్దుతో 2% జి.డి.పి. తగ్గిపోయింది. దానితో దాదాపుగా మూడు నుండి మూడున్నర లక్షల కోట్ల రూపాయల నష్టం జరిగిందని నిపుణులు నివేదికలిచ్చారు. ఆ నోట్ల రద్దుకు మద్దతు పలికిందే వీళ్ళు అధ్యక్షా. ఇదే సభలో తీర్మానం చేసి, గొప్ప నిర్ణయమని పొగడ్తలతో ముంచెత్తారు.

ఇదే కాదు. 2017లో రాష్ట్రపతి ఎన్నికలు జరిగాయి. ఆనాటి బిజెపి అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్ గారికి వీళ్ళందరూ లైన్‌లో నుంచొని ఓట్లేశారు.

శ్రీ కె. తారక రామారావు:- (మైకు లేకుండా) ఎస్..., ఎస్..

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి:- అదే విధంగా ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు గారికి అండగా నిలబడి లైన్లో నుంచొని బిజెపికి ఓట్లేసింది వీళ్ళే. ఎన్నికల్లో కూడా బిజెపికి అనుకూలంగా ఓట్లేసి, ఆనాటి నుంచి ఈనాటి వరకు పోరాటాలు చేస్తున్నామంటూ ఈరోజు ఈ సభనూ, ఈ సభ ద్వారా ప్రజలనీ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు.

అదే విధంగా ఆర్టికల్ 370ని రద్దు చేసిన రోజు ఆ సభలో నేను సాక్షిని. ఆర్టికల్ 370 రద్దులో పూర్తిగా నరేంద్ర మోడీగారి కేంద్ర ప్రభుత్వానికి వీళ్ళు మద్దతు పలికారు. ఇదే కాదు, ట్రిపుల్ తలాఖ్ విషయంలో కూడా 2019 జూలై 30 నాడు రాజ్యసభలో జరిగిన చర్చలో, ఓటింగ్‌లో పాల్గొనకుండా బయట కూర్చుని, వీళ్ళు ట్రిపుల్ తలాఖ్‌కు సంపూర్ణంగా మద్దతు పలికి, పాస్ చేయించారు.

అదే విధంగా అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల సవరణ బిల్లు. 2019 ఆగస్టు సమావేశాల్లో ప్రవేశపెట్టిన అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల సవరణ బిల్లులో డ్యామ్ సేఫ్టీ బిల్లుకు కూడా బీఆర్ఎస్ స్పష్టంగా మోడీకి మద్దతు తెలిపింది. అదే విధంగా రాజ్యసభ డెప్యూటీ ఛైర్మన్ ఎన్నికకు సంబంధించి 2018 ఆగస్టులో బిజెపి ఎన్డీఏ అభ్యర్థి అయిన జెడియు ఎంపీ హరివంశ్‌నారాయణ్‌సింగ్‌కు బీఆర్ఎస్ పార్టీ స్పష్టంగా మద్దతు పలికింది. అదే విధంగా విపక్షాల ఉమ్మడి అభ్యర్థి కాంగ్రెస్ ఎంపీ హరి ప్రసాద్ మీద 20 ఓట్ల తేడాతో... అంటే ఆరోజు వాళ్ళు పూర్తిగా ఉమ్మడి ప్రతిపక్షాల అభ్యర్థిని ఓడించడానికి బిజెపికి మద్దతు పలికారు. ఎన్నికల్లో బిజెపికి ఒకసారి ఓట్లేశారు, ఇదే రాజ్యసభలో మిగతా విషయాలలో గైరుహాజరయ్యారు.

అదే విధంగా సాగు చట్టాలు. ఇప్పుడు వారు చట్టాల గురించి తీర్మానమంటున్నారు. పార్లమెంటు ప్రొసీడింగ్స్ ఒకసారి చూద్దాం. 2020 డిసెంబరు 27 నాడు ప్రగతి భవన్‌లో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో కేంద్రం తీసుకొచ్చిన సాగు చట్టాలను కేసీఆర్ గారు స్వాగతించారు.

(బీఆర్ఎస్ పార్టీ నుండి 'నో, నో' అంటూ అభ్యంతరాలు)

మీరు కావాలంటే ఆనాటి పేపర్లన్నింటినీ ఒకసారి తిరగేయండి. అధ్యక్షా, ఆరోజు వారు మాట్లాడిందేమంటే, పంటలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం వ్యాపార సంస్థ కాదు. రైస్ మిల్లరో, దాల్ మిల్లరో అసలే కాదు. కొనుగోలు అమ్మకాల బాధ్యత ప్రభుత్వ బాధ్యత కాదు. మద్దతు ధరతో కొనుగోళ్ళు జరుపడం ద్వారా రాష్ట్రప్రభుత్వానికి రూ. 7500 కోట్ల రూపాయల నష్టం వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త వ్యవసాయ చట్టాలు ఇదే చెప్తున్నాయి. ఈ విధానం ఉత్తమమని చంద్రశేఖర్ రావు గారు రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు మద్ధతుగా మాట్లాడారు. ఆనాటి పేపర్లు తీసి మీరు తిరగేయండి, వారు ఏ రకంగా మద్ధతు పలికారో మనకు తెలుస్తుంది.

అధ్యక్షా, ఇవన్నీ కాదు, చివరగా రెండు విషయాలు నేను ప్రస్తావించదలచుకున్నాను. 2016 ఆగస్టు 7 నాడు మిషన్ భగీరథ కార్యక్రమం ప్రారంభోత్సవం కోసం మెదక్ జిల్లా కోమటిబండకు ప్రధాన మంత్రి గారు వచ్చారు. మీరు ఒక్కసారి ఆ రికార్డులు తిరగేయండి. సభా సమయంలో అత్యంత కీలకమైన అంశాల గురించి చర్చించవలసిన అవసరముంది కాబట్టి, నేను తెలుగులో సింపుల్‌గా చెప్పదలచుకున్నాను. అక్కడ ఆనాటి మన రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ఏం మాట్లాడారంటే, నేను బాధ్యత గల తెలంగాణ ముఖ్యమంత్రిని. మాకు కేంద్రం నుండి రూ.50 వేల కోట్లు కావాలి, లక్ష కోట్లు కావాలని మేము కోరబోము. మాకు మీ ప్రేమ, మీ ఆశీర్వాదం ఉంటే చాలు. హమ్ కో కుఛ్ భీ నహీ చాహియె, ఆప్ కా ప్యార్ చాహియె అని ఆయన ప్రేమలో మునిగి, తేలి, తెలంగాణను నిండా ముంచి, తెలంగాణకు రూ.50 వేల కోట్లు, లక్షకోట్లు వద్దే వద్దని స్పష్టంగా వేదిక మీద కోట్లాది ప్రజల ముందు మాట్లాడి, ప్రధాన మంత్రి నరేంద్రమోడీ గారికి మా తెలంగాణకు నిధులే వద్దు, నువ్వు నన్ను ప్రేమిస్తే చాలు, మీ ప్రేమలో మేము అమరులమైపోతాము, తెలంగాణ ప్రజలను ముంచేస్తామని మాట్లాడిన చంద్రశేఖర్ రావు గారి పార్టీ.., ఈరోజు చంద్రశేఖర్ రావు గారు సభలోకి రాక తెలంగాణ ప్రజల హక్కులను కాలరాసి, తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని మోడీ గారికి తాకట్టు పెట్టి, ఈరోజు వచ్చి కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని మాట్లాడడం.. ఇవాళ ఉదయం 11 గంటల నుంచి పార్లమెంటు మెట్ల మీద తెలంగాణకు ఇవ్వని నిధుల మీద, రాని అనుమతుల మీద కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ గారు, సోనియా గాంధీ గారు, మల్లిఖార్జున ఖర్గే గార్లు మా ఎంపీలతో అక్కడ దీక్షచేస్తున్నారు. నీ రాజ్యసభ ఎంపీలు ఎక్కడున్నరో ఒక్కసారి లెక్క పెట్టుకో.

2.00 మ. విలీనం కోసం ఇల్లిల్లూ తిరిగి చీకట్లో అందరినీ కలిసొచ్చి, కౌగిలించుకునే ప్రయత్నం చేసి, అన్ని వ్యవహారాలు చేసి వచ్చి, ఇప్పుడు సభలో అసలు విషయం పక్కదారిన పెట్టి, రాజకీయ వివాదాస్పద అంశాల మీద చర్చలు చేసి, అదానీ, అంబానీలతో చీకట్లో కుమ్మక్కయ్యే అలవాటు మాకు లేదు. కాంగ్రెస్ పార్టీ వ్యక్తిత్వ విధానం గురించి ఆల్రెడీ మా మంత్రిగారు చెప్పారు. గత పదేండ్లలో తెలంగాణకు పాలసీనే లేదు. స్పష్టంగా తెలంగాణ రాష్ట్రానికి ఏ విధంగా విద్యుత్తు పాలసీని తీసుకురాబోతుందో సభలో చర్చ పెట్టమని స్పష్టంగా చెప్పాము. ఒక సంస్థను ప్రైవేటైజ్ చేయాలంటే దానికి నోటిఫికేషన్‌ను ఇవ్వకుండా పబ్లిక్‌లో చర్చ చేయకుండా, ప్రభుత్వం అధికారికంగా నిర్ణయాలు తీసుకోకుండా జరుగుతుందా అధ్యక్షా? గాలివాటం వార్తలను పట్టుకువచ్చి ఇక్కడ మాట్లాడి, గాలి మాటలు మాట్లాడడానికా ఈ సభ పెట్టుకున్నది? మీరు వారికి అనుమతినిచ్చింది, ఇట్లాంటి మాటలు మాట్లాడడానికా? కాబట్టి ఒకరోజు మీరు.., మేము ఎవరము? ఏ అంశాల మీద 18 సార్లు మేము తిరిగి, ఇవాళ 14 వేల కోట్ల రూపాయల మిగులు రాష్ట్రాన్ని మీకు అప్పజెప్పినాం. ఆనాడు సంవత్సరానికి 6500 కోట్ల రూపాయలు అప్పు చెల్లించే పరిస్థితి ఉన్నది. సరిగ్గా పది సంవత్సరాలు తిరిగే వరకు ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి, ప్రతి నెల 6500 కోట్ల రూపాయలు, దాదాపుగా 70 వేల కోట్ల రూపాయలు మీరు చేసిన అప్పులకు మిత్తీలు కట్టీ, కట్టీ ఈరోజు నడుము వంగిపోయే పరిస్థితిలో రాష్ట్రం ఉంటే, ఆ నిజాలు చెప్పొద్దంటున్నారు. లోపల క్యాన్సర్ ఉండాలి, ఎయిడ్స్ ఉండాలి కానీ, ఎర్రగా, బుర్రగా ఉన్న నాకు పిల్లనివ్వండి పెండ్లి చేసుకుంటా అని అబద్దాలు చెప్పి ముంచాలని వారు సూచనలు చేస్తున్నారు.

(ట్రెజరీ బెంచీ సభ్యుల నుండి హర్షధ్వానాలు)

రాష్ట్రం దివాళా తీసింది. దివాళా తీయడానికి అసమర్థమైన పది సంవత్సరాల పరిపాలన. విద్యుత్తు శాఖ దివాళా తీసింది. 88000 కోట్ల రూపాయల అప్పులు కాకుండా, సింగరేణికి బకాయిలు వారు అట్లనే పెట్టినారు. ప్రైవేటు కంపెనీలల్లో ఎక్కడ తెచ్చిన అప్పులు అక్కడే ఉన్నాయి. కాళేశ్వరం కట్టినామన్నారు, మేడిగడ్డ కుప్పకూలిపోయింది.

(బీఆర్ఎస్ సభ్యులచే సభకు అంతరాయం)

ఇవాళ ఆ ప్రాజెక్టులకు తెచ్చిన అప్పులు అట్లనే ఉన్నాయి. కాంట్రాక్టర్లకు పెండింగ్ పెట్టి పోయిన వేల కోట్ల రూపాయలు అట్లనే ఉన్నాయి. ఇట్లా ప్రతి శాఖలో.....ఎఫ్.సి.ఐ.లో 2014-2015లో మేము సరఫరా చేసినామన్నది ఇప్పటి వరకూ వసూలు చేయలేదు. మా సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డిగారు కష్టపడి మీరు చేసిన తప్పులను సవరించి, ఆ నిధులను రాబట్టడానికి ప్రయత్నం చేస్తున్నారు. వీళ్ళు ప్రతిసారి వచ్చినప్పుడల్లా జి.డి.పి. గురించి, మిగతా విషయాలన్నింటి గురించి మాట్లాడుతున్నారు. నేను తప్పకుండా ఈ బడ్జెట్ సమావేశాలల్లో ఉన్న వివరాలన్నింటినీ తీసుకువచ్చి బయటపెడ్తాను. కాబట్టి, వారికి నేను చేసే సూచన ఒకటే. మీరేమి చేసినారో చూసిన తరువాతనే ప్రజలు ఒక తీర్పునిచ్చారు. ఆ తీర్పు ద్వారానైనా మీకు జ్ఞానోదయం కలుగుతుందని ప్రజలు భావించారు. ఇంకా అదే అహంకారం, అదే అహంభావం, అవే చులకన మాటలు, ఎదురుగా ఉన్న వాళ్ళని కించపరిచే విధంగా మాట్లాడడం, ఈ వ్యవహారాన్ని మానుకోండి. అసెంబ్లీ ఎన్నికలలో 39 సీట్లలో మీకు మెజారిటీ ఇచ్చారు, పార్లమెంటుకు వచ్చేవరకల్లా 3 సీట్లకు పడిపోయారు. ఇప్పటివరకు ఊకదంపుడు ఉపన్యాసాలు చేసిన ఆయన శాసన సభ నియోజకవర్గంలో కూడా మెజారిటీ రాలేదు అధ్యక్షా.

(బీఆర్ఎస్ సభ్యులచే అంతరాయం)

ఆ ఓట్లు ఎక్కడ బదిలీ అయ్యాయని నేను అడుగుతున్నాను. అసెంబ్లీలో 39 సీట్లలో మెజారిటీ వస్తే, పార్లమెంటుకు వచ్చే వరకల్లా 3 మాత్రమే మిగిలాయి. మూడిట్లల్లో ప్రక్కనే ఉన్న దుబ్బాక మిత్రుడు కష్టపడి ఓట్లు వేయించినట్లున్నారు. సిరిసిల్లలో కూడా మెజారిటీ కోల్పోయింది. మాట్లాడే ముందు ఆ లెక్కలు చూసుకోవాలి. మాకు 2014లో రెండు ఎంపీ సీట్లు వచ్చినాయి, 2019లో 3 సీట్లు వచ్చినాయి, 2024లో మాకు 8 సీట్లు వచ్చినాయి. అంటే, ప్రజలల్లో ఉండి మేము పని చేయడంతో వరుసగా మేము నెంబరు పెంచుకుంటూ వచ్చాం. మీకు మొదటిసారి 12 వచ్చినాయి, రెండవసారి 9 వచ్చినాయి, మూడవ సారి గుండు సున్నా వచ్చింది. గుండు సున్నా వచ్చినాక కూడా బుద్ధి మారకపోతే ఎట్లా అధ్యక్షా? ఇప్పటికైనా విధానాన్ని మార్చుకోండి, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పండి, మీరు చేసిన దోపిడీ, మీరు చేసిన తప్పుడు విధానాల వల్ల ప్రజలు మిమ్మల్ని శిక్షించారు, దాని నుంచైనా మీరు గుణపాఠం నేర్చుకొని, పద్ధతి మార్చుకొని తెలంగాణ ప్రజల యొక్క హక్కుల కోసం ముందుకు రావలసిందిగా వారికి సూచన చేస్తున్నాను అధ్యక్షా.

మిస్టర్ స్పీకర్:- మహేశ్వర్ రెడ్డిగారు...

(బీఆర్ఎస్ సభ్యుల నుండి అంతరాయం)

(సభ్యులు మహేశ్వర్ రెడ్డిగారికి మాట్లాడేందుకు అవకాశమివ్వగా పలువురు బీఆర్ఎస్ సభ్యులు సభకు అంతరాయం కలిగించారు.)

ఏం ప్రాక్టీస్ ఇది. ఒక్కొక్కరు ఐదు, ఆరు సార్లు గెలిచిన సీనియర్ సభ్యులు. మీరు చెప్పిన దానికి సభా నాయకుడు సమాధానం ఇచ్చారు. దానికి కూడా సమాధానం చెబుతారా మీరు? ప్రశాంత్ రెడ్డిగారు ఈ ప్రాక్టీస్ మంచిది కాదు. మీరు చాలా సీనియర్ శాసన సభ్యులు.

(ప్రతి పక్ష సభ్యుల నుండి అంతరాయం కొనసాగింపు)

కేటీఆర్‌గారు ప్లీజ్....

(పలువురు ప్రతిపక్ష సభ్యులు వెల్ వద్దకు వచ్చేందుకు ప్రయత్నించగా...)

వెల్ వద్దకు రావద్దు. మీరు కూడా సీనియర్ శాసన సభ్యులు, మాజీ మంత్రిగా పని చేశారు.

(సభకు అంతరాయం కలిగిస్తూ, ముఖ్యమంత్రిగారు చెప్పిన వాటికి స్పందించే అవకాశమివ్వవలసిందిగా పలువురు బీఆర్ఎస్ సభ్యులు సభాపతిని కోరడంతో సభ్యులు కేటీఆర్ గారికి మాట్లాడే అవకాశం ఇచ్చారు.)

శ్రీ కె. తారక రామారావు:- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు మాట్లాడిన విధానం రాష్ట్ర ప్రజలని, మొత్తం సభని తప్పుదోవ పట్టించే విధంగా, చాలా దుర్మార్గంగా మాట్లాడారు. బీఆర్ఎస్ ఎంపీలు ఫార్మ్ బిల్స్‌కి మద్దతుగా నిలబడ్డారు, ఓటు వేశారని చాలా అన్యాయంగా మాట్లాడారు. రామ్‌నాథ్ కోవింద్ గారి ఎలక్షన్ గురించి చెప్పారు. అవును, మేము ఏది చేసినా బాజాప్తాగ చేశాము. ఒక దళితుడు రాష్ట్రపతి అవుతున్నాడంటే మేము అండగా నిలబడ్డాం, yes, బరాబర్ ఓటు వేశాం. ఉప రాష్ట్రపతిగా ఒక తెలుగు బిడ్డ వెంకయ్య నాయుడు గారు అవుతున్నా డంటే, yes, అండగా నిలబడ్డాం, ఓటు వేశాం. కానీ, తదుపరి మరొకసారి ఇంకొకరిని పెడితే మేము ఉల్టా యశ్వంత్ సిన్హాగారిని రాష్ట్రపతి క్యాండిడేట్‌గా పెట్టాం. మేము మద్దతు ఇవ్వడమే కాదు, నేను పోయి రాహుల్ గాంధీగారి పక్కన కూర్చొని పార్లమెంటులో మా పార్టీతరఫున నేను సంతకం చేశాను. వారు ఈ రకంగా మిస్లీడ్ చేయడం తప్పు. ఫార్మ్ బిల్స్‌కు మేము మద్దతు ఇవ్వలేదు. (పార్లమెంటులో ఎంపీల నిరసన ఫొటోను చూపిస్తూ) వాటిని రాజ్యసభలో వ్యతిరేకించాము. ఆ విషయంలో గట్టిగా కొట్లాడాము. అందులో అనుమానం అవసరం లేదు. ఇంకా విలీనాలు, చీకటి ఒప్పందాలు అని ముఖ్యమంత్రి గారన్నారు. రేవంత్ రెడ్డిగారికి నేనొక్కటే చెబుతున్నాను, మాకు చీకటి స్నేహాలు అలవాటు లేవు. రేవంత్ రెడ్డిగారికి ఉన్నాయి అధ్యక్షా. ఢిల్లీలో బి.జె.పి. వాళ్ళతో స్నేహం చేయడం, ఇప్పటికీ ఆయన పనులన్నీ బి.జె.పి. వ్యక్తులే చేస్తారు. (మైక్ కట్ చేయబోగా) అధ్యక్షా, కంక్లూడ్ చేస్తున్నాను...ఆయన ఎట్లంటే అలా మాట్లడవచ్చా అధ్యక్షా. ఎన్ని మాట్లాడారు సార్. నేననేది ఒక్కటే, కేసీఆర్‌గారి మీద ఆయన ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. నేనొకటే అంటున్నాను. ఒకటి, విలీనం చేయడానికి మేమేమి రేవంత్ రెడ్డిగారి లాగా పరాన్నజీవులం కాదు. వారు పదవుల కోసం పార్టీలు మారారు. మేము అలా కాదు. తెలంగాణ కోసం పదవులు వదులుకున్నాం. ఒకసారి కాదు, వంద సార్లు రాజీనామాలు చేశాం. ఇంకొక్క మాట అధ్యక్షా, ఇవాళ బి.జె.పి. వాళ్ళతో చీకటి స్నేహం ఎవరు చేస్తున్నారు? ఎందుకు మోడీగారి పేరు తీసుకోడానికి కూడా భయపడుతున్నారు? ముఖ్యమంత్రిగారు కేసీఆర్‌గారి పేరు చెప్పకపోతే బ్రతుకుతెరువు లేదా? మోడీగారి పేరు తీయడానికి కూడా ఎందుకు ముఖ్యమంత్రి భయపడుతున్నాడు? అందుకే వారు నోటికి వచ్చినట్లు మాట్లాడితే కాదు. తప్పకుండా రాష్ట్ర ప్రజలకు వారు సమాధానం చెప్పాలి. 8 ఎంపీలున్నా తెచ్చింది గుండుసున్నా. ఆరు గ్యారెంటీలు ఎత్తేయడానికి గత ప్రభుత్వం మీద బద్నాం చేయడం రాష్ట్రం దివాలా తీసిందనడం తీవ్రంగా ఖండిస్తున్నాం.

(ప్రతిపక్ష పార్టీ సభ్యుల నుండి అంతరాయం)

2.10 మ. **శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి**:- ధన్యవాదాలు అధ్యక్షా.

(అంతరాయం)

మిస్టర్ స్పీకర్:- సభానాయకుడు గురించి ఆ విధంగా మాట్లాడటం పొరపాటు. నేను మీకు అవకాశం ఎందుకిచ్చానంటే, మీరు జవాబు చెపుతారని ఇచ్చాను కానీ, మీరు జవాబు చెప్పడం లేదు.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- అధ్యక్షా..

(అంతరాయం)

మిస్టర్ స్పీకర్:- డెప్యూటీ సిఎం గారూ..

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ద్వారా ఈ రాష్ట్రానికి జరిగిన నష్టం పైన చర్చ పెట్టి ఒక తీర్మానం ప్రవేశపెట్టాము. ఆ డిమాండ్స్ పై చర్చ చేసేటప్పుడైనా తెలంగాణ రాష్ట్రానికి ప్రయోజనం చేకూరేలా ఒక తీర్మానం చేసి పంపించాలనే ఆలోచనతో చర్చకు పెట్టాము. ఆ చర్చపై వాళ్ళు మాట్లాడతారేమోనని చూస్తే ఎంతసేపటికీ ఆ సబ్జెక్టు కాకుండా మిగతావన్నీ మాట్లాడుతున్నారు.

ముఖ్యమంత్రిగారు ఏమి చెప్పారు, వారు తప్పేమీ చెప్పలేదు. గతంలో మీరు బిజెపితో అనేక సందర్భాలలో,

వారు బిల్లులు పెట్టినపుడు చాలా సార్లు మీరు మద్ధతు ఇచ్చారు, ఇప్పుడు కూడా అదే ప్రయత్నం చేస్తావున్నారు. అది మంచిది కాదు. తెలంగాణ ప్రజల కోసం ఆలోచన చేయండని చెప్పి ముఖ్యమంత్రిగారు ఉదాహరణకు ఒక మాట చెప్పారు. ఏమి చెప్పారు, భారతీయ జనతాపార్టీ తరపున రాష్ట్రపతిగా భారతీయ జనతా పార్టీ అభ్యర్థి రామ్‌నాథ్‌కోవింద్ గారిని పెడితే ఆయనకు మీరు మద్దతిచ్చారు. అదే కాంగ్రెసుపార్టీ, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెసుపార్టీ, లోక్‌సభలో మీరాకుమార్ గారు సభాపతి స్థానంలో కూర్చుని తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం కోసం బిల్లును పాస్ చేశారు. వారు రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తావుంటే వారికి మద్ధతిచ్చి ఓట్లేసి గెలిపించాల్సింది పోయి కనీసం ప్రొటోకాల్ మర్యాదలు కూడా చూడనటు వంటి దౌర్భాగ్య పరిస్థితిని ఆనాడు మనం చూశాము. ఇగ చెప్తా ఉన్నారు.. రామ్‌నాథ్‌కోవింద్ దళితుడు కాబట్టి మేము మద్దతిచ్చామని చెప్తావున్నారు. ఏం మీరాకుమార్ గారు దళితురాలు కాదా? తెలంగాణ రాష్ట్రసాకారం నిజం చేసిన మీరా కుమార్ గారికి మీరు మద్ధతు ఇవ్వాల్సిన అవసరం లేదా? తెలంగాణ రాష్ట్రం ఇచ్చినటువంటి కాంగ్రెసు పార్టీ ముఖ్యమా, లేదా? తెలంగాణ రాష్ట్రం ఇచ్చేటప్పుడు ఈ దేశంలో చాలా నష్టం జరిగిందని, తల్లిని చంపి బిడ్డను ఎత్తుకొచ్చారు., పార్లమెంటు తలుపులు బంద్ చేసి తెలంగాణ ఇచ్చారు అని చెప్పిన బిజెపి అభ్యర్థికి మద్ధతిచ్చారు కానీ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి మద్ధతియ్యలేదు. తెలంగాణ బిల్లు పాస్ చేసిన మీరాకుమార్ గారికి మద్దతియ్యలేదు. ఇంతకంటే అన్యాయం, ద్రోహం ఏముంటదండీ. ఇదే కదా ముఖ్యమంత్రిగారు చెప్పింది.

శ్రీ కె. తారక రామారావు:- సార్, మాకు భట్టి విక్రమార్క గారంటే చాలా గౌరవం ఉంది. మీరాకుమార్ గారంటే కూడా గౌరవం ఉంది. వారు మాకు సహకరించారు. అవసరమైతే ప్రత్యేకంగా వారికి ధన్యవాదాలు తెలిపేందుకు తీర్మానం పెట్టండి. తప్పకుండా చేద్దాం. ప్రోటోకాల్ సమస్య గురించి మీరు చెప్పారు, దానిగురించి నేను లోతుల్లోకి పోను. మేము మొన్ననే చెప్పాము. నేను చెప్పేది ఒక్కటే అధ్యక్షా. ముఖ్యమంత్రిగారు చాలా స్వీపింగ్ రిమార్కులు చేశారు. వారికైనా, కాంగ్రెసు పార్టీకైనా మేము చెప్పేది ఒక్కటే. ఎలక్షన్ టైంలో రాజకీయాలు ఆరునెలలు చేద్దాం. మిగతా నాలుగున్నరేళ్ళు రాష్ట్ర ప్రయోజనాల కోసం కష్టపడదాం, we are ready మాకు ఆ రాజనీతిజ్ఞత, మాకు ఆ విజ్ఞత ఉంది, చివరగా నేను చెప్పేది ఒక్కటే. వినండి స్వామీ మీ గురించే చెపుతున్నాను. విలీనం అని చెప్పారు అధ్యక్షా, ఎస్, ఒకనాడు 2014వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం ఇచ్చినపుడు నిజానికి కాంగ్రెస్ పార్టీలో మేము విలీనం అవుదా మనుకున్నాం. దురదృష్టం ఆనాడు దిగ్విజయ్‌సింగ్ గారి వైఖరి వల్ల కాలేదు. కానీ ఆరోజు మేము కాంగ్రెస్‌తో విలీనం చర్చలు జరుపుతున్నప్పుడు, ఇదే రేవంత్ రెడ్డిగారు సోనియాగాంధీగారిని బలిదేవత అని, రాహుల్‌గాంధీగారిని ముద్దపప్పు అని తిట్టే పనిలో బిజీగా ఉన్నారు. మేము ఏమి చేసినా బాజాప్తుగానే చేశాము. ఏం చేసినా బాజాప్తంగానే చేశాము తప్ప బేజాప్తగా చేయలేదు.

మిస్టర్ స్పీకర్:- మహేశ్వర రెడ్డి గారు.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి (నిర్మల్):- అధ్యక్షా, ఇప్పటికీ మూడుసార్లు నన్ను కూర్చోపెట్టారు. అవకాశం ఇస్తున్నారు, కూర్చోపెడుతున్నారు. ఇది చూస్తుంటే వీళ్ళిద్దరి మ్యాచ్ ఫిక్సింగ్ జరిగినట్టు, ఇద్దరి అలయెన్స్‌లో మాట్లాడుకుంటున్నట్టుగా వుంది. మమ్మల్ని మీరు పూర్తిగా విస్మరిస్తున్నట్టుగా అనిపిస్తుంది.

అధ్యక్షా, మిత్రుడు, శాసన సభ్యుడు, మంత్రి వర్యులు శ్రీధర్‌బాబుగారు ఈరోజు ప్రవేశ పెట్టిన తీర్మానం పై చర్చ ఎంత దారుణంగా ఉందంటే, కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎంతో వివక్షతో విషపూరితమై ఉన్నదట. అసలు విషపూరితమేంటంటే ఒక్కసారి మీరు గ్రహించండి మంత్రిగారు., మీరు మీ బడ్జెట్‌లో లేదా, గతంలో మీరు కేటాయింపులు చేసినపుడు నాలుగువేల కోట్ల రూపాయలు ఒకే నియోజకవర్గానికి, ముఖ్యమంత్రిగారికి ఇచ్చినపుడు మిగిలిన నియోజకవర్గాలు గురించి మిగిలిన జిల్లాల గురించి ఏరోజైనా ఆలోచన చేశారా అని అడుగుతున్నాను. వాళ్ళు కూడా మీలాగనే ఆలోచన చేసి మా జిల్లాలను పూర్తిగా విస్మరించారని మా జిల్లాలకు నిధులు ఇవ్వలేదని

ఆ జిల్లాల వాళ్ళు కూడా ఈరకమైన తీర్మానం చేయమనంటే తీర్మానానికి మీరు సిద్ధమా అని నేను అడుగుతున్నాను.

అదేవిధంగా నిన్న కూడా గౌరవ మంత్రిగారు, గౌరవ ముఖ్యమంత్రిగారు చాలా దారుణంగా మా ఎం.ఎల్.ఎలను ఎం.పిలను ఇష్టానుసారంగా కామెంట్లు చేయడమే కాకుండా ఒక విషం చల్లే కార్యక్రమాన్ని చేపట్టారు. మేము ప్రధాన ప్రతిపక్షంగా ఈ రాష్ట్ర ప్రభుత్వానికి సమానంగా ఎనిమిది మంది ఎంపిలను గెలుచుకునే సరికి పాపం ముఖ్య మంత్రిగారు ఇబ్బందిలో పడి ఎక్కడ ఆయన కుర్చీకే ఎసరొస్తదో, ఎక్కడ ఆయన పదవి పోతదో అని భయపడి ఏదో ఒక రకంగా మమ్మల్ని ఇబ్బంది పెట్టాలని ఈరోజు ఈ విధంగా తీర్మానం ప్రవేశపెట్టడం ఎంతవరకు సమంజసం అని నేను అడుగుతున్నాను అధ్యక్షా.

మిస్టర్ స్పీకర్:- మీరు చర్చలోకి రండి.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- అధ్యక్షా. కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకే కాదు ఏ రాష్ట్రానికీ కూడా అన్యాయం చేయలేదు. ఒక్కసారిగా ముఖ్యమంత్రిగారు ఏ అనుభవం లేకుండా నేరుగా ముఖ్యమంత్రి అవడం వల్ల పాపం వారికి ఫెడరల్ వ్యవస్థ మీద పూర్తిగా విశ్వాసం లేకనా, లేదా అనుభవం లేక మాట్లాడుతున్నారా? దయచేసి వారు ఒక్కసారి సభకు తెలియజేయాల్సిన అవసరముంది అధ్యక్షా.

(కాంగ్రెస్ పార్టీ సభ్యులచే అంతరాయం)

నేను సింపుల్‌గా రెండు విషయాలు అడుగుతున్నాను. ఈ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గానీ, తెలంగాణ రాష్ట్రంలో కానీ ఏరోజు కూడా జరగనటువంటి ఒక గొప్ప చర్యకు పూనుకొన్నారు ముఖ్యమంత్రిగారు. నేను ఒక్కటే అడుగుతున్నాను, కేంద్రం నుంచి నిధులు వచ్చినపుడు గానీ ..

మిస్టర్ స్పీకర్:- రాంచందర్ నాయక్ గారు.

డాక్టర్ జె. రాంచందర్ నాయక్:- అధ్యక్షా, మహేశ్వర రెడ్డి గారు తెలంగాణ రాష్ట్ర రాజకీయ ప్రయోజనాల గురించి మాట్లాడమంటే టిఆర్ఎస్ వాళ్ళు లేవంగానే ఆయన కూర్చుంటానంటారు. మూడునాలుగు సార్లు వారు కావాలనే కూర్చున్నారు. సభలో వారినొకరినొకరు సహకరించుకున్నట్టు కనిపిస్తూనే ఉంది. ఇక్కడ మన ముఖ్యమంత్రిగారి గురించి సమస్య కాదు. కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీరు జీర్ణించుకోలేక బాధలో ఉన్నారు. మహేశ్వర రెడ్డిగారూ, దయచేసి రాష్ట్ర ప్రయోజనాల గురించి, ప్రజాప్రయోజనాల గురించి చర్చించండి. మన హక్కులను ఏవిధంగా సాధించుకోవాలో దానిమీద కొంచెం ఆలోచన పెట్టి మాట్లాడండి. ప్లీజ్.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- మిత్రమా, నువ్వు ఎంత తిప్పలు పడ్డా నీకు మంత్రి పదవి ఇవ్వరు. మీ కమ్యూనిటీకి ఒక్క మంత్రి పదవి ఇవ్వలేదు. మీరు ఎక్కువ అధైర్యపడకండి. మంత్రి గారు శ్రీధర్‌బాబు గారు పచ్చి అబద్ధాలు మాట్లాడినా, దాదాపు 40 నిమిషాలు విషం చిమ్మినా కూడా మేము ఓపికతో విన్నాము. ఈరోజు మేము మాట్లాడుతున్న సమయంలో వారికి ఓపిక ఉండాలి అధ్యక్షా. ఎందుకంటే ఈరోజు యావత్ తెలంగాణ ప్రజానీకం మనవైపు చూస్తున్నారు. తెలంగాణ ప్రజలు నిజంగా ఇది వాస్తవమా అనుకునే రీతిలో వారి ప్రజెంటేషన్ ఉంది అధ్యక్షా. అయినప్పటికీ కూడా, పచ్చి అబద్ధాలు మాట్లాడినప్పటికీ కూడా మేము మధ్యలో ఎక్కడా కలగజేసుకోకుండా చాలా శ్రద్ధగా వారు చెప్పిన మాటలు విన్నాము., తప్పుడు మాటలైనా, అబద్ధపు మాటలైనా మేము విన్నాము. రెండు నిమిషాలు మేము మాట్లాడదాము అంటే వారికి ఓపిక ఎందుకు లేదో తెలియడం లేదు అధ్యక్షా.

2.20 మ.

(అధ్యక్ష స్థానంలో ప్యానల్ స్పీకర్ శ్రీ బాలూ నాయక్ గారు ఆసీనులై ఉన్నారు)

అధ్యక్షా, నేను ఒకటే అడుగుతా ఉన్నాను. ఏ.పి.కి నిధులు ఇచ్చారనే కదా వీళ్ల బాధ. ఆ రాష్ట్రానికి స్పెషల్ స్టేటస్ ఇవ్వమని ఆ రోజు గౌరవ ముఖ్యమంత్రిగారు కూడా చెప్పారు. గౌరవ కేసీఆర్‌గారు కూడా ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఇవ్వమని. వాళ్లకి స్పెషల్ స్టేటస్ ఇస్తే మాకేం అభ్యంతరం లేదని చెప్పారు. నేను ఒకటే అడుగుతున్నాను. నిజంగా ఏ.పి.కి ప్రత్యేక హోదా వచ్చి ఉంటే, ఈ రోజు ఇక్కడ ఒక ఫ్యాక్టరీ అయినా ఉంటుండెనా అధ్యక్షా? ఆ స్పెషల్

స్టేటస్ వలన అక్కడ కల్పించే పన్ను మినహాయింపులు, తదితర సౌకర్యాల వలన ఈ రాష్ట్రం ఎడారిగా మారుతుండె అధ్యక్షా. కాని, అలా జరగకుండా ఆ రాష్ట్రానికి కేవలం రూ. 15 వేల కోట్లు ఇచ్చినందుకు, పదేపదే ఆ రాష్ట్రానికి 15 వేల కోట్లు ఇచ్చారు, 15 వేల కోట్లు ఇచ్చారని శ్రీధర్‌బాబుగారు చెబుతున్నారు. మరి ఈ రాష్ట్రంలో రూ. 80 వేల కోట్ల ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు నడుస్తున్నాయి, గత పది సంవత్సరాల కాలంలో రూ. 9 లక్షల, 50 వేల కోట్ల రూపాయల ప్రాజెక్టుల పనులు చేపట్టడం జరిగింది. మరి దాని గురించి మాట్లాడ రెందుకు? అంతే కాకుండా, మొన్న ఆర్ అండ్ బి మంత్రిగారు కేంద్ర మంత్రి గడ్కరీగారు మాకు బ్రహ్మాండమైన పనులకి శాంక్షన్ ఇచ్చారని చాలా గొప్పగా చెప్పారు. సివిల్ సప్లైస్ కేంద్ర మంత్రిగారి గురించి కూడా చెప్పారు. అదే మాదిరిగా ప్రధాన మంత్రిగారు కూడా మాకు బ్రహ్మాండంగా టైమిచ్చారు, బ్రహ్మాండంగా మేము అడిగిన పనులు చేశారని చెప్పారు. కాని ఈరోజు కేవలం రూ. 15 వేల కోట్లు ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చినందుకు మాకు ఇవ్వలేదని అక్కసుతో మాట్లాడుతున్నారు. ఈ పరిస్థితి మంచిది కాదు అధ్యక్షా. ముఖ్యమంత్రిగారికి కనీసం ఫెడరల్ స్ఫూర్తి అనేది ఉండాలి అధ్యక్షా. వారికి బాధ్యతాయుతమైన సీట్లో కూర్చునప్పుడు కనీసమైన ఆలోచన చేయాలి తప్ప, ఇలాంటి చిన్నచిన్న విషయాల మీద ఈ రకంగా మాట్లాడడం మంచిది కాదు. ఏదైనా చెప్పాలనుకుంటే ఈరోజు జరుగుతున్న రూ. 80 వేల కోట్ల ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల గురించి కూడా డిస్కస్ చేయాలి. రూ. 9.50 లక్షల కోట్లు ఈ రాష్ట్రానికి గత పది సంవత్సరాలలో ఇచ్చిన సందర్భం గురించి కూడా మాట్లాడాలి. అదేమీ లేకుండా కేవలం వారికి 15 వేల కోట్ల రూపాయలిచ్చారు, మాకేమీ ఇవ్వలేదని అంటున్నారు. మరి డీపిఆర్‌లు ఏమైనా సబ్మిట్ చేశారా అధ్యక్షా? మూసీనదికి నిధుల అడిగితే ఇవ్వలేదని అంటున్నారు. అయ్యా మీ మూసీ ప్రక్షాళనకు రూ. 10 వేల కోట్లు కాదు, మీరు ముందు డీపిఆర్ ఇచ్చారా? కనీసం దాని కొరకు అప్లై చేసి, అడిగారా? ఆరోజు వాళ్లు కాళేశ్వరాన్ని రూ. 16 వేల కోట్ల నుండి రూ.లక్ష కోట్లకు చేసి, ఏటిఎం చేసుకున్నట్లుగా, మీరు కూడా ఈ మూసీనదిని అడ్డం పెట్టుకుని, లక్షకోట్లో, లక్షా యాభైవేల కోట్లో తీసుకుని, ఏటిఎం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారా? దీని వెనక ఉన్న మతలబు ఏమిటో మాకు తెలుసు. మూసీనదిని అడ్డం పెట్టుకుని, ఒక విషపూరితమైన ఆలోచన చేస్తున్న సంగతి గురించి మీకు తెలియజేస్తా ఉన్నాను అధ్యక్షా.

అధ్యక్షా, కేంద్ర బడ్జెట్‌కి వ్యతిరేకంగా ఈరోజు మరి ఈ రకమైన అసెంబ్లీ తీర్మానం చేయడం వెనుక ఉన్న మతలబు ఏమిటో తెలియవలసిన అవసరం ఉంది. రేపు తెలంగాణ బడ్జెట్‌లో మాకు కూడా అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్రంలో ఉన్న జిల్లాలు కూడా ఇదే తీర్మానం చేస్తారు. ఏ రకంగా మీరు రేవంత్‌రెడ్డిగారి నియోజకవర్గానికి రూ. 4 వేల కోట్లు ఇచ్చారో, అదే విధంగా మా నియోజవర్గానికి ఎందుకు రూ. 4 వేల కోట్లు ఇవ్వలేదని అడుగుతారు. మేం కూడా తీర్మానం అడిగితే పెడతారా? ఈ రకంగా వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని చెప్పి రేపు ఆ జిల్లా ప్రజలకు అటువంటి ఆలోచన వచ్చినప్పుడు అటువంటి తీర్మానం పెట్టమని అడిగితే, పెడతారా?

అధ్యక్షా, దీని వెనుక ఉన్న అసలు రహస్యం నేను చెబుతాను. రాహుల్ గాంధీగారు ప్రజా సమస్యలు మరిచిపోయారు. దేశాన్ని మరిచిపోయి, హిందువులంటే ద్వేషాన్ని పెంచుకున్నారు. హిందువులకు వ్యతిరేకంగా మొన్న స్టేట్‌మెంట్ ఇచ్చారు అధ్యక్షా. ఆన్ రికార్డ్ మా దగ్గర ఉంది.

(అంతరాయం)

శ్రీ డి. శ్రీధర్ బాబు:- అధ్యక్షా, గౌరవ బీజేపి లీడర్ మహేశ్వర్‌రెడ్డి గారిని కోరుతాఉన్నాను. రాజకీయాలు మాట్లాడదామంటే వేరే సమయం, సందర్భం ఉంటుంది. ఇది రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు సంబంధించి మేము ఈరోజు వారిని అడుగతా ఉన్నాము. A.P. Reorganisation Actకి సంబంధించి మీరు, బీజేపికి సంబంధించిన శాసన సభ్యులు కూడా ప్రస్తుతం పార్లమెంటు బడ్జెట్

సమావేశాలు నడుస్తా ఉన్నాయి. దానికి సవరణ చేయడానికి మీ సహకారం, మీ చేయూత ఈ రాష్ట్ర ప్రజానీకానికి సంబంధించిన విషయాలలో మీరు మాతో నడుస్తారా, లేదా అనేది స్పష్టతతో చెప్పండి. రాహుల్ గాంధీగారి గురించి, లేకుంటే మేము మోదీగారి గురించి మాట్లాడాలన్నా లేకుంటే మీరు ఇతర నాయకుల గురించి మాట్లాడాలన్నా, వేరే చర్చ పెట్టుకుందాం. But present subject is regarding that. ఎందుకంటే వారు కూడా శాసన సభ్యులు, బీజేపి నాయకులు. మేము అడుగుతున్నాము. మేమేం కామెంట్ చేయలేదే. మేమేం మిమ్మల్ని క్రిటిసైజ్ చేయలేదే. మోదీగారిని క్రిటిసైజ్ చేయలేదే. వేరే వారిని ఇండివిడ్యువల్‌గా క్రిటిసైజ్ చేయలేదే. మేము ఈరోజు రాష్ట్రానికి జరుగుతా ఉన్న అన్యాయం గురించి, నష్టం గురించి చెబుతున్నాము. మనకు ఇంకా సమయం ఉంది. మనందరం కలిసి వెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి చెబుదామని అంటున్నాము. అది కూడా అర్థం చేసుకోకుండా, ఒక ప్లాట్‌ఫాంగా ఉపయోగించుకుని రాహుల్ గాంధీ గారి గురించి మాట్లాడుతున్నారు. ఏమన్నా మీనింగ్ ఉందా సార్?

మిస్టర్ ప్యానల్ స్పీకర్:- మహేశ్వర్ రెడ్డిగారూ, మీరు సబ్జెక్టు మాత్రమే మాట్లాడండి. ఎందుకంటే సభలో లేనటువంటి నాయకుల గురించి దయచేసి ప్రస్తావించ కండి. ఈ రాష్ట్రప్రయోజనాల మీద చర్చ జరుగుతున్నటు వంటి సందర్భంలో కేవలం ఈ రాష్ట్రానికి రావలసిన నిధులు రాబట్టుకోవడానికి చేసే ప్రయత్నంలో మీరు ఆ సబ్జెక్టుకి అంకితమైతే బాగుంటుంది.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- అధ్యక్షా, శ్రీధర్‌బాబు గారు బ్రహ్మాండమైన సూచనలు చేశారు. కాని గతంలో కూడా వారు మాట్లాడిన మాటలు పరిగణనలోకి తీసుకోండి. వారు ఏఏ అంశాలు మాట్లాడారు, ఏ రకంగా విషం చిమ్మి తెలంగాణ ప్రజానీకానికి ఏ రకంగా తప్పుడు సమాచారం ఇచ్చారనే విషయంలో దానికి క్లారిఫికేషన్ ఇవ్వవలసిన బాధ్యత మా మీద ఉంది. చాలా ప్రియమైనటు వంటి మిత్రులు మంత్రి శ్రీధర్‌బాబు గారు. వారు చాలా బ్రహ్మాండంగా ప్రజంటేషన్ చేస్తారు, మాకు అంత బ్రహ్మాండంగా చేయడం రాదు. కాకపోతే వాస్తవాలు మాత్రం మాట్లాడతాము. వారు రీసెర్చి స్కాలర్ కాబట్టి ఏ అంశం ఇచ్చినా చాలా గంభీరంగా మాట్లాడగలరు. అది నిజం అనుకుంటారు అధ్యక్షా. కాని వారు మాట్లాడేది ఏమిటో వారికే తెలుసు అధ్యక్షా. ఈరోజు నేను ఒకటే అడుగుతున్నాను. కేంద్రంలో మోదీగారి ప్రభుత్వాన్ని ఏదో రకంగా టార్గెట్ చేస్తే తప్ప, ఆయన కుర్చీ పదిలంగా ఉండదనో, లేదా ఏదో రకంగా వారి కుర్చీ కాపాడుకోవాలనో మాటాడుతున్నారు. ఎందుకంటే అధ్యక్షా, ఇక్కడ వారు ఇబ్బంది పడి, భయపడి.....

(అంతరాయం)

ఏదో ఒక రకంగా ఇక్కడ ఈ రోజు అనవసరమైన రాద్ధాంతం చేసి, ఇక్కడ ఒక చర్చకు దారి తీసే ప్రయత్నం చేస్తున్నారు అధ్యక్షా. ఏ రోజు కూడా కేంద్రం తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చెయ్యలేదు, అన్యాయం చేసే ఆలోచన కూడా చెయ్యదు. ఎందుకంటే గత పది సంవత్సరాల కాలంలో ఏ రకంగా రూ. 9 లక్షల 58 వేల కోట్ల రూపాయలు ఇచ్చి ఆదుకున్నదో, ఈ తెలంగాణలో ఈ రోజు రూ. 80 వేల కోట్ల ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు నడుస్తా ఉన్నాయో అదే మాదిరిగా ఎప్పుడూ కూడా తెలంగాణ రాష్ట్రం కోసం సపోర్ట్ చేస్తూ శాంక్షన్స్ ఇస్తున్నది. మన మంత్రివర్యులు శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిగారు స్వయంగా చెప్పారు – గడ్కరి గారు మేము వెళితే మర్యాద ఇచ్చారు, మాకు శాంక్షన్ను ఇచ్చారని చెప్పారు. వాస్తవానికి మా భారతీయ జనతా పార్టీకి ఆ వివక్ష ఉండదు అధ్యక్షా. అలాగే పరిశ్రమల గురించి ఆదిలాబాద్ సిమెంటు ఫ్యాక్టరీ గురించి అడిగితే కేంద్ర మంత్రిగారు వెంటనే స్పందించారు.

2.30 మ. మొన్న ఇండస్ట్రీస్ మినిస్టర్ గారిని తెలంగాణ ఇండస్ట్రీస్ మినిస్టర్ గారు కలిసి ఆదిలాబాద్ సిసిఐ ఫ్యాక్టరీ గురించి అడగ్గా, దానికి వారు వెంటనే స్పందించారు. వాస్తవానికి భారతీయ జనతా పార్టీ ఎవరు వచ్చినా చాలా సానుకూలంగా పనిచేస్తూ, వివక్ష చూపదన్న విషయాన్ని మరొక్కసారి గుర్తు చేస్తున్నాను అధ్యక్ష. కర్ణాటకలో జరుగుతున్న అంశాన్ని పరిశీలిస్తే అక్కడ ఒక మంత్రిగారు రాజీనామా చేసే పరిస్థితి వచ్చింది. అక్కడ

నుండి ఒక ఎస్టీ కార్పొరేషన్ ద్వారా దాదాపు రూ. 90 కోట్ల నిధులు హైదరాబాదుకు మరలినందుకు దాని మీద ఎంక్వైరీ నడుస్తోంది. ఆ నిధులను హైదరాబాద్‌లో జరిగిన ఎన్నికలకు వాడుకోవడం జరిగిందట అధ్యక్ష. అంటే ఎక్కడి నుండి లీక్ అయ్యి ఎక్కడికి వస్తుందో ఒక్కసారి గమనించాలని కోరుతున్నాను. ఇక్కడ వీరు కేవలం దోచుకోవడం, దాచుకోవడం అవినీతి చేయడం తప్ప ఇంకో ఆలోచన లేకుండా ఈ అంశాలను మళ్లించి మమ్మల్ని మరియు ప్రజలను మభ్యపెట్టడానికి మాత్రమే ఈ తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్నారని తెలియజేస్తున్నాను. కేంద్ర మంత్రులైన కిషన్ రెడ్డిగారు, బండి సంజయ్ గారు బానిసలని చాలా దారుణంగా నిన్న గౌరవ ముఖ్యమంత్రి గారు మాట్లాడారు. అవును, మా మంత్రులు బానిసలే అధ్యక్షా. ఎవరికి బానిసలంటే భరతమాతకు బానిసలు, దేశ ప్రజలకు బానిసలు వారు. వారి జీవిమంతా కూడా ఈ ప్రజానీకం కోసం త్యాగం చేసిన మూర్తులు అధ్యక్ష. ఒకే మతాన్ని, ఒకే ధర్మాన్ని , ఒకే పార్టీని నమ్ముకొని జీవితాంతం పని చేస్తున్నటువంటి భరతమాత ముద్దుబిడ్డలు వారు. భరతమాతకు మాత్రమే వారు బానిసలు గానీ, మీరు ఈరోజు రాహుల్‌గాంధీకి బానిసలుగా మారి, వారి దగ్గర మీ కుర్చీ కాపాడుకునే ప్రయత్నంలో మీరు తీవ్రమైన ఆరోపణలు చేస్తున్న మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను.

డాక్టర్ జె. రాంచందర్ నాయక్:- మహేశ్వర రెడ్డిగారు మీరు మేధావులు, తెలంగాణ సమస్యలు తెలిసిన వారు. కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, గిరిజన యూనివర్సిటీ వంటి అంశాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలకు సంబంధించిన విషయాల గురించి మాట్లాడండి. అదే విధంగా మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కోల్పోయిన ఏడు మండలాలకు మీ పార్టీవారి వల్ల నష్టం జరిగింది, వాటి గురించి మాట్లాడండి.

(అంతరాయం)

మిస్టర్ ప్యానల్ స్పీకర్:- విప్‌గారికి ఎప్పుడైనా మధ్యలో మాట్లాడే అవకాశం ఉంటుంది. అది చట్టసభల్లో కూడా ఉంది. దేశంలో ఉన్న రాహుల్ గాంధీ గురించి గానీ, ఇతర నాయకుల గురించి గానీ మాట్లాడకుండా కేవలం సబ్జెక్ట్ మాట్లాడండి మహేశ్వర్ రెడ్డిగారు.

శ్రీ డి. శ్రీధర్ బాబు:- అధ్యక్షా, గౌరవనీయులు మహేశ్వర్ రెడ్డి గారికి అనుభవం ఉంది. ఎవ్వరి పేర్లు ప్రస్తావనకు తీసుకురావాలన్నా, గౌరవ పార్లమెంటు సభ్యుల పేర్లు, మంత్రుల పేర్లు ప్రస్తావనకు తీసుకురావాలన్నా నోటీస్ ఇచ్చిన తరువాతనే దానికి స్పీకర్‌గారు అనుమతి ఇస్తారు. అనుమతి ఇచ్చిన తరువాతనే మాట్లాడాలని వారికి కూడా తెలుసు. మరొక్కసారి వారికి గుర్తు చేస్తున్నాను.

SRI ALLETI MAHESHWAR REDDY:- Before you advising me, Sir, I request you to set the records straight. Sir, you have to set the records in place because before the discussion they have many times brought the names of M.Ps here who are not in the House. So, Sir you have to set the records straight and then see. నేను ఒకటే విషయం తెలుపుతున్నాను. అనవసరంగా జోక్యం చేసుకొని మధ్యలో మా గొంతులు నొక్కే ప్రయత్నం దయచేసి చేయవద్దు. మేము వాస్తవాలు చెబుతున్నప్పుడు మీకు వినాల్సిన బాధ్యత ఉంది. ఇన్‌సెక్యూరిటీతో ముఖ్యమంత్రి గారు తన పదవీ కాపాడుకునే ప్రయత్నంలో ఈ రోజు కేవలం కేంద్రంపై నెపం పెట్టి ఏదో ఒక విధంగా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. మీరు ఎవరి మెప్పు కోసం ఈ ప్రయత్నం చేస్తున్నారో తెలియదు కాని, ఇదే చిత్తశుద్ధి మీరిచ్చిన 6 హామీల మీద ఎందుకు లేదని అడుగుతున్నాను. ఆంధ్రప్రదేశ్‌కి రూ. 15 వేల కోట్లు ఇవ్వ కుండా స్పెషల్ స్టేటస్ ఇచ్చి ఉంటే, నిజంగానే తెలంగాణ ఎడారి అయ్యేది అధ్యక్ష. అంటే, మీ మంత్రులు వెళ్ళి అడిగినప్పుడు శాంక్షన్ ఇస్తేనేమో,ఆరోజు మంచి కోరారు. అంటే పెడితే పెళ్ళి కోరతారు, లేకుంటే చావు కోరతారా? మంత్రులు ఎప్పుడు కోరితే అప్పుడిచ్చారు. ఈరోజు కేవలం ఆంధ్రకు రూ. 15 వేల కోట్లిచ్చారు, మాకివ్వలేదనే కదా మీ అక్కసు. మరి ఆంధ్రకు రూ.15 వేల కోట్లకు బదులు

ఈరోజు వారికి స్పెషల్ స్టేటస్ ఇచ్చి ఉంటే, తెలంగాణ ఒక ఎడారి అయ్యేది. తెలంగాణ ప్రాంతంలో ఒక్క ఇండస్ట్రీ కూడా లేకుండా మొత్తం ఇండస్ట్రీలన్నీ కూడా తరలిపోయేవి. కేవలం తెలంగాణను రక్షించినటువంటి మోదీ గారికి మీరు పాలాభిషేకం చేయాల్సింది పోయి మీరు ఈరోజు ఈ రకంగా చేయడం సమంజసం కాదు. ఈ రకంగా ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదని మీకు తెలియజేస్తున్నాను. నేనొక్కటే అడుగుతున్నాను. అధ్యక్షా, అసలు ప్రాబ్లమ్ ఎక్కడ వచ్చిందంటే, వీళ్ళు స్పెషల్ స్టేటస్ అని రీ–ఆర్గనైజేషన్ బిల్లులో పెట్టారు. పార్లమెంటులో మాత్రం అనౌన్స్ చేశారు అప్పటి కాంగ్రెస్ ప్రధానమంత్రి గారు. అసలు రీ–ఆర్గనైజేషన్‌ను రాసేటప్పుడు ఏ ఆలోచనా లేకుండా, ఎక్కడా కూడా నార్మ్స్‌కి సెట్ కానటువంటి ఒక స్పెషల్ స్టేటస్‌ని రాసి, ఈరోజు స్పెషల్ స్టేటస్ ఇస్తామని చెప్పి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నా, అక్కడి ప్రజలు ఎందుకు నమ్మడం లేదు? అక్కడ ప్రజలు నమ్మకపోవడానికి కారణమేమంటే, మీరు స్పెషల్ స్టేటస్‌కు ఉన్నటువంటి నార్మ్స్ ఏమిటో వారికి తెలుసు. ఏదీ ఆలోచన చేయకుండా, నార్మ్స్ స్టడీ చేయకుండా ప్రధానమంత్రితో ఒక స్టేట్‌మెంట్ ఇప్పిచ్చారు. రీ–ఆర్గనైజేషన్ యాక్ట్‌లో ఎక్కడా కూడా ప్రస్తావించలేదు. నేను ఈరోజు ఒక్కటే చెప్తున్నాను, మీరు ఎన్ని రకాలుగా మాట్లాడినా తెలంగాణ రాష్ట్రానికి గత పదేళ్ళలో భారతీయ జనతా పార్టీ ఇచ్చిన ఎన్నో నిధులు గానీ, రామగుండంలో ఇచ్చినటువంటి పవర్ ప్లాంట్‌లు గానీ, ఎరువుల ప్రాజెక్టులు గానీ, రోడ్లు గానీ, రైల్వేల కోసం జరుగుతున్నటువంటి ఆధునీకీకరణ గానీ, కొత్తలైన్లు గానీ... ఎన్నో వందల వేల కోట్ల రూపాయలు.., రూ.80 వేల కోట్ల రూపాయలతో on going projects నడుస్తున్నాయి. 9 లక్షల 28 వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులకు ఇప్పటికే అప్రూవల్ ఇచ్చినటువంటి సందర్భముందని చెప్తున్నాను.

ఇందాక బయ్యారం ఉక్కు ప్రాజెక్టు గురించి మాట్లాడారు. ఆరోజు రీ–ఆర్గనైజేషన్ యాక్ట్‌లో బయ్యారం ఉక్కు ప్రాజెక్టు గురించి ఏం రాశారు? ఫీజిబిలిటీ ఉంటే పరిశీలిస్తామని రాశారు. కానీ, అధికారులేమని చెప్పారు. అక్కడ ఫీజిబిలిటీ లేదు, అక్కడున్నటువంటి రా–మెటీరియల్ థర్డ్ గ్రేడ్ రా–మెటీరియల్, ఎక్కడా పనికి రాదు, ఫీజిబిలిటీ లేదని చెప్పారు. దానిగురించి మీరు రీ–ఆర్గనైజేషన్ యాక్ట్‌లో ఎందుకు అప్రూవల్ ఇవ్వలేదు? పరిశీలిస్తామంటారు. అదే పోలవరంకు మీరు అక్కడ నేషనల్ స్టేటస్ ఇస్తారు. ఇక్కడ మాత్రం ఆ స్టేటస్ ఇవ్వరు. అది మీరు చేసినటువంటి తప్పిదాలు కాదా? ఆరోజు టిఆర్ఎస్ ప్రభుత్వం డిపిఆర్ ఇవ్వకనో, లేకుంటే అది ఎత్తిపోతల పథకం, అది ఫీజిబుల్ కాదనో అది నేషనల్ ప్రాజెక్టు క్రిందకు రాలేదు. అదే పోలవరానికి వచ్చింది. నేను ఒక్కటే అడుగుతున్నాను. ఈరోజు బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ గురించి పదే పదే అడుగుతున్న మంత్రి గారికి తెలుసు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ కొరకు అక్కడున్నటువంటి రా–మెటీరియల్ థర్డ్‌గ్రేడ్ రా–మెటీరియల్, అది ఏ రకంగా కూడా పనికిరాదని మంత్రిగారికి తెలుసు. అది తెలిసి కూడా కేవలం మా మీద విషం జల్లడానికి మాత్రమే గౌరవ మంత్రి గారు మామీద మమ్మల్ని బద్నాం చేసే కార్యక్రమం చేస్తున్నారు. ఒక రాష్ట్రంలో జాతీయ ప్రాజెక్టులు ప్రకటించడానికి ఎన్నో నిబంధనలుంటాయి. ఒక రాష్ట్రంలో జాతీయ ప్రాజెక్టు రావడానికి దానికి సంబంధించిన నిబంధనలు గానీ, ప్రిస్క్రైబ్డ్ ఫార్మాట్ గానీ, లేకుంటే డీపీఆర్స్ గానీ సబ్మిట్ చేయకుండా మనం ఒక నేషనల్ ప్రాజెక్టు అడగడం సాధ్యం కాదు. కానీ, ఏదో ఒక రకంగా మేము అడగకున్నా కూడా వాళ్ళు పెట్టలేదని చెప్పి, బద్నాం చేయాలి కాబట్టి, వాళ్ళు ఎలాగూ ఈ రాష్ట్రంలో ఫెయిల్ అవుతున్నారు కాబట్టి, మాకు కేంద్రం సపోర్టు చేయకపోవడంతో మేము నిధులివ్వలేము, ఈ సంక్షేమ కార్యక్రమాలను చేయలేమనే వాళ్ళు మమ్మల్ని బద్నాం చేస్తున్నారు. మేము ఒక్కటే అడుగుతున్నాము. మీరు ఇచ్చినటువంటి హామీలు అమలు చేయలేరని మీకు తెలుసు. మీ నిధులేమిటో మీకు తెలుసు. ఈరోజు బీఆర్ఎస్‌ను తిట్టడమో, లేకుంటే భారతీయ జనతాపార్టీ మీకు సపోర్టు చేయడం లేదంటూ మమ్మల్ని బద్నాం చేసే ప్రయత్నం చేయడం వల్ల, మీరు ఇచ్చినటువంటి హామీల నుండి మీరు తప్పించుకోలేరు. మరి అవే హామీలు మేమెందుకు ఇవ్వలేదు? ఎందుకంటే, అవి సాధ్యం కావని మాకు తెలుసు కాబట్టి, మేము ఆ హామీలు ఇవ్వలేదు.

అబద్దాలని తెలిసినా, మీరు ప్రజల్లోకి వెళ్ళి ఇచ్చిన హామీలని, పదే పదే డిక్లరేషన్స్ అని చెప్పి, మీ నాయకుడిని తోలుకొచ్చి ఎన్నో హామీలిచ్చి, ఈరోజు ఆ హామీలను నెరవేర్చలేని పరిస్థితుల్లో మీరు ఈరోజు ఏదో ఒక రకంగా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. బ్లేమ్ గేమ్ ఆడుతున్నారు, మమ్మల్ని బ్లేమ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్ని రకాలుగా మీరు బ్లేమ్ గేమ్ చేసినా కూడా, ప్రజలు గమనిస్తూ ఉన్నారు. ప్రజలు తెలివతక్కువ వాళ్ళు కాదు. ఖచ్చితంగా గమనిస్తూ ఉన్నారు. మీరు చేసినటువంటి తప్పుడు వాగ్దానాలు మీరు అమలు చేయలేరని తెలుసుకాబట్టి, వాళ్ళు ఏదో ఒక రకంగా మీకు ఖచ్చితంగా బుద్ధి చెప్తారని తెలియజేస్తున్నాను. అదేమాదిరి 3 కేంద్రీయ విద్యాలయాలు ఆదిలాబాద్ జిల్లాకి మంజూరయ్యాయి.

2.40 మ. నిర్మల్ జిల్లాకు ఒకటి మంజూరైంది. కనీసం స్థలాన్ని కేటాయించడానికి కూడా అధికారులు ముందుకు వచ్చి సహకరించడం లేదంటే మా పరిస్థితి ఏ విధంగా ఉందో మీరు అర్థం చేసుకోవాలి. అంతేకాదు. మీరు మాకు ఇన్‌ఛార్జ్ మంత్రి కదా ఉన్నది.

శ్రీమతి దనసరి అనసూయ:- (మైక్ లేకుండా) కలెక్టర్ గారికి చెబితే చేస్తారు.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- అదే ఇప్పించండని అంటున్నాను. ఇప్పించండి మీతో కొబ్బరికాయ కొట్టించి మీతోనే ఫౌండేషన్ చేయిస్తాము. చాలా సంతోషం. అంటే మంత్రిగారు అబద్ధాలు చెబుతున్నారు ఇప్పటికైన అర్థం చేసుకోండి. కేంద్రీయ విద్యాలయాలు ఇవ్వలేదని చెబుతున్నారు కదా, అది వాస్తవం కాదు అని నేను చెబుతున్నాను. అయితే ఆది నుండి తెలంగాణ రాష్ట్రానికి మెయిన్ విలన్ కాంగ్రెస్ పార్టీ అని తెలుపుతున్నాను. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసింది. 1956వ సంవత్సరం నుండి హైదరాబాద్ రాష్ట్రాన్ని బలవంతంగా ఆంధ్రవాళ్ళతో విలీనం చేసింది ఆనాటి నెహ్రూ గారేనని తమ ద్వారా తెలుపుతున్నాను. ఆరోజు ఇక్కడ తెలంగాణ ఉద్యమం వచ్చింది, అక్కడ ఆంధ్ర ఉద్యమం వచ్చింది. తెలంగాణ ఉద్యమం వచ్చిన తరువాత వళ్ళీ విడదీశారు. విడదీసినా కూడా మంచి వాతావరణంలో విడదీయలేదు. ఆ విధంగా విడదీసిన తరువాత మాకు నిధులు ఇవ్వడం లేదంటే, ఏ రకమైన న్యాయమని తమ ద్వారా అడుగుతున్నాను. అన్ని రకాలుగా తెలంగాణకు మెయిన్ విలన్‌గా కాంగ్రెస్ పార్టీ ఉన్నదని నేను మరొక్కసారి తమ ద్వారా తెలుపుతున్నాను. ఎందుకంటే, తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో రాష్ట్రం కోసం వెయ్యి మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది. వెయ్యి మంధి ప్రాణాలు కోల్పోయిన తదుపరి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తరువాత కూడా మంచి వాతావరణంలో ఇవ్వలేని పరిస్థితిలో తలపోటు పెట్టుకొని తెలంగాణ ఇచ్చుకునే పరిస్థితి ఏర్పడిందంటే, దానిని సరిగ్గా హ్యాండిల్ చేయలేక, మీరు సరిగ్గా రీ-ఆర్గనైజేషన్ బిల్లును మీరు రాయలేక ఇవన్నీ జరిగినట్లు మేము భావిస్తున్నాము. అంతేకాదు రెండుచోట్ల కూడా కాంగ్రెస్ పార్టీ నష్టపోయిందని తప్పని పరిస్థితుల్లో ఆనాడు తెలంగాణ రాష్ట్రం ఇవ్వవలసి వచ్చింది తప్ప, వారిలో తెలంగాణ రాష్ట్రం ఇవ్వాలనే చిత్తశుద్ధి మాత్రం కనపడలేదు. నిజంగా మీకు ఈ బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని , కేంద్రం మాకు సపోర్టు చేయడం లేదని ఈ రోజు కాంగ్రెస్ పార్టీ భావిస్తే, మొన్న గెలచిన 8 మంది ఎంపి సభ్యులతో రాజీనామా చేయించి మళ్ళీ గెలిపించుకోండి. కేంద్రం మీకు న్యాయం చేసిందా లేదా అన్యాయం చేసిందా అన్నది అప్పుడు మేము నమ్ముతాము.

(బీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుంచి హర్షధ్వానులు)

మీరు ఈరోజు ఒకటి గుర్తు పెట్టుకోండి. అధికారంలో ఉన్న మీరు...

శ్రీ ఆది శ్రీనివాస్:- అధ్యక్షా, కేంద్రంలో బిజెపి పార్టీ అధికారంలో ఉంది. తెలంగాణ రాష్ట్రానికి నష్టం జరిగిందని ఈ సభలో గౌరవ ముఖ్యమంత్రి గారు సభా నాయకుడిగా చర్చను ప్రవేశపెడితే, తెలంగాణకు నిధులు రావడంలో విఫలమైన మీ 8 మంది ఎంపీలు ముందుగా రాజీనామా చేయండి. ఇద్దరు మంత్రులు ముందు రాజీనామా చేసి మీరు ఎన్నికలకు రండి. మేము ఈసారి తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేకపోయాము, మళ్ళీ ఇస్తామనే మాటతో మీరు రావాలి కాని, మమ్మల్ని రాజీనామా

చేయమనడం ఏంటి? అధికారంలో ఉన్నది మీరు. కాబట్టి, ఈనాడు మీరు రాష్ట్రప్రయోజనాలపై మాట్లాడే ప్రయత్నం చేయాలి తప్ప, రాష్ట్రప్రయోజనాలు ప్రక్కన పెట్టి, పునర్విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్ని వేల కోట్ల రూపాయలు పోతే, అణా పైసా కూడా ఇవ్వకుండా నిన్న కేంద్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ పదం కూడా ఎత్తని సందర్భం ఉన్నప్పుడు మీరు మెసేకుకోస్తే ఎట్లా? తెలంగాణ ప్రజలు మీకు ఎన్ని సీట్లు కట్టపెట్టారు? తెలంగాణ ప్రజలు 8 ఎంపి సీట్లు కట్టపెట్టారు. మీరు ముందు రాజీనామా చేస్తే, మీ ప్రభుత్వం దిగి వస్తుంది. మమ్మల్ని రాజీనామ చేయమని అనడం ఏంటి? తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ఈ రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు గారు రాష్ట్ర వనరులపై తెలంగాణ రాష్ట్రప్రజల అన్ని వర్గాల కోసం బడ్జెట్ ప్రవేశపెడతారు. కాని, రాజీనామా మీరు చేయాలని కోరుతున్నాను.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- అధ్యక్షా, 40 నిమిషాల పాటు శ్రీధర్ బాబు గారు మాట్లాడుతున్న సందర్భంలో మాకు మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని ఎప్పుడు కూడా అడగలేదు. కానీ, ఈరోజు ఇంతపెద్ద ఎత్తున వాస్తవాలు మాట్లాడుతుంటే వారు జీర్ణించుకోలేక ఒకరి తరువాత ఒకరు లేచి మమ్మల్ని Disturb చేసి అడ్డుపడే ప్రయత్నం చేయడం సమంజసం కాదని తెలుపుతున్నాను. నేను ఒక్కటే అడుగుతున్నాను. గడిచిన 7 నెలల్లో 64 సీట్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ నిజంగా మంచి చేసి ఉంటే 17 సీట్లలో కనీసం సగం సీట్లు కూడా ఎంపిలను గెలిపించుకోలేని దుస్థితికి ఎందుకు వస్తుంది? 8 మంది ఉన్న ఎమ్మెల్యేలము 8 మంది ఎంపిలను ఏ విధంగా గెలిపించుకోగలిగామో ఒకసారి ఆలోచన చేయాలని తమ ద్వారా కోరుతున్నాను. ప్రజలు మాపై పూర్తి విశ్వాసంతో ఉన్నారు. ప్రజలు మా వైపు చూస్తున్నారు. ప్రజలకు మాపై నమ్మకం ఉన్నది. ఎట్టిపరిస్థితిలో కూడా బిజెపి పార్టీనే కాంగ్రెస్ పార్టీకి ఆల్టర్‌నేట్ పార్టీగా ప్రజలు గుర్తించారు కాబట్టే ప్రజలు మా వైపు చూస్తున్నారు. ఈ రోజు మేము ఏం చేసినా ప్రజల సంక్షేమం కోసం ఆలోచన చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం పాటు పడ్డది. తెలంగాణ రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయలు ఇచ్చినా కూడా ఈ రోజు ఏదో ఒక నెపం పెట్టి మీరిచ్చిన హామీలు నెరవేర్చలేని పరిస్థితుల్లో కేంద్రంపై బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారు. మూసీ నది ప్రక్షాళన కోసం కేవలం రూ. 10 వేల కోట్లు అడిగితే ఇవ్వలేదంటే, గత ప్రభుత్వపార్టీ వారు కాళేశ్వరం ప్రాజెక్టును కడితే, మేము మూసీ నదిని ప్రక్షాళన చేస్తామనే ఉద్దేశంతో ఆ ప్రాజెక్టును మీరు టేకప్ చేస్తున్నారు. వాళ్ళు లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు, మాకొక ప్రాజెక్టు కావాలి, మా ఆస్థాన గుత్తేదారులు ఖాళీగా ఉన్నారు. వారికి పర్కులిచ్చి దాన్ని రేపు లక్షకోట్ల ప్రాజెక్టుగా చేసి, మేము వాళ్ల దగ్గరికెళ్ళి ఏటిఎంగా వారిని వాడుకుంటామనే ఆలోచన చేస్తున్నారు. ఇదొక దుర్మార్గమైన ఆలోచన. ఒక దుర్మార్గమైన ఆలోచనతో ముందుకు వెళుతున్నారు. దానికి కేంద్రం సపోర్టు చేయాలంట. దాని కోసం కేంద్రం ఈరోజు నిధులివ్వాలంట. కనీసం డీపీఆర్ సబ్‌మిట్ చేయలేదు. కనీసం దాని గురించి ప్రస్తావన చేయకుండా ఈరోజు కేంద్రాన్ని ఈ విధంగా నిందించడం అనేది సిగ్గుచేటు బాధాకరమని తెలుపుతున్నాను. ఎందుకంటే మీరొక్కసారి ఆలోచన చేయండి. మేము ఎప్పుడైనా సమయం పాటించాము. వాస్తవాలే మాట్లాడాము. కానీ, ఇన్ని అబద్ధాలతో ఈ విధంగా విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారు. ఎందుకంటే బిజెపి పార్టీ ఆల్టర్‌నేట్ పార్టీగా ఎదుగుతున్నది. బిజెపి పార్టీయే మేజర్ అపోజిషన్ పని చేస్తుంది. 8 మంది ఎంపిలు గెలిచారు కాబట్టి, 8 మంది ఎంపిలతో ప్రమాదంగా మారుతోందని చెప్పి ఏదో ఒక రకంగా బిజెపి పార్టీని బద్నాం చేయాలనే ఉద్దేశంతో మాపై విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్ని రకాలుగా విషం చిమ్మినా ఎన్ని రకాలుగా మా మీద అభాండాలు వేసే ప్రయత్నం చేసినా, పెద్దలు మా వైపు ఉన్నారు, ప్రజలు మా వైపు చూస్తున్నారు. ఖచ్చితంగా బిజెపి పార్టీ వారికి న్యాయం జరుగుతుంది. ఈ ధర్మాన్ని దేశాన్ని రక్షించగలిగిన పార్టీ బిజెపి పార్టీ కాబట్టి ప్రజలు మా వైపు ఉన్నారు. ఏమైనా సరే మేము 8 సీట్లు గెలిచాం కదా అని మీ సొంత నియోజకవర్గంలో కూడా గెలిపించు

కున్నాము మరిచిపోవద్దు. సవతి తల్లి ప్రేమ అట. బ్రహ్మాండంగా ప్రజంటేషన్ చేస్తారు మంత్రిగారు. మంత్రి గారూ, తెలంగాణ ప్రాంతంలో ఆదిలాబాద్ వంటి మారు మూల జిల్లాలో మీరు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారు. మీరు కొడంగల్‌కి రూ.5 వేల కోట్లు (ఒక పేపర్‌ను చూపిస్తూ) చూడండి ఇక్కడ. రైతు బంధుకి పైసలు లేవట కాని, కొడంగల్‌కు మాత్రం రూ. 5 వేల కోట్లట. రైతు బంధు ఇవ్వండి. రైతులంతా ఎదురుచూస్తున్నారు. రైతు బంధు ద్వారా నిధులు అందించడానికి నిధులు లేవట కాని, కొడంగల్‌కు మాత్రం రూ.5 వేల కోట్లు. రేవంత్ రెడ్డి గారి సొంత నియోజకవర్గంలో 70 రోజుల్లో రూ. 3,695 కోట్లు.. కనీసం మాకు రూ. 3 కోట్లు ఇవ్వడానికి కూడా దిక్కులేదు. రూ. 3 కోట్లు అడిగితే, నానా ఇబ్బంది పెడుతున్నారు మంత్రిగారు. మాకు నిధులివ్వనంత మాత్రాన ప్రజలు చూస్తున్నారు, గమనిస్తున్నారు. మీరు నిధులివ్వడం లేదని వారు అర్థం చేసుకుంటారు. మేము ప్రజల పక్షాన నిలబడ్డాము, వారి పక్షాన పోరాటం చేస్తున్నాము. మీరు వేల కోట్లు తీసుకొని పోయినా, రేపు మళ్ళీ ప్రజల మధ్యే వెళ్లాల్సి వస్తుంది. మీరు ఒకవైపు వివక్ష చూపిస్తూ మీ నియోజక వర్గం అభివృద్ధి చేస్తే, రాష్ట్రం అభివృద్ధి చెందదు. మీ నియోజకవర్గం కోసం చివరికి ఏ పరిస్థితికి వెళ్లారో తెలుసా? కేంద్ర ప్రభుత్వం అమృత్ అని మంచి నీటి కోసం రూ. 3,500 కోట్లు కేటాయించింది. ఆ రూ. 3,500 కోట్లను రాత్రికి రాత్రే ఆస్థాన గుత్తేదారులకు పంచుకున్నారు. పాపం మా అన్నకు అందులో నుండి ఇవ్వనట్లున్నారు. దానికి టెండర్ లేదు. పబ్లిక్ డొమైన్‌లో ఏమి లేదు. కనీసం పబ్లిక్ డొమైన్‌లో టెండర్ కాపీలు లేవు. ఇన్ని విధాలుగా మోసం చేసి, చివరకు ఈ రాష్ట్రం ఏ పరిస్థితిలో ఉందంటే.....

శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి:- అధ్యక్షా, గౌరవ బిజెపి పక్ష నాయకులు మహేశ్వర్ రెడ్డి గారు చాలా అద్భుతంగా మాట్లాడుతూ, అసలు సబ్జెక్ట్‌ను డైవర్ట్ చేస్తూ, సభను ఇంకొక పక్కకు తీసుకెళ్తూ, కేవలం కేంద్రం నుండి రూ. 3,500 కోట్లు అమృత్ స్కీమ్‌లో తీసుకొస్తే ఎవరికో ఇవ్వాలని, వారికి ఇవ్వలేదని మాట్లాడటం అసమంజసం. ప్రధానంగా కేంద్ర బడ్జెట్‌లో ఈ రాష్ట్రానికి రావల్సిన నిధులు రాలేదనేది మన ఎజెండాలో చర్చ. ఈ చర్చలో మీరు మద్దతు తెలిపితే సంతోషం. తెలపము అని అన్నా కూడా ఏమి అనరు. ప్రజలు ప్రతిదీ గమనిస్తున్నారు. ఇందాక సహచర మిత్రులు మాట్లాడినట్లు 8 మంది కాంగ్రెస్ పార్టీ ఎంపీలు గెలిస్తే, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ కూడా 8 మంది ఎంపిలు గెలిస్తే రాజీనామా చేయవల్సింది ఎవరు?

2.50 మ. రెండవది, మా కాంగ్రెస్ సహచర మిత్రులు మాట్లాడినట్లుగా ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు మరియు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ కూడా ఎనిమిది మంది ఎంపీలు గెలిస్తే ఎవరు రాజీనామా చేయాలి. మీరు రాజీనామా చేసి మీ నిరసన తెలియజేస్తే కేంద్రంలో అధికారంలో ఉన్న మీ పార్టీ దిగొచ్చి తప్పకుండా ఈ రాష్ట్రానికి నిధులిస్తుంది. అది మరిచిపోయి ఏదో అజెండాలో మాట్లాడాలి కాబట్టి, విమర్శించాలి కాబట్టి మహేశన్న విమర్శిస్తున్నారు తప్ప వారి ఆత్మకు ఏమి జరుగుతుంది, ఏంటి అని తెలియనిది కాదు. దయచేసి రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం నుంచి వచ్చే నిధుల విషయంలో ఈ సభలో కూర్చున్న మన తెలంగాణ బిడ్డలందరూ కలిసి ఉండాలని కోరుతున్నాను. పార్టీలకు అతీతంగా ఈ రాష్ట్ర అభివృద్ధికి మంచి సూచనలిస్తే తూచా తప్పకుండా, బేషజాలకు పోకుండా ఈ ప్రభుత్వం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నది. సహచర సభ్యులు కూడా సహకరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

శ్రీ ఆది శ్రీనివాస్:- అధ్యక్షా, వారు అమృత్ పథకం రాత్రికి రాత్రే పంచుకున్నారనే దాన్ని రికార్డులో సరి చేయాలి. ఎందుకంటే అమృత్ పథకంలో టెండర్లు పూర్తియిన తదుపరి గుత్తేదార్లు ఆయా పనులు చేయడానికి వచ్చారు తప్ప ఎవరూ రాత్రికి రాత్రి పంచుకోలేదు అధ్యక్ష. ఇది తప్పుడు సమాచారం. గతంలో బయట ప్రెస్‌మీట్‌లో కూడా మాట్లాడారు. కానీ, హౌస్‌లో ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తే సరిచేసే ప్రయత్నం చేస్తున్నాం. అమృత్ పథకంలో వచ్చిన నిధులకు టెండర్లు జరిగాయి, వాటి ప్రకారమే పనులు జరుగుతున్నాయి తప్ప మరొకటి కాదు. ఇంకొక విషయమేమిటంటే ఆనాటి ఎన్నికలప్పుడు కింద మీరుండాలి, పైన వారుండాలనే ఉద్దేశంతో వారు ఓటు

వేస్తే ఎనిమిది సీట్లు వచ్చాయి అధ్యక్షా. మన తెలంగాణ రాష్ట్రానికి బిజేపి అన్యాయం చేసింది కాబట్టి ఆ ఎనిమిది మంది రాజీనామా చేసి మరలా ఎన్నికలకు రావాలనేది ఒక సూచన. ఈ రోజు వాళ్ళు మీరేన్ని గెలిచారని మాట్లాడుతున్నారు. అయోధ్యలో వారు ఓడిపోయారు. అలా అనుకుంటే మొదటి ఓట్ల లెక్కింపులో కూడా ప్రధాన మంత్రి గారు వెనకబడిపోయారు. అది ప్రమాణికం కాదు. ఈ రోజు ప్రభుత్వం మాకు వచ్చిందనేది మ్యాన్‌డేటరి అని తెలియజేస్తున్నాను.

(బీజేపి సభ్యుల నుంచి అంతరాయం)

మిస్టర్ ప్యానెల్ స్పీకర్:- దయచేసి సభ్యులు కూర్చోవలసిందిగా కోరుతున్నాను. మహేశ్వర రెడ్డి గారు మీరు సబ్జెక్ట్‌కు మాత్రమే పరిమితం కండి. మీరు మిగతా సబ్జెక్ట్‌లోకి పోవడం వల్లనే ఇబ్బంది అవుతుంది.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- అధ్యక్షా, వారు ఇక్కడ నుంచి అయోధ్య వరకు వెళ్ళవచ్చు కానీ నేను మాట్లాడకూడదా. వారు అయోధ్యలో గెలవలేదంటున్నారు కానీ, ముఖ్యమంత్రి గారి సొంత జిల్లాలో ఓడిపోయారు. అక్కడ బిజేపి గెలిచింది. మల్కాజ్‌గిరి సిట్టింగ్ సీటు వారు ఓడిపోయారు. అట్లా విమర్శలు చేసే విధంగా మేము మాట్లాడం. అటువంటి మాటలు మేము మాట్లాడం. Sir Iam not yielding sir.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క :- అధ్యక్షా, మహేశ్వర్ రెడ్డి గారు బిజేపి పార్టీ శాసన సభ్యులకు ఫ్లోర్ లీడర్. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా మనం మాట్లాడుతున్నామని, తీర్మానం చేస్తున్నామని వారు అనుకుంటున్నారు. మేమెవరి మీద విషం చిమ్మటం లేదు. ఆ బడ్జెట్‌ను మేమేమి తప్పు పట్టడం లేదు. మనం జరుపుతున్న ఈ చర్చ ఏంటంటే తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అవసరాలు, వాటా, హక్కు ఆ బడ్జెట్ ద్వారా రాలేదు. అన్ని రాజకీయ పార్టీలకు రాష్ట్ర ప్రయోజనాలే ప్రధానంగా ఉంటాయి కాబట్టి విశాలమైన రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఈ సభలో చర్చ ద్వారా ఒక తీర్మానం చేసి, ఆ బడ్జెట్ ద్వారా ఎక్కువ నిధులు రాబట్టే ప్రయత్నం చేద్దామనే ఆలోచనతో ఈ చర్చ పెట్టడం జరిగింది. ఆ చర్చను ప్రక్కన పెట్టి, తప్పు దోవ పట్టించి మిగతా అంశాలన్నీ మాట్లాడుతున్నారు. దాని వల్ల రాష్ట్ర ప్రజలకు నష్టం జరుగుతుంది. సభలోని సభ్యులందరికి ముఖ్యంగా మహేశ్వర్ రెడ్డి గారికి నేను విజ్ఞప్తి చేసేది ఏంటంటే, కేంద్రంలో బిజేపి పార్టీ ఉంది, వారు మోదీ గారి వద్దకు వెళ్ళగలరు కాబట్టి, వారెళ్ళి మాట్లాడి అవసరమైతే మన రాష్ట్రం గురించి ఒక మంచి మాట చెప్పగలిగితే రాష్ట్రానికి కొన్ని నిధులు వచ్చే అవకాశమున్నది. దయచేసి ఈ చర్చలో మనం ఏ అంశాలు పెడదాం, ఏ రకంగా నిధులు తెచ్చుకోవడానికి ప్రయత్నం చేద్దామని, ఏ రకంగా తీర్మానం చేద్దామనేది వారు చెబితే బాగుంటుందని, దాని మీదే వారు మాట్లాడాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- ధన్యవాదాలు అధ్యక్షా. వారు కూడా సెంట్రల్ యూనివర్శిటీ రిసర్చ్ స్కాలర్. వారు ఇద్దరు ఇక్కడ intellectuals కాబట్టి వారిని చూస్తే భయపడుతాను. వారు ఏదైనా మాట్లాడి కన్విన్స్ చేయగలుగుతారు. వారు తెలియకుండానే అప్పుడప్పుడు మైల్డ్‌గా వార్నింగ్ కూడా ఇస్తుంటారు. అయితే ఈ రోజు గౌరవ ఉపముఖ్యమంత్రి గారు అడ్వైజ్ చేసినందుకు చాలా సంతోషం కానీ, దానికి ముందు అటు పక్షం కానీ, ఇటు పక్షం కానీ మాట్లాడిన ఎన్నో అంశాలు దీనికి అతీతంగా ఉన్నాయి. వాటిని కూడా సెట్ చేస్తే నేను ఇలా మాట్లాడి ఉండేవాడిని కాదు. ఇప్పుడే గౌరవ విప్ గారు మాట్లాడుతూ అయోధ్య వరకు వెళ్ళారు. వారు రాష్ట్రం దాటి పోవచ్చు కానీ నేను జిల్లా దాటి పోకూడదా అధ్యక్షా? కానీ నేను ఆ అంశంలోకి పోవడం లేదు. I am not deviating the subject. I respect the Honourable Chief Minister and Democracy Sir. డెమోక్రసీలో గెలుపు ఓటములు సహజమే. అవన్నీ మేము చూశాం కాబట్టి మేము దానిలోకి వెళ్ళడం లేదు. అయ్యో, గౌరవ మంత్రిగారు మాట్లాడి వెళ్ళిపోతే ఎలా సార్? వారి ముఖ్యమైన సబ్జెక్ట్ ఒకటి

మాట్లాడదామని అనుకున్నాను కానీ వారు సభలో నుంచి వెళ్ళిపోయారు.

(అధికార పార్టీ సభ్యులు.. మేము వింటామని చెప్పారు.)

మీరు వింటా అంటే నేను మాట్లాడుతాను. మంత్రి గారికి వేల కోట్ల రూపాయలు వర్క్ చేసే పెద్ద కంపెనీ ఉంది. దీనికి వారు కూడా కాంపిటీటరే. అమృత్ స్కీముకు కేంద్ర ప్రభుత్వం 3వేల 5వందల కోట్ల రూపాయలిస్తే, మీరు డబ్బే ఇవ్వలేదని అన్నారు. కానీ, టెండర్లు జరిగి పనులు నడుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమృత్ స్కీమ్కు ఇచ్చిన 3వేల 5వందల కోట్ల రూపాయలు గురించే నేను మాట్లాడుతున్నాను. టెండర్లకు సంబంధించి ఒక పబ్లిక్ డొమెయిన్, టెండర్ కాపీలు కూడా ఉండవు. ఉంటే నాకు ఒక టెండర్ కాపీ ఇవ్వమని నేను కోరుతున్నాను. సభా పక్షంలో ఆ 3వేల 5వందల కోట్ల రూపాయలకు సంబంధించి టెండర్ నోటీసులు కానీ, మొత్తం ప్రోసీజర్ కానీ, ఏ రకంగా టెండర్లు వేశారనే క్లారిఫికేషన్ ఇవ్వమనండి. ఒక సిట్టింగ్ జడ్జినో లేదా సిబిఐ ఎంక్వైరీనో పెట్టమనండి. అవి మాత్రం చేయరు. ఎందుకంటే 2 వేల 5 వందల కోట్ల రూపాయలను 3వేల 5వందల కోట్ల రూపాయలకు యాక్సిలరేట్ చేసి దాన్ని వారి మిత్రులకు ఇస్తే వారు 30 శాతం బ్యాక్ టూ బ్యాక్ ఇచ్చుకుంటున్నారు. కాంట్రాక్టర్గా వచ్చిన వాళ్ళు 30 శాతం బ్యాక్ టూ బ్యాక్ ఇస్తున్నారంటే వెయ్యి కోట్ల రూపాయలు దానిలో కుంభకోణం ఉన్నట్లే కదా అధ్యక్షా. ఇలాంటి కుంభకోణాలు....,

శ్రీ డి. శ్రీధర్ బాబు:- అధ్యక్షా, మరొక సారి మహేశ్వర్ రెడ్డి గారిని సబ్జెక్ట్ పై మాట్లాడాలని కోరుతున్నాను. ఇంత సీరియస్ సబ్జెక్ట్ నడుస్తుంది. కేంద్ర పథకాలకు సంబంధించిన అంశాల విషయంలో తప్పకుండా ప్రకటన చేయండి. అమృత్ స్కీమ్కు మేము ఈ విధంగా ఇచ్చామని చెప్పండి. దాని టెండర్స్కు సంబంధించిన అంశాన్ని మీరు ప్రశ్న రూపంలో, లేదా షార్ట్ డిస్కషన్కు పెట్టండి, లేదా ఏదైనా ఇతర రూపంలో రండి. అప్పుడు ప్రభుత్వం సమాధాన మిస్తుంది. దయచేసి ఇంత సీరియస్ ఇష్యూను డివియేట్ చేయవద్దని కోరుతున్నాను. దీని కంటెంట్ ఏంటి, దీని ఆబ్జెక్టివ్ ఏంటి, ఈ రోజు స్టేట్మెంట్కు సంబంధించిన ప్రాముఖ్యం ఏంటి వంటి వాటిపై మాట్లాడాలని ఇంతకు ముందే మా గౌరవ ఉప ముఖ్యమంత్రి గారు చెప్పారు. దాని గురించి ప్రస్తావన చేసినప్పుడు ఆ యాంగిల్లో పోదామని మీ ద్వారా మహేశ్వర్ రెడ్డి గారిని కోరుతున్నాను.

మిస్టర్ ప్యానెల్ స్పీకర్:- మహేశ్వర్ రెడ్డి గారూ, మీరు చెప్పవల్సిన సబ్జెక్ట్ చెప్పకపోతే మీ సమయం కూడా అయిపోతుంది. మీకు ఇప్పటికే 30 నిమిషాల సమయం అయిపోయింది. మీకు ఇంకొక 5 నిమిషాల సమయం మాత్రమే ఇస్తాను.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- సార్ మీరొక్కరే సీనియర్ సార్, మీరు మంత్రిగా కూర్చొవలసిన వాళ్ళు అక్కడ కూర్చున్నారు సార్, మీరు మంత్రి కావాలి సార్ నేను ఒకటే విషయం మాట్లాడదలచుకున్నాను.

మిస్టర్ ప్యానెల్ స్పీకర్:- మహేశ్వర్ రెడ్డి గారు మీరు మంత్రుల వైపు కాకుండా ఛైర్ వైపు చూసి మాట్లాడండి.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- అధ్యక్షా, నేను మిమ్మల్నే చూసి మాట్లాడుతాను. ఒక్క విషయం అధ్యక్షా, నేను సింపుల్గా ఒక విషయం అడుగుతున్నాను. గౌరవ శాసన సభ మంత్రి శ్రీధర్ బాబు గారు ఒక విషయం చెప్పారు, షార్ట్ డిస్కషన్కి ఈ రాష్ట్రంలో జరిగిన టెండర్ల విషయానికి సంబంధించిన డిస్కషన్కు ఒప్పుకున్నారు కదా. ఎప్పుడు ఏంటో మాకు షెడ్యూల్ ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

3.00 సా. గౌరవ శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి శ్రీధర్బాబుగారు ఒక అంశం చెప్పారు. ఈ రాష్ట్రంలో జరిగిన టెండర్ల విషయానికి సంబంధించి వారు లఘు చర్చ చేయడానికి ఒప్పుకున్నారు. ఆ విషయానికి సంబంధించి తమరు నాకు ఒకసారి షెడ్యూల్ ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. రెండవది అమృత్ పథకం ద్వారా తాగునీటి కోసం 3 వేల అయిదు వందల కోట్ల రూపాయల నిధులు మొన్న వచ్చాయి.

(అధికార పక్ష సభ్యుల నుండి అంతరాయం)

ఒక్క రూపాయి కూడా రాలేదన్నారు కదా? నేనేమి టెండర్ల గురించి మాట్లాడడం లేదు. మీరు కూర్చోండి. మూడు

వేల అయిదు వందల కోట్ల రూపాయలు వచ్చాయి. మరి అసలు డబ్బులే రాలేదని అంటున్నారు. నేనొక విషయం చెబుతాను. ఈ రాష్ట్రానికి 26 వేల కోట్ల రూపాయలను రీజినల్ రింగ్ రోడ్ (RRR)కు ఇచ్చారు. దేశంలోని ఏ రాష్ట్రంలో ల్యాండ్ అక్విజిషన్‌కు డబ్బులు ఇవ్వలేదు. కేవలం తెలంగాణ రాష్ట్రంలో ల్యాండ్ అక్విజిషన్‌తో సహా దానికి 35 వేల కోట్ల రూపాయలను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. RRR కనుక పూర్తయితే హైదరాబాద్ రూపు రేఖలు మారిపోతాయి. మీ కాంగ్రెస్ ప్రభుత్వం వారు 15 వేల కోట్ల రూపాయలకే ఇంత బాధపడుతున్నారు. 30 వేల కోట్ల రూపాయల గురించి మాట్లాడం లేదు. నేను ఎందుకంటున్నాను అంటే కాంగ్రెస్ ప్రభుత్వం వారికి మా 15 వేల కోట్ల రూపాయలు, 30 వేల కోట్ల రూపాయలు కాదు అధ్యక్షా, మాకు మూసీ నది ప్రాజెక్టుకు నిధులు ఇవ్వలేదని వారికి ఒకటే బాధ ఉన్నది. ఆ మూసీ నది వెనుక ఒక పెద్ద కథ ఉన్నది, టైమ్ వచ్చినప్పుడు చెబుతాను. ఆ మూసీనది వెనుక పెద్ద కుంభకోణం ఉంది. ఏ రకంగా అయితే కాళేశ్వరం ప్రాజెక్టు ఉందో అదే విధంగా మేము కూడా ఒక ఏటిఎం పెట్టుకుందామని అనుకుంటున్నారు అన్నాం గుత్తేదార్లు. నేను ఒక విషయం చెప్పదల్చుకున్నాను. 26 వేల కోట్ల RRR రోడ్డు గురించి .....

(అధికార పక్ష సభ్యుల నుండి అంతరాయం)

మూసీ నది ప్రాజెక్టు అనేది లక్ష కోట్ల రూపాయల కుంభకోణం. మూడుసార్లు కాదు ముప్పైసార్లు, ముప్పై వేలసార్లు కూడా చెబుతాము.

మిస్టర్ ప్యానల్ స్పీకర్:- మహేశ్వర్ రెడ్డి గారూ, ఒక్క నిమిషం ఆగండి. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఇంత సీరియస్ ఇష్యూపై జరుగుతుంటే మీరు ఇలా మాట్లాడితే ఎలా? కోట్ల మంది ప్రజలు సభలో ఏమి మాట్లాడుతారని ఎదురుచూస్తున్న తరుణంలో, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులు గురించిన సబ్జెక్టు మీద ఇంత సీరియస్ చర్చ నడుస్తున్నప్పుడు మీరు ఈ కుంభకోణాలు, ప్రాజెక్టుల గురించి మాట్లాడడం కరెక్టు కాదు. దయచేసి మీకు ఇచ్చినటువంటి 30 నిమిషాల సమయం ముగిసినది. మీకు ఇంకా మూడు నిమిషాలు మాత్రమే ఉంది కాబట్టి మీరు పూర్తి చేయండి. కనీసం సబ్జెక్టు పరంగా తెలంగాణ రాష్ట్రానికి న్యాయం జరిగేలా రెండు మాటలు చెప్పండి.

శ్రీమతి కొండా సురేఖ:- అధ్యక్షా, శ్రీధర్‌బాబు గారు చాలా క్లారిటీగా విభజన చట్టం అమలులో ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేశారు. తెలంగాణకు బిజెపి ప్రభుత్వం అన్యాయం చేసిందని అన్నారు. ఆయన వ్యక్తిగతంగా ఎక్కడా ఎవరిని కూడా విమర్శించలేదు. ముఖ్యమంత్రిగారు కూడా మాట్లాడాల్సిన విధానంలో అక్కడ నుంచి కేటీఆర్‌గారు రిమార్క్స్ చేశారు కాబట్టి ముఖ్యమంత్రిగారు అలా మాట్లాడారు. ఇక్కడ తను సంబంధం లేని విషయాలను మాట్లాడుకుంటూ అసలు సబ్జెక్ట్ వదిలిపెట్టి మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకి పైసలు రాలేదని బాధపడుతున్నారంటే .. ఆయన చెప్పే విధానం ఏ విధంగా ఉందంటే ఏదో డబ్బులు వస్తే కాంగ్రెస్ పార్టీ అవినీతి చేసుకుని సొమ్ము కాజేసుకుందామని చూస్తున్నామన్నట్లుగా మాట్లాడటం కరెక్ట్‌కాదు.

రాహుల్‌గాంధీగారి పేరు వారు పదేపదే లేవనెత్తు తున్నారు. ఇక్కడ నుంచి మోడీ గారి పేరును ఎవ్వరూ తీయలేదు. సభలో లేని వాళ్ల గురించి మాట్లాడుకుంటూ మళ్లీ సి.ఎం గారి సీటు గురించి పదేపదే అక్కడ నుంచి కామెంట్స్ వస్తున్నాయి. వారు కావాలని రెచ్చగొట్టి సబ్జెక్టును డీవియేట్ చేసి, డైల్యూట్ చేసి సబ్జెక్టు మీద సీరియస్‌నెస్ పోగొట్టడానికి ఆ ఇద్దరు ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయి. మహేశ్వర్‌రెడ్డిగారూ, మీరు సపోర్ట్‌చేస్తున్నారా లేక వ్యతిరేకిస్తున్నారా? ఇప్పుడు ప్రభుత్వం ఏం మాట్లాడిందంటే కేంద్రం నుంచి ఎందుకు మనకు నిధులు రాలేదు, రావాల్సిన అవసరం ఉందా లేదా? నిధులు రావడానికి మనం ఏమి చేయాలి, ఈ విషయాల గురించి మాట్లాడితే మేము కూడా స్పందిస్తాము. అలా కాకుండా వారు వ్యక్తిగతంగా విమర్శలు చేస్తూ, పార్టీలను విమర్శలు చేస్తూ మాట్లాడితే ఎలాగండీ? ముఖ్యమంత్రిగారు బయట మాట్లాడితే మీరు కూడా బయట ప్రెస్ ముందు మాట్లాడండి. కానీ శాసనసభలో ముఖ్యమంత్రిగారు మాట్లాడినప్పుడు ఆ విషయాల మీద మాట్లాడకుండా వేరే

విషయాలు ఇక్కడ మాట్లాడడం కరెక్ట్ కాదు. ప్రస్తుతం ఏ సబ్జెక్ట్ మీదనైతే మాట్లాడుతున్నామో ఆ సబ్జెక్ట్ మాత్రమే మాట్లాడమని వారికి చెప్పండి.

మిస్టర్ ప్యానల్ స్పీకర్:- మహేశ్వర్‌రెడ్డి గారూ, పూర్తి చేయండి ఇప్పటికే మీకు సమయం ఎక్కువగా ఇచ్చాము.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- అధ్యక్షా, ఇంత మంది మీద పడితే దమ్ము తీసుకోగలుగుతామా? నాది చిన్న ప్రాణం సార్. మంత్రులు, ఉపముఖ్యమంత్రి, విప్‌లు ఇంత మంది మాట్లాడుతారా అధ్యక్షా? నేను ఒక్క విషయం అడుగుతున్నాను. నేను సింపుల్‌గా చెబుతున్నాను. మంత్రిగారు హైలీ క్వాలిఫైడ్ పర్సన్ కాబట్టి వారికి అన్నీ తెలుసు. ఈ బడ్జెట్ అంశంలో CII&FICCI says that the Union Budget will help the growth of Telangana State. Sir, whether it may be Industrial Corridor or whatever it may be. ... My concern is that the Union Finance Minister or the Union Budget is kind enough for the State of Telangana. మేము ఇచ్చిన బడ్జెట్ ప్రకారమే ఇప్పటివరకు ఎనభైవేల కోట్ల రూపాయల ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు నడుస్తున్నాయి. ఇరవై ఆరు వేల కోట్ల రూపాయలు మేము రీజినల్ రింగ్‌రోడ్‌కి ఇస్తున్న నిధుల వల్లనే నడుస్తున్నాయి. 3500 కోట్ల రూపాయలు తాగునీటి కోసం, రైల్వే సుందరీకరణ కానీ, రైల్వే ట్రాక్‌లు కానీ ఇవన్నీ అంశాలు ఉన్నప్పటికీ ఇవన్నీ జరుగుతున్నాయంటే కేంద్ర బడ్జెట్‌తోనే నడుస్తున్నాయి. అదే విధంగా ఎన్‌ఆర్‌ఇజిఎస్‌కు సంబంధించి నేడు రాష్ట్రంలో చాలా వరకు .....

(కొంత మంది అధికారపార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

శ్రీ పొన్నం ప్రభాకర్ (హుస్నాబాద్):- అధ్యక్షా, ఎన్‌ఆర్‌ఇజిఎస్ కార్యక్రమం అనేది గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టడం జరిగింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ఇస్తున్నారు. వారు తెలంగాణ కొత్త రాష్ట్రమని ప్రత్యేకించి ఏమైనా తెచ్చారా? పొద్దున లేచినప్పటి నుంచి ఎన్నికల సమయంలో గ్రామ గ్రామానికి వెళ్లి ఉపాధి హామి తెచ్చామని అంటే ఎలా? ఏమి తెచ్చారనేది చట్టంలో ఉన్నది దాని గురించి మీరు చెబితే ఎలా? ప్రతి ఎన్నికల సమయంలో గ్రామ గ్రామానికి వెళ్లి ఉపాధి హామి తెచ్చామని చెబుతున్నారు. మీరు తెలంగాణ రాష్ట్రానికి ఏమి తెచ్చారో చెప్పండి. ఉపాధి హామీ కార్యక్రమాన్ని మేము కూడా చేశాము కదా. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి ఈ బడ్జెట్‌లో ఏం ఇచ్చారనేది చెప్పకుండా ఊరికే తప్పుగా అటు ఇటు మాట్లాడితే ఎలా? వాళ్లకు చర్చ చేయడం ఇష్టం లేదు. జరిగిన పొరపాటును ఏ విధంగా తప్పించుకోవాలని ఈ విధంగా వితండవాదం చేస్తున్నారు. మరో ప్రాజెక్టు, మరో అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారు. మూసీ నది గురించి మేము మాట్లాడగానే ఆయనకు అవినీతి కనపడుతుంది. ప్రధానమంత్రి సబర్మతి కట్టగానే అందులో అవినీతి కనపడలేదా? గంగా శుద్ధి చేస్తామన్నారు అందులో కూడా అవినీతి కనపడుతుందా? మేము సబ్జెక్ట్ మాట్లాడమని అడుగుతున్నాము. నిన్న కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగింది. ఆ విషయాన్ని వారు అవునంటారా, కాదంటారా చెప్పమనండి. అటు కాదు, ఇటు కాదని వారు మధ్యలో ఉండి కూడా మాట్లాడవచ్చు. వారు చెప్పే విషయాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. వారు ఎన్‌డిఏలో భాగస్వామి. అసలు తెలంగాణలో భారతీయ జనతాపార్టీ భాగస్వామి అవునా కాదా అని డిఎన్ఏ పరీక్ష చేయించాలి. తెలంగాణ పౌరుషం ఉందా లేకపోతే బానిసత్వం ఉందా అనేది తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

మిస్టర్ ప్యానల్ స్పీకర్:- మహేశ్వర్‌రెడ్డిగారూ, పూర్తి చేయండి.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- అధ్యక్షా, ముగిస్తున్నాను. పొన్నం ప్రభాకర్‌గారు నా మిత్రులు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ గురించి చెబుతూ వారు ఆవేశపడ్డారు కానీ నేను ఏమి మాట్లాడుతున్నానో వారు వినిపించుకోలేదు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ సబ్జెక్ట్ గురించి నేను మాట్లాడడం లేదు. ఎన్‌ఆర్‌ఇజిఎస్‌కు కేంద్రం ఇటీవల 800 కోట్ల రూపాయలు పంపించినప్పటికీ మా ఆర్థిక శాఖ మంత్రిగారు ఆ నిధులు మాకు ఇవ్వడం లేదు. ఆ నిధులను డైవర్ట్ చేశారా లేక గుత్తేదారులకు ఇచ్చుకున్నారా అనేది నాకు తెలియదు. 800 కోట్ల రూపాయలు... ఇస్తే చిన్న చిన్న గుత్తేదారులు రోడ్లు వేసుకున్నారు, చిన్న చిన్న బిల్డింగ్‌లు కట్టుకుంటామంటే

వాళ్లకు ఇవ్వలేదు. అంతేకాదు గ్రామ పంచాయతీ కోసం 15వ ఫైనాన్స్ కమిషన్‌లో ..... అంటే కేంద్రం నిధులు ఇవ్వలేదంటున్నారు, ఇచ్చిన నిధులను మాత్రం వాడకుండా డైవర్ట్ చేస్తారు.

3.10 సా. **శ్రీ డి. శ్రీధర్ బాబు**:- అధ్యక్షా, సభ్యులు మహేశ్వర్ రెడ్డి గారిని స్పష్టంగా ఒకటే అడుగుతున్నాను. న్యాయపరంగా రావాల్సిన నిధులు తప్పకుండా రావాలి, అది మన హక్కు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవిభజన చట్టానికి సంబంధించి విభజన చట్టంలో ఉన్న ఒక రాష్ట్రానికి న్యాయం చేస్తూ, మరొక రాష్ట్రానికి కూడా న్యాయం జరిగే విధంగా వారి చర్యలుంటాయా? లేదా చెప్పాలని కోరుతున్నాను. బిఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాల కథ వారు చెప్పారు. ఇప్పుడు వీరి కథ చెబుతున్నారు. ఇప్పుడు నిన్న జరిగిన కథ విషయంలో రాష్ట్ర విభజన చట్టానికి సంబంధించిన అంశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులు కేటాయిస్తే మాకు సంతోషమే. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల విషయంలో మాకు కూడా ప్రాధాన్యతను ఇవ్వాలని కోరుతున్నాం. వారు దానికి సహకరిస్తారా లేదా? దానికి వారి ఆలోచనలు ఏమిటీ అని అడుగుతా ఉంటే మొత్తం ఉన్నవి, లేనివన్నీ పథకాల గురించి మహేశ్వర్ రెడ్డి గారు చెబుతున్నారు. మొత్తంగా దాని డైరెక్షన్ చేంజ్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈరోజు వారు చెప్పదలుచుకున్నది అంతా చెప్పారు. మనకు అంతా అర్థం అయిపోయింది. మన రాష్ట్ర విభజనకు సంబంధించిన ప్రయోజనాల గురించి బిజెపి ఒక రాష్ట్రానికే మేలు చేస్తుందనే ఆలోచన ప్రక్రియ కనబడుతోంది. దయచేసి తదుపరి సభ్యులకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని తమరిని కోరుతున్నాను.

మిస్టర్ ప్యానెల్ స్పీకర్:- మహేశ్వర్ రెడ్డి గారు, మీరు పూర్తి చేస్తే ఒక్క నిమిషంలో పూర్తి చేయండి. లేదంటే తదుపరి సభ్యుడికి ఇస్తాను.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- అధ్యక్షా, మొన్న 15వ ఫైనాన్స్ కమిషన్ రూ.500కోట్లు పంపించిందని చెప్పాను. వాటిని ఎందుకు డైవర్ట్ చేశారని అడుగుతున్నాను సార్.

శ్రీ పొన్నం ప్రభాకర్:- అధ్యక్షా, ఈరోజు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి సంబంధించి చర్చ జరుగుతోంది. ఆ చర్చలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించినట్లుగా తెలంగాణకు న్యాయం జరగడం కొరకు గౌరవ సభ్యుల నుండి సలహాలను తీసుకోవడం జరుగుతుంది.

మిస్టర్ ప్యానెల్ స్పీకర్:- మంత్రి గారు ఒక్క నిమిషం. మహేశ్వర్ రెడ్డి గారు ఒక్క నిమిషంలో పూర్తి చేయండి.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- ధన్యవాదాలు అధ్యక్షా. మొన్ననే కేంద్ర ఆర్థిక మంత్రి గారు మూడు కోట్ల ఇండ్ల నిర్మాణం కొరకు దాదాపు పది లక్షల కోట్లు మంజూరు చేయడం జరిగింది. అందులో భాగంగా మన దగ్గర నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కూడా నిధులు కేటాయించడం జరిగింది. ఇన్ని నిధులు కేటాయించినా కూడా ఇంకా నిధులివ్వడం లేదని అంటున్నారు. కేంద్రం నుండి వస్తున్న నిధులన్నీ తీసుకుంటారు. వేల, లక్షల కోట్లు తీసుకుంటారు, పైనుండి కేంద్రంపై ఏదో ఒక బురద చల్లాలి. ఎందుకంటే, రాష్ట్రంలో మేము ఎనిమిది సీట్లు గెలుపొందడంతో ఏదో ఒక అక్కసుతో కేంద్రాన్ని బదనాం చేయాలి, కేంద్రంపై ఏదో ఒక నెపం పెట్టాలనే ఆలోచన మంచిది కాదు. ఫెడరల్ స్ఫూర్తి ఉండాలి. Sir, India is a Democratic Republic Country where you have unitary and federal features. It is also a quasi-federal Country and you have to understand it Sir. ఒక ఉదార స్వభావంతో ఆలోచించాల్సిన ముఖ్యమంత్రి గారు ఈ రకమైన చర్చ పెట్టడమే మంచిది కాదు. ఫెడరల్ రాష్ట్రాల్లో ఇలాంటి చర్చలు పెట్టడం మంచి పద్ధతి కాదు. ప్రజాస్వామ్యంలో ఆరోగ్యవంతమైన అంశం కాదు. ఇంకా చాలా అంశాలున్నాయి. కానీ, మీరు మాట్లాడనివ్వడం లేదు. గౌరవ రెవెన్యూ మంత్రి గారు అకస్మాత్తుగా లేచారు. నేనైతే వారి గురించి ఏమీ మట్లాడలేదు. టెండర్‌లో పార్టిసిపేట్ చేశారు కానీ, వారికి టెండర్ రాలేదని మాత్రమే అన్నాను.

మిస్టర్ ప్యానెల్ స్పీకర్:- నేను ఇన్ని సార్లు మీకు అవకాశం ఇచ్చినా మీరు సరిగా వినియోగించుకోవడం లేదు. మంత్రి గారు, పొన్నం ప్రభాకర్ గారు మాట్లాడండి.

శ్రీ పొన్నం ప్రభాకర్:- అధ్యక్షా, తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. అధ్యక్షా, వారికి చాలాసార్లు అవకాశం కల్పించారు. రాష్ట్రప్రయోజనాలకు అనుగుణంగా నిన్నటి కేంద్ర బడ్జెట్ లేదు.

(సభ్యులు డా.పాల్వాయి హరీష్‌బాబు వెల్‌లోకి వచ్చి సభ్యులు మహేశ్వర్ రెడ్డి గారికి మరికొంత సమయం మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని ప్యానెల్ స్పీకర్ గారిని కోరడం జరిగింది. మరికొందరు బిజెపి శాసనసభ్యులు శ్రీ పాయల్ శంకర్, శ్రీ కాటిపల్లి వెంకట రమణ రెడ్డి, శ్రీ రామారావు పవార్ వారి, వారి సీట్లలో నుండి లేచి నిలబడి శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డికి మైకు ఇవ్వకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.)

రాష్ట్రానికి న్యాయం జరగాలని మనం ప్రతిపాదిద్దాం. మహేశ్వర్ రెడ్డిగారు బిజెపి పార్టీ కాబట్టి, అవసరమైతే అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి మన రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతారని ఆశించాము. కానీ, ఆ విషయం మాట్లాడకుండా, తెలంగాణ రాష్ట్రప్రయోజనాల అంశాన్ని ప్రస్తావించకుండా అనేకమైన రాజకీయ అంశాలు మాట్లాడుతున్నారు. మహేశ్వర్ రెడ్డిగారిని గానీ, భారతీయ జనతా పార్టీ సభ్యులను ఒకటే మాట అడుగుతున్నాను. తెలంగాణ అంటే ఎందుకు అంత కక్ష? తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యే దశలో కూడా శ్రీమతి సుష్మాస్వరాజ్ గారు గనుక ఒకవేళ మద్దతు ఇవ్వకపోయి ఉంటే వీళ్లు ఒప్పుకునే వారు కాదు. బేసిక్‌గా తెలంగాణ ఏర్పాటుకు భారతీయ జనతా పార్టీ వ్యతిరేకంగా ఉంది. ఈరోజు నేను ఊరికనే మాట్లాడటం లేదు. ఆనాటి తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక సాక్షిగా మాట్లాడుతున్నాను. కీ.శే. శ్రీమతి సుష్మాస్వరాజ్‌గారు భాగస్వామ్యం తీసుకొని, వారు నాయకత్వం వహించి మద్దతు ఇవ్వకపోతే వీళ్లు తెలంగాణ ఏర్పాటుకు ఒప్పుకునే వాళ్లేకాదు. తెలంగాణ ఏర్పాటు 60 సంవత్సరాల ఆకాంక్ష. అమరుల ప్రాణ త్యాగాల మీద ఏర్పడ్డ తెలంగాణ. ఇక్కడ మాజీ పార్లమెంట్ సభ్యులున్నారు. ఏ బిల్లునైనా ప్రవేశపెట్టినప్పుడు lobbies clear అని తలుపులు వేసి బిల్లులు పాస్ చేస్తారు. అది తెలియని ప్రధానమంత్రి గారు పార్లమెంట్‌సాక్షిగా తెలంగాణ ఏర్పాటును అవమానపరిస్తే, ఆనాడు సభలో ఉన్నటువంటి పార్లమెంట్ సభ్యులు మాట్లాడలేదు. ఈరోజు గౌరవ బిఆర్ఎస్ సభ్యులు లేరు కాబట్టి, తెలంగాణ పదాన్ని లేకుండా చేస్తున్నారని కేటీఆర్ అంటున్నారు. అయ్యా, ఆనాడు 9 మంది బిఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులుండగా, ప్రధానమంత్రి తెలంగాణను వ్యతిరేకిస్తూ తల్లిని చంపి బిడ్డను తీసుకుపోయారని, తలుపులు వేసి దేశ విభజనను కోరేవారు ఈ బిల్లును ఆకాంక్షించారని అంటే, ఆ 9 మంది బిఆర్ఎస్ ఎంపీలు అప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని అడుగుతున్నాను. తెలంగాణలో ఉన్న భారతీయ జనతా పార్టీ నాయకులు వారి రక్తం డిఎన్ఏను పరీక్ష చేయించుకోవాలని కోరుతున్నాను. తెలంగాణ పౌరుషం ఉందా లేదా? ఈరోజు మీరు బిజెపికి బానిసలుగా ఉండే ప్రయత్నం చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రఏర్పాటు 60 సంవత్సరాల తెలంగాణ ప్రజల ఆకాంక్ష. అటువంటి తెలంగాణ ఏర్పాటును పార్లమెంట్‌సాక్షిగా అవమానించినటువంటి మోదీ వాఖ్యలు వాపస్ తీసుకోవాలని సభ తీర్మానం చేయాల్సిన అవసరముందని తెలియజేస్తున్నాను. నిధుల కేటాయింపులో కూడా రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే ఆ విషయంలో మాట్లాడకుండా ఉంటే ఎలా అధ్యక్షా? అసలు నేను కాంగ్రెస్‌లో ఉంటే మంత్రి అయ్యే అవకాశం ఉండేదని సభ్యులు శ్రీ మహేశ్వర్ రెడ్డి గారు బాధపడుతున్నారు. భారతీయ జనతా పార్టీ తరఫున మాట్లాడకపోతే ఎక్కడ ఫ్లోర్ లీడర్ పీకేస్తారో అని అనుకుంటున్నారు.

మిస్టర్ ప్యానెల్ స్పీకర్:- మంత్రి గారు ఒక్క నిమిషం కూర్చోండి.

శ్రీ పొన్నం ప్రభాకర్:- అధ్యక్షా, నన్ను ఎన్నిసార్లు ఆపుతారు? నేను మాట్లాడేది వాస్తవం కాదా? నిండు పార్లమెంట్‌సాక్షిగా నరేంద్రమోదీ గారు అన్నారా, లేదా రికార్డ్ చెక్ చేయండి. ఎందుకు తెలంగాణ మీద ఇంత వివక్ష? ఎందుకు తెలంగాణ మీద కక్ష? నిన్నటి బడ్జెట్‌లో ఒక్కసారి కూడా తెలంగాణ పేరును ఎందుకు ప్రస్తావించలేదని అడుగుతున్నాను. అది చెప్పమంటే చెప్పరు. దానిగురించి మాట్లాడరు. ఎందుకు మాట్లాడరని అడుగుతున్నాను. అడిగితే ఎందుకు ఉలిక్కిపడుతున్నారు?

మిస్టర్ ప్యానెల్ స్పీకర్:- మంత్రి గారు ఒక్క నిమిషం కూర్చోండి, హరీష్ గారు మీరు మీ సీట్లో కూర్చోండి. మహేశ్వర్ రెడ్డి గారికి ఇవ్వాల్సిన సమయం కంటే ఇరవై నిమిషాలు ఎక్కువగా కేటాయించాను. వారికి ఎన్నిసార్లు చెప్పినా సబ్జెక్ట్‌ని డెలివర్ చేయలేకపోతున్నారు. సబ్జెక్ట్‌ను డీవియేట్ చేసి కాంట్రవర్సీ చేస్తున్నారు. మంత్రి గారిని రెండుసార్లు కూర్చోబెట్టి మహేశ్వర్ రెడ్డి గారికి ప్రసంగం పూర్తి చేయడానికి అవకాశం ఇచ్చినా కూడా వారు సమయాన్ని వాడుకుంటలేరు. ఇంతకంటే ఎక్కువ సమయం ఇవ్వలేము. అంతగా మాట్లాడాలని అనుకుంటే మంత్రి గారు మాట్లాడాక చూద్దాం కూర్చోండి.

శ్రీ పొన్నం ప్రభాకర్:- అధ్యక్షా, నేను కరీంనగర్ లోక్‌సభనియోజకవర్గానికి సంబంధించిన ఏడు శాసనసభ నియోజకవర్గాలలో ఒక నియోజకవర్గానికి శాసనసభ సభ్యుడిగా నేను ప్రాతినిధ్యం వహిస్తున్నాను. ఆ స్థానం నుండి లోక్‌సభలో శ్రీ బండి సంజయ్ గారు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అదేవిధంగా నేను హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రిగా ఉన్నాను. హైదరాబాద్ నుండి శ్రీ జి. కిషన్ రెడ్డి గారు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మావోళ్లంతా ఎనిమిది మంది ఎంపీల గురించి మాట్లాడినా, నేను ఇద్దరు కేంద్ర మంత్రులను అడుగుతున్నాను. వారు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాలకు కూడా ఒక రూపాయి నిధులు తేనివారు రేపు తెలంగాణలో ఎట్లా అడుగుపెడతారని అడుగుతున్నాను. కేంద్రం వివక్ష పూరితంగా చేసినప్పుడు మన రాష్ట్రం నుండి నేడు కేంద్ర మంత్రులుగా బాధ్యత వహిస్తున్న ఇద్దరు వ్యక్తులు, బాధ్యత వహించకుండా ప్రజాహితమైన బడ్జెట్ ప్రవేశపెట్టారని చెబుతున్నారు. తెలంగాణకు ఏమి చేశారో చెప్పాలి. అక్షింతల పేరు మీద రాముడి ఫోటోలు పెట్టి, ఈరోజు మతం పేరుమీద మాట్లాడి ఎనిమిది సీట్లు గెలుచుకున్న వారు ఈ తెలంగాణ రాష్ట్రంలోని ఇంతపెద్ద హైదరాబాద్ నగరానికి...

3.20 సా.

(బిజెపి సభ్యులు శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి తదితరులు తమకు మాట్లాడే అవకాశం కావాలంటూ, గౌరవ మంత్రి గారిని కూర్చోవలసిందిగా పలుమార్లు కోరసాగారు)

అధ్యక్షా, మీరు కూర్చోమంటే నేను కూర్చుంటాను. ఇలా భయపెడితే ఈ బిడ్డ భయపడడని గతంలో ఒకసారి చెప్పాను. మళ్ళీ ఒకసారి చెప్తున్నాను. హైదరాబాద్ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నటువంటి వీళ్ళు హైదరాబాద్‌కు ఏయే నిధులు తీసుకువచ్చారో చెప్పాలని అడుగుతున్నాం. ఈరోజు వాళ్ళు ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ. గౌరవ సభ్యులు శ్రీ కె. తారక రామారావు గారు మాట్లాడుతూ మేము గత పదేళ్ళు చాలా గట్టిగా కొట్లాడినాం, ప్రతీ బిల్లులో మద్దతిచ్చారన్నారు. ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అని మా పార్టీ ఆరోజు కూడా చెప్పింది. ఇవాళేం చేశారు? రాజకీయంగా తెలంగాణకు సంబంధించిన విషయంలో అన్యాయం జరుగుతోంటే ఎన్నడైనా అఖిలపక్షాన్ని తీసుకుపోయారా? 2014లో తెలంగాణ ఏర్పడిన నాడు 7 మండలాలతోపాటు సీలేరు ప్రాజెక్టునిస్తే, మీ కళ్ళ ముందరే ఆర్డినెన్స్ ద్వారా ఆ మండలాలను తీసుకొనిపోతే, ఒక్కరోజు బంద్‌కు పిలుపునిచ్చారు. అంతకు ముందు కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ తెచ్చామని చెప్పు కుంటున్న మీరు 7 మండలాలు పోతే ప్రేక్షకుల్లా ఎందుకు చూస్తూ కూర్చున్నారని ఈ సభ ద్వారా మిమ్మల్ని అడుగుతున్నాను. ఆనాడు నేను ఈ సభలో సభ్యుడిని కాదు. 2009 నుంచి 2014 దాకా మా పార్టీ అయినప్పటికీ కూడా తెలంగాణ కోసం కొట్లాడితే, వచ్చిన తెలంగాణ నుంచి 7 మండలాలను, సీలేరు ప్రాజెక్టుని తీసుకుపోయారు. ఆంధ్రప్రదేశ్‌కు నిధులివ్వడానికి మాకు వివక్ష లేదు. మేము ఆంధ్ర ప్రదేశ్ విభజనకు సంబంధించిన హక్కుల గురించి, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని అంశాల గురించి పోరాటం చేస్తూ, మహేశ్వర్ రెడ్డి గారితో ఢిల్లీకి వచ్చి ఆ అంశాల గురించి అడగడానికి సిద్ధంగా ఉన్నాం. ఆ విధంగా సభ్యులు స్పందిస్తారనుకుంటే, తెలంగాణ ప్రయోజనాలను పక్కనబెట్టి మళ్ళీ రాష్ట్ర ప్రభుత్వం యొక్క కార్యక్రమాల గురించి మాట్లాడుతున్నారు.

అధ్యక్షా, ఇవాళ తెలంగాణకు నిజంగా అన్యాయం జరిగిందా లేదా అని మహేశ్వర్ రెడ్డి గారిని గుండెల మీద చేతులేసుకుని చెప్పమనండి, భారతీయ జనతా పార్టీ నాయకులని చెప్పమనండి. ఎంతసేపూ ఉపాధి హామీ

పనులో, లేకపోతే సహజంగా 28 రాష్ట్రాలకిచ్చేటువంటి వాటిని 29వ రాష్ట్రానికి కూడా ఇస్తే, దాన్ని మీ ప్రతిభ అనుకుంటే ఎలా? వాళ్ళని ఇచ్చేవాళ్ళనుకుంటే ఎలా? చిన్న రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రానికి, 29వ రాష్ట్రానికి భారతీయ జనతా పార్టీ గత పదేళ్ళలో, ఇప్పుడు కాదు పది సంవత్సరాలుగా ఏమిచ్చింది?

(కేవలం మమ్మల్ని విమర్శించడానికే ఈ తీర్మానం పెటినట్లుందంటూ బిజెపి సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం కలుగసాగింది)

అదేమంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సహక రించలేదు, వాళ్ళ అడగడం లేదని భారతీయ జనతా పార్టీ అంటుంది. ఇవాళ మేము ప్రధాన మంత్రి గారిని కలిశాం. మంత్రులని కలిశాం. కేంద్రంతో సత్సంబంధాలుంటాయని సంకేతాలిచ్చాం. ఇవాళ నువ్వు బడే భాయ్, ఛోటా బాయ్ అన్నావు. అభివృద్ధికి సంబంధించి అన్నావు.

శ్రీ కె. తారక రామారావు:- అధ్యక్షా, నాకు మాట్లాడే అవకాశమివ్వండి.

మిస్టర్ ప్యానెల్ స్పీకర్:- రామారావు గారూ ఒక్క నిమిషం. మీరు మళ్ళీ మాట్లాడుదురుగానీ, మీరు కూర్చోండి. మహేశ్వర్ రెడ్డి గారూ, నేను మీకు చాలా సార్లు అవకాశమిచ్చాను. మీకు చాలాసార్లు అవకాశమిచ్చినా మీరు వాడుకోలేదు. మీరు సమయాన్ని వృధా చేశారు. ఇంకా చాలామంది సభ్యులు మాట్లాడవలసి ఉంది. అందుకని మినిస్టర్ గారు మాట్లాడిన తరువాత అవసరమనుకుంటే, మళ్ళీ అవకాశమిస్తాను. దయచేసి కూర్చోండి. మినిస్టర్ గారు మాట్లాడిన తరువాత మహేశ్వర్ రెడ్డి గారికీ అవకాశమిస్తాను, రామారావు గారికి కూడా అవకాశమిస్తాను. వారు మాట్లాడిన తరువాత మీకు మైకిస్తాను. దయచేసి కూర్చోండి.

శ్రీ పొన్నం ప్రభాకర్:- అధ్యక్షా, నిన్న బడ్జెట్ ప్రవేశపెట్టినటువంటి నిర్మలా సీతారామన్ గారు, గత కొద్ది సంవత్సరాల క్రితం నిజామాబాద్ వచ్చినప్పుడు అక్కడి రేషన్ షాపు దగ్గర ప్రధానమంత్రి ఫోటో లేదేమిటని అడిగింది. అయ్యా, అటువంటి ఆర్థిక శాఖామాత్యులు, తెలుగులో మాట్లాడగలిగేటువంటి బిడ్డను ఈరోజు మనం మన ఆడబిడ్డగా భావించుకుంటాం. అటువంటి ఆమె కూడా తెలంగాణ ఊసు ఎత్తడానికే.., తెలంగాణకు నిధులివ్వకపోతే అడగొద్దా? బరాబర్ అడుతాం. వికసిత్ భారత్ పేరు మీద, సబ్ కే సాథ్ సబ్ కా వికాస్ అన్న భారతీయ జనతా పార్టీ నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని గత పది సంవత్సరాలుగా వివక్షపూరితంగా చూస్తోంది. ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదు.

(కేవలం విమర్శించడానికే చర్చ పెట్టారంటూ బీజెపి సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం కొనసాగుతోంది)

తెలంగాణ పట్ల వివక్షపూరితంగా మాట్లాడి, తెలంగాణ ఏర్పాటును తెలంగాణ అమరవీరులను అవమాన పరచిన మీకు, తెలంగాణలో ఈరోజు మతం పేరు చెప్పుకుని గెలిచి అదే బలమనుకుంటే, వంద సీట్లలో డిపాజిట్లు కూడా రానటువంటి వీళ్ళు కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తున్నారు. మళ్ళీ ఒకసారి అడుగుతున్నాను, ఇక్కడ ఉన్నటువంటి భారతీయ జనతా పార్టీ నాయకులు తెలంగాణ ప్రయోజనాల కోసం కలిసి వస్తే, మా గౌరవ ముఖ్యమంత్రి గారితో పాటు మా మంత్రులం అందరం కూడా.., కిషన్ రెడ్డి గారు కేంద్ర మంత్రిగా అయిన వెంటనే, ఒక మంచి సుహృద్భావ వాతావరణం ఉండాలనే ఉద్దేశంతో 'అన్నా హైదరాబాద్‌కు సంబంధించిన డెవలప్‌మెంట్ చేయాలి' అనడిగాం. కానీ, ఇవాళ హైదరాబాద్ వాటర్ వర్క్స్‌కు ఇబ్బంది ఉంది. మేము హైదరాబాద్ శాసనసభ్యులందరితో సమావేశమయ్యాం. ఇంత పెద్ద మహానగరానికి కేంద్రం నుండి ఒక్క రూపాయి కూడా రానటువంటి పరిస్థితి. రూ. 49 వేల కోట్ల రూపాయ లుంటే, రూ. 9 వేల కోట్ల రూపాయలు ఇచ్చినటువంటి పరిస్థితి. ఇవాళ అందుకే, ఈ సభ ద్వారా ఒక్కటే డిమాండ్ చేస్తున్నాను. బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిన దానిపై భారతీయ జనతా పార్టీ మాట్లాడగలుగుతారా? మాట్లాడరా? చెప్పాలి.

(బీజెపి సభ్యులు మంత్రిగారు మాట్లాడింది చాలంటూ, వారిని కూర్చోవలసిందిగా పదే పదే కోరడంతో సభకు తీవ్ర అంతరాయ కలుగసాగింది)

అధ్యక్షా, నన్ను మీరు కూర్చోమంటే, మళ్ళీ నేను కూడా ప్రొటెస్ట్ చేస్తాను. ఇన్నిసార్లు ఆపుతుంటే నేను ఎలా మాట్లాడాలి? నేను మాట్లాడిన తరువాత వారికి అవకాశమివ్వండి. I am not yielding. నాకు తమరు అవకాశమిచ్చారు. నేను మాట్లాడుతున్నాను. నేను వాళ్ళలాగా గంటల తరబడి సమయం తీసుకోను. నాకు 15 నుండి 20 నిమిషాల సమయం చాలు, వారికి సంబంధించినటువంటి విషయాలను ఖుల్లా ఖుల్లా చేయడానికి. ఈరోజున్న పరిస్థితుల్లో భారతీయ జనతా పార్టీని నేను అడిగాను. చట్ట సభల గురించి మీకు తెలిసుంటే, చట్ట సభలో నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని అవమానపరచడం తప్పని ఈ వేదికగా చెప్పండి. అలా చెప్పే ధైర్యం లేదు. ఆనాడు మాజీ పార్లమెంటు సభ్యులు వివేక్ గారు, రాజగోపాల్ రెడ్డి గారు ఇవాళ ఇక్కడ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఆనాడు సుష్మస్వరాజ్ గారు లేకుంటే మీరు ఎన్నడో తెలంగాణను పుట్టి ముంచెటోళ్ళు.

(వారు మీ పార్టీకి చెందిన వారు కాదు, మా పార్టీకి చెందినవారంటూ బీజెపి సభ్యులు అన్నారు)

మేము వారిని చిన్నమ్మా అని గౌరవిస్తున్నాం. వారిని మేమెన్నడూ అగౌరవపరచలేదు. మా నాయకురాలు సోనియమ్మ గారితో సమానంగా సుష్మస్వరాజ్ గారిని మేము చిన్నమ్మా అని గౌరవిస్తున్నాం. కానీ, మీరేమో 29వ రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణను చిన్న చూపు చూస్తున్నారు. మేము చిన్నమ్మా అనంటే, మీరు చిన్న చూపు చూస్తున్నారయ్యా. మేము రాజకీయపరమైన అధికారంలో ఉన్నాం, మంత్రిగా ఉన్నాం, మా ప్రభుత్వం ఉంది, మేము రాష్ట్ర ప్రయోజనాల గురించి బరాబర్ అడుగుతూ ఉంటాం.

(బీజెపి సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం కలుగసాగింది)

మిస్టర్ ప్యానెల్ స్పీకర్:- మీరు ఇలా సభకు అంతరాయం కలిగించడం మంచిది కాదు.

శ్రీ పొన్నం ప్రభాకర్:- అధ్యక్షా, వారేమైనా లొల్లి పెట్టుకోనీయండి, మీరు వారినేమీ అనకండి.

(బీజెపి సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం కలుగసాగింది)

అధ్యక్షా, భారతీయ జనతా పార్టీ ప్రవేశపెట్టినటువంటి ఆ బడ్జెట్‌ను ఒకసారి పరిశీలించినట్లయితే, ఎంతసేపూ కుర్చీ కాపాడుకోవడానికి, ఆంధ్రప్రదేశ్‌కు, బీహార్‌కూ తప్ప, తెలంగాణ పేరు ఎత్తడానికి కూడా భయపడుతున్నటువంటి పరిస్థితుల్లో వీళ్ళు ఇలా మాట్లాడితే ఎలా అధ్యక్షా. ఎందుకివ్వ లేదో, కారణం చెప్పగలుగుతారా? ప్రజాహితమంటే ఏంటి? వికసిత్ భారత్‌లో తెలంగాణ రాష్ట్రం భాగం కాదా? సబ్ కా వికాస్ – సబ్ కే సాథ్ అంటే తెలంగాణ అందులో భాగం కాదా? తెలంగాణ మీద విషం చల్లుతున్నారు. తెలంగాణ పట్ల వివక్ష ఉంది. ఎంతసేపూ ఉపాధి హామీ ఇచ్చాం, ఉపాధి కార్యక్రమం గురించి చెప్పామంటారు. రొటీన్‌గా ఇచ్చారు. అది చట్టంలో మా హక్కు. మేము ఇవాళ రూపాయి పన్ను కడితే, మీరు 40 శాతమే ఇస్తున్నారు. మీరు వేరే రాష్ట్రాలకు అనేకమిస్తున్నా మేమెన్నడూ అడగడం లేదే. కానీ, బడ్జెట్‌లో మా రాష్ట్ర ప్రయోజనాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునేటువంటి తెలంగాణ గడ్డ కాదిది. దయచేసి ఆలోచన చేయండని ఈ సందర్భంగా నేను కోరుతున్నాను.

ఆరోజు మిత్రులు హరీష్‌రావు గారు చెప్పారు. ఆనాడు తెలంగాణ పదం నిషేధం అన్నటువంటి వాళ్ళున్నారు. చాలా మంది చాలా రకాలుగా ఉన్నారు. కానీ, ఆఖరుకి ఆర్టికల్ 3 ద్వారా కాంగ్రెస్ పార్టీ ఇస్తేనే తెలంగాణ రాష్ట్రమేర్పడిందనే విషయాన్ని దయచేసి గౌరవ సభ్యులు మరచిపోవద్దని నేను గౌరవ సభ్యులని కోరుతున్నాను. ఆనాడు మేము స్వంత కాంగ్రెస్ పార్టీలో ఉండి కూడా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల మేము ఏవిధంగా మాట్లాడామో, అలాగే ఇవాళ మీరు భారతీయ జనతా పార్టీకి ఏవిధంగా మీకు మీరు సర్ది చెప్పుకుంటారో, ఆ విధంగా సర్ది చెప్పుకోవాలని కోరుతున్నాను. అదేవిధంగా ఈరోజు హైదరాబాదుకు సంబంధించి, తెలంగాణకు సంబంధించి ఏ విధమైన ప్రతిపాదనలను తీసుకువస్తారో చెప్పవలసిందిగా ఈ సందర్భంగా కోరుతున్నాను. ఇక్కడున్నటువంటి అనేక చారిత్రాత్మక ప్రదేశాలు, అనేక విభజన చట్టానికి సంబంధించినటువంటి హామీలు అన్నీ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవలసిందిగా ఈ సందర్భంగా

భారతీయ జనతా పార్టీ సభ్యులని కోరుతున్నాను. అదే విధంగా ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన విషయాల్లో కావచ్చు, మా జిల్లాలో సిరిసిల్ల టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ఉంది. ఈరోజు సిరిసిల్ల టెక్స్‌టైల్ ఇండస్ట్రీ గురించి మా గౌరవ శాసనసభ్యుడు లెటర్ వ్రాస్తే, బండి సంజయ్ గారు మీకు ఇవాళ జ్ఞాపకం వచ్చిందా అనడుగుతున్నారు.

3.30 సా. అవును, వారికి ఇవాళనే జ్ఞాపకం వచ్చింది. నాకు ఇవాళనే జ్ఞాపకం వచ్చింది మరి ఐదు సంవత్సరాల ఎం.పి., ఇప్పుడు కేంద్ర మంత్రి అయ్యారు, సిరిసిల్లకి మీరేమి చేశారని నేను అడుగు తున్నాను. మా సభ్యులు లెటర్ రాస్తే, వారిని అవమా నించారు, నేనడిగితే నన్ను అవమానిస్తావు, కానీ, ఇవాళ సిరిసిల్లలో ఆత్మహత్యలు జరుగుతుంటే, కేంద్ర మంత్రిగా, అక్కడ పార్లమెంటు సభ్యునిగా ఏమి చేసినావని అడుగుతున్నాను?

(బీజేపీ సభ్యుల నుండి అంతరాయం)

సభ్యులు పాల్వాయి హరీష్ బాబు అహంకారంతో ఏయ్ అని అంటే ఊరుకోను, జాగ్రత్త. గాలి ప్రస్తావనలు చేయడం పద్ధతి కాదు అధ్యక్షా. మీరు సభా సాంప్రదాయాన్ని, నా గౌరవాన్ని కాపాడవలసిన అవసర ముంది. నా సిరిసిల్ల చేనేత కార్మికులు ఈరోజు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

(సభ్యులు పాల్వాయి హరీష్‌బాబుతోబాటు పలువురు బీజేపీ సభ్యులు వారి సీట్ల నుండి ముందుకు వచ్చి అంతరాయం కలిగించసాగారు)

మిస్టర్ ప్యానల్ స్పీకర్:- హరీష్‌బాబు గారు మీరు మీ సీట్లో కూర్చోండి. మీరు పోడియంకు వచ్చేస్తున్నారు, మిగతా సభ్యులపైకి పోతున్నారు. మీరు కొత్త సభ్యులు. మీరు ముందు కూర్చోండి. మంత్రిగారు.. మీరు మాట్లాడండి.

శ్రీ పొన్నం ప్రభాకర్:- ఏయ్ అనడం ఏంటి? సభ్యున్ని కాదా నేను? హరీష్‌బాబు గారు తమ కుర్చీలో నుండి బయటకు వచ్చి మహేశ్వర్ రెడ్డిగారికి పేపర్లు తెచ్చి వారికి చూపడం ఏమిటి? మీరు ఇండిపెండెంట్‌గా మీరే మాట్లాడండి.

మిస్టర్ ప్యానల్ స్పీకర్:- మంత్రిగారు మీరిక్కడ మాట్లాడండి.

శ్రీ పొన్నం ప్రభాకర్:- నేను సిరిసిల్ల ప్రాంతమున్న కరీంనగర్ పార్లమెంటు సభ్యునిగా గతంలో పని చేశాను, కేటీఆర్‌గారు సిరిసిల్ల టెక్స్‌టైల్ ఇండస్ట్రీ అడిగితే తప్పా? చేనేత కార్మికులు చనిపోతున్నారు. కేంద్రం నుంచి ఏమిచ్చారు? సిరిసిల్ల ప్రాంతంలో చేనేత కార్మికులను ఆదుకోడానికి ఏమిస్తున్నారు? వాళ్ళేమి చేయరు.

(బీజేపీ సభ్యుల నుండి అంతరాయం)

నేనొక్కటే అడుగుతున్నాను. ఈ సభ ద్వారా చర్చ జరుగుతా ఉంది, నరేంద్ర మోడీగారికి తెలంగాణ అంటే ఇష్టం లేదు, తెలంగాణ ఏర్పాటును పార్లమెంటు సాక్షిగా అవమానపరచినాడు, అమరవీర్లను కించపరిచిండు. అందుకే తెలంగాణకు సంబంధించి టీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా, నిర్లక్ష్యం చేస్తున్నాడు. ఆనాడు మీకు టీఆర్ఎస్‌కు కేంద్రంతో సత్సంబంధాలు లేవనే సాకుండేది. కానీ, మా ప్రభుత్వం, మా ముఖ్యమంత్రిగారు, మా మంత్రులు అనేక సందర్భాలలో కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి విజ్ఞాపనలిస్తున్నాం. ఇప్పుడు కూడా తెలంగాణ నిధులు ఇవ్వకపోడానికి ఏ కారణం చెబుతారని అడుగుతున్నాను.

(సభ్యులు శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డిగారు నీళ్ళ బాటిల్‌ను మంత్రివర్యులకు అందించారు)

ధన్యవాదాలు. ఈ నీళ్ల బదులు తెలంగాణకు నిధులు తెప్పించాలని కోరుతున్నాను. నీళ్ళు తెచ్చివ్వడం వ్యక్తిగతమైన సంబంధం. కానీ, తెలంగాణ నిధులు ఆనాడు తెలంగాణ కోసం ఎలాగైతే గొంతెత్తినామో, బరాబర్ తెలంగాణ నిధుల కోసం కూడా నిలదీస్తాం. బరాబర్ బీజేపీని అడుగుతాం. ఈరోజు ఈ రాష్ట్రం నుండిపోరాటం చేయవల్సిన కేంద్ర మంత్రులు తెలంగాణ గడ్డ మీద అడుగుపెడుతారా? గుజరాత్ పోతారా? బీహార్‌కు పోతారా? ఎ.పి.కి పోతారా?

అనేది వాళ్ళు ఆలోచన చేసుకోవాలి. నా గుండె బాధపడుతూ ఉంది. ఎందుకంటే, తెలంగాణ ఏర్పాటుకు పోరాడిన తెలంగాణ అమరవీరులను అవమానపరచిన నరేంద్ర మోడీ గారి తీరుపై ఒక్క తెలంగాణ బి.జె.పి. నాయకుడు కూడా స్పందించడం లేదు. దానిని మీరు సమర్థిస్తున్నట్లా? అని అడగదలచుకున్నాను. దయచేసి తెలంగాణ రాష్ట్రానికి నిధులు తేవాలని చర్చ ప్రారంభం చేసిన గౌరవ ముఖ్య మంత్రిగారు మరియు శాసన సభ వ్యవహారాల మంత్రిగారి దొక్కటే ఉద్దేశ్యం. మాదీ వేరే రాజకీయ చర్చల్లేవు. తెలంగాణ బిల్లుకు సంబంధించి, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో హక్కులేవైతే ఉన్నాయో ఆ హక్కులు ఆంధ్ర ప్రదేశ్‌తో బాటు, తెలంగాణ రాష్ట్రానికి రావాలి. అవి తెలంగాణ రాష్ట్రానికి రావడానికి తెలంగాణ బి.జె.పి. ప్రజాప్రతినిధులు ఏం చేస్తారో, ఏం సహకారం చేస్తారో సూటిగా చెప్పమని ఈ వేదిక ద్వారా అడిగితే, ప్రత్యారోపణలు చేస్తున్నారు. ప్రత్యారోపణలు మానుకొని తెలంగాణ ప్రయోజనాలు కాపాడడానికి, తెలంగాణ బి.జె.పి. ఏమి నిర్ణయం తీసుకుంటుందో చెప్పాల్సిందిగా ఆ ఎనిమిది మంది ఎంపీలను, ఇక్కడి బి.జె.పి. నాయకత్వాన్ని డిమాండ్ చేస్తూ, తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించి సభ ఒక్క అడుగు కూడా వెనుకకు వేయకుండా తెలంగాణ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో మా ప్రభుత్వం పని చేస్తుందని మనవి చేస్తున్నాను. తెలంగాణ విభజన హక్కులకు ఏ ఆంధ్రప్రదేశ్ బైఫర్కేషన్ యాక్ట్ ఉన్నదో, అవన్నీ సాధించుకోడానికి ఇక్కడి బి.జె.పి. సభ్యులు సహకరిస్తారా, లేదా అనే మాటను స్పష్టం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాను అధ్యక్షా.

మిస్టర్ ప్యానల్ స్పీకర్:- ఎం.ఐ.ఎం. పార్టీ నుండి మజీద్‌హుస్సేన్‌గారిని మాట్లాడవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ మహ్మద్ మజీద్ హుస్సేన్:- Thank you sir..

మిస్టర్ ప్యానల్ స్పీకర్:- హరీష్ బాబు గారు మీరు మీ కుర్చీలో కూర్చోండి. మీరు కొత్తసభ్యులు. మీరు ఎవరు పడితే వారి కుర్చీ వద్దకు వెళితే ఎలా? శాసన సభ సభ్యులాయన. జిల్లా పరిషత్ కాదు, మండల్ పరిషత్ సభ్యులు కాదు. ఇక్కడ కొన్ని రూల్స్ ఉంటాయి. శంకర్‌గారూ కూర్చోండి. మహేశ్వర్ రెడ్డిగారు బి.జె.పి.కి ఇవ్వవలసిన సమయానికంటే చాలా ఎక్కువ ఇచ్చాము. మీకు వ్యక్తిగతంగా ఇంకొకపది నిముషాలు ఎక్కువ ఇచ్చాను, అయినా కూడా మీరు ఆ సమయాన్ని వృథా చేసుకొని ఈ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడే విషయాలు మాట్లాడకుండా మీరు అనవసరమైన సబ్జెక్టు మాట్లాడి సభనంతా కూడా మిస్‌గైడ్ చేసే విధంగా మాట్లాడారు.

(బీ.జె.పి. సభ్యుల నుండి అంతరాయం)

మహేశ్వర్ రెడ్డిగారు మీరు ఫ్లోర్ లీడర్‌గా ఉన్నారు. మీరు మీ స్థానం నుండే మాట్లాడవచ్చు. కేవలం ఒక్క నిమిషం మీకు మాట్లాడే అవకాశమిస్తున్నాను. ఈ సబ్జెక్టుపైన అభిప్రాయాన్ని మాత్రమే మీరు చెప్పండి.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- ఎన్ని రకాలుగా కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చినా ఔటర్ రింగ్ రోడ్డు అభివృద్ధికి 26 వేల కోట్ల రూపాయలిచ్చినా లేక ఆన్‌గోయింగ్ వర్క్స్ కొరకు 80 వేల కోట్లున్నా లేదా లక్షల కోట్ల రూపాయలు గతంలో ఇచ్చినా కూడా కేవలం కేంద్రాన్ని నిందించాలి కాబట్టి, ఏదోక నెపంతో బి.జె.పి.ని బ్లేమ్ చేయాలి కాబట్టి ఈరోజు ఈ చర్చ పెట్టడం జరిగింది. ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం అధ్యక్షా. కాంగ్రెస్ సర్కార్‌కి ఏ మాత్రం సమాఖ్య స్ఫూర్తిపై అభిమానమున్నా, నమ్మకం ఉన్నా, ఈ తీర్మానాన్ని ఉపసహరించుకోవాలి అధ్యక్షా. ఈ తీర్మానం ద్వారా దేశం మొత్తంగా తెలంగాణ రాష్ట్రానికి చెడ్డ పేరొస్తుంది.

(అంతరాయం)

ఈ తీర్మానం ద్వారా రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు సంకుచితంగా వ్యవహరిస్తుందనే ఆరోపణ దేశ వ్యాప్తంగా వెల్లివిరుస్తోంది. అందుకే ఈ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలి. ఏదో తొందరపాటుగా ఈ తీర్మానం పెట్టారు. గౌరవ మంత్రిగారు కూడా ఇప్పటివరకూ సత్యదూరమైనటువంటి అబద్దాలు మాట్లాడినారు. సభలో లేని వారి పేరు...

(మైక్ కట్ చేయగానే.. మేము వాకౌట్ చేస్తున్నామని సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డిగారు చెప్పి సభ నుంచి నిష్క్రమించగా, వారితోబాటు బీజెపి సభ్యులందరూ కూడా వాకౌట్ చేశారు)

శ్రీ పొన్నం ప్రభాకర్:- అధ్యక్షా, మాట్లాడాల్సినదంతా మాట్లాడి, తెలంగాణ ప్రయోజనాల గురించి ఏమీ చెప్పలేక, తెల్లమొహం వేసుకొని వాకౌట్ పేరు మీద పోతున్నారు అధ్యక్షా. నిజానికి మేమేమి అడుగలేదు. కేంద్రంతోటి కొట్లాడుదాం అనడం లేదు. కేంద్రం, రాష్ట్రం ఫెడరల్ సిస్టంలో ఫైటింగ్ మాకవసరం లేదు. మేము స్వయంగా మా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులంతా ఈ రాష్ట్రప్రభుత్వానికి నిధులు రావాలంటే కేంద్రంతో సఖ్యతగా ఉండాలనుకున్నాం. దానిని కూడా తప్పు పడుతున్నారు. టీఆర్ఎస్ వాళ్ళు బడే భాయి, చోటే భాయి అనుకునే విధంగా స్పందించినా మేము ఈల్డ్ అవతలేం. మేము కూడా తెలంగాణ రాష్ట్రప్రజల లాగా తెలంగాణ బిడ్డలము. తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలి. బి.జె.పి.నే నాయకత్వం వహించి కేంద్రం దగ్గరకు బృందాన్ని తీసుకుపోయి, తెలంగాణ బడ్జెటలో పెట్టమని అడుగు తారనుకుంటే, వారు ముఖం చెల్లక కేంద్రం నుండి వాళ్ళే వాకౌట్ చేస్తున్నారంటే, ఈరోజు జరిగిన అన్యాయాన్ని వారు ఒప్పుకుంటునట్టే అనేది తెలంగాణ సమాజం గమనించాలని ఈ సందర్భంగా ఈ సభ ద్వారా తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను.

(తమ పార్టీ వైఖరిపై స్పష్టతనివ్వదలచి మాట్లాడేందుకు అవకాశం కోరుతూ పలువురు బీఆర్ఎస్ సభ్యుల అంతరాయం)

మిస్టర్ ప్యానల్ స్పీకర్:- మీరు చాలా సందర్భాల్లో.....

(బీఆర్ఎస్ సభ్యుల అంతరాయం)

మంత్రిగారూ మాట్లాడండి.

శ్రీ పొన్నం ప్రభాకర్:- అధ్యక్షా, తెలిసీ తెలువక మెల్లగా వీళ్ళు(బీఆర్ఎస్ సభ్యులు) కూడా బి.జె.పి. వారు వాకౌట్ చేసినట్లు వాకౌట్ చేసి ప్రొటెస్ట్ చేస్తే నేనేం చేయాలి? నేను కేటీఆర్‌గారిని దృష్టిలో పెట్టుకొని ఒక్కటే మాటన్నాను. ఇవాళ సభలో బీఆర్ఎస్ వాళ్ళు లేరు కాబట్టి తెలంగాణ పదం అనడానికి భయపడుతున్నారన్నారు. నేనన్నది తొమ్మిది మంది ఎం.పి.లున్న నాడు తెలంగాణను నరేంద్ర మోదీగారు అవమానపరిస్తే, ఎందుకు మౌనంగా ఉన్నారని అడగడం తప్పా అధ్యక్షా? అంత కంటే నేనేమి అనలేదు అధ్యక్షా.

(బీఆర్ఎస్ సభ్యుల అంతరాయం)

3.40 సా. **శ్రీ కె.తారక రామారావు**:- అధ్యక్షా,

మిస్టర్ ప్యానెల్ స్పీకర్:- మీరు కేవలం క్లారిఫికేషన్లు మాత్రమే అడగండి.

శ్రీ కె. తారక రామారావు:- అదే సార్. మీరు ఆ కుర్చీలో బ్రహ్మాండంగా సభని నిర్వహిస్తున్నారు, ముందుగా మీకు అభినందనలు . మీకు పదోన్నతి కూడా రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను సార్. ఒక్క లంబాడ మంత్రి లేరు. ఉంటే తప్పేముంది? పెట్టాలి. పెట్టాలని మా పార్టీ నుంచి కూడా మేము కోరుతున్నాము. తప్పకుండా ఒక ట్రైబల్ బిడ్డ, ఒక లంబాడ బిడ్డ మంత్రిగా కావాలని కోరుతున్నాము. ఎవరైనా మాకు అభ్యంతరము లేదు కానీ, అయితే మంచిదని కోరుతున్నాము. తప్పేముంది?

మిస్టర్ ప్యానెల్ స్పీకర్:- కానీయండి, కానీయండి.

శ్రీ కె. తారకరామారావు:- సార్, మా పొన్నం ప్రభాకరన్న నాకు పాత దోస్తు. 2009 సంవత్సరం నుంచీ మేము దోస్తులం. ఇప్పుడు కూడా మేము దోస్తులమే. దుష్మన్‌లము కాదు. రాజకీయం రాజకీయమే, ఇది ఇదే సార్. కానీ అన్న మాట్లాడినపుడు బాధ అనిపించింది. మా మహేశ్వర్ రెడ్డి నీళ్లిచ్చేదాకా పోయింది కథ. ఆవేశంతోని ఊగిపోతూ తెలంగాణాకి తన కమిట్మెంటు ఇచ్చిన తీరు ఏదైతే ఉందో నాకు బాగా నచ్చింది. నేను వారిని అభినందిస్తున్నాను. ముఖ్యమంత్రిగారు ఈ మధ్య రెండు మూడు సార్లు ఒక మంచి ప్రతిపాదన పెట్టారు. నేను కూడా గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారికి గౌరవ రాష్ట్ర మంత్రి వర్గానికి ఒక ప్రతిపాదన పెడుతున్నాను. ముఖ్యమంత్రిగారు ఈ మధ్యన రెండు మూడు సార్లు అన్నారు, నేను కూడా అదే ఉటంకిస్తున్నాను తప్ప కొత్తదేదీ అనడం లేదు. ఈరోజు మంత్రుల కమిట్మెంటు, ప్రభుత్వం యొక్క కమిట్మెంటు చూస్తే చాలా చాలా ఆనందంగా ఉన్నది. చాలా గొప్పగా అనిపిస్తున్నది. అందుకే దయచేసి ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో బ్రహ్మాండంగా ఢిల్లీ లోని జంతర్‌మంతర్‌లో

ఆమరణ దీక్షకు మొత్తం మంత్రి వర్గం కూర్చోండి, మేము కూడా అండగా ఉంటాము. మీ చుట్టూ కూర్చుంటాము. చచ్చేదాకా కూర్చోమనండి, మేము అండగా ఉంటాము, కేంద్రంతో కొట్లాడదాం. మొత్తం మంత్రివర్గం వెళ్లి మంచిగ జంతర్‌మంతర్ దగ్గర కూర్చోండి. ఎంఎల్‌ఏలు అందరం వస్తాము, ఎంపీలందరం వస్తాం. అందరం పోయి కూర్చుందాం, అంతు చూసుకుందాం. ఎందుకంటే ముఖ్యమంత్రి గారు ఈ మధ్యన ఒక్కసారి కాదు, రుణమాఫీ అంటే హరీష్‌రావు గారు దీక్ష చేయాలి అంటాడు, నిరుద్యోగుల సమస్యలంటే నన్ను ఆమరణ దీక్ష చేయమంటాడు. అందుకే నేను అడుగుతున్నాను, మొత్తం క్యాబినెట్ కూర్చోండి మేమండగా నిలబడతాం, మీరు నిధులు తెచ్చుడో అంటే ఏమో కావాలని నేను కోరుకోను, మంత్రులందరూ ఆమరణ దీక్షకు కూర్చోవాలని మనస్ఫూర్తిగా మీ కమిట్మెంటును అభినందిస్తున్నాను.

SRI MOHAMMED MAJID HUSSAIN (NAMPALLY):- Panel Speaker Sir, our Party – All India Majlis Ittehadul Muslimeen has been demanding that the Telangana State should be given a fair deal by the Union Government. This has been our Party's persistent stand ever since the bifurcation of United Andhra Pradesh and formation of Telangana State in June, 2014. I may recall that my Party's Floor Leader, Janab Akbar Uddin Owaisi saheb has been raising his voice in this particular Assembly against the injustice meted out to the Telangana State by the BJP, now NDA Government ever since the new State came into being. Participating in the discussion on the Governor's Address, State Budget, Appropriation Bills and Short Discussion on various subjects, Janab Akbaruddin Owaisi saheb has been demanding the Union Government to do justice to the State and implement all the assurances contained in the A.P. Reorganisation Act. However, ever since it came to power in 2014 coinciding with the formation of the Telangana State, the BJP regime at the Centre has been adopting discriminatory attitude towards Telangana and seeking to favour the successor Andhra Pradesh State at the expense of Telangana. Our Party has been highlighting how the Union Government has been denying its rightful share to Telangana in devolution of Central Taxes as well as in the Central Grants-in-Aid for the Central Schemes and centrally sponsored schemes. Also the Union Government has been consistently refusing to fulfil the assurances given in the A.P. Reorganisation Act. We, All India Majlis Ittehadul Muslimeen have consistently said that the successive Union Budgets since 2014 till date have been unfair to Telangana State. Telangana State's share of central devolution has been fixed at 2.10% as against AP's share of 4.05% on the recommendation of 15th Finance Commission. For instance, in the Financial Year 2023-24, Telangana received only Rs.23,216 Crores as share in Central Taxes as against Rs.44,699 Crores released to Andhra Pradesh. Also Andhra Pradesh was given additional grants for its new capital Amaravati, Polavaram Project and for its budgetary deficit. In the Union Budget for 2024-25 presented by the Finance Minister, Telangana is allocated Rs.26,216 Crores as against Rs.50,475 Crores for AP. The Union Finance Minister also made a reference to A.P. Reorganisation Act and announced that A.P. would be provided Rs.15,000 Crores as additional grant in the current year and similar amounts in the future years. Moreover, the Union Government has been targeting Telangana State by restricting the borrowing of the State under FRBM Act by curbing the loans taken by Corporations and Government Undertakings under the Government guarantees with budgetary borrowing of the State Government. Also the Union Government has been refusing to provide Central grants for Mission Kakatiya, Mission Bhagiratha as recommended by NITI Aayog as well as Palamuru-Ranga Reddy Lift Irrigation Scheme and Kaleswaram Project by designating them as National Projects on the lines of Polavaram Project of AP as per the A.P. Reorganisation Act. The Union Government has not fulfilled many of the provisions made in the A.P. Reorganisation Act, including distribution

of revenues and appropriation of assets and liabilities of the State Government and the State Public Undertakings.The A.P. Reorgani- sation Act made several provisions for setting up educational and infrastructure facilities in Telangana also. These provisions relate to the establishment of Tribal University, setting up Integrated Steel Plant at Bayyaram and Integral Coach Factory at Kazipet, apart from improvement of road connectivity under NHAI and rail connectivity in the State. The Union Government has also refused to release the Central grants for the development of backward districts in Telangana. Even after 10 years, the Union Government has failed to fulfil these assurances to the Telangana under the A.P. Reorganisation Act. On the other hand, the BJP Government at the Centre has been making attempts to harm the interests of Telangana by seeking to privatize some coal blocks of Singareni Collieries, pressurizing the State to privatise the Nationalised Bus Routes operated by TGSRTC and also gaining control over all irrigation and hydel projects of Godavari and Krishna Rivers. Telangana State has suffered a lot on account of the Union Government's apathy in resolving the issues relating to sharing of Krishna waters between Telangana and AP under the Krishna River Water Dispute Tribunal Act. This has adversely affected the Palamuru-Ranga Reddy and Dindi Irrigation Projects in the State. After the change of Government in the State in December, 2023, Revanth Reddy saheb has met Prime Minister, Narendra Modi, Union Home Minister, Amit Shah and other Union Ministers to seek clearance for various State Projects and schemes as well as for their additional assistance to the State, but in vain. I would like to demand once again that the Congress Government in the State should implement all the six guarantees and the other promises made in the Congress Manifesto by finding the resources for the same.

اس کا بہت انتظار ہے۔ خاص طور سے آپ ہمارے علاقہ میں بھی آئے تھے اور اس کا وعدہ کیا گیا تھا۔ وہاں کی عوام بھی اس کے انتظار میں

-۴-

Our Party is opposed to privatization of power sectors namely, the GENCO, TRANSCO and two DISCOMS in the name of entrusting the power bill collection to Adani Powers in Old City of Hyderabad and so-called pilot project. We extend full support to the Telangana Government in its fight to secure the State's rightful share in central resources and to ensure all the promises and assurances to the Telangana under A.P. Reorganisation Act. Thank you Sir.

3.50 సా. **శ్రీ మల్లు భట్టివిక్రమార్క:-** అధ్యక్షా, ఈ రోజు సభలో జరుగుతున్నటువంటి చర్చ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా చాలా అత్యవసరమైన చర్చగా భావించాలి. కేంద్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదించిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి రావలసినటువంటి లేదా కేటాయించవలసినటువంటి లేదా మనం పొందవలసిన ప్రయోజనాలకి సంబంధించి ఏమీ రాకపోవడం వలన పెద్ద ఎత్తున రాష్ట్రం నష్టపోయే ప్రమాదంలో ఉంది కాబట్టి, విశాలమైన రాష్ట్రప్రయోజనాల దృష్ట్యా, సభా నాయకుడిగా, ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా శ్రీ రేవంత్‌రెడ్డిగారు దీర్ఘంగా, చాలా లోతుగా ఆలోచన చేసి, దీని పైన రాష్ట్రప్రయోజనాల కోసం, సభలో అత్యంత ప్రజాస్వామ్యయుతంగా ఈ అంశాన్ని చర్చకు పెట్టి, అందరి ఆలోచనలు తీసుకుని, రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా పెట్టుకుని, అవసరమైతే, అందరూ ఒప్పుకుంటే ప్రభుత్వ ఆలోచనతో ఏకీభవిస్తే, ఒక ఏకగ్రీవ తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపించాలనే ఒక ఆలోచనతో పెట్టినటువంటి ఈ చర్చ చాలా అత్యవసరమైనది, అతి ముఖ్యమైనదిగా నేను భావిస్తున్నాను.వారిని నేను అభినందిస్తున్నాను కూడా.

అలాగే అధ్యక్షా, దీని పైన సుదీర్ఘంగా సభలో ఉన్నటువంటి అనుభవం కలిగిన నాయకులు, శాసన సభా పక్ష నాయకులు అందరూ కూడా వారి అభిప్రాయాలు చాలా స్పష్టంగా చెప్పాల్సిందంతా చెప్పారు. సరే, ఈ చెప్పే క్రమంలో ఆశించిన మేరకు రావలసినంత మద్దతు రాలేదేమో, రాష్ట్ర ప్రయోజనాల కోసం, అనే భావన కూడా

కలుగుతా ఉంది. రాష్ట్ర ప్రయోజనాల కంటే, రాజకీయ ప్రయోజనాలే ఎక్కువగా ఈరోజు కనిపిస్తున్నదేమో అనే భావన ఈ రోజు దేశంలో కలుగుతున్నది. మనందరి ఆలోచన రాజకీయాలకు అతీతంగా, రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ఉండాల్సిన అవసరం ఉందని చాలా స్పష్టంగా ప్రభుత్వం తరపున మీ ద్వారా సభలో ఉన్న సభ్యులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను.

ఎందుకనంటే అధ్యక్షా, రాష్ట్ర విభజన చట్టం గురించి నిన్న జరిగిన బడ్జెట్‌లో రాష్ట్ర విభజన చట్టం ద్వారా పక్క రాష్ట్రం అయినటువంటి ఆంధ్రప్రదేశ్‌కి అమరావతికి సంబంధించిగాని, పోలవరానికి సంబంధించి గాని ఇచ్చిన నిధుల గురించి ప్రస్తావించిన సందర్భంలో అసలు విభజన చట్టం వచ్చిందే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం. A.P.Reorganisation బిల్లు వచ్చింది కూడా, ఆ నాడు ఉమ్మడి రాష్ట్రం విభజన జరిగింది కూడా తెలంగాణ ప్రాంతం వెనుకబడి ఉంది, తెలంగాణ ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఇచ్చి కొన్ని రాయితీలు కల్పించినట్లయితే కొంత అభివృద్ధి చెందుతారనే ఆలోచనతో తీసుకువచ్చిందే ఆ చట్టం. అటువంటి చట్టం గురించి ప్రస్తావిస్తూ ఏ రాష్ట్ర ప్రయోజనాల కోసమైతే చట్టం తీసుకువచ్చి, విభజన చేశామో ఆ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇవ్వాల్సిన నిధులు కేటాయించకుండా, దానిని ప్రస్తావించి మాట్లాడినటువంటి వైనం తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఒక్కళ్లకి కూడా బాధ కలిగించిన అంశం అధ్యక్షా. అంటే పక్క రాష్ట్రానికి ఇచ్చినందుకు మా కెవరికీ బాధ లేదు. మీరు ఎవరికి ఇచ్చినా అది మీ సమస్య. మేము కాదనడం లేదు. అందరికీ ఇవ్వాలి. కాని ప్రత్యేకంగా ఇవ్వాల్సిన రాష్ట్రానికి ఇవ్వకుండా ఉండడమే అత్యంత బాధాకరమైన విషయం అధ్యక్షా. దీనిని మిత్రులందరూ గమనంలోకి తీసుకోవాలని నేను మీ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

అలాగే ప్రధాన ప్రతిపక్షానికి సంబంధించి బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం కూడా ఈ రోజు సభలో మేము సుదీర్ఘంగా తెలంగాణ కోసం పోరాటం చేశాం, తెలంగాణ కోసమే పుట్టినటువంటి పార్టీ అని చెప్పుకునే వాళ్లు ఈరోజు చాలా గట్టిగా వాదిస్తారని నేను అనుకున్నాను అధ్యక్షా. తీసుకోవలసిన అంశాలు కూడా ఈ చర్చ సందర్భంగా వారు ప్రతిపాదనలు చేస్తారని నేను ఆశించాను. కాని మొదలు పెట్టిన దగ్గర నుండి ఆద్యంతం గత పది సంవత్సరాలుగా వారు ఏం చేశారనేది చెప్పుకోవడానికి ప్రయత్నం చేశారు తప్ప, అసలు ఈ చర్చకు సంబంధించిన అంశం చుట్టూ తిప్పడంగాని, ఈ చర్చ ద్వారా రాష్ట్ర ప్రయోజనాల కోసం మేము ఈ సూచనలు చేస్తా ఉన్నాం, ఈ రకంగా మనం తీర్మానం చేస్తే బాగుంటుంది, సభా నాయకుడు ఈ అంశాలు చర్చకు పెట్టాడు, ఈ చర్చను మేము స్వాగతిస్తున్నాము, స్వాగతించడమే కాదు, మా సూచనలు ఇవి, మా పార్టీ ద్వారా ఈ సూచనలు చేస్తా ఉన్నాం, మీరు తీర్మానం చేయండి అని చెప్పాల్సింది పోయి కేటీఆర్‌గారు మరొక మాట్లాడారు. వారు సీనియర్ శాసన సభ్యులు. మంత్రిగా పనిచేశారు. సభా వ్యవహారాలు కూడా వారికి బాగా తెలుసు. ఈ రోజు వారి జన్మదినం అని ఇప్పుడే మిత్రులు చెప్పారు. మీ అందరి సమక్షంలో వారికి జన్మదిన శుభాకాంక్షలు కూడా నేను తెలియజేస్తా ఉన్నాను. మీరు అనేక సంవత్సరాలు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, మీకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, మీరు ఈ రాష్ట్ర ప్రయోజనాల కోసం, రాజకీయ ప్రయోజనాలు పక్కన పెట్టి ఈ ప్రభుత్వ ఆలోచనలతో కలిసి రావలసిందిగా కూడా వారికి నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

వారు మాట్లాడేటప్పుడు ఒక అంశం చెప్పారు. మీరేదో రిజల్యూషన్ పెట్టారు, ఇందులో సబ్జెక్ట్ లేదు, అంశం లేదు, ఏమీ చెప్పలేదు, మీకసలు అవగాహనే లేదు, అనుభవమే లేదు, మీ ఇష్టం వచ్చినట్లు సభను నడుపుతా ఉన్నారు, మీకు అనుభవం ఉంటే ఇలా చేసేవారు కాదన్నారు. అధ్యక్షా, మాకు అనుభవం ఉందో, లేదో మీకు కూడా తెలుసు. గౌరవ ముఖ్యమంత్రిగారు వారు కూడా సీనియర్ శాసన సభ్యులే. వారు ఒక ఫ్లోర్ లీడర్‌గా కూడా పనిచేశారు. శాసన మండలిలో పనిచేశారు. శాసన సభలో పనిచేశారు. జడ్‌పిటిసి సభ్యునిగా పనిచేశారు. పార్లమెంట్ సభ్యుడిగా చేశారు. సభా వ్యవహారాలపై క్షుణ్ణంగా వారికి అవగాహన ఉంది. ఒక సభా నాయకుడిని పట్టుకుని మీకేం అనుభవం

లేదని చెప్పి అవహేళన చేసినటువంటి మాటలు సరైనవి కాదని నేను భావిస్తున్నాను. మాకు వ్యవహారం మీద అనుభవం లేక కాదు. ఈ రోజు బిజినెస్‌లో ప్రశ్నోత్తరాల తరువాత గవర్నమెంట్ రిజల్యూషన్ అని చెప్పాము. చాలా స్పష్టంగా చెప్పాము.

ఆ రోజుల్లో 2014 జూన్ 14 శనివారం నాడు వారు కూడా సభా వ్యవహారాల గురించి ఒక రిజల్యూషన్ పెట్టారు. హడావుడిగా సభలోకి వచ్చారు. నేను అవతల సభ్యుడిగా ఉన్నాను. నా చేతికి ఒక కాగితం ఇచ్చారు. కనీసం మేము అంశం చెప్పి, చర్చకైనా పెట్టాము. మీరు అంశం చెప్పి, చర్చకు కూడా పెట్టలేదు. మేము కేవలం రిజల్యూషన్ పెడుతున్నాం అని, అంశాలను అప్పటికప్పుడు సభలో పెట్టి ఒకటి కాదు, దాదాపు 6, 7 అంశాలకు సంబంధించి రిజల్యూషన్స్ పెట్టి, మమ్మల్ని మాట్లాడమన్నారు.

4.00 సా.

ఇది సభా వ్యవహారాలకు సంబంధించిన కాగితం.

(అంతరాయం)

14.06.2014వ సంవత్సరంలోని రికార్డ్‌లో ఈ అంశాన్ని మెన్షన్ చేయలేదు. కేవలం రిజల్యూషన్ అని అన్నారు. ఈరోజు కూడా గవర్నమెంట్ రిజల్యూషన్ అని చెప్పారు. అప్పుడు కూడా గవర్నమెంట్ రిజల్యూషనే అని అన్నారు, కావాలంటే వారికి కాగితాలు కూడా పంపిస్తాను ఒకసారి చూసుకోవచ్చు. అంటే వారికి తెలియక కాదు, తెలిసే కావాలని ఈ అంశం చుట్టూ మాట్లాడితే, దీని మీద గట్టిగా వాదించి ఈ ప్రభుత్వానికి మద్దతు తెలిపితే అక్కడ ఉన్న బీజేపీ ప్రభుత్వానికి కోపం వస్తుందని, ఎందుకులే అని అంతిమంగా అది వదిలేసి అన్ని మాట్లాడారు. వారు మాట్లాడిన తరువాత కూడా నేను, శ్రీధర్ బాబుగారు, ముఖ్యమంత్రిగారు, మిగిలిన సభ్యులు కూడా ఈ అంశం మీద మాట్లాడాలని పదే పదే విజ్ఞప్తి చేశాము. మీకు ఇవ్వవలసిన సమయం కంటే ఎక్కువ ఇచ్చినప్పటికీ, మీరు ఈ తీర్మానం గురించి గానీ, తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన అంశాల గురించి వారు చెప్పకుండా ఇతర అంశాల గురించి మాట్లాడి బయటికి వెళ్లారు. దీనిని బట్టి మీకు రాష్ట్రప్రయోజనాల కంటే మీ రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమనే విధంగా కనిపిస్తున్నాయి. ఇది సరైనది కాదని స్పష్టంగా తెలియజేస్తున్నాను.

అదే విధంగా, ఆంధ్రప్రదేశ్ రీ-ఆర్గనైజేషన్ బిల్లు ద్వారా మనకు రావలసిన అంశాల గురించి అడుగుతున్నప్పటికీ, ఈ బడ్జెట్‌లో వస్తాయని ఆశించాము. ఆశించడమే కాకుండా దాని కోసం చేయవలసిన ప్రయత్నాలు మొత్తం చేశాము. వీటికి సంబంధించిన అంశాలలో ఒక్క అంశం గురించైనా ఊసెత్తుతారేమోనని ఆశించాము. రీ-ఆర్గనైజేషన్ బిల్లు ద్వారా మనకు హక్కుగా రావలసిన జాతీయ ప్రాజెక్టు, పాలమూరు-రంగారెడ్డి, ఐటిఐఆర్, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీల గురించి అడిగాము. కొత్తగా ఏమీ అడగలేదు. ఆనాడు యూపిఏ ఛైర్‌పర్సన్‌గా ఉన్న శ్రీమతి సోనియా గాంధీగారు, ఆనాడు ప్రధానమంత్రిగా ఉన్న మన్మోహన్ సింగ్ గారు రాష్ట్ర విభజన చేసేటప్పుడు ప్రత్యేకంగా తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలనే వాటిని పొందుపరిచి ఇవ్వడం జరిగింది. ఆ విధంగా వచ్చిన హక్కును కూడా మనం అడిగితే ఇవ్వడం లేదు. దీనికి ఏం చేయాలా అనే ఆవేదనతో, ఆలోచనతో చర్చకు తీసుకురావడం జరిగింది. ఐఐఎమ్, నవోదయ పాఠశాలలు, హైదరాబాద్ వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్, హైదరాబాద్ నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్ గురించి అడిగినా ఇవ్వలేదు. ఇక్కడ డిఫెన్స్ హబ్, ఫార్మా సిటీ హబ్ వీటికి సంబంధించిన క్లస్టర్స్ ఇవ్వమని అడిగాము కానీ ఇవ్వలేదు. మూసీ, మెట్రో రైలు ఎక్స్‌టెన్షన్ గురించి ఏది అడిగినా ఇవ్వలేదు. ఈ దేశం రాష్ట్రాల సమూహామే కదా. మనం ఫెడరల్ స్పిరిట్‌తో ముందుకు వెళ్లాలి. ఎవరి దయాదాక్షిణ్యాల మీదనో ఇస్తున్నారని మిగిలినవారు మాట్లాడుతున్నారు. ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరం లేదు. అన్ని రాష్ట్రాల వారు కలిసి పన్నులు కడితే పన్నుల రూపేణ అక్కడికి వెళుతున్న నిధులతో పథకాలను రూపొందించి అందిస్తున్నారు తప్ప, ఎవరి దయాదాక్షిణ్యాలతో ఇవ్వడం లేదు. మనకు హక్కుతో రావలసిన అంశాల గురించి అడుగుతున్నాము. మనం దేశం కోసం ఇంత కాంట్రిబ్యూట్ చేస్తుంటే, దేశం రాష్ట్రాల అవసరాలు వదిలేసి రాజకీయ అవసరాలను చూస్తోంది.

ఈ విధంగా ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రాలే ఆలోచనలో పడ్డాయి. ఒకవేళ ఇదే పద్ధతిని కొనసాగిస్తే, ఈ దేశానికి చెందిన ఫెడరల్ స్పిరిట్‌కే ఒక ప్రమాదకరమైన సంకేతాలు మీరు పంపించినట్లుగా అవుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తరువాత.. కేంద్ర ప్రభుత్వం పూర్తి బడ్జెట్‌ను పెట్టకపోవడం వల్ల మేము ఓటాన్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌ను పెట్టడం జరిగింది. కేంద్రంలో పూర్తి బడ్జెట్ పెట్టిన తరువాత దానిలో నిధులు కేటాయిస్తే, వాటికి రాష్ట్ర నిధులను కూడా కలిపి పూర్తి బడ్జెట్‌ను పెట్టాలనే ఆలోచనతో కేంద్ర బడ్జెట్ కోసం ఎదురు చూడడం జరిగింది. కానీ వారు పూర్తిగా గాలికి వదిలేసినప్పటికీ, దాని గురించి అందరం తప్ప నిసరిగా ఆలోచన చేయాలనడంలో ఎటువంటి సందేహం లేదని మిగతా మిత్రులకు తెలియజేస్తున్నాను.

మేము కేంద్రంతో మాట్లాడి, చాలా చేశామని, కానీ మీరు మాత్రం కేంద్రంతో కలిసిపోయి చేస్తున్నారని కేటీఆర్‌గారు మరికొన్ని విషయాల గురించి మాట్లాడారు. మేము బీజేపీతో కలవడం ఏమిటి అధ్యక్షా? గౌరవ ముఖ్యమంత్రిగారు మీరు ఎక్కడెక్కడ కలిసిన విషయాలు మరియు సింగరేణి కోల్ మైన్స్ గురించి కూడా చెప్పారు. కిషన్ రెడ్డిగారు ఆక్షన్‌కి వచ్చినప్పుడు మీరు కూడా వెళ్లి వారితో కూర్చొని కోల్ మైన్స్ లేకుండా చేసే కార్యక్రమంలో ఇద్దరూ నవ్వుకున్నారు. నేను వెళ్ళిన మాట నిజమే కానీ, అక్కడికి వెళ్ళి రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యమని, గోదావరి పరివాహక ప్రాంతంలోని కోల్ బ్లాక్స్ అన్నింటికి కూడా ఆక్షన్ పెట్టకుండా సింగరేణికే ఇవ్వాలని చాలా స్పష్టంగా అధికారికంగా నేను చదివాను, చెప్పాను. ఈ రాష్ట్రంలోని కోల్ బ్లాక్స్‌కు మరియు ఇతర కోల్ బ్లాక్స్‌కు గానీ ఆక్షన్ పెట్టడానికి మీరే కదా కారణం! 2015లో ఎం.ఎం.డి.ఆర్ బిల్లు (Mines and Minerals Development and Regulation) ప్రవేశపెట్టినప్పుడు ఆ బిల్లుకు టిఆర్ఎస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులందరూ మద్దతివ్వడం వల్ల బిల్లు పాస్ అయ్యి దేశంలో ఆక్షన్ జరుగుతూ ఉంది. మీరు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తూ, మేము వెళ్లామని మమ్మల్ని అనడం కరెక్ట్ కాదంటున్నాను. అదే విధంగా జీఎస్టీకి సపోర్ట్ చేశారు. డీ-మానిటైజేషన్ చేశారు. ఏడు మండలాల గురించి మేము చాలా గొప్పగా చేశామని చెప్పారు. మీరేమి చేశారని ఒక్కసారి అవగాహనతో మాట్లాడాలి. జయరామ్ రమేష్‌గారు తయారు చేసిన బిల్లును ఒక్కసారి చదవండి. ఏడు మండలాలు లేకుండా పార్లమెంట్‌లో బిల్లు పాసైంది. నేను ఉన్నాను కాబట్టి, ఈ విషయం చెబుతున్నాను. మీరొకసారి ఆ బిల్లును చదవండి. AP Re-organisation Act, 2014కు సంబంధించి పాసైన బిల్లులో ఏడు మండలాలను తొలగించి బిల్లు పాసు చేశారు. ఏడు మండలాలను తెలంగాణకు ఉంచారు. రాష్ట్ర విభజన జరిగింది. మీరు ముఖ్యమంత్రి అయ్యారు. చాల్లే నేను ముఖ్యమంత్రి అయ్యాను కదా అనుకున్నారు. ఆ అమాయకమైన గిరిజనుల రెండు లక్షల ఎకరాలు పోయినా పర్వాలేదు, ఏడు మండలాలు ఏమైనా పర్వాలేదని గాలికి వదిలేశారు. వాళ్ళు ఆర్డినెన్స్ తీసుకొని వచ్చి ఏడు మండలాలను అప్పనంగా ఆంధ్రలో కలిపితే కనీసం మాట కూడా మాట్లాడకుండా ఒక రిజల్యూషన్ పాస్ చేసి గాలికి వదిలేశారు తప్ప ఆ తరువాత దాని మీద ఏమి చేశారు. పది సంవత్సరాల్లో ఎప్పుడైనా ఢిల్లీ వెళ్ళారా? మీరు రిజల్యూషన్‌లో ఏమి చెప్పారు? నేను ఆ రోజు అక్కడే ఉండి మాట్లాడాను. రిజల్యూషన్ పాసైన తరువాత సభలోని అన్ని పక్షాలను తీసుకొని ఢిల్లీ వెళ్తామన్నారు. ఢిల్లీలో పెద్ద ఎత్తున యుద్ధం చేద్దామన్నారు. చేశారా? ఢిల్లీకి తీసుకుపోయారా? కనీసం మీరెళ్ళి ఎప్పుడైనా రిప్రజెంట్ చేశారా అంటే లేదే. పూర్తిగా ఏడు మండలాలను గాలికి వదిలేశారు. వేలాది మంది గిరిజన సోదరులు, లక్షలాది ఎకరాలు మునిగి పోతున్నాయంటే దానికి కారణం వీళ్ళే అధ్యక్షా. ఈ బీఆర్ఎస్, బీజేపి కలిసి ఈ రోజు తెలంగాణకు ఉన్న ఏడు ఎకరాలు మనకు లేకుండా చేశారు. ఇంకా తగుదున్నమ్మా అని ఏడు మండలాల కోసం పోరాటం చేశామని చెబుతున్నారు. దానితోపాటు ఇంకొకటి కూడా చెప్పారు. డెప్యూటీ సి.యం గారు

మరియు ఫైనాన్స్ మినిస్టర్ గారు మొన్ననే పోయి పంపులకు పెట్టిన స్విచ్ ఆన్ చేసి వచ్చారు, సీతారామ ప్రాజెక్టును మేము బ్రహ్మాండంగా కట్టామన్నారు. ఏం కట్టారు అధ్యక్షా?

4.10 సా.

సీతారామ ప్రాజెక్టును మీరు బ్రహ్మాండంగా కట్టారా?

(అంతరాయం)

సీతారామ ప్రాజెక్టు కంటే ముందు ఉన్నటువంటి ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులకు సంబంధించి కేవలం రూ.1450 కోట్లతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టులను రీ–డిజైన్ చేసి రూ.20 వేల కోట్లకు పెంచి ఇప్పటికే రూ.7 నుండి 8 వేల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరానికి కూడా నీళ్ళు ఇవ్వకుండా అన్యాయంగా ఖర్చు అవుతుంటే......

మిస్టర్ స్పీకర్:- ప్లీజ్ రన్నింగ్ కామెంటరీ ఆపండి.

(అంతరాయం)

శ్రీ భట్టి విక్రమార్క మల్లు:- వ్యవసాయ శాఖా మంత్రిగారు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మేమందరం కూర్చోని.....

శ్రీ కె. తారక రామారావు:- (మైక్ లేకుండా) మాట్లాడేందుకు అవకాశమివ్వండీ అధ్యక్షా.

మిస్టర్ స్పీకర్:- మీరింత సీనియర్ శాసన సభ్యులు, కొత్తవారికి ఆదర్శం కావాలి కాని, మీరే రన్నింగ్ కామెంటరీ చేస్తే ఎట్లా కేటీఆర్ గారు? ప్లీజ్ కూర్చోండి, ప్లీజ్ కూర్చోండి.

శ్రీ భట్టి విక్రమార్క మల్లు:- అధ్యక్షా, ఇప్పటికే రూ.8వేల కోట్లు ఖర్చు చేశారు. ఈ సొమ్ము అంతా తెలంగాణ ప్రజలదే. ఆ కట్టిన దానికి ఇంకా వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా కూడా నీళ్ళు ఇచ్చే పరిస్థితి లేనప్పుడు దీన్ని ఏదో రకంగా రాష్ట్ర ప్రజలను తీసుకొని రావాలని చెప్పి, ఆలోచన చేసి......

మిస్టర్ స్పీకర్:- శ్రీ పల్లా రాజేశ్వర్ రెడ్డి గారూ, మీరు కూర్చోండి. ప్లీజ్ కూర్చోండి, ప్లీజ్ కూర్చోండి.

SRI BHATTI VIKRAMARKA MALLU:- Please, sit down. I request you to please resume to your seats. గౌరవ ముఖ్యమంత్రి గారు భద్రాచలం వచ్చినప్పుడు అక్కడ కూర్చోని ఖమ్మం జిల్లాలో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను రివ్యూ చేసి, ఇన్ని వేల కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు పెట్టామే, అంతా దుర్వి నియోగం అయిపోతుందే అని మేము ఆలోచన చేసి, దీనిలో నుండి ఎంతో కొంత వచ్చేట్లు చూడండని చెప్పి అందుబాటులో ఉన్న ఆలోచనలన్నింటిని తీసుకొని కేవలం రూ. 70 కోట్లతో అదనంగా ఒక లింక్ కెనాల్‌ను కలిపి దానిని ఎన్.ఎస్.పి కెనాల్‌కు, వైరా ప్రాజెక్టుకు అనుసంధానం చేసి......

(బీఆర్ఎస్ సభ్యులచే అంతరాయం)

మిస్టర్ స్పీకర్:- ఇది మంచి పద్ధతి కాదు. మీరు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతున్నారు.

శ్రీ భట్టి విక్రమార్క మల్లు:- కేవలం రూ. 70 కోట్లతో లక్షల ఎకరాలకు నీళ్ళిచ్చే కార్యక్రమాన్ని మేము చేపట్టాము. మీరు రూ. 8 వేల కోట్లు ఖర్చు పెట్టారు కానీ, ఒక్క ఎకరానికి కూడా నీళ్ళు ఎందుకు ఇవ్వలేకపోయారు. చేసినదంతా చేస్తూ, ఇంకా తగుదునమ్మా అని మాట్లాడుతుంటే తప్పనిసరి పరిస్థితుల్లో నేను గుర్తుచేస్తున్నాను. అలాగే వారు ఇంకో మాట కూడా అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం మీరందరూ కలిసి తీర్మానం చేయండి, పార్లమెంట్ సభ్యులు, మంత్రులందరూ ఢిల్లీ వెళ్ళి చచ్చేదాకా కూర్చోండని వారన్నారు. ఏంటి చచ్చేదాకా కూర్చునేది? ఇదేం ఆలోచనండి?

(అంతరాయం)

ముఖ్యమంత్రి, మంత్రులు చచ్చేదాకా కూర్చోమనే ఆలోచన ఏం ఆలోచన? ఈ ఆలోచన సరైనది కాదు. దయచేసి healthy opposition గా ఉండాల్సిందిగా తమ ద్వారా కోరుతున్నాను. రాష్ట్ర ప్రయోజనాల కోసం మీ సూచనలుంటే తప్పనిసరిగా మేము వాటిని ముందుకు తీసుకెళ్తామని తమ ద్వారా తెలుపుతున్నాను. రెండో ఆలోచన ఏమి లేదు. మీరు కూడా దయచేసి రాష్ట్ర

ప్రయోజనాల కోసం కలిసి రావడానికి ప్రయత్నం చేయాలని కోరుతున్నాను. రాష్ట్ర ప్రయోజనాల అవసరం దృష్ట్యా మీ అందరి తరఫున మీరందరూ ఇచ్చిన సూచనలను తీసుకొని చర్చకు పెట్టమని సభా నాయకున్ని తప్పనిసరిగా రిజల్యూషన్ పెట్టమని నేను కూడా కోరుతున్నాను. అన్ని పక్షాల నాయకులకు ఈ రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా, ముఖ్యంగా ఉండాలి. రాష్ట్రం బాగుండి, ప్రజలు బాగుండి సుభిక్షంగా మనం తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందితే, అదే దశాబ్దాల మన నాయకులు, కార్యకర్తలు, యువకులు ప్రాణ త్యాగాలు చేసి అందించిన తెలంగాణకి అర్థం, పరమార్థం ఉంటుంది. దానికోసం అవసరమైతే ఈ సభలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు మీ రాజకీయ ప్రయోజనాలు ప్రక్కన పెట్టి ప్రభుత్వంతో కలిసి రండి. ఎందుకు నిధులు రావో, ఏ రకంగా నిధులు రావో చూద్దాం. అవసరమైతే పోదాం. మేము వారిని బెదిరించడం లేదు. వారు ఈ దేశానికి ప్రధానమంత్రి. అది ఈ దేశానికే ప్రభుత్వం. మనం అందులో భాగం. ఈ రాష్ట్రానికి రావాల్సిన నిధుల వాటా గురించి ప్రధానమంత్రి గారిని కలిసి గౌరవంగా అడుగుదాం.

ఇందాక ఇంకో సభ్యులు మాట్లాడుతూ విషం చిమ్ముతున్నారని అన్నారు. మేము ఏం విషం చిమ్ము తున్నాం? మేము విషం చిమ్మట్లేదు. ఈ రాష్ట్రానికి రావాల్సిన వాటా గురించి అడుగుతున్నాము. గౌరవంగానే తీర్మానం చేసి, అందరం కలిసి వెళ్ళి అడుగుదామని తమ ద్వారా వారికి తెలుపుతున్నాను. దయచేసి ఇటువంటి ఏ అంశాలు వచ్చినా పాజిటీవ్‌గా స్పందించాలని బిఆర్ఎస్ నాయకులకు కూడా విజ్ఞప్తి చేస్తున్నాను. మేము అత్యంత డెమోక్రటిక్‌గా ఉన్నాము. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా మేము గౌరవించడానికి సిద్ధంగా ఉన్నాము. ఎందుకంటే, గవర్నమెంట్ ఉండాలి, అపోజిషన్ ఉండాలి. మేము true democrats. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నమ్ముతుంది, ఆచరిస్తుంది కూడా. ఆ రకంగా మీకు కూడా మేము గౌరవిస్తామని తమ ద్వారా సభలో ఉన్న వారందరికీ తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, వారితోపాటు గౌరవ సీనియర్ శాసన సభ్యులు, బిజెపి ఫ్లోర్ లీడరైన మహేశ్వర్ రెడ్డి గారు మాట్లాడారు. రాష్ట్ర విభజన జరిగినప్పుడు ఆ విభజనలో ఈ రాష్ట్రానికి ఏ ఏ అంశాలు వాటాగా వస్తే బాగుంటాయో, మాతోపాటు వారు కూడా ఉండి గట్టిగా వాదించినటువంటి గౌరవ శాసన సభ్యులు. బిజెపి పార్టీకి సంబంధించిన ఫ్లోర్ లీడర్‌గా నా వంతు ప్రయత్నం చేస్తానని వారు ఈరోజు తప్పనిసరిగా అంటారని నేను అనుకున్నాను. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన అంశం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పి వారు చెప్తారేమో, మనందరికీ మద్దతిస్తారేమోనని ఆశించాము. కానీ, మొదలుపెట్టినప్పటి నుండి మీరు విషం చిమ్ముతున్నారని ఒకటే మాట్లాడుతున్నారు. రాష్ట్ర ప్రయోజనాల గురించి మాట్లాడటం లేదు. కేంద్రం ఆంధ్ర రాష్ట్రానికి, బీహార్ రాష్ట్రానికి నిధులిస్తే మీకేంటి బాధ అని అన్నారు. మీరు ఎవరికి నిధులిచ్చినా మాకు ఎటువంటి బాధ లేదు. అందరికీ ఇవ్వండి కాని, మాకు ఎందుకు ఇవ్వలేదనే బాధ ఉంది. వాళ్ళతోపాటు మాకు కూడా ఇవ్వమని మేము అడుగుతున్నాము. ముఖ్యంగా వాళ్లకంటే మాకు ఎక్కువే రావాలి కాబట్టి అదే ఇవ్వండని అడుగుతున్నాము. రాష్ట్ర ప్రయోజనాలు పరమావధిగా పెట్టుకొని మీరు ఏకగ్రీవ తీర్మానం చేయడానికి ముందుకు రావాలని వారికి ప్రత్యేకంగా తమ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

అలాగే, మీరు చాలా అడుగుతున్నారు కాని, ఉత్తుత్తిగా అడుగుతున్నారని వారు ఇంకొక మాట కూడా అన్నారు. మేము ఏం అడగలేదా అధ్యక్షా? నేను, ముఖ్యమంత్రి గారు ప్రత్యేకంగా సమయం తీసుకొని ప్రధానమంత్రి గారిని రెండుసార్లు కలిసి రాష్ట్ర ప్రయోజనాల గురించి వారిని అడిగాము. అమిత్‌షా గారిని, పెట్రోలియం మంత్రి గారిని, వాటర్ రిసోర్సెస్ మంత్రి గారిని, ఇతరత్రా మంత్రులందరినీ కూడా కలిసిన ప్రతిసారి రాష్ట్రప్రయోజనాల గురించే రాత పూర్వకంగా ఇచ్చాము.

వారు మూసీ ప్రాజెక్టు గురించి అడుగుతున్నారు, ఏదో పెద్ద స్కామ్ చేయాలని మేము అడుగుతున్నామని వారు ఇంకో మాట కూడా అన్నారు. మేము స్కామ్ చేస్తామా

అధ్యక్షా. మేము అడిగిందేంటి, హైదరాబాద్ నగరంలో ఒక పెద్ద మణిహారం లాగా ఉండి మధ్య నుండి పారుతూ, దశాబ్దాలుగా ఉన్నటువంటి కాలుష్యం వల్ల అది కలుషితం అయ్యింది. దానిని శుభ్రపరిచే అద్భుతమైన కార్యక్రమాన్ని హైదరాబాద్ నగరానికి అందిస్తే, ఈ నగరం గ్లోబల్ సిటీగా పెరిగి ఇంటర్నేషనల్‌గా మంచి పేరు వస్తుంది. హైదరాబాద్ నగరంలో ఉన్న ఓల్డ్ సిటీలో గాని, న్యూ సిటీలో గాని, ఉన్నటువంటి వారికి మంచి అహ్లాదకరమైన వాతావరణంతో పాటు, రిక్రియేషన్ సెంటర్లతోపాటు, అక్కడ ఒక బిజినెస్ యాక్టివిటీని అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుంది. తద్వారా రాష్ట్రానికి ఆదాయం కూడా పెంచుకోవచ్చనే ఆలోచనతో ఒక ప్రపోజల్ ఇచ్చాము. ఆ ప్రపోజల్ మీరు సబర్మతి దగ్గర, గంగా నది శుద్ధి కోసం చేసినటువంటి ప్రపోజల్ వంటిదే. లండన్‌లో ఉన్న థేమ్స్ నది పక్కన ఉన్న వెస్ట్ మినిస్టర్ పార్లమెంట్ ఎలా అయితే ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకుల్ని ఆకర్షిస్తుందో, ఆ స్థాయిలో హైదరాబాద్‌లో ఉన్నటువంటి మూసీ నదిని బాగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో రాష్ట్రముఖ్యమంత్రి గారు వచ్చిన దగ్గర నుండి దానిని ప్రయారిటీగా పెట్టుకొని ముందుకుపోతున్నారు. దానికి కావల్సిన వివరాలు ఇవ్వలేదని అంటున్నారు. ఏం ఇవ్వలేదు అధ్యక్షా. నా దగ్గర కాపీ ఉంది.

(ఈ సందర్భంగా వారు ఒక కాపీని సభలో చూపించడం జరిగింది.)

పూర్తిగా డిపిఆర్‌తో సహా వారికి సబ్‌మిట్ చేశాము. మేమేమి గాలికి మాట్లాడటం లేదు. డిపిఆర్‌తో సహా వారికి సబ్‌మిట్ చేస్తే, మేము చేయలేదని వారు మాట్లాడు తున్నారు. ఇది సరైనది కాదని వారికి తెలియజేస్తున్నాను. అలాగే, మిగతా అంశాలకు వస్తే, కేంద్రం నుండి కోట్లకు కోట్లు ఇస్తున్నాము, మీకేంటి బాధ, మీకివ్వాల్సినవన్నీ ఇచ్చేశామన్నారు. లేకపోతే త్రాగు నీటి పథకానికి సంబంధించి ఎంతో ఇచ్చాము, అసలు టెండర్లే లేకుండా పంచేసుకుంటున్నారన్నారు. అది ఎంత మాట అధ్యక్షా. ఇక్కడ ఒక ప్రభుత్వం, ఒక వ్యవస్థ, ఒక సిస్టమ్ ఉంటుంది. కేంద్రం నుండి మీరిచ్చింది మీ ఒక్కరిదే కాదు, దానిలో మా వాటా కూడా ఉంది. చాలా స్పష్టంగా ట్రాన్స్‌పరెంట్‌గా టెండర్లు పిలిచి, టెండర్లద్వారా జరిగేటువంటి కార్యక్రమాన్ని అట్లా బ్లేటెంట్‌గా, బ్లాంకెట్‌గా నిండు సభలో ఆ రకంగా మాట్లాడటం కరెక్టు కాదని నేను భావిస్తున్నాను. దానిని రికార్డు నుండి తొలగించాలని కూడా నేను తమ ద్వారా కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో భాగంగా ఐటిఐఆర్ గురించి అడిగాము. ఐటిఐఆర్ అనేది నిజంగా తెలంగాణ రాష్ట్రానికే కాదు హైదరాబాదు నగరానికి కూడా చాలా అత్యంత అవసరమైనది. ఇది వరకే మనం ఇక్కడ eco-system ని అభివృద్ధి చేసి పెట్టాము. సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీలకు సంబంధించి, పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజు రీ-యింబర్స్‌మెంట్ కార్యక్రమం, హైటెక్ సిటీ దగ్గర ఉన్నటువంటి వ్యవస్థ గాని, ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ సిటీ వంటివి ఒక eco-system లా డెవలప్ అయ్యి ఉన్నాయి.

4.20 సా. రాష్ట్ర విభజన కంటే ముందే అంటే 2014వ సంవత్సరానికి ముందే ఆనాటి యుపిఏ ప్రభుత్వం ఐటిఐఆర్‌ను మంజూరు చేసి ఇచ్చింది. రాష్ట్ర విభజన జరిగింది, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కాని, ఈ రోజు వరకు దాన్ని పట్టించుకోలేదు. వారు ఇవ్వలేదు. వీరిద్దరూ ఆ ఐటిఐఆర్‌ను పది సంవత్సరాలు గాలికి వదిలేశారు. దాన్ని తీసుకొచ్చి మనం అందిస్తే లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి, సాధ్యమైనంత వరకు దాని కోసం పోరాటం చేద్దాం. మనందరికి అది అవసరమా కాదా చెప్పండి. ఇది అవసరం కాబట్టి దీని కోసం పోరాటం చేద్దామని చెబుతూ, నేను ఇంకొక విషయం కూడా చెబుతున్నాను.

(ఈ సందర్భంలో సభ్యులు శ్రీ కె. తారక రామారావు తనకు మాట్లాడడానికి మైకు ఇవ్వాలని గౌరవ సభాపతిని కోరారు)

మీకు ఇవ్వాల్సినంత సమయం గౌరవ సభాపతి గారిచ్చారు. వారు కావాలంటే మరలా ఇస్తారు. ఏదైనా సూచన ఉంటే కూడా రాసి పంపించవచ్చు. సభ్యులు హరీష్ రావు గారు ఇప్పుడే వస్తున్నారు. నేను ఇందాకటినుంచి చూస్తున్నాను. హరీష్‌రావు గారు మాట్లాడే ప్రతి సభ్యునికి చీటీలు అందిస్తున్నారు. సీరియస్‌గా చర్చ జరుగుతుంటే బిజెపి సభ్యులకు చీటీలు అందిస్తున్నారు.

శ్రీ టి.హరీష్ రావు:- (మైకు లేకుండా) మీకు సి.ఎం గారు అందిస్తున్నారు కదా!

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- మేమిద్దరమంటే సరే, వారు సి.ఎం గారు, నేను డెప్యూటీ సి.ఎం. కాబట్టి దానికి ఒక అర్థం ఉంది. కానీ మీరు బిఆర్ఎస్, వారు బిజేపి, మీ ఇద్దరికి పొంతనే కుదరదు కదా. అధ్యక్షా, అంతిమంగా నేను చెప్పేదేమంటే మనందరం ఆలోచన చేయవలసింది ఒక్కటే. రాష్ట్ర ప్రయోజనాల కోసం పెద్ద ఎత్తున ఆలోచన చేసి ఈ రోజు పెట్టిన ఈ చర్చను సభా నాయకులు పెట్టడం జరిగింది. ఈ అంశాన్ని మనందరం సీరియస్‌గా తీసుకొని అంతిమంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం సభలోని గౌరవ సభ్యులందరి తరఫున ఒక తీర్మానం పెట్టమని సభా నాయకులను కోరుతున్నాను. సభలో ఏకగ్రీవంగా అందరూ మద్దతిస్తారని నేను ఆశిస్తున్నాను. సభ్యులు కేటీఆర్ గారు అన్నట్లుగా వారు కూడా వస్తామంటే మేము తీసుకొని పోతాము. మేము మీలాగా వదిలిపెట్టిపోము. అందరం కలిసి వెళ్ళి ప్రధాన మంత్రిగారిని మరియు సంబంధిత మంత్రులను కలుద్దాం, రాష్ట్ర ప్రయోజనాలే అంతిమ ప్రయోజనాలు.

శ్రీ టి. హరీష్‌రావు (మైకు లేకుండా):- అవసరమైతే జంతర్ మంతర్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేద్దాం.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- ఒక వేళ 'లీడర్ ఆఫ్ ది అపోజిషన్' కేసీఆర్ గారు కూడా వస్తామంటే తీసుకొని పోతాము.

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి:- అధ్యక్షా, మా మిత్రులు పదే పదే దీక్ష గురించి ఉబలాట పడుతున్నారు. మేమెప్పుడు కూడా చావు నోట్లో తల పెట్టి తెలంగాణ సాధించామని చెప్పుకోలేదు. 24 గంటలు గడవక ముందే నిమ్మకాయ రసం తాగి, నిమ్స్ ఆసుపత్రిలో సెలైన్ ఎక్కించుకొని దీక్షలు చేసామని, చావు నోట్లో తల పెట్టామని అబద్ధం చెప్పలేదు. రెండవది, వంద రూపాయలు పెట్టి పెట్రోలు కొనుక్కున్నాము కానీ, పది పైసలు పెట్టి అగ్గిపెట్టె కొనుక్కోక డ్రామా చేయడం ద్వారా శ్రీకాంతాచారిని, ఇషాన్ రెడ్డి, యాదయ్య వంటి వారిని మేము బలి తీసుకోలేదు. మేము ఎవరి శవాల ప్రాతిపదికనో, ఎవరి ప్రాణాల ప్రాతిపదికనో మేము అధికారంలోకి రావాలని కోరుకోలేదు. కోల్పోయిన అధికారాన్ని మళ్ళీ ఇతర ప్రాణాలను బలిచ్చి కుర్చీలో కూర్చోవాలని అనుకోవడంలేదు. అయితే తెలంగాణ రాష్ట్ర విశాల ప్రయోజనాల దృష్ట్యా అక్కడ కల్వకుంట్ల తారక రామారావు గారు, ఇక్కడ తన్నీరు హరీష్ రావు గారు దీక్ష గురించి ప్రతిపాదించారు. తప్పకుండా జంతర్ మంతర్‌కు చంద్రశేఖర్ రావు గారిని రమ్మనండి, ప్రతి పక్ష నాయకుడిగా చంద్రశేఖర రావు గారు, సభా పక్ష నాయకుడిగా నేను తెలంగాణకు నిధులు తెచ్చుడో, అవసరమైతే చచ్చుడో తేలుద్దాం. మేము సిద్ధంగా ఉన్నాము. తేది చెప్పి చంద్రశేఖర్ రావు గారిని తీసుకొని రమ్మని తెలియజేస్తున్నాను.

(బీఆర్ఎస్ సభ్యుల నుండి అంతరాయం)

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- అధ్యక్షా, నేను కంక్లూడ్ చేయలేదు. దయచేసి నేను కంక్లూడ్ చేసిన తరువాత...,

(బీఆర్ఎస్ సభ్యులు అంతరాయం కలిగించసాగారు.)

అధ్యక్షా, వారు ఎందుకు ఆవేశపడుతున్నారో నాకర్థం కావడం లేదు, వారు అడిగిందే సి.ఎం గారు ఒప్పుకున్నారు. వారు కొత్తగా ఏమి చెప్పలేదు. సభా నాయకుడిగా నేను వస్తాను, ప్రతిపక్ష నాయకుడిగా వారిని కూడా రమ్మన్నారు. ఈ రాష్ట్రప్రయోజనాల కోసం కూర్చుందాం అన్నారు. ఇక్కడ మిమ్మల్ని ఏమి దూషించలేదు, తప్పు పట్టలేదు. మీరు చెప్పిన దానికి వారు రెస్పాండ్ అయ్యారు.

మిస్టర్ స్పీకర్:- దయచేసి సభ్యులందరూ తమ తమ స్థానాల్లో కూర్చోండి. వారు మాట్లాడిన తరువాత నేను మీకు అవకాశం ఇస్తాను.

శ్రీ టి. హరీష్ రావు (మైకు లేకుండా):- సభా నాయకుడు ప్రశ్న అడిగారు, నేను సమాధానం చెప్పాలి అధ్యక్షా.

మిస్టర్ స్పీకర్:- దయచేసి సభ్యులందరూ మీ మీ స్థానాల్లో కూర్చోండి.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- అధ్యక్షా, నన్ను దయచేసి కంక్లూడ్ చేయనివ్వండి. వారిని కూర్చోమనండి. కావాలంటే తరువాత సమయం ఇవ్వండి.

శ్రీ టి. హరీష్ రావు (మైకు లేకుండా) :- సమాధానాలు చెప్పాల్సిన ప్రభుత్వం మమ్మల్ని ప్రశ్నలు అడుగుతోంది . మరి మేము సమాధానాలు చెప్పాలి కదా.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- అధ్యక్షా, ఇక్కడేమి ప్రశ్నలు అడగలేదు. వారిని రమ్మని ఆహ్వానించాము. గౌరవ ముఖ్యమంత్రి గారు వారిని ఏమి ప్రశ్నలు అడగలేదు. దయచేసి సభ్యులను కూర్చోమని చెప్పండి. తీర్మానాన్ని పాస్ చేయండి. వారికెవ్వరికి ఇష్టం లేనట్లుంది. పదేపదే మాట్లాడుతున్నారు.

మిస్టర్ స్పీకర్:- దయచేసి కూర్చోండి. వారు మాట్లాడిన తరువాత మీకు అవకాశమిస్తాను. ఈ ప్రాక్టీస్ మంచిది కాదు. ఇప్పుడు నిలబడిన వాళ్ళంతా సీనియర్ శాసన సభ్యులు.

(బీఆర్ఎస్ సభ్యుల నుండి అంతరాయం)

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- దయచేసి కూర్చోండి. రిజల్యూషన్ పాస్ చేయడం మీకెవ్వరికి ఇంట్రస్ట్ లేదా? రిజల్యూషన్ పాస్ చేయద్దా? దయచేసి కూర్చోండి.

మిస్టర్ స్పీకర్:- హరీష్ రావు గారు, ప్రశాంత్ రెడ్డి గారు దయచేసి కూర్చోండి. మీరు సీనియర్ శాసన సభ్యులు. ఇద్దరూ లెజిస్లేటివ్ఎఫైర్స్ మంత్రులుగా చేశారు.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- అధ్యక్షా, సమస్త తెలంగాణ ప్రజానీకం అంతా కూడా సభలో ఏమి జరుగుతోంది, మనం తీర్మానం చేస్తామా లేదా, రాష్ట్ర ప్రయోజనాల కోసం కట్టుబడి ఉంటామా లేదా, రాష్ట్ర ప్రయోజనాల కోసం మనం పోరాటం చేస్తామా లేదా అని రాష్ట్రమంతా చూస్తోంది. దయచేసి వారిని కూర్చోమని చెప్పండి. తీర్మానం గురించి నేను మాట్లాడిన తరువాత వారికి అవకాశం ఇవ్వండి.

(బీఆర్ఎస్ సభ్యుల నుండి అంతరాయం)

మిస్టర్ స్పీకర్:- వారు మాట్లాడిన తరువాత నేను మీకు అవకాశమిస్తాను. ఇది మంచి ప్రాక్టీస్ కాదు.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- అసలు మీ బాధ ఏంటి? తెలంగాణ ప్రయోజనాల కోసం ఒక రిజల్యూషన్ పాస్ చేసి కేంద్ర ప్రభుత్వం దగ్గరికి పోవడానికి ఎందుకు అంత బాధ పడుతున్నారు? రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమా, లేదా బిజేపికి మీకున్న బంధం ముఖ్యమా? దయచేసి సభ్యులను కూర్చోవాలని కోరుతున్నాను.

(బీఆర్ఎస్ సభ్యుల నుండి అంతరాయం)

మిస్టర్ స్పీకర్:- వారు మాట్లాడిన తరువాత నేను మీకు అవకాశమిస్తాను.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- వారికి రిజల్యూషన్ పాస్ చేయడం ఇష్టం లేదు. తెలంగాణ రాష్ట్రప్రయోజనాల కోసం పోరాటం చేయడం ఇష్టం లేదు. వారికి రాజకీయ ప్రయోజనాలు ముఖ్యంగా కనిపిస్తున్నాయి.

(బీఆర్ఎస్ సభ్యుల నుండి అంతరాయం)

4.30 సా. **మిస్టర్ స్పీకర్**:- నేను మీకు అవకాశమిస్తాను, దయచేసి కూర్చోండి. వారు మాట్లాడిన తరువాత నేను మీకు అవకాశమిస్తాను. ఈ రకమైన ప్రాక్టీస్ మాత్రం మంచిది కాదు. ఈ పోడియం దగ్గర నిలబడిన వారందరు సీనియర్ శాసనసభ్యులు.

(బీఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు పోడియం దగ్గర నిలబడి సభకు అంతరాయం కలిగించసాగారు)

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- దయచేసి కూర్చోండి. మీకెవరికీ రెజల్యూషన్ పాస్ చేసుకోవడం ఇంట్రస్ట్ లేదా అని అడుగుతున్నాను. రెజల్యూషన్ పాస్ చేసుకోవద్దా? రెజల్యూషన్ పాస్ చేసుకోవాలి, దయచేసి మీ స్థానాలకు వెళ్లి కూర్చోండి.

మిస్టర్ స్పీకర్:- హరీష్‌రావు గారూ, ప్రశాంత్‌రెడ్డి గారూ మీరు మీ స్థానాలకు వెళ్లి కూర్చోండి. మీరు సీనియర్ శాసనసభ్యులు. మీరిద్దరు శాసనసభ వ్యవహారాల మంత్రులుగా పనిచేశారు. దయచేసి కూర్చోండి.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- ఈ సభలో ఏం జరుగుతున్నది, మనం తీర్మానం చేస్తామా లేదా, రాష్ట్ర ప్రయోజనాల కోసం మనం కట్టుబడి ఉంటామా లేదా రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాటం చేస్తామా లేదా అనే దాని

గురించి రాష్ట్ర ప్రజలంతా చూస్తున్నారు. అందువల్ల దయచేసి వారిని కూర్చోమని చెప్పండి. తీర్మానం గురించి నేను మాట్లాడిన తరువాత ....

మిస్టర్ స్పీకర్:- వారు మాట్లాడిన తరువాత మీకు అవకాశమిస్తానని చెబుతున్నాను. ఈ రకమైన ప్రాక్టీస్ మంచిది కాదు.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం మీకు పట్టింపు లేదు. కేంద్ర ప్రభుత్వానికి మన రాష్ట్ర శాసనసభ నుంచి ఒక రెజల్యూషన్‌ను పాస్ చేసుకొని పంపించడానికి ఎందుకంత బాధ పడుతున్నారని అడుగుతున్నాను. మీకున్న ఇబ్బంది ఏమిటి, రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమా లేదంటే మీకు, భారతీయ జనతా పార్టీకున్న బంధం ముఖ్యమా? అనేది చెప్పాలి.

(బీఆర్ఎస్ సభ్యుల నుంచి అంతరాయం కొనసాగింపు)

మిస్టర్ స్పీకర్:- వారు మాట్లాడిన తరువాత మీకు అవకాశమిస్తానని చెబుతున్నాను. ఈ రకమైన ప్రాక్టీస్ మంచిది కాదు.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో కొట్లాడటానికి వారికి ఇష్టం లేదు. వారికి రాజకీయ ప్రయోజనాలే ముఖ్యంగా కనిపిస్తున్నాయి.

(బీఆర్ఎస్ సభ్యుల నుంచి అంతరాయం కొనసాగింపు)

ఈ రకంగా సభను అడ్డుకునే కార్యక్రమం గాని, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం పాస్ చేసుకునే రెజల్యూషన్‌ను అడ్డుకునే కార్యక్రమం గాని తెలంగాణ ప్రయోజనాలే మాకు అవసరం లేదు, కేవలం మా ప్రయోజనాలే మాకు ముఖ్యం అనే విధానం కరెక్టు కాదు. కాబట్టి దయచేసి ఈ బీఆర్ఎస్ నాయకులందరికీ మీద్వారా నా విజ్ఞప్తి ఏమిటంటే దయచేసి కూర్చోండి. Please resume your seats.

(బీఆర్ఎస్ సభ్యుల నుంచి అంతరాయం కొనసాగింపు)

మిస్టర్ స్పీకర్:- హరీశ్‌రావు గారూ, వారు మాట్లాడిన తరువాత మీకు అవకాశమిస్తానని చెబుతున్నాను.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- నేనొక చిన్న రిక్వెస్టు చేసేది ఉన్నది కాబట్టి దయచేసి కూర్చోండి. ఆ తరువాత మాట్లాడండి.

(బీఆర్ఎస్ సభ్యుల నుంచి అంతరాయం కొనసాగింపు)

మీరు కూర్చుంటేకదా నేను చెప్పేది. సభ ఇంత ఆర్డర్‌లో లేకుండా నేను ఎలా మాట్లాడాలి? అధ్యక్షా please ask them to resume their seats.

మిస్టర్ స్పీకర్:- నేను మళ్లీ, మళ్లీ రిక్వెస్టు చేస్తున్నాను...డెప్యూటీ సిఎం గారు కంక్లూడ్ చేయగానే మీకు అవకాశమిస్తాను.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- అధ్యక్షా, వాళ్లకు రెజల్యూషన్ పాస్ చేసుకోవడం ఇష్టం లేకపోతే మనం ఒక నిర్ణయం తీసుకుందాం.

(ఈ దశలో బీఆర్ఎస్ సభ్యులు పోడియం నుంచి వారి స్థానాలకు వెళ్లి కూర్చున్నారు)

శ్రీ టి. హరీష్ రావు:- అధ్యక్షా, మీ మాట మీద మేం మా స్థానాలలో కూర్చునాం, మాకు మాట్లాడే అవకాశమివ్వండి.

మిస్టర్ స్పీకర్:- మీకు అవకాశమిస్తాను గాని మీరు చేస్తున్న ప్రాక్టీస్ మంచి పద్ధతి కాదు. మీరు ఒక్కొక్కరు అయిదు సార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారు. మీరందరు చాలా సీనియర్ శాసనసభ్యులు. మంత్రులుగా పనిచేసిన అనుభవం ఉండి మీరు కొత్త సభ్యులకు ఏం నేర్పిస్తున్నట్లు అని అడుగుతున్నాను. కౌశిక్‌రెడ్డి గారిని ముందు పెట్టి వారిచేత అరిపిస్తున్నారు. వారు ఆ విధంగా ఆవేశపడినప్పుడు హార్ట్ అటాక్ వస్తే వారు ఏమైపోతారు? దయచేసి కూర్చోండి.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క:- అధ్యక్షా, ఈ రెజల్యూషన్‌కు సంబంధించి సభ అందరి తరఫున కూడా నేను ముఖ్యమంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను......రాష్ట్రప్రజల

ప్రయోజనాల దృష్ట్యా వారిని రెజల్యూషన్‌ను ప్రవేశపెట్టాలని, దానికి సభలోని సభ్యులందరి సహకారం కావాలని విజ్ఞప్తి చేస్తూ నేను వారికి ఇంకొక మాట కూడా విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రతిపక్ష సభ్యులకు కూడా రెజల్యూషన్‌కు మద్దతు తెలపాలనే ఆలోచన ఉన్నందున ముఖ్యమంత్రిగారు ఏం తప్పు మాట్లాడలేదు, వారు ఏమన్నారంటే మీరు చెప్పిన దాని ప్రకారం మీరే ఢిల్లీకి వెళ్లి దీక్షలో కూర్చోవాలని చెబితే మీరు చెప్పిన దానిని నేను స్వీకరిస్తున్నాను, నేను రెడీగా ఉన్నాను, నేను దీక్షలో కూర్చుంటాను నాతోబాటు ప్రధాన ప్రతిపక్ష నాయకుడిని కూడా తీసుకొని వస్తే మనందరం రాష్ట్రప్రయోజనాల కోసం దీక్షలో కూర్చుందామని అన్నారు. ఇందులో తప్పేముంది? వారు ఎందుకు అఫెండ్ అవుతున్నారో నాకైతే అర్థం కావడం లేదు. దయచేసి మీరు రెజల్యూషన్ పాసింగ్ కార్యక్రమాన్ని సక్రమంగా జరగ నివ్వండి, ఈ కార్యక్రమం పూర్తయిన తరువాత మిగతా విషయాల గురించి మాట్లాడదాం.

(బీఆర్ఎస్ పార్టీ సభ్యులు శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి నుంచి అంతరాయం)

మీరు అడిగిన దానికి వారు రమ్మన్నారు. మీరు ఓ.కె అనుకుంటే వారిని తీసుకొని రండి. దీక్షలో కూర్చోవడానికి డేట్ వారు ఫిక్స్ చేస్తారు.

(బీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

మంత్రులందరూ ఢిల్లీ వెళ్లి కూర్చొని దీక్ష చేసి సచ్చుడో, తెచ్చుడో కాదు సచ్చేంతవరకు కూర్చోండని స్వీపింగ్ రిమార్క్ ఆయన చేశారు. వారే అటువంటి తప్పుడు మాటలు మాట్లాడేది. సరే, మీరు చెప్పినట్లుగానే మనం దీక్షలో కూర్చుంటాము. మాతోపాటు మీరు కూడా రండీ అని అన్నారు. ఇందులో తప్పు ఏమి లేదు. దయచేసి మీరందరూ ఈ తీర్మానానికి ఏకగ్రీవంగా ఒప్పుకోవల్సిందిగా నేను మీఅందరికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ టి. హరీష్‌రావు:- అధ్యక్షా, ముందు కేటీఆర్‌గారు చెప్పారు. నేను మళ్లీ చెబుతున్నాను. ఈ రోజు కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్రమైన అన్యాయం జరిగిన మాట వాస్తవం. మీరు రెజల్యూషన్ ప్రవేశపెడితే దానిని ఏకగ్రీవంగా పాస్ చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాము. మీరు ఢిల్లీకి అఖిల పక్షాన్ని తీసుకెళితే మీ వెంట రావడానికి సిద్ధంగా ఉన్నాము. ఢిల్లీలో ధర్నా చేద్దామంటే మేము కూడా మీతోపాటు ధర్నా చేయడానికి సిద్ధంగా ఉన్నాము. ఈ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజకీయాలకు అతీతంగా ఏ పోరాటానికైనా బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉన్నది, ఉంటుందని స్పష్టంగా తెలియజేస్తున్నాను.

గౌరవనీయ ముఖ్యమంత్రిగారు ఆ మధ్య మాట్లాడుతూ రుణమాఫీ గురించి హరీష్‌రావు దీక్ష చేయాలన్నారు. నిరుద్యోగుల గురించి కేటీఆర్ దీక్ష చేయాలన్నారు. మరి అన్నీ మేమే చేస్తే మీరేమి చేస్తారు. ఈ రాష్ట్ర సభానాయకుడిగా ..... ఎందుకంటే నన్ను వ్యక్తిగతంగా అన్నారు. ఈ రోజు నీకు అగ్గిపెట్ట దొరకలేదా అని అంటున్నారు. మాది ఉద్యమ స్ఫూర్తి. మీలాగ ఆరోజు రాజీనామా చేయమంటే తెలుగుదేశం పార్టీ తరఫున ఎమ్మెల్యేగా ఉండి రాజీనామా చేయకుండా పారిపోయిన చరిత్ర మీది. తెలంగాణ ఉద్యమకారుల మీదకి తుపాకీ పట్టుకొనిపోయిన రైఫిల్ రెడ్డిగా పేరు తెచ్చుకున్నది మీరు. సోనియా గాంధీగారిని దెయ్యం అని నాడు అన్నారు. నేడు దేవత అని అన్న చరిత్ర వారిది. రాహుల్ గాంధీ గారిని ఆనాడు పప్పు అన్నారు. ఈనాడు పిఎం క్యాండిడేట్ అంటున్నారు.

(అధికార పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

శ్రీ డి. శ్రీధర్ బాబు:- అధ్యక్షా, నేను హరీష్ రావుగారిని కోరుతున్నాను. ఇది చాలా ప్రాముఖ్యత గల అంశం. ఒక స్టేట్‌మెంట్‌కు సంబంధించి అందరి అభిప్రాయాలు తీసుకుని ముఖ్యమంత్రిగారు తీర్మానం చేయాలని మనమందరం అనుకున్న తరుణంలో మళ్లీ రాజకీయాలకు తావు ఇచ్చే కార్యక్రమం చేస్తున్నారు. మీరు సమాధానం చెప్పారు. నేను వారిని కోరుతున్నాను. సిపిఐ పార్టీకి సంబంధించిన పెద్దలు, ఒకరిద్దరు గౌరవ సభ్యులు ఇంకా మాట్లాడాల్సి ఉన్నది. తదుపరి గౌరవ ముఖ్యమంత్రిగారు తీర్మానాన్ని ప్రవేశపెడుతారు కనుక సమయాభావం కూడా ఆలోచన చేసి సభ్యులందరూ సహకరించమని కోరుతున్నాను.

శ్రీ టి. హరీష్‌రావు:- అధ్యక్షా, శాసనసభ వ్యవహారాల శాఖమంత్రిగారు చెప్పినట్లు తప్పకుండా మీ తీర్మానాన్ని ఏకగ్రీవంగా పాస్ చేయడానికి సహకరిస్తాము. నేను ఒక్క విషయాన్ని సభానాయకుడిని కోరుతున్నాను. సార్, మాకు ట్రాక్ రికార్డ్ ఉన్నది. మా నాయకుడు చెబితే గడ్డి పోచల్లాగా రెండుసార్లు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన చరిత్ర నాది. మంత్రిపదవికి రాజీనామా చేసిన చరిత్ర నాది. కానీ మీరు మా ఉద్యమ స్ఫూర్తిని ఈ రకంగా అవమానపరచడాన్ని సభ రికార్డ్ నుండి తొలగించాలని మిమ్మల్ని కోరుతున్నాను అధ్యక్షా. కేసీఆర్‌గారిని రమ్మంటున్నారు. కేసీఆర్‌గారు చావునోట్లో తలపెట్టి కానే కాదన్న తెలంగాణను తెచ్చారు. కేసీఆర్ ఎందుకు? నువ్వు చెయ్యి, నీకు వెయ్యి మందిమి రక్షణ కవచంగా ఉంటాము. మేమందరం ఎమ్మెల్యేలం వచ్చి నీ చుట్టూ ఉంటాము. మీరు, మీ కేబినెట్ దీక్ష చేయండి. ఆనాడు దొడ్డు వడ్ల కేంద్రం కొనకపోతే.....

(అధికార పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

4.40 సా. **మిస్టర్ స్పీకర్**:- హరీష్ రావు గారు దయచేసి కూర్చోండి. సభా నాయకుడు చెప్పినదాంట్లో తప్పేమి లేదు. సభా నాయకుడు ప్రతిపక్ష నాయకుడిని రమ్మని అంటున్నాడు. అది చాలా మంచిది. నేను కూడా వార్తా పత్రికల్లో, టీవీలల్లో కూడా చెప్పాను. ప్రతిపక్ష నాయకుడు వస్తే సభకు చాలా గౌరవం పెరుగుతుంది. వారు ఇచ్చిన సూచనలను, సలహాలను తీసుకుంటామని నేను కూడా చాలాసార్లు చెప్పాను. అదేమాట వారి నోటి నుండి చెప్పారు. ప్రతిపక్ష నాయకుడు లేనప్పుడు మీకు అవకాశం ఇవ్వమంటే ఇచ్చాను. మీరు రాజకీయాలకు వెళ్లకుండా సూటిగా సమాధానం చెప్పండి. హరీష్‌రావు గారు మీరు కూర్చోండి. మీరు అడిగితే నేను మైకు ఇచ్చాను. సాంబశివ రావు గారు మాట్లాడండి.

శ్రీ కూనంనేని సాంబశివరావు (కొత్తగూడెం):- అధ్యక్షా, ఈరోజు శాసనసభలో జరుగుతున్న చర్చను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజానీకం అంతా వీక్షిస్తున్నారు. ఈ చర్చ చూసిన తరువాత వాస్తవంగా తెలంగాణ పట్ల ప్రేమతో, లేదంటే తెలంగాణకు జరుగుతున్న అన్యాయం పట్ల ఆవేదనతో చర్చ జరుగుతోందా? లేదంటే వేరు, వేరు ఎజెండాలతో చర్చ జరుగుతోందా అనేది చూచేటువంటి వీక్షకులకు ఒక ప్రశ్నగా మిగులుతోంది.

ప్రత్యేకించి ఈరోజు సభలో ఏమి జరిగిందని సామాన్యులను ఎవరినైనా అడిగితే, ప్రతిపక్ష పార్టీలకు సంబంధించి ప్రభుత్వ పక్షంతో ఈ నాలుగైదు గంటలు కూడా ఘర్షణలు జరిగాయని అంటారు. తప్పితే, కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేసిన అంశంపైన చర్చ జరిగిందని దాదాపు ఒక ఏడెమిది మంది చెబుతారేమో. ఇటువంటి వాతావరణం చాలా బాధాకరంగా ఉంది. నేను ఎవరిని తప్పుపట్టడానికి చెప్పడం లేదు. కొంతమంది బిజెపి మిత్రులు మాట్లాడారు. వారికి నిజంగా సాహసం ఉంది. ఎందువల్ల అంటే, అంత అన్యాయం జరిగిన తరువాత కూడా అందులో ఏమి జరిగిందో, దానిని అర్థం చేసుకొని మేము కూడా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి మనకు కూడా నిధుల వాటా వచ్చే విధంగా చేస్తామని చెప్పి ఉంటే చాలా హుందాగా ఉండేది వారికి.

అలా కాకుండా, ఇందాక అక్కడ చూశాం. మనందరం కూడా చిన్నప్పుడు కళాశాలల్లో చదివిన వారిమే. అందరం కూడా ఎంతో కొంత అల్లరి చేసి ఉంటాం. కానీ, కళాశాలల్లో కూడా ఇంత అల్లరి, చిల్లరగా ఉన్నట్లు మేము ఎప్పుడూ చూడలేదు. సభ నిండుదనం గానీ, సభా గౌరవ మర్యాదలు గానీ లేకుండా చాలా అన్యాయంగా ఈ సభను అలా తప్పుదారి పట్టించి, పక్కదారి పట్టించి తద్వారా అసలు సమస్యను మరుగున పడేట్లు చేయడం అనేడిది చాలా దురదృష్టకరం.

ఈరోజు జరిగిన పరిస్థితి ఏమిటి? ఈవాళ జరిగిన చర్చ ఏమిటంటే, పునర్ విభజన చట్టానికి సంబంధించి 2014లో మనకు కొన్ని హామీలిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొన్ని హామీలిచ్చారు. మొన్నటివరకు ఆంధ్రప్రదేశ్‌కి ఏమీ చేయలేదు. మనకి అప్పుడు చేయలేదు, ఇప్పుడూ చేయలేదు. ఆంధ్రప్రదేశ్ పైనా ఇప్పుడే ఎందుకు ప్రత్యేకంగా ప్రేమ వచ్చింది? అనేది మనం గమనంలోకి తీసుకుంటే, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పెన్న గానీ, ఆంధ్రప్రదేశ్ పైన

గానీ, ఆంధ్రప్రదేశ్ లోని తెలుగు వారిపైన గానీ. లేదంటే తెలంగాణలో ఉన్న తెలుగు వారిపైన గానీ. మొత్తంగా తెలుగు ప్రజలపైన వారికి ఎటువంటి ప్రేమ, అభిమానం లేదు. ఈరోజు కేంద్రంలో ఉన్నటువంటి వారు వారి కుర్చీని నిలబెట్టుకోవడం కొరకు వారికి సహాయం చేశారు. ఇది మనం గమనంలోకి తీసుకోవాలి.

అంతిమంగా మనకు అర్థం ఏమౌతుందంటే, ఇక్కడ co-operative federal వ్యవస్థ అనేది నీరుగారిపోతోంది. మేము అది ఇచ్చాం, ఇది ఇచ్చామని ఇందాక కొంతమంది మిత్రులు చెప్పారు. ఎవరి సొమ్ము అది? ఎవరి సొమ్ము ఎవరికి ఇచ్చినట్లు? అవి ప్రజలందరి శిస్తులు. ఆ వరుసకు వస్తే రాష్ట్ర ప్రభుత్వమైనా ధర్మకర్తలే, కేంద్ర ప్రభుత్వమైనా ధర్మకర్తలే. మమ్మల్ని సరిగ్గా పరిపాలించమని ప్రజలు డబ్బులు కడుతున్నారు. దానిపై మేమిచ్చాం, మేమిచ్చాం అంటున్నారు. ఇవ్వకపోతే విడిపోతారా? విడిపోవాలా? తెలంగాణ అనేది భారత చిత్రపటంలో ఉండదా? ఏమి మాట్లాడుతున్నారు నాకు అర్థం కావడం లేదు. కొన్ని రొటీన్‌గా మనకు వచ్చేవి వస్తూ ఉంటాయి. కానీ, ప్రత్యేకంగా మనకు ఇచ్చిన హామీలేమయ్యాయి? అది కదా ఇప్పుడు సమస్య. వచ్చేవాటిని చూసి మేము ఇచ్చాం అంటున్నారు. అట్లా అనుకుంటే, రాష్ట్రాలు ఇవ్వకపోతే కేంద్రం ఎక్కడుంటుంది? గతంలో ఒకసారి ఎన్‌టిఆర్ గారు అన్నది మీకు గుర్తు చేస్తాను. కేంద్రం అనేది మిథ్య అని ఎన్‌టిఆర్ గారు చెప్పారు. ఆ తరుణం ఇవాళ్ల వచ్చేటువంటి పరిస్థితి కనబడుతోంది. ఎందువల్లనంటే, ఈరోజు జిఎస్‌టి పేరుతో రాష్ట్రాల్ని బిక్షగాళ్లలాగా చేస్తున్నారు. బిక్షా పాత్ర తీసుకొని వెళ్లి అక్కడ ఉండే విధంగా ఉంది. సరే, ప్రారంభంలో జిఎస్‌టికి కాంగ్రెస్ కూడా సపోర్టు ఇచ్చి ఉండవచ్చు. పరిమితికి మించి డబ్బులన్నీ కూడా కేంద్రంలోకి వెళ్లిపోతున్నాయి. దాంతో రాష్ట్రాల్లో డబ్బులు లేని పరిస్థితి. ఆవిధంగా మనం చూస్తూ ఉన్నాం. అదే పద్ధతుల్లో ఇవాళ్ల కేంద్రానికి సంబంధించి, అక్కడున్నటువంటి పాలకులు, నేను పేరు కూడా పెట్టను, మనకు ఎన్ని ఇబ్బందులు పెడుతున్నారో తెలుసు. బీఆర్ఎస్‌కి ఎన్ని ఇబ్బందులు పెడుతున్నారో తెలుసు. తన మాట వినని వాళ్లకి ఎన్ని ఇబ్బందులు పెడుతున్నదో తెలుసు. ఈడీలు, సిబిఐలు, పోలీసు వ్యవస్థలు, ఐ.టి. దాడులు.. ఇన్ని ఇబ్బందులు పెడుతుంటే, ఇవాళ్ల మనందరం కసిగా, పౌరుషంగా ఎదుర్కోవలసిన పరిస్థితి. అందరూ బాధితులే. ఈ బాధితులుగా ఉన్నటువంటి మనం అంశాల వారీగా ఎదుర్కొని ఆ విధానాన్ని చీల్చి చెండాడాల్సినటువంటి మనం ఇవాళ్ల కొద్దిగా భిన్నమైన వైఖరి తీసుకోవడం చాలా దురదృష్టకరంగా నేను భావిస్తున్నాను.

2014లోని విభజన చట్టంలో చాలా అంశాలు చెప్పారు. ఇక్కడ నేను ఒక అంశాన్ని ప్రస్తావిస్తున్నాను. భర్తృ హరి ఒకటి వ్రాస్తారు. ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంతుష్టులై.. అంటే విఘ్నాలు జరుగుతాయో ఏమో అని ఏదీ ప్రారంభించరు. ఆరంభించి పరిత్యజించుదురు విఘ్నాయత్తులై మధ్యముల్.. అంటే, మొదలెట్టిన తరువాత మాకు ఏదో ఇబ్బంది వస్తుందని మానేసేవాళ్లు ఉంటారు. ధీరుల్ విఘ్ననిహన్య మానులగుచు ధృత్యున్నతోత్సాహులై ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ.. అంటే చివరి వరకు కూడా ధీరులనే వారు ప్రజ్ఞానిధులుగా ఉండేటువంటి వారు వదిలివేయరు. ఇక్కడ దీనిని, ఈ అంశాన్ని రాజకీయంగా కొద్దిగా అన్వయించుకుంటే.. అథములు, మధ్యములు, ఉత్తములు అని ఉంటారు. ఇంకా సాధారణ భాషలో దీనిని కూడా భర్తృహరే చెబుతారు. అథములు అంటే, ఎట్లా వాటిని గెలవాలి. గెలిచే వాళ్లే అథములు అనే భావన కాదు. అంటే, ఆ సెన్స్‌ని మనం అన్వయించుకుంటే ఆ నిమిషానికి మేము ఎలా గెలవాలి అని చూసేవాళ్లు కొంతమంది. ప్రయత్నం చేసి ఆపేవారు కొంతమంది. మరికొంత మందేమో తుదికంటూ ఉండాలని చూసేవాళ్లు కొంతమంది. అందులో ప్రతి ఒక్కరు రాజకీయ నాయకులే. రాజకీయాలు లేని రాజకీయాలు లేవు. ప్రతి నాయకుల్లో రాజకీయ నాయకులుంటారు, రాజకీయ కార్యకర్తలు ఉంటారు. రాజకీయవేత్తలు ఉంటారు. రాజకీయవేత్తల్లో ఉత్తములు, రాజ నీతిజ్ఞులుగా ఉంటారు. ఇవాళ మన భారతదేశానికి రాజనీతిజ్ఞుల కొరత ఉన్నది.

రాజనీతిజ్ఞుల కొరతను మనం 2014 నుండి చూస్తున్నాం. అంతకుముందు ఏ ప్రధానమంత్రి అయినా సరే ఈ విధమైనటువంటి కక్షసాధింపు ధోరణిలు గానీ, ఈ విధమైనటువంటి పరిస్థితులు తీసుకువచ్చినటు వంటి దాఖలాలు ఎప్పుడూ చూడలేదు. ఇవాళ్ల ఏ దశకు వచ్చామంటే, అసలు దక్షిణ భారతదేశం అంటేనే, భారతదేశం నుండి విడిపోవాల్సిన అవసరం ఉంటుందనే ఆలోచనలు కూడా మధ్యలో వచ్చాయని మీ దృష్టికి తీసుకువస్తున్నాను. ఇవాళ తమిళనాడు గానీ, కేరళ గానీ, మన రెండు తెలుగు రాష్ట్రాలు గానీ, ఏ రాష్ట్రాలైనా గానీ. తెలంగాణలో గెలిచి ఉండవచ్చు, ఉత్తర భారతంలో ఏమైంది? అంటే అచ్చుగా మతం, దేవుడూ కొంతకాలం పనిచేస్తాయి. ఎప్పుడూ అవే పని చేస్తాయని అనుకుంటే, అది పొరపాటు. ఇంకా కొద్దిగా అటూ, ఇటూ అయితే అసలు వాళ్లే పోయేవాళ్లు. కానీ, అది నడవదు అందులో తెలంగాణలో అసలే నడవదు. తెలంగాణలో సంభవించిన పరిణామాలను వాపును చూసి బలం అనుకోవద్దు. కొన్ని ప్రత్యేకమైన పరిణామాల నేపథ్యంలో సీట్లు గెలిస్తే అది శాశ్వతమని అనుకోవాల్సినటువంటి అవసరం లేదు. అందుకనే దక్షిణాదిన ఇవాళ వాళ్లను ప్రజలు తిరస్కరిస్తున్నారు. ఆ కోపం వాళ్లకు ఉంది. ఆంధ్రప్రదేశ్ అనేది ఇవాళ వారికి ఆధారం. కాబట్టి, అక్కడ కొద్దిగ సహకరిస్తున్నారు. ఇది గమనించివలసిన అవసరం మన అందరి మధ్య ఉంది. తమిళనాడును చూశాం, కర్ణాటకను చూశాం. వాళ్ల, వాళ్ల రాష్ట్ర ప్రయోజనాలు వచ్చినప్పుడు వాళ్లు ఏవిధంగా ఒక తాటిపైన నిలబడ్డారో వాటిన్నింటినీ కూడా చూశాం. ఇక్కడ ఛాలెంజ్‌లు, ప్రతి ఛాలెంజ్‌లు జరిగినాయి. నేను అనేది ఏమిటంటే, ఒకరినొకరు ఇబ్బంది పెట్టుకోవాల్సిన అవసరం లేదు. లేదంటే ఆమరణ నిరాహార దీక్షలు అవసరం లేదు. కానీ, అవసరం అనుకుంటే గౌరవ ముఖ్యమంత్రి గారు అలాగే పెద్దలు కె.చంద్రశేఖర్ రావు గారు, ఇతరా అందరం కూడా కలిసి ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్ భవన్ ముందు గానీ, జంతర్‌మంతర్ వద్ద గానీ ధర్నా చేస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదు. మంచి సంకేతంగా ఉంటుందనేది నా అభిప్రాయం.

అదేవిధంగా ఇంతకుముందు మన మిత్రులు కేటిఆర్ గారు, హరీష్ రావు గారు చెప్పారు. పన్నుల విభజనలో ఇంతకుముందు ఉన్నటువంటి 2.37శాతం నుండి 2.1శాతానికి పడిపోయింది. విభజన చట్టంలోని తొమ్మిదవ, పదవ షెడ్యూళ్ల ప్రకారం ఆస్తుల పంపకం ఇంతవరకు జరగలేదు.

4.50 సా. ఈమధ్య ఏమన్నా జరిగిందేమో తెలియదు. నేను దీనిపైన ఒక ఆర్టికల్ వ్రాశాను. దానిని తెప్పించి చదువుతున్నాను. సీలేరు జలవిద్యుత్తుకు సంబంధించి మనకు అన్యాయం జరిగింది. అదేవిధంగా ఏ.పి. స్టేట్ కార్పొరేషన్‌కు సంబంధించిన అంశాలపై ఇంతవరకేమీ జరగలేదు. 1930 నుండి సింగరేణి అనేది మన తెలంగాణకి సంబంధించిన సంపద. ఇవాళ నయా రూపాల్లో, కార్పొరేట్లకి వాటిని దోచిపెట్టే పద్ధతుల్లో మన నోట్లో మట్టి కొట్టి, మన తెలంగాణ సంపద అయినటువంటి సింగరేణి ని కూడా ఇవాళ దోచుకుపోయారు.

మనకి విభజన చట్టంలోని సెక్షన్ 13 ప్రకారం ఆరు నెలల్లోపు ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వాలి, ఇవ్వలేదు. మనకు కొత్త రైలు కనెక్టివిటీలు లేవు. ఒకవేళ బడ్జెట్‌లో రాసినా, ఎక్కడో నామినల్‌గా డీపీఆర్ కొరకు కొద్దిగా అలోకేషన్ జరిగినా సరే, ఎక్కడా కనెక్టివిటీ జరగలేదు. నీతి ఆయోగ్ సిఫారసు మేరకు దాదాపు మనకు రూ.24,205 కోట్లు మనకు రావలసి ఉంది. నీతి ఆయోగ్ సిఫారసు మేరకు మిషన్ భగీరథ కొరకు రూ.19 వేల కోట్లు మనకు రావలసి ఉంది. అదేవిధంగా, మిషన్ కాకతీయకు రూ.5205 కోట్లు రావలసి ఉంది. అలాగే, బయ్యారంకు సంబంధించి ఆరోజుల్లో నేనే ఆ అంశాన్ని ప్రశ్న రూపంలో రెయిజ్ చేశాను. దాదాపు మూడు నాలుగు గంటలపాటు బయ్యారం పైన చర్చ జరిగింది. అది ప్రశ్న అయినప్పటికీ అందరూ పాల్గొన్నారు. దాదాపు 34 మంది సభ్యులు పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు గారు కూడా ఆ చర్చలో పాల్గొన్నారు. చివరికి ముఖ్యమంత్రి గారితో చర్చించడం కోసం అటు రేవంత్ గారిని ఆయన అప్పజెప్పారు. వారితోపాటు మేమందరం కూడా వెళ్ళి అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య గారితో చర్చించాం.

రాష్ట్ర విభజన చట్టంలో ఆంధ్ర ప్రదేశ్‌కు కడప స్టీల్ ప్లాంటు, తెలంగాణకు బయ్యారం స్టీల్ ప్లాంటు ఉండే విధంగా విభజన చట్టంలో రాశారు. ఒకసారి కేంద్ర ఉక్కు గనుల శాఖ మంత్రి గారు పాల్వంచకు వచ్చారు. వచ్చి, దానిలో ఫీజిబిలిటీ ఉంది, చేస్తామని కూడా చెప్పారు. ఈమధ్యనేమో దానిలో ఫీజిబిలిటీ లేదు, నాణ్యత లేదు అని చెప్తున్నారు. నేననేదేమంటే, 54% నుండి 65% వరకు నాణ్యత గల 'Fe' అనే వందల లక్షలాది కోట్ల విలువైనటువంటి ఖనిజం ఇప్పటికి కూడా అక్కడుంది. వైజాగ్‌లో ఏముందని పెట్టారు? మా దగ్గర నీళ్ళున్నాయి. ఒకప్పుడు బయ్యారం మా జిల్లాలోనిదే. ఇప్పుడంటే అది మహబూబాబాద్‌కు వచ్చింది. ఇక్కడ నీళ్ళున్నాయి. బొగ్గు ఉంది. రైల్వే కనెక్టివిటీ ఉంది. అన్నీ ఉన్నాయి. ఖనిజం కూడా ఉంది కదా. మరి ఉన్న ఖనిజాన్ని అసలు తీయరా? దాన్ని పెల్లెట్స్, ఇంకోటో, ఇంకోటో ఏదో ఒకటి చేయాలి కదా? మరి వాళ్ళకి ఆ ఆలోచనే లేదు. అంటే వేల కోట్లు లక్షల కోట్లు విలువ చేసే ఖనిజమంతా కూడా నేలపాలైనా ఫరవాలేదు గానీ, తెలంగాణలో ఉంది కాబట్టి, దాన్ని టేకప్ చేసే పనిలేకుండా వాళ్ళు ఆలోచన చేశారు. అలాగే, ట్రిపుల్ ఐఐటిలు గాని, మెడికల్ కాలేజీలు గానీ, కేంద్రీయ విద్యా లయాలు గానీ, ఇటువంటివి ఏమీ కూడా లేవు. మా కొత్తగూడెంలో మైనింగ్ కాలేజీలు వస్తాయని ఆశించాం. అవి కూడా లేవు. గిరిజన యూనివర్శిటీకి నామినల్‌గా కేటా యింపులు చేశారు తప్పితే, ఈ సంవత్సరం బడ్జెట్‌లో కూడా పెట్టలేదు.

ఆఖరుకి ఇద్దరి మధ్య కృష్ణ, గోదావరి విషయంలో కూడా తగువులు పెట్టి, పెత్తనం వాళ్ళకున్న పరిస్థితులను ఇవాళ మనం చూశాం. ఈవిధంగా మన తెలంగాణకు ఇంత అన్యాయం జరిగినటువంటి ఈ పరిస్థితుల్లో మనంద రికీ కసి రావాలి, కోపం రావాలి. అందరం పట్టుదలతో ఉండాలి. వాళ్ళు మనకు ఎంతిచ్చారని గానీ, వాళ్ళు ఇవ్వక పోతే మనం బతకలేమని గానీ కాదు. అవసరమనుకుంటే మనం కూడా వాళ్ళకి ఇవ్వాల్సినటువంటి జీఎస్టీనో, ఇంకోటో, ఇంకోటో మేము మీకిచ్చే పనేలేదు, ఇక్కడి నుండి మీరు వసూలు చేసే పనేలేదు. అనే పద్ధతుల్లో మనం కూడా మన పోరాటాన్ని తీసుకెళ్ళాలి. తెలంగాణ రక్తంలోనే తిరుగుబాటు ఉంటుంది. అటువంటి తిరుగుబాటుని తీసుకురావడం తప్పితే, అడుక్కుంటే వాళ్ళు ఇచ్చేటువంటి పరిస్థితి లేదు. ఇవాళ ఈ చర్చ జరగడం చాలా సంతోష దాయకం. సరే, మిత్రులందరికీ కూడా ఆవేశకావేశాలున్న ప్పటికీ కూడా అందరికీ తెలంగాణపై ప్రేమ ఉంది. కానీ దానిని ఎలా డైరెక్ట్ చేయాలి, ఏ పద్ధతుల్లో దానికి దశ, దిశను ఏర్పాటు చేసుకోవాలో చూసి, ఖచ్చితంగా మనకి రావలసిన హక్కుల కోసం మనం పోరాడాలి. రెండవది, వాళ్ళకు ఇష్టంలేని పార్టీలపైనా, ఆ నాయకులపైనా వాళ్ళు చేసేటువంటి కక్షసాధింపు చర్యలకు కూడా ఎక్కడో ఫుల్‌స్టాప్ పెట్టాలంటే, అది మన తెలంగాణ నుంచే ప్రారంభం కావాలని చెప్తూ, హృదయపూర్వక నమస్కారాలతో సెలవు తీసుకుంటున్నాను.

DR. G. VIVEK VENKAT SWAMY (CHENNUR):- Speaker Sir, Thank you for giving me few minutes time. అధ్యక్షా, చాలామంది మాట్లాడారు. బీఆర్ఎస్ వాళ్ళు, బీజెపి వాళ్ళు, ముఖ్యమంత్రి గారు, శ్రీధర్‌బాబు గారు, డెప్యూటీ సీఎం గారు మొదలగు వారందరూ కూడా మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని మనందరికీ తెలుసు. పది సంవత్సరాల నుంచి అన్యాయం జరుగుతూనే ఉంది. గౌరవ సభ్యులు కేటీఆర్ గారు మాట్లాడుతూ, మనమందరం కలిసి ఢిల్లీకి పోయి ధర్నా చేద్దామని చెప్పారు. మరి పది సంవత్సరాల నుండి తెలంగాణాకు కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరుగుతున్నప్పుడు, ఈ పది సంవత్సరాలు వారు ఎందుకు ధర్నాలు చేయలేదనే విషయం చెప్పి ఉంటే బాగుండేది.

శ్రీ కె. తారక రామారావు:- (మైకు లేకుండా) చేశాం కదా!

డా. జి. వివేక్ వెంకట స్వామి:- మరి ఫలితాలు రాలేదు కదా! మీరందరూ కూడా ఒక విషయం గుర్తుంచుకోవాలి. నోట్ల రద్దు విషయంలో కూడా మీరు కేంద్రానికి సపోర్టు చేశారు. అప్పుడు సపోర్టు చేసినప్పటికీ తెలంగాణకి నిధులు ఎక్కువ రాలేదు. మేము

పార్లమెంటులో తెలంగాణ కొరకు కొట్లాడడం జరిగింది. సభ్యులు మహేశ్వర్ రెడ్డి గారు మాట్లాడేటప్పుడు, రామగుండం ఫెర్టిలైజర్ ప్లాంటు గురించి మాట్లాడారు. అప్పుడు నేను ఎంపీగా రూ. 10 వేల కోట్ల రూపాయల ఋణమాఫీ చేయించి, దాన్ని రీ–ఓపెన్ చేయడానికి చర్చ జరిగింది. అప్పుడు మన్మోహన్ సింగ్ గారితో ఆరోజుల్లో పది వేల కోట్ల రూపాయల ఋణాన్ని మాఫీ చేయించుకొని, ఫర్టిలైజర్ ప్లాంట్‌ని తీసుకురావడం జరిగింది.

అధ్యక్షా, మన తెలంగాణ నుండి తీసుకుంటున్న ట్యాక్స్ నుండి మనకు ఎంత రిటర్న్ వస్తుందనేది ముఖ్యమైన విషయం. ఇప్పుడు బీఆర్ఎస్ వాళ్ళు చెప్తున్నారు. అప్పుడు కూడా మనం ఒక రూపాయి ట్యాక్స్ చెల్లిస్తే, మనకి తిరిగి వచ్చింది కేవలం 27 పైసలు మాత్రమే. ఆ రోజుల్లో ఆంధ్ర ప్రదేశ్‌కి 47 పైసలు వచ్చింది. కానీ, బీజెపి పాలిత రాష్ట్రమైన యు.పి.కి ఒక రూపాయికి రూ. 1.72 పైసలుగా కేంద్రం నిధులివ్వడం జరిగింది. గౌరవ మంత్రి శ్రీధర్‌బాబు గారు మన తెలంగాణకు హక్కుగా రావలసిన నిధులను రాబట్టుకునేందుకు మనమందరం కలిసి కొట్లాడదామని ఈ చర్చను చేపట్టారు. యు.పి.కి ఇస్తున్నట్లుగా మనకి కూడా ఒక రూపాయికి రూ. 1.72 పైసలు ఇస్తే, మనకు సుమారు లక్ష కోట్ల రూపాయల కేంద్ర నిధులు వచ్చేందుకు అవకాశముంది.

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ గురించి ఢిల్లీలో రాహుల్ గాంధీ గారు చెప్పినట్లుగా, ఇది ప్రధాన మంత్రి పదవి కోసం కొన్నట్లుగా కనబడుతోంది. రూ. 56 వేల కోట్లు బీహార్ రాష్ట్రానికి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి సుమారుగా రూ. 40 వేల కోట్ల నుండి రూ. 60 వేల కోట్ల వరకు ఇవ్వడం జరిగింది. ఇన్ని నిధులను రెండు రాష్ట్రాలకి ఇచ్చినప్పుడు, మన రాష్ట్రానికి రావలసిన నిధులను మనం కొట్లాడి తీసుకురావలసి ఉంటుంది. ఇప్పుడు కొట్లాడకుంటే కుదరదు. మనకు హక్కుగా రావలసిన నిధుల కోసం మనమందరం కూడా కలిసి కొట్లాడవలసి ఉంది. యు.పి. రెవిన్యూ లక్ష కోట్ల రూపాయలు కాగా, వాళ్ళకి వచ్చేటువంటి నిధులు సుమారుగా రెండు లక్షల కోట్ల రూపాయల వరకు ఉంది. కాబట్టి, వారు అక్కడి బీద ప్రజలకు గ్యారెంటీ స్కీములను ఇంప్లిమెంట్ చేస్తున్నారు. మనకి కూడా ఎక్కువ నిధులు వస్తే, మనమేదైతే గ్యారెంటీ స్కీములను తెలంగాణ బీద ప్రజలకు ఇచ్చామో, వాటిని త్వరితగతిన ఇంప్లిమెంట్ చేసుకునే అవకాశం మనకి కూడా కలుగుతుంది.

5.00 సా. ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు A.P.Re-organisation Act ప్రకారం ఏవైతే అమలు చేయాలో, వాటన్నింటినీ కేవలం ఆంధ్ర రాష్ట్రానికే అమలు చేస్తూ, తెలంగాణకు అన్యాయం చేయడం జరుగుతోంది. మనం కొట్లాడి కృష్ణా నది నీళ్ళు ఏదైతే యాభై శాతం రావాలో, దాని గురించి కూడా తెచ్చుకోవాలి. పోలవరం ప్రాజెక్టుకు నిధులిచ్చినప్పుడు, రంగారెడ్డి పాలమూరు ప్రాజెక్టుకు కూడా నిధులివ్వాలి. కాళేశ్వరంకి ఎందుకు ఇవ్వడం లేదని ఇంతకు ముందు కూడా చాలామంది కొట్లాడారు. ఆరోజులలో బి.జె.పి.లో ఒక ఆలోచన ఉండేది. దీనిలో చాలా కమీషన్లు పోయాయి, ఎందుకివ్వాలనే ఆలోచన ఉండేది. ఇప్పుడైతే ఈ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు ఖచ్చితంగా కొట్లాడి నిధులు తీసుకువచ్చి ఈ ప్రాజెక్టు కంప్లీట్ చేసే అవసరమున్నది. ఎందుకంటే, అందరు మాట్లాడడం జరిగింది. తొందరగా ఈ రెజల్యూషన్ పాస్ చేసి, కేంద్రం నుండి కొట్లాడి ఎక్కువ నిధులు తెచ్చుకోవాలి, అది మన హక్కు. ఎందుకంటే, చిన్న రాష్ట్రమైనప్పటికీ సుమారు లక్ష కోట్ల రూపాయలు కేంద్రానికి ట్యాక్స్ పే చేస్తున్నాము. దీనిలో సరైన నిధుల వాటా తెలంగాణకు రావాలని చెప్పి కోరుతూ ముగిస్తున్నాను.

మరొక విషయం అధ్యక్షా, A.P.Re-organisation Act అంశాల అమలుతోబాటు మరొక విషయం చెబుతున్నాను. మా సింగరేణి సంస్థ కార్మికులంతా కూడా ఇన్‌కం ట్యాక్స్ ఎక్జెంప్షన్ కావాలని చాలా రోజుల నుండి కొట్లాడుతున్నారు. పన్ను మినహాయింపు ఇవ్వాలని మేము కిషన్ రెడ్డి గారికి, ప్రధాన మంత్రిగారికి రెప్రజెంటేషన్స్ ఇచ్చాం. మొన్న ఎన్నికల్లో వారు వచ్చి సింగరేణి కార్మికులకందరికీ పన్ను మినహాయింపు ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ అంశాన్ని కూడా చేర్చగలిగితే బాగుంటుందని ముఖ్యమంత్రిగారికి, శ్రీధర్ బాబు గారిని కోరుతున్నాను అధ్యక్షా.

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి:- అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మీద రాష్ట్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన తీర్మానంపై చర్చకు తమరు అనుమతించడం జరిగింది. ఈ చర్చలో దాదాపుగా తొమ్మిది మంది సభ్యులు సుదీర్ఘంగా పాల్గొని, ప్రభుత్వానికి కొన్ని సూచనలు, కేంద్ర ప్రభుత్వానికి కొన్ని డిమాండ్స్ ప్రతిపాదించారు. ఇందులో ప్రధానంగా శ్రీధర్ బాబు గారు, కె.టి.రామారావుగారు, ఎ.మహేశ్వర్ రెడ్డిగారు, పొన్నం ప్రభాకర్‌గారు, మాజీద్ హుస్సేన్‌గారు, భట్టి విక్రమార్కగారు, హరీష్ రావుగారు, కూనంనేని సాంబశివరావుగారు, వివేక్ వెంకటు స్వామిగారు, సభ్యులందరూ చర్చలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం పట్ల చూపిన వివక్ష కానీ, ప్రదర్శిస్తున్న కక్ష గానీ, ఇవ్వాల్సిన అనుమతులు కానీ, విడుదల చేయాల్సిన నిధుల విషయంలో వారి అభిప్రాయాలు చెప్పారు. వారి అభిప్రాయాలతోబాటు వారు సూచనలు కూడా చేశారు. ఈ సభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదం చేసి కేంద్ర ప్రభుత్వానికి మన నిరసనను, ఆలోచనను తెలియజేస్తే బాగుంటుందని చెప్పి వారు సూచన చేశారు. తప్పకుండా కొన్ని అంశాలను ప్రస్తావించిన తరువాత తమరి అనుమతితో ఆ తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి నాకు అనుమతివ్వాల్సిందిగా కోరుకుంటున్నాను.

భారతదేశం 15.08.1947 కంటే ముందు దాదాపుగా 565 సంస్థానాల రూపంలో, అదే విధంగా బ్రిటీష్‌పాలనలో మగ్గిపోతున్న సందర్భంలో హైదరాబాదు సంస్థానం వేరుగా ఉండేది. అందులో ఆనాడు కొంత ప్రాంతం మహారాష్ట్రంలో మిగిలినకొంత ప్రాంతం కర్ణాటకలో ఉండగా, ఇప్పుడున్నది తెలంగాణ రాష్ట్రం. ఆనాడు ఈ సంస్థానం కూడా స్వేచ్ఛ కోసం, స్వతంత్రం కోసం సాయుధ రైతాంగ పోరాటాన్ని చేస్తూ, ఈ ప్రాంతాన్ని కూడా పోరాటంలో చాలామంది అమరులై మనం స్వతంత్రాన్ని సాధించుకున్నాం. సెప్టెంబరు 17, 1948లో మనకు స్వతంత్రం వచ్చి ఈ ప్రాంతం కూడా హైదరాబాదు సంస్థానం కూడా భారతదేశంలో విలీనమైంది. ఈ విలీనమైన భారతదేశం, ఈ సంస్థానాలు, వివిధ రకాల జాతులు, భిన్న మతాలు, బహు భాషలు, ఎన్నో సంస్కృతులున్న ఈ దేశం అఖండ భారత్‌గా ఒక ప్రజాస్వామ్య స్ఫూర్తి దేశంగా ప్రపంచానికే ఆదర్శంగా నిలబడాలని చెప్పి ఆనాడు పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ మొట్టమొదటి ప్రధాన మంత్రి ఈ దేశానికి ఒక మంచి రాజ్యాంగాన్ని ఇవ్వాలి, ఈ రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శంగా ఉండాలని ప్రతి వాడి హక్కును, అవకాశాలను కాపాడాలని చెప్పి భారత రాజ్యాంగాన్ని ఈ దేశానికి ప్రసాదించడం జరిగింది. డా.బాబా సాహెబ్ అంబేద్కర్‌గారి నేతృత్వంలో మేధావులందరూ కలిసి కూలంకశంగా చర్చించి, ఈ దేశానికి ఒకగొప్ప గ్రంథమైన రాజ్యాంగాన్ని మనకిచ్చారు. ఆ రాజ్యాంగం యొక్క స్ఫూర్తి మీకందరికీ తెలుసు, 140 కోట్ల ప్రజలకు కూడా తెలుసు. ఏ ప్రాంతానికి కూడా పాలకులు అన్యాయం జరగకుండా Union of States, వివిధ రాష్ట్రాలను సమానంగా చూసుకోవడానికి అవసరమైన విధి విధానాలు రూపొందించి, ఎలాంటి వివక్ష లేని పరిపాలన జరగాలని వారు స్పష్టంగా రాజ్యాంగంలో పొందుపరచడం జరిగింది. ఆ రాజ్యాంగ స్ఫూర్తితోనే కాంగ్రెస్ పార్టీ కొన్ని దశాబ్దాల పాటు పరిపాలనను అందించి, భాక్రానంగల్ డ్యాం నుండి మొదలు పెడితే నాగార్జునసాగర్ వరకు, హరిత విప్లవం నుండి మొదలుపెడితే, సాగునీటి ప్రాజెక్టు నుండి మొదలు పెడితే అణుబాంబు తయారీ వరకు అన్ని రకాల కార్యక్రమాలను ముందుకు తీసుకెళుతూ ఎడ్యుకేషన్ నుండి ఇరిగేషన్ వరకు, హెల్త్ నుండి ఎంప్లాయిమెంట్ వరకూ సమానమైన అవకాశాలు ఈ దేశంలో ఉండే యువతకు ఇవ్వాలన్న ఆలోచనతోనే మంచి పరిపాలనకు పండిత్ జవహర్‌లాల్ నెహ్రూగారు పునాదులు వేశారు. వారు వేసిన పునాదుల మీద ఈ దేశాన్ని శ్రీమతి ఇందిరాగాంధీగారు అద్భుతమైన అభివృద్ధి పథం వైపు ఎన్నో సరళీకృత విధానాలు తీసుకొచ్చి బ్యాంకులను జాతీయం చేయడం, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లతోబాటు భూమి మీద హక్కులివ్వడంలోగానీ, చదువుకున్న నిరుద్యోగ యువకుల ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఒక పకడ్బందీ పరిపాలన అందించి ఈ దేశానికే ఆదర్శవంతమైన ప్రధానమంత్రిగా శ్రీమతి ఇందిరాగాంధీ గారు ప్రపంచంలోని ఒక ఉక్కు మహిళగా

గుర్తింపు పొందారు. ఆ తరువాత సంక్షోభాలు ఎదుర్కొంటున్న దేశం ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందా లేదా అని ప్రపంచ దేశాల ముందు అనుమానంగా నిలబడ్డ ఈ దేశాన్ని 2004లో శ్రీమతి సోనియా గాంధీగారి నాయకత్వంలో UPA-1 ప్రభుత్వాన్ని, మన్మోహన్ సింగ్‌గారిని ప్రధానమంత్రిని చేసి, ఈ దేశాన్ని సరళీకృత విధానాలను ముందుకు తీసుకెళ్ళి ఈ దేశాన్ని ప్రపంచంతో పోటీ పడే విధంగా ఆ ప్రధానమంత్రిగారు తీర్చిదిద్దారు. పది సంవత్సరాల మన్మోహన్ సింగ్‌గారి నాయకత్వంలో సోనియాగాంధీగారి నేతృత్వంలో అన్ని రాష్ట్రాలకు అవకాశాన్ని కల్పిస్తూ, అన్ని ప్రాంతాలకు సమానమైన నిధులు కేటాయిస్తూ వివిధ రాష్ట్రాల అభివృద్ధి కోసం పెట్టుకుంటున్న విజ్ఞప్తులకు అనుమతు లిస్తూ, ఈ దేశంలో ప్రజాస్వామ్యం వేళ్ళూనుకునే విధంగా ఈ దేశం అభివృద్ధి చెందిన దేశంగా ముందుకు తీసుకెళ్ళడానికి ప్రయత్నం చేశారు. ఆ స్ఫూర్తితో ఈ దేశంలో ప్రపంచానికి ఈ దేశమే ఆదర్శంగా నిలబడుతున్న సందర్భంలో 2014లో బి.జె.పి. నుండి నరేంద్ర మోడీగారు ఈ దేశానికి ప్రధాన మంత్రి అయ్యారు. 2004-2014 మధ్యలో ఈ ప్రాంత ప్రజలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివక్షకు లోనవుతున్నాము, మా ప్రాంతానికి రావలసిన నిధులు రావడం లేదు, మా నీళ్ళు మాకు పారడం లేదని, మా ప్రాంతానికి ప్రత్యేక రాష్ట్రమే పరిష్కారమని చెప్పి ఆనాడు ప్రజలందరూ కలిసికట్టుగా కోదండరాం గారి నేతృత్వంలో, వారి నాయకత్వంలో మనమందరం కలిసి కొట్లాడితే తెలంగాణ రాష్ట్రమనే కల సాకారమైంది. తెలంగాణ రాష్ట్రం ఇవ్వాలనే ఆలోచన, ఇచ్చి నిరూపించిన శక్తి కాంగ్రెస్ పార్టీది, శ్రీమతి సోనియా గాంధీ గారిది.

(ట్రెజరీ బెంచి సభ్యుల నుండి హర్షధ్వానాలు)

ఇచ్చిన తెలంగాణ అభివృద్ధి పరంగా రాష్ట్రం ముందుకు జరగాలని, అలా అభివృద్ధి చెందాలంటే చట్ట రూపంలో ఏమేమి అనుమతులు ఇవ్వాలో, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం, 2014, State Re-organisation Act లో స్పష్టంగా ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే బయ్యారంలో, ఖమ్మం జిల్లాలో ఉక్కు కర్మాగారం నిర్మించాలి, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మించాలి, IIITలు ఇవ్వాలి, ట్రైబల్ యూనివర్సిటీ ఇవ్వాలి, IIM ఇవ్వాలి, సాగునీటి ప్రాజెక్టు అయిన జాతీయ ప్రాజెక్టు ఇవ్వాలి, ఈ ప్రాంతంలో నాలుగు వేల మెగావాట్ల ఎన్టీపీసీ పవర్ ప్రాజెక్టు నిర్మించాలి, ఈ ప్రాంతానికి ఏమేమి కావాలనో క్షుణ్ణంగా ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకొని, రేపు ఎవరు వచ్చినా కూడా మన తెలంగాణకు అన్యాయం జరగకుండా చట్టబద్ధత కల్పించి లోక్ సభలో, రాజ్య సభలో బిల్లును ఆమోదింప చేసి హైదరాబాదుతో కూడుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని శ్రీమతి సోనియాగాంధీగారు, మన్మోహన్ సింగ్ గారు మనకిచ్చారు.

(ట్రెజరీ బెంచి సభ్యుల నుండి హర్షధ్వానాలు)

5.10 సా. తెలంగాణ రాష్ట్రం అని గర్వంగా చెప్పుకునే విధంగా కాంగ్రెసు పార్టీ పునాదులు వేస్తే, మొన్న జరిగిన ఎన్నికలలో కొంతమందికి ప్రజలు తీర్పునిచ్చారు, అవకాశం ఇచ్చారు. ఆ తీర్పును, అవకాశాన్ని పది సంవత్సరాలు కేంద్రంలో నరేంద్రమోదీగారు ఉండొచ్చు రాష్ట్రంలో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుగారు ఉండొచ్చు. ప్రజాస్వామ్య దేవాలయమే పార్లమెంటరీ వ్యవస్థ, పార్లమెంటు. ఆ దేవాలయంలో చేసిన చట్టాలను కూడా పది సంవత్సరాలు వారు అమలు చేయలేదు. అమలు చేయకపోవడానికి గల కారణాలు ప్రజలు గుర్తించారు. ఆనాడు చట్టం ద్వారా మనకిచ్చిన అధికారాన్ని పది సంవత్సరాలు ఇక్కడున్న పాలకులు ప్రశ్నించకపోవడం, నిలదీయకపోవడం, కావలసిన నిధులను రాబట్టుకోకపోవడం వల్ల తెలంగాణాకు తీరని అన్యాయం జరిగింది.

కనీసం ఇప్పుడైనా పది సంవత్సరాల పాటు మోదీగారు అమలు చేయని విషయాలను ఈ బడ్జెట్‌లోనైనా తప్పకుండా చేస్తారనే ఆలోచనతో, చేయాలనే ఉద్దేశ్యంతో మేము డిశంబరు 3వ తేదీ, 2023 నాడు ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంబడే, మేము 7వ తారీఖున ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణం కేంద్రంలో ప్రధాన మంత్రిని, హోం మంత్రిగారిని, వివిధ శాఖల మంత్రులను, స్వయంగా ప్రధాన మంత్రిగారిని రెండుసార్లు ఢిల్లీకి వెళ్ళి కలిశాము. ఆయన ఇక్కడ ఆదిలాబాద్‌కి వచ్చినపుడు కూడా పర్సనల్‌గా కలిసి వారిని ఆహ్వానించి ఫెడరల్ స్ఫూర్తితో ఒక ప్రధాన

మంత్రికి ఇవ్వవలసిన గౌరవాన్ని ఇస్తూ, తెలంగాణ ముఖ్యమంత్రిగా నా విధులను నేను నిర్వర్తించాను. ఆ సందర్భంలో నేను ప్రధాన మంత్రిగారికి స్పష్టంగా చెప్పాను. మీరొక పెద్దన్న. ప్రజాస్వామ్యంలో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఈ దేశ ప్రధాన మంత్రి ఒక పెద్దన్న లాంటి వాడు. మీరు పెద్దన్న పాత్రని పోషించి మా రాష్ట్రానికి రావలసిన నిధులు, మాకు ఇవ్వవలసిన అనుమతులు ఇవ్వండని నేను చెప్పాను.

అధ్యక్షా, నేను వారిని పెద్దన్న అంటే వారు నాకేమన్నా పదవి ఇస్తారా? నాకేమన్నా కిరీటం పెడతారా? ఈరోజు నాకీపదవి వచ్చిందంటే ప్రజలు అవకాశం ఇవ్వడం వల్ల వచ్చింది. నా పార్టీ నాకీ బాధ్యతను ఇవ్వడం వల్ల వచ్చింది. పార్టీ అధ్యక్షుడిగా నాకు మా పార్టీ అవకాశం ఇచ్చింది. ప్రజల తీర్పు కోరాము. ప్రజలు తీర్పు ఇచ్చి కాంగ్రెసు పార్టీకి అవకాశం ఇస్తే, 65 మంది శాసన సభ్యులు సభానాయకుడిగా నన్ను ఎన్నుకొని ప్రజాస్వామికస్ఫూర్తితో నన్ను ఇక్కడ కూర్చోపెట్టారు.

ముఖ్యమంత్రి పదవి ఎవరి దయాదాక్షిణ్యాలమీదనో, ఎవరినో పెద్దన్నా అంటే వచ్చే పదవి కాదు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగుకోట్ల ప్రజల హక్కులను కాపాడాల్సిన బాధ్యత నామీద ఉంది. ఈ గురుతరమైన బాధ్యతను అమలు చేయడానికే ఒక్క అడుగు ముందుకు వేసి, ఒక్క అడుగు దిగి మీరు ఈదేశ ప్రజలందరికీ పెద్దన్న లాంటి వారు, మీరు పెద్ద మనసు చేసుకుని తెలంగాణ రాష్ట్రానికి చట్టం ద్వారా ఏమైతే హక్కులను కల్పించారో ఆ హక్కులను అడ్డుకోకండి తెలంగాణకు అనుమతులివ్వండని వారికి విజ్ఞప్తి చేశాము.

మూడుసార్లు ప్రధాన మంత్రిని కలిశాను, 18 సార్లు వివిధ శాఖల మంత్రులను కలిశాము. ప్రతి ఒక్కరినీ కలిసి తెలంగాణ రాష్ట్రానికి రావలసిన బయ్యారం ఉక్కు కర్మాగారం, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, ట్రిబుల్ ఐటి, ఐఐఎంల గురించి, మూసీ పరివాహక ప్రాంతం అభివృద్ధి కోసం, రీజనల్ రింగ్ రోడ్డు కోసం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు, ఈ రాష్ట్రంలో జరగవలసిన అభివృద్ధి, సెమీ కండక్టర్స్ పరిశ్రమలు, ఐటీ పరిశ్రమలు, ఫార్మా పరిశ్రమల కోసం అనుమతులివ్వండి మీరు నిధులివ్వండని వారిని కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది అధ్యక్షా.

ప్రజాస్వామికస్ఫూర్తితో పనిచేయాలన్న ఆలోచనే తప్ప ఎవరి దగ్గరో లొంగిపోవడమో, ఒంగిపోవడమో కాదు అధ్యక్షా. ఇన్ని ప్రయత్నాలు చేసినా కేంద్ర ప్రభుత్వం మన పట్ల వివక్ష చూపించింది. ఇది వివక్షనే కాదు కక్ష్య పూరిత చర్య. ఈ సభ దీనిని ఖండించాలని ప్రత్యేకంగా రోజు మొత్తం ఈ సభలో చర్చ పెట్టి ప్రతి సభ్యుడికీ అవకాశం ఇచ్చి మీ అభిప్రాయాలు చెప్పండి, నిక్కచ్చిగా మీరు చెప్పే అభిప్రాయాలు కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తామని ఈ సభలో చర్చకు తీసుకువచ్చాము. కానీ జరుగుతున్న పరిణామాలు మీరు చూశారు కదా అధ్యక్షా. అసలు విషయాన్ని ప్రక్కదోవ పట్టించి ఇక్కడున్న ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని, నరేంద్రమోదీని కాపాడాలని లేదా నరేంద్రమోదీగారి పార్టీలో మేము ఉన్నాము కాబట్టి ఆ పార్టీని సమర్థించాలని వివిధ రకాలుగా ఈరోజు ఇక్కడ చర్చ జరుగుతున్నది అధ్యక్షా. అయినా అధ్యక్షా, కొంతమంది పదే పదే తెలంగాణ కోసం పదవులను త్యాగాలు చేశామంటున్నారు. ఎంఎల్ఏ కాకముందే మంత్రిని చేసింది కాంగ్రెసు పార్టీ అన్న సంగతి ఆ వ్యక్తి మరచిపోయినా తెలంగాణ సమాజం మరచిపోదు. ఏది లేనపుడు, ఏ దిక్కూ ఏ దివాణం లేనపుడు వార్డు మెంబరు కూడా కానపుడు, ఆరోజు మంత్రి పదవి ఇచ్చింది కాంగ్రెసు పార్టీ, శ్రీమతి సోనియా గాంధీగారు అన్న సంగతి వారు మరచిపోతే ప్రజలు క్షమించరు.

అధ్యక్షా ఈరోజు కొన్ని అంశాలను నేను మీ ముందు ప్రస్తావించదలచుకున్నాను. నేను ఎక్కువ రాజకీయాల జోలికి పోదలచుకోలేదు. రాజకీయ పరమైన చర్చలకు ఇంకా చాలా రోజులు సభా సమావేశాలు ఉన్నాయి. అవసర మైనపుడు తమరి అనుమతి తీసుకుని తప్పకుండా అన్ని విషయాలు, వివరాలు ఈ సభ ద్వారా తెలంగాణ ప్రజలకు నేను చెబుతాను. రెండు, మూడు ప్రధానమైన అంశాలను నేను ఈరోజు ప్రస్తావించదలచుకున్నాను. దేశంలో జరుగుతున్న పరిణామాలు ఈ సభ ద్వారా తెలంగాణా

ప్రజలకు చెప్పాల్సిన అవసరముంది. ఎందుకంటే ఈసభలో ఇక్కడ జరుగుతున్న పరిణామాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పట్ల మన వైఖరి ఏంటి, కేంద్ర ప్రభుత్వానికి మన పట్ల ఉన్న వైఖరి ఏంటని నేను కూడా ఈరోజు తెలంగాణ సమాజానికి చెప్పాలి అధ్యక్షా.

ఈ రోజు తెలంగాణ రాష్ట్రం పన్ను రూపంలోఒక్క రూపాయిని కేంద్ర ప్రభుత్వానికి చెల్లిస్తే తెలంగాణ రాష్ట్రానికి తిరిగి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నది 47 పైసలు. కానీ బీహార్ రాష్ట్రం ఒక్క రూపాయి పన్ను చెల్లిస్తే ఆ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుండి 7 రూపాయల 26 పైసలు వాళ్లకి తిరిగి వస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ పరిస్థితి కూడా అదే అధ్యక్షా. గత ఐదు సంవత్సరాలలో తెలంగాణ నుంచి రూ. 3 లక్షల 68 వేల కోట్ల రూపాయలు పన్నుల రూపంలో తెలంగాణ ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి చెల్లిస్తే, కేంద్ర ప్రభుత్వం తిరిగి తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చింది రూ. 1 లక్ష 68 వేల కోట్ల రూపాయలు. అంటే ఈరోజు తెలంగాణ రాష్ట్రం చెల్లిస్తున్న పన్నులు తిరిగి కేంద్ర ప్రభుత్వం మనకిస్తున్న నిధులు ఇవి అధ్యక్షా.

ఈ రోజు చాలా మంది కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ద్వారా మీకు రూ.3 వేల 500 కోట్లు ఇచ్చారు, లేకపోతే ఇంకేదో ఇచ్చారు అంటున్నారు. నేనడుగుతున్నాను, మోదీగారు గుజరాత్‌లో ఏమైనా ఎస్టేట్‌లు అమ్మి ఇచ్చిండా అధ్యక్షా. లేకపోతే ఆయన జాగీర్దారు భూములు అమ్మి గుజరాత్ నుంచి మనకేమన్నా అదనంగా ఇచ్చాడా? తెలంగాణ రాష్ట్రం రూ. 3 లక్షల 68 వేల కోట్ల రూపాయలు పన్నుల రూపంలో ఐదు సంవత్సరాలు కేంద్ర ప్రభుత్వానికి చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం తిరిగి మనకు విడుదల చేసిన నిధులు కేవలం రూ. 1లక్ష 68 వేల కోట్ల రూపాయలు మాత్రమే. ఇది ఎవరి దయా దాక్షిణ్యాల మీద ఇచ్చినది కాదు, ఎవరి ఆస్తులను అమ్మి తెలంగాణ ప్రజలకు ఇవ్వలేదు అధ్యక్షా. ఇది మన హక్కు . మన హక్కులు, మనకు ఇవ్వాల్సినవి ఇవ్వకపోవడం వల్ల చట్టం రూపంలో పార్లమెంటులో చేసిన శాసనాలను ఉల్లఘించడం వల్ల ఈరోజు అసెంబ్లీలో చర్చించాల్సిన పరిస్థితి వచ్చింది.

నేను ఇంకొక మాట చెప్పదలచుకున్నాను. ఐదు దక్షిణాది రాష్ట్రాలు చెల్లిస్తున్న పన్నులెంత? తిరిగి ఐదు దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నదెంత? ఒక్క ఉత్తర్‌ప్రదేశ్‌కు ఇస్తున్నదెంత అనేది కూడా ఈరోజు చర్చించాల్సిన అవసరముంది అధ్యక్షా. దక్షిణాది రాష్ట్రాలు ఐదు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు.. ఈ ఐదు రాష్ట్రాల నుంచి జిఎస్‌టి వసూళ్ళు రూ.22 లక్షల 26 వేల కోట్లు. ఈరోజు ఈ ఐదు రాష్ట్రాలు కలిసి కేంద్రానికి పన్నుల రూపంలో చెల్లించింది రూ. 22 లక్షల 26 వేల కోట్లు అధ్యక్షా. కానీ తిరిగి కేంద్ర ప్రభుత్వం ఈ ఐదు రాష్ట్రాలకు చెల్లించింది ఎంతంటే రూ.6 లక్షల 42 వేల కోట్ల రూపాయలు మాత్రమే. ఐదు రాష్ట్రాలు రూ. 22 లక్షల 26వేల కోట్ల రూపాయలు చెల్లిస్తే ఐదు రాష్ట్రాలకు తిరిగి కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది రూ. 6 లక్షల 42 వేల కోట్ల రూపాయలు మాత్రమే.

అదేవిధంగా ఒక్క ఉత్తరప్రదేశ్ పన్నుల రూపంలో కేంద్రానికి రూ. 3 లక్షల 41 వేల కోట్లు చెల్లిస్తే, ఉత్తరప్రదేశ్‌కు రూ. 6 లక్షల 91 వేల కోట్ల రూపాయలు తిరిగి కేంద్ర ప్రభుత్వం చెల్లించింది. మన ఐదు రాష్ట్రాలకు ఇచ్చిన నిధుల కంటే ఒక్క ఉత్తరప్రదేశ్‌కే అత్యధికంగా ఇస్తున్నారు. ఉత్తరప్రదేశ్ నుంచి కేంద్ర ప్రభుత్వానికి జిఎస్‌టి రూపంలో వచ్చింది రూ. 3 లక్షల 41 వేల కోట్లయితే, ఉత్తర్‌ప్రదేశ్‌కి కేంద్ర ప్రభుత్వం చెల్లించింది రూ. 6 లక్షల 91 వేల కోట్లు అధ్యక్షా. ఇదేం వివక్ష అధ్యక్షా?

5.20 సా. అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీగారిని కలిసి, వేదిక మీద ప్రత్యక్షంగా వారి సమక్షంలో చెప్పాను. మీరు మాట్లాడుతున్న ఐదు ట్రిలియన్ల ఎకానమితో నిజంగా ఈ దేశం రాణించాలి అని అంటే ఈ దేశంలో ఐదు మహానగరాలు ఉన్నాయి. అవి ఢిల్లీ, ముంబై, కలకత్తా, బెంగుళూరు, హైదరాబాద్. హైదరాబాద్ ఒక ప్రధానమైన నగరం. మీ ఫైవ్ ట్రిలియన్ ఎకానమీకి, మీ ఆలోచనకు ఈ దేశం చేరాలి అనంటే, హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం మూసి రివర్ డెవలప్‌మెంట్ కొరకు మీరు నిధులు ఇవ్వాలి అని చెప్పాను అధ్యక్షా. రీజినల్ రింగ్ రోడ్డుకి అనుమతులు ఇవ్వాలి,

నిధులివ్వాలి అని నేను చెప్పాను అధ్యక్షా. మెట్రో రైలు విస్తరణకు మీరు నిధులు ఇవ్వాలి, అనుమతులు ఇవ్వాలి అని నేను చెప్పాను. అదే విధంగా గోదావరి జలాల నుండి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు నీటిని తీసుకువచ్చి, శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరించడానికి, అక్కడ నుండి పైప్ లైన్ ద్వారా నీళ్లు తీసుకువస్తే, మూసీ రివర్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసి, బాగుపరచడానికి ఉపయోగ పడుతుందని మేము చెప్పాము అధ్యక్షా. ఫార్మా సిటీకి అనుమతి ఇవ్వండి, ఫార్మా సిటీ ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అడిగాము. ఈ ప్రాంతంలో 30 లక్షల మంది నిరుద్యోగులు, చదువుకున్న విద్యార్థినీ, విద్యార్థులున్నారు, మాకు ఐఐఎం ఇవ్వండి, వివిధ రాష్ట్రాలలో సైనిక్ స్కూల్స్ ఉన్నాయి, ఆంధ్రప్రదేశ్‌లో రెండున్నాయి, ఉత్తర్ ప్రదేశ్‌లో ఏడు ఉన్నాయి. ఇతర రాష్ట్రాలలో సైనిక్ స్కూల్స్ ఉన్నాయి. ప్రతి రాష్ట్రానికి కనీసంగా ఒక సైనిక్ స్కూల్ ఉండాలి, తెలంగాణ రాష్ట్రంలో సైనిక్ స్కూల్ లేదు. తెలంగాణ రాష్ట్రానికి సైనిక్ స్కూల్ ఇవ్వండి అని చెప్పి, పదేపదే ప్రధాన మంత్రిగారి నుండి మొదలుపెట్టి, రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్‌గారి వరకు మేము కలిసి, విజ్ఞప్తి చేశాము అధ్యక్షా. నేను హైదరాబాద్ ప్రాంతంలో కంటోన్మెంట్ పరిధిలో పార్లమెంటు సభ్యునిగా పనిచేశా. 50 ఎకరాల భూమిని కంటోన్మెంట్ ప్రాంతంలో డిఫెన్స్ నుండి సేకరించి ఇస్తాం, మీరు సైనిక్ స్కూల్‌కి అనుమతి ఇవ్వండి అని అంటే, కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు అధ్యక్షా. అందుకే ఈ రోజు ఐఐఎం కోసం, సైనిక్ స్కూల్ కోసం, గిరిజన యూనివర్శిటీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడం కోసం అన్ని రకాల అనుమతులు ఇవ్వండి అని మనం పట్టుబట్టి, సాధించి, ఈ సభలో ఏకాభిప్రాయంతో ఉండి, ప్రభుత్వం పెట్టిన చర్చలో సంపూర్ణంగా ప్రభుత్వానికి అండగా నిలబడి, ఇవ్వాళ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తే ఈ సమస్య పరిష్కారానికి ఒక దారి ఉండేది. కాని, దురదృష్టవశాత్తు పార్టీల ప్రయోజనాలు, వ్యక్తుల ప్రయోజనాల కోసమే కొంతమంది సభ్యులు మాట్లాడడం శోచనీయం అధ్యక్షా. తెలంగాణ సమాజం నిశితంగా గమనిస్తోంది. ఇది తెలంగాణ సమాజానికి మంచిది కాదు. అందుకే ఈ రోజు చర్చలో పాల్గొన్న అన్ని రాజకీయ పార్టీల సభ్యులకు నా సూచన ఒక్కటే. రేపటి నుండి రాజకీయాలు మాట్లాడుకుందాం. ఇవ్వాళ తెలంగాణ ప్రజల కోసం, తెలంగాణ హక్కుల కోసం, తెలంగాణాకు రావలసిన నిధుల కోసం, తెలంగాణాకు రావలసిన అనుమతుల కోసం మనందరం ఏకాభిప్రాయంతో, ఒక్క తాటి మీద నిలబడితే, కేంద్ర ప్రభుత్వాన్ని మెడలు వంచి, మనకు కావలసిన హక్కులను సాధించుకోవడం పెద్ద సమస్య కాదు అధ్యక్షా. నిన్న ఈ బడ్జెట్‌లో ఈ విధంగా ఉందనే విషయం తెలిసిన వెంటనే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖర్గే గారిని, సోనియా గాంధీగారిని, రాహుల్ గాంధీ గారితో మాట్లాడి, ఈ రోజు ఉదయం 11 గంటల నుండి పార్లమెంటు మెట్ల మీద తెలంగాణాకు జరిగిన అన్యాయం మీద ఇండియా కూటమిలో ఉన్న అన్ని పార్టీలను కలిపి ఈ రోజు నిరసన తెలిపి, కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేసింది, ఆ బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకున్నదని తెలియజేస్తున్నాను.

అదే విధంగా 14వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు స్టేట్ ట్యాక్స్ డివల్యూషన్‌లో, అంటే రాష్ట్రాలకు పన్నుల పంపిణిలో వాటా ఇవ్వవలసిన దానిని 42 శాతం ఇవ్వమని 14వ ఆర్థిక సంఘం రికమండ్ చేస్తే, కోతలు విధించి, రకరకాలుగా తిరకాసులు పెట్టి, ఈ రోజు 32.47 శాతం మాత్రమే రాష్ట్రాలకు ఇస్తున్నారు అధ్యక్షా. సెస్సులు, సర్‌ఛార్జీల రూపంలో కోతలు విధించి, రాష్ట్రాలకు న్యాయంగా దక్కాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం లేదు. అందుకే పునర్విభజన చట్టం నుండి మొదలుపెడితే, డెవల్యూషన్ ప్రకారం మనకు రావలసిన వాటాలు, వివిధ ప్రాజెక్టులకు జాతీయ హోదాగాని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పిఎంకెఎస్‌కెవై క్రింద పెట్టాలని, జల్‌జీవన్ మిషన్ క్రింద తాగునీటికి నిధులు ఇవ్వాలని వీటన్నిటి మీద కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చి, మా శాయశక్తులా ప్రయత్నం చేసినాము. ఆఖరి నిమిషం వరకు మేము ప్రయత్నం చేస్తూనే ఉన్నాము.

ఈ రోజు కూడా ఈ సభలో ఇంత చర్చ ఎందుకు తీసుకున్నాము అధ్యక్షా? ఉదయం నుండి మిగతా బిజినెస్ అంతా పక్కన పెట్టి, ఈ ఒక్క అంశానికి ఎందుకు ప్రాధాన్యత ఇచ్చినాము అధ్యక్షా? తెలంగాణ ప్రయోజనాలను కాపాడడమే మా బాధ్యత అని మేము భావించినాము. సభ్యులు మమ్మల్ని తిట్టినా, సభ్యులు అక్కసు వెళ్లగక్కినా, నేను ఇక్కడ కూర్చున్నానని కొంతమంది సభ్యులు కళ్లల్లో నిప్పులు పోసుకున్నా, అవమానించే విధంగా మాట్లాడినా కూడా, ఆ సభ్యులకు మేము మాట్లాడే అవకాశం ఇచ్చినాము. మేమేం అభ్యంతర పెట్టలేదు. ఎక్కడెక్కడో లేని విషయాలు ప్రస్తావించినా మేము ఎందుకు ఓపిక పట్టాము అధ్యక్షా? కావాలంటే మేము వాళ్లని మాట్లాడకుండా చేయలేమా, మాకా శక్తి లేదా? అయినా మా సభ్యులు ఎందుకు సంయమనంతో ఉన్నారు? ఈ రోజు రాష్ట్ర ప్రయోజనాల కోసమే సభలో చర్చ జరగాలి. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడానికి మనందరం ఏకాభిప్రాయంతో ఉన్నాము అని , ఏకగ్రీవ తీర్మానం చేయాలి అనే ఆలోచనతోటే ఈరోజు మేము ఈ సభలో మేము సహకరించి, మీ ఆదేశాల మేరకు మేము ముందుకు వెళుతున్నాము అధ్యక్షా.

అందుకే అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వానికి విస్పష్టంగా మా నిర్ణయాన్ని, నిరసనను తెలపదలచుకున్నాము. అందుకే 27వ తారీఖున ఛైర్మన్‌గా ఉన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీగారి నేతృత్వంలో నీతి ఆయోగ్ సమావేశం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర హక్కులకు భంగం కలిగించినందుకు, తెలంగాణాకు రావలసిన నిధులను విడుదల చేయనందుకు, తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వవలసిన అనుమతులు ఇవ్వనందుకు, నీతి ఆయోగ్ సమావేశాన్ని తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రిగా బహిష్కరిస్తున్నాము. ఈ బహిష్కరణను సభ మొత్తం ఏకగ్రీవంగా ఆమోదించాలని తమరి ద్వారా నేను విజ్ఞప్తి చేస్తున్నా అధ్యక్షా.

మేము ప్రజాస్వామ్య స్ఫూర్తితో నిరసన తెలుపుతున్నాము అధ్యక్షా. మేము ఏదిబడితే అది మాట్లాడి, ఎంతొస్తే అంత మాట్లాడి, తరువాత కాదు, కూడదు అని మాట్లాడే విధానం మాకు లేదు అధ్యక్షా. అందుకే నిర్దిష్టంగా, విస్పష్టంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నిరసన తెలుపదలచుకున్నది. నిరసనలో మొదటి భాగంగా ఈ నెల 27వ తారీఖు నాడు ప్రధాన మంత్రిగారి నేతృత్వంలో జరగబోయే నీతి ఆయోగ్ సమావేశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ముఖ్యమంత్రిగా బహిష్కరిస్తున్నాము. ఇది మా స్పష్టమైన నిర్ణయం అధ్యక్షా. ఈ లోపు కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేసుకుని, సవరించిన బడ్జెట్‌లో అయినా తెలంగాణకు న్యాయం చేస్తామని, తెలంగాణకు బయ్యారం ఉక్కు కర్మాగారం ఇవ్వాలని, తెలంగాణాకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేయాలని, తెలంగాణాకు ఐటిఐఆర్ కారిడార్ తిరిగి పునరుద్ధరించాలని, పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు పిఎంకెఎస్‌వై లో అనుమతి ఇవ్వాలని, ఎన్‌టిపిసి ద్వారా 4 వేల మెగావాట్ల ప్రాజెక్టుకి సంబంధించి బ్యాలెన్సు 2,400 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలని, గిరిజన యూనివర్శిటీని పూర్తి స్థాయిలో ప్రారంభించాలని, వీటన్నిటిని కూడా మేము డిమాండ్ చేస్తున్నాము. వీటి మీద పార్లమెంటులో ప్రధాన మంత్రిగారి నుండి ఒక స్పష్టమైన ప్రకటన రావాలని కోరుకుంటున్నాము.

అదే విధంగా తీర్మానానికి సంబంధించి సభ్యులందరూ ఏవైతే సూచనలు చేశారో, ఆ మేరకు ఈ క్రింది తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి మిమ్మల్ని అనుమతి కోరుతున్నాను అధ్యక్షా.

మిస్టర్ స్పీకర్:- గౌరవ ముఖ్యమంత్రిగారిని ప్రభుత్వ తీర్మానాన్ని ప్రవేశపెట్టవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ ఎనుముల రేవంత్‌రెడ్డి:- ధన్యవాదాలు అధ్యక్షా.

5.30 సా.

ప్రభుత్వ తీర్మానం

"డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం భారతదేశం అన్ని రాష్ట్రాల సమాఖ్య. అన్ని రాష్ట్రాల సమీకృత సమ్మిళిత అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం బాధ్యత. ఈ ఫెడరల్ స్ఫూర్తిని కేంద్ర ప్రభుత్వం విస్మరించింది. కేంద్ర ప్రభుత్వం

ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు వివక్ష జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ఇదే ధోరణి కొనసాగించింది.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల సుస్థిర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి. కానీ, విభజన చట్టంలో పొందుపరచిన హామీలను అమలు చేయటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. పార్లమెంట్‌లో చేసిన విభజన చట్టంలో పొందుపరచిన హామీలు ఇప్పటికీ అమలు కాకపోవటం తెలంగాణ ప్రగతిపై తీవ్రమైన ప్రభావం చూపింది.

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా నేను మరియు రాష్ట్ర మంత్రులు పలు దఫాలుగా ప్రధాన మంత్రిని, ఇతర కేంద్ర మంత్రులను కలిసి వివిధ విజ్ఞప్తులు చేశాము. రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులకు ఆర్థిక సాయం కోరటంతో పాటు చట్ట ప్రకారం రావాల్సిన నిధులు, అపరిష్కృతంగా ఉన్న అంశాలపై అనేక సార్లు అభ్యర్థనలు అందించాము. కానీ కేంద్ర ప్రభుత్వం వీటిని పట్టించుకోకుండా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల పూర్తిగా వివక్ష చూపించింది. అందుకే తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్రం అనుసరించిన తీరుపై ఈ సభ తీవ్ర అసంతృప్తిని, నిరసనను తెలియజేస్తోంది.

ప్రస్తుతం కొనసాగుతున్న బడ్జెట్ చర్చల్లోనే కేంద్ర బడ్జెట్‌కు సవరణలు చేసి, తెలంగాణ రాష్ట్రానికి న్యాయం జరిగేటట్లు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ ఈ సభ తీర్మానం చేస్తోంది. ఈ తీర్మానానికి సభ్యులందరూ పార్టీలకు అతీతంగా చప్పట్ల ద్వారా ఆమోదాన్ని తెలపండి. తదుపరి కార్యాచరణను మళ్లీ మనమందరమూ చర్చించుకొని, కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి మన హక్కులను సాధించుకుందామని తమరి అనుమతితో ఈ తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్నాను.”

MR. SPEAKER:- Resolution moved. The Government Resolution is before the House. The question is:

“డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం భారతదేశం అన్ని రాష్ట్రాల సమాఖ్య. అన్ని రాష్ట్రాల సమీకృత సమ్మిళిత అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం బాధ్యత. ఈ ఫెడరల్ స్ఫూర్తిని కేంద్ర ప్రభుత్వం విస్మరించింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు వివక్ష జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ఇదే ధోరణి కొనసాగించింది.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల సుస్థిర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి. కానీ, విభజన చట్టంలో పొందుపరచిన హామీలను అమలు చేయటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. పార్లమెంట్‌లో చేసిన విభజన చట్టంలో పొందుపరచిన హామీలు ఇప్పటికీ అమలు కాకపోవటం తెలంగాణ ప్రగతిపై తీవ్రమైన ప్రభావం చూపింది.

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా నేను మరియు రాష్ట్ర మంత్రులు పలు దఫాలుగా ప్రధాన మంత్రిని, ఇతర కేంద్ర మంత్రులను కలిసి వివిధ విజ్ఞప్తులు చేశాము. రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులకు ఆర్థిక సాయం కోరటంతో పాటు చట్ట ప్రకారం రావాల్సిన నిధులు, అపరిష్కృతంగా ఉన్న అంశాలపై అనేక సార్లు అభ్యర్థనలు అందించాము. కానీ కేంద్ర ప్రభుత్వం వీటిని పట్టించుకోకుండా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపట్ల పూర్తిగా వివక్ష చూపించింది. అందుకే తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్రం అనుసరించిన తీరుపై ఈ సభ తీవ్ర అసంతృప్తిని, నిరసనను తెలియజేస్తోంది.

ప్రస్తుతం కొనసాగుతున్న బడ్జెట్ చర్చల్లోనే కేంద్ర బడ్జెట్‌కు సవరణలు చేసి, తెలంగాణ రాష్ట్రానికి న్యాయం జరిగేటట్లు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ ఈ సభ తీర్మానం చేస్తోంది. ఈ తీర్మానానికి సభ్యులందరూ పార్టీలకు అతీతంగా చప్పట్ల ద్వారా ఆమోదాన్ని తెలపండి. తదుపరి కార్యాచరణను మళ్లీ మనమందరమూ చర్చించుకొని, కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి

మన హక్కులను సాధించుకుందామని తమరి అనుమతితో ఈ తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్నాను".

Those who are for the Resolution, please say 'Aye',

Those who are against please say 'No'.

"Ayes have it", "Ayes have it",

The Government Resolution is adopted.

MR.SPEAKER:- Now the House is adjourned to meet again on Thursday the 25th July, 2024 at 12.00 Noon.

(The House then adjourned at 5.31 P.M. to meet again at 12.00 Noon on Thursday, the 25th July, 2024.)

******

"Published under Rule 347 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly and Printed at Assembly Press, Public Gardens, Hyderabad."